A-PDF Merger DEMO : Purchase from www.A-PDF.co



# మీరైతే ఏంచేస్తారు?

పందిట్లో పెళ్ళవుతున్నదీ
కను విందవుతున్నదీ?
అన్న ట్యూన్ వాయిస్తున్నారు బ్యాండ్ మేళం వాళ్ళు. అదొక అందమైన ఆధునాతన భవనము.

"ఆనంద్ భవనం" అన్న అక్షరాలు నియాన్ లైట్ల వెలుగుల్లో తళుక్కుమంటున్నాయి.

ఆనంద్ భవన్ ఆవరణ అంతా కోలాహలంగా వుంది. పట్టుచీరెల రెపరెపలు, సూటు, బూట్లు శృంగారాలు—చిరునవ్వులతో చిరు సిగ్గులతో ఒకరిని ఒకరు పలుకరించుకుంటున్నారు. ధోవతులు కట్టినవారు, ధరించ లేక తేలికగా వెంకటగిరి చీరలు కట్టినవారూ లేకపోలేదు.

"వాడి మాటలు నమ్మకు చెల్లాయ్! ఈ ఆహార కర్తీవుంది చూశావ్, మన బాడీ వెల్తీలను పూర్తిచేసి ఆరోగ్యంగా వుంచుతుంది. ఒరేయ్ హర్షా! ఆ పెట్టె విప్పి అందులోని గిఫ్ట్ మా చెల్లికివ్వు" అతని మాట పూర్తికాకముందే బిలబిలమంటూ ఓ పది మంది యువతీ యువకులు వచ్చారు.

"ఒరేయ్! చెప్పాపెట్టకుండా పెళ్ళి చేసుకుని, డిన్నర్ కార్డ్ పంపిస్తావట్రా!" ఒకతను అమాంతంగా కౌగలించుకున్నాడు.

"ఒరేయ్ మధూ! ఆ అమ్మాయికి ఆ ఛాన్సులన్నీ వదిలేయరా!" అన్నారెవరో. నవ్వుల జల్లులు కురిశాయి.

పెళ్ళికూతురి బుగ్గలు కెంపులీనాయి.

"సారీ బ్రదర్స్! నాకేం తెలియదు. నేను మద్రాసు నుండి వచ్చే సరికి అమ్మ ముహూర్తం నిశ్చయించింది." అన్నాడు క్రీగంట ఒక చూపు పెళ్ళికూతురివైపు విసిరి.

"ఓహో....అరేంజ్‌డ్ మ్యారేజీ అన్నమాట. ఐ.ఐ.టి.లో చదువు వెలగబెట్టేసుగా, ఓ లవ్ గివ్ ఏంలేదా? ఇట్ ఈజ్ ఏ షేమ్" అన్నాడు మధు.

"లవ్, గివ్, అన్నీ పెళ్ళికూతురితోనే...." గివ్ అన్నప్పుడు మూతి సున్నా చుట్టాడు రాజన్.

మరోసారి అందరూ నవ్వారు.

"అదికాదురా అమ్మకూచీ! అమ్మ ఈ బంగారు బొమ్మను చూచింది కాబట్టి సరిపోయింది. ఏ హిడింబినో చేసుకొమ్మంటే?" మరొకతను ప్రశ్నించాడు.

"తప్పక చేసుకునేవాడిని. ఆమె బ్రతికిందే మా కోసం. ఆమె ఊపిరిలో, తలపులలో అంతటా మేమే నిండివున్నాము" అన్నాడు శ్రీహర్ష గర్వంగా. ఆ మాటలు అంటున్నప్పుడు అతని ఛాతీ రెండు అంగుళాలు పెరిగిందేమో అనిపించింది.

అతనా మాట అన్నప్పుడు ఒక్కక్షణం పెళ్ళికూతురి ముఖంలో బాధాకరమైన భావం కదలాడి మాయం కావటం రాజన్ దృష్టిని దాటిపోలేదు.



"ఈ ఆధునిక యువకులున్నారే, భర్త తిన్నగా ఆకాశం నుండి తన వడిలో పడ్డాడు అనుకుంటారు. అమ్మ, అబ్బ వుంటారన్న జ్ఞానం లేకపోతే యెలా?"

"జరగండి, జరగండి....అయిదారుగురు వ్యక్తులు ఓ పెద్ద పెట్టె మోసుకువచ్చి పెళ్ళికూతురికిస్తూ, ఫొటోగ్రాఫర్ వంక చూశారు.

రెండువైపుల నుండీ కెమేరాలు క్లిక్‌మన్నాయి.

"కంగ్రాచ్యులేషన్స్" అని ఒక వ్యక్తి చేయి ముందుకు చాపాడు.

"నమస్తే...." చేతులు జోడించింది పెళ్ళికూతురు.

"సారీ.... సారీ పెళ్ళికొడుక్కు...." అంటూ బలవంతంగా శ్రీహర్షతో చేయి కలిపారు.

శ్రీహర్ష స్నేహబృందం అట్టపెట్టె విప్పుతున్నారు.

"ఏముందంటావ్?" అతిమెల్లగా పెళ్ళికొడుకు అడిగాడు.

"ఏ బాక్లెట్టో అయివుంటుంది" అన్నది పెళ్ళికూతురు.

"అప్పుడే గుసగుసలు ప్రారంభించారా?" వాళ్ళ దూరపు బంధువు ఒకాయన నవ్వి, రెండు దండలు వారికిచ్చి, దండలు మార్చుకున్నాక ఫొటో తీసుకుని వెళ్ళి కూర్చున్నాడు.

ఆ సోఫాకు కాస్త దూరంగా పసుపు, కుంకుమ, సెంటుబాటిల్ పట్టుకున్న ఆ అమ్మాయిలు కాస్త విసుగ్గా చూశారు. తమ ఫొటో ఒక్కటీ రావటంలేదని వారికి చాలా దిగులుగా వుంది.

"ఎంతసేపు ఈ గుంజిళ్ళు?" అన్నది పెళ్ళికూతురు.

"కాళ్ళు లాగుతున్నాయా? గదిలోకి వెళ్ళగానే కాళ్ళుపడతాను సరా-నా చెయ్యి పడగానే నొప్పి ఉఫ్‌మని ఎగిరిపోతుంది" అన్నాడు.

ఆమె తల వంగిపోయింది.

"ఏమిటోయ్ గుసగుసలు?" రాజన్ ప్యాక్ విప్పుతున్నాడు.

"నీ గురించి చెబుతున్నా" అన్నాడు కొంటెతనం కనుకొనల కదులాడుకుంటే. పన్నెండు పై పొరలు విప్పారు.

"ఇక నువ్వే విప్పరా బాబూ!" చెమట తుడుచుకున్నాడు రాజన్.

శ్రీహర్ష చకచక విప్పాడు. అతను పైకి తీసి, పెళ్ళికూతురికిచ్చిన

బహుమతి చూసి, అందరూ ఘొల్లున నవ్వారు.

అందమైన, నగిషీ చెక్కిన వెండిపళ్ళెంలో అందమైన రబ్బరు బొమ్మలు. ఒక బొమ్మ గౌను వేసుకుంది. రెండవ బొమ్మ నిక్కర్లో వుంది.

సిగ్గుపడి, బొమ్మలు చటుక్కున ప్రక్కన పెట్టింది పెళ్ళికూతురు.

"ఏం ముగ్గురు కావాలా?" అల్లరిగా వినీ వినిపించనట్టు అడిగాడు శ్రీహర్ష.

ఆమె మోచేత్తో పొడిచింది.

"నీ స్నేహితురాండ్రెవరూ రాలేదా?"

లేదన్నట్టుగా తలాడించింది.

మధు మళ్ళీ ముందుకు వచ్చాడు. శ్రీహర్ష మెడలోని దండలు తీసి ఒక్కటి వుంచుకున్నాడు.

"హర్షా! మీ ఇల్లు లోపల ఎలా వుందోగాని, బయటికి మాత్రం బ్రహ్మాండంగా వుందిరా. ఉదయమే గృహప్రవేశమటగా?" అన్నాడు.

"ఇల్లు బావుందని నా ముందు అంటే అన్నావుగాని, మా అక్క ముందు అనకురా బాబూ! ఇప్పటికే ప్రాక్టీస్ వదిలి ప్లాన్స్ వేస్తుందని బావ గారి కంప్లయింట్" అన్నాడు.

"అంటే ఇదంతా విజయక్క ప్లానన్నమాట" ఇంటివైపు మరోసారి చూశాడు మధు.

"మరేం అనుకున్నావు?"

ఆగంతకుడు మైమరచి వాళ్ళనే చూస్తున్నాడు.

"హాయ్ మధూ....హల్లో రాజన్....నమస్తే మామయ్యా! గుడ్ ఈవినింగ్ అంకుల్, బావున్నావా పిన్నీ? మీ ఆరోగ్యం ఎలా వుంది? అత్తయ్యా! మీ క్లబ్ మిమ్మల్ని వదిలిందా, మిసెస్ రెడ్డీ...." అందరినీ పలకరిస్తూ చైతన్య ప్రవంతిలా అందరిమధ్య కొచ్చిందో యువతి.

ఎత్తు, ఎత్తుకు తగిన లావుతో, బన్నాముడి వేసుకుని హుందాగా వుంది.

చాక్లెట్ కలర్ అంచున్న తెల్లని కంచిపట్టుచీర కట్టి, ముత్యాల నగలతో స్వచ్ఛతకు మారుపేరులా వుంది.



ఆమె వెనుకే ముద్దుగా-బొద్దుగా వున్న నాలుగేళ్ళ అమ్మాయి, పరికిణీ, పొట్టి జాకెట్టు వేసుకుని, చేతిలో ఓ ప్యాకెట్టు పట్టుకుని వచ్చింది.

"మమ్మీ....మమ్మీ...."

"నా బంగారు తల్లి! నువ్వెళ్ళి ఆడుకో! అంజనీ, మామయ్య వాళ్ళు బయలుదేరారట. వాళ్ళు రాగానే విందు ప్రారంభిద్దాం" అన్నది పెళ్ళికూతురుకేసి తిరిగి.

అంజని కళ్ళలో కన్నీటిపొర తళుక్కుమనటం శ్రీహర్ష కంట పడనే పడింది. అతను కలవరపడ్డాడు.

"వాట్ ఈజ్ ద మాటర్?" వినీ వినిపించనట్టు అడిగాడు.

"మీరు....మీరు అదృష్టవంతులు. ఆప్యాయంగా చూసే అమ్మ, అనురాగం పంచే అక్కా వున్నారు" అన్నది. వివాహమైన తరువాత మొదటిసారిగా మాట్లాడిన మాటలు. అంతవరకు 'అవును', 'కాదు' అంటూ జవాబు యిచ్చింది.

అతనికి అర్థం అయింది. అంజని మారుటి అన్న, వదినలు కన్యాదానం చేయటానికెంత గర్వం, దాంబికం ప్రదర్శించారో.

"ఓ....నో అంజూ! ఈ రోజునుండి నాకు దొరికే అనురాగం, ఆప్యాయత అన్నిటిలో అర్ధభాగం నీదని మరిచిపోకు" అన్నాడు.

ఆమె కళ్ళతోనే కృతజ్ఞతలు తెలుపుకుంది.

"హల్లో మామయ్యా! దండలన్నీ నీకేనా? నాకు ఒక్కటి యివ్వవూ?"

"మా స్వీటీ అడిగితే ఒకటేమిటి, అన్నీ యిస్తాను" రెండు దండలు తీసి ఆ అమ్మాయి మెడలో వేశాడు.

"మామయ్యా! వంగు...." అన్నది ఆరిందాలా.

దండ వేస్తుందేమో అనుకుని వంగాడు. స్వీటీ అతని రెండు బుగ్గల మీద ముద్దులు పెట్టింది.

"చూడు స్వీటీ! ఆంటీని కిస్ చేయవా?"

"నో! ఓన్లీ మై లవ్లీ అంకుల్!" అన్నది కళ్ళు మిటకరించి.

"ఇప్పుడే ఆంటీతో చెప్పాను. నాకు దొరికే అన్నింటిలో స

యిస్తానని....?"

బుంగమూతి పెట్టాడు హర్ష.

"దట్స్ ఆల్‌రైట్...." అని పెద్దదానిలా వంగమని అంజనకు సైగచేసింది. అంజని కిలకిల నవ్వింది. మెల్లగా వంగింది. స్వీటీ రెండు చెంపలు ముద్దు పెట్టుకుని పరుగెత్తింది.

"నా ఛాన్స్ స్వీటీ కొట్టేసింది" అన్నాడు కొంటెగా.

అంజని తల వంగిపోయింది. రాత్రి తిరుపతి కొండమీద వివాహమయింది. అప్పుడే ఒకరికి, ఒకరు యింత దగ్గర ఎలా కాగలిగారో అర్థం కాలేదు.

"రండి మామయ్యా! అందరూ వచ్చారు. మీకోసమే చూస్తున్నాము" విజయ ఎదురుగా వెళ్ళి ఓ ఖద్దరు ధోవతిని ఆహ్వానించింది.

అతన్ని చూడగానే అంజని కళ్ళు కలువపువ్వుల్లా విచ్చుకున్నాయి. ఆగంతకుని ముఖంలోకి రక్తం పొంగింది.

'ఒరేయ్ కోటేశ్వరరావ్.... కోటిగా....' అనుకున్నాడు కసిగా. అతను ముందుకు రాబోయాడు.

"కాసేపుండండి బాబూ! లలితమ్మగారింటి నుండి భోజనం చెయ్యకుండా ఎవ్వరూ వెళ్ళరు. కుటుంబసభ్యుల ఫోటోలు తీస్తున్నారు" ఒక వ్యక్తి వచ్చి చెయ్యి అడ్డం పెట్టాడు.

ఆగంతకుడు ఆగిపోయాడు.

"నాన్నా! అన్నయ్యేడీ?" ఉదాసీనంగా అడిగింది.

"మీ వదినకేదో క్లబ్ మీటింగు వుందట. వీలయితే వస్తామన్నారు" అన్నాడు.

వీలుకాదని అంజనికి తెలుసు.

విజయ, ఆమె భర్త రాజశేఖర్ చెరో ప్రక్కన నిలబడితే ఫోటో తీశారు.

"అక్కా! అందరికీ విసుగ్గా వుంటుంది. అమ్మని పిలువ్. ఒక్క ఫోటో తీసి భోజనాలకు వెళ్దాము" అన్నాడు శ్రీహర్ష.

విజయ వెళ్ళి ఒక వితంతువును వెంటబెట్టుకు వచ్చింది. గాలికి పడి



పోతుందేమో అన్నంత బలహీనంగా వుంది. గోరంచు ఆఫ్‌వైట్ వెంకటగిరి చీర కట్టుకుంది. చేతులకు ఒక్కో బంగారు గాజు, మెడలో సన్నని గొలుసు వున్నాయి.

'ఈవిడ ఇప్పుడే ఇంత పసిమిచ్ఛాయ అయితే, వయసులో ఎలా వుండేదో!' అనుకుంటారు కొత్తవాళ్ళు.

ఆగంతకుడు అప్రయత్నంగా వంగి దూరంనుండి ఆమెకు నమస్కరించాడు.

ఒక్క ఫోటో అంటే మూడు తియ్యవలసి వచ్చింది.

తల్లితో వధూవరులు ఒక్కటి తీశాడు.

తల్లితో వధూవరులు, విజయ, రాజశేఖర్‌తో మరొకటి తీశాడు.

మూడవదాంట్లో లలితమ్మ కుటుంబసభ్యులతోపాటు, కోటేశ్వరరావుని తీశారు.

అప్పుడు విజయ అందరినీ భోజనాలకు పిలిచింది. అందరూ అటు వెళ్ళారు.

"మనము వెళ్దామా? ఇంట్లోకి వెళ్ళి భోజనం చేద్దామా?" పెళ్ళికూతుర్ని అడిగాడు శ్రీహర్ష.

"అందరూ ఏమనుకుంటారో...." అన్నది భయంగా చుట్టూ చూచి.

ఈసారి అతను నవ్వాడు. తన మెడలోని, ఆమె మెడలోని దండలు తీసివేశాడు.

పనివాళ్ళు ప్రజంటేషన్స్ ఇంట్లోకి చేరేస్తున్నారు.

"బాబూ...." ఆగంతకుడు ముందుకు వచ్చాడు. హర్ష కనుబొమ్మలు ముడిపడ్డాయి. ఎంత జ్ఞాపకం తెచ్చుకున్నా అతనెవరో గుర్తుకు రాలేదు.

"ఒక్క అయిదు నిముషాలు నీతో మాట్లాడాలి...." అన్నాడు మెల్లగా.

"అమ్మో! అయిదు సెకండ్లు లాభంలేదండి. మా డిసిప్లిన్ అక్కయ్య గోడకుర్చీ వేయించగలదు. భోజనం తరువాత ఐదు గంటలు

మాట్లాడతాను" అన్నాడు.

"ఒరేయ్ శ్రీ, పెళ్ళి నీదిరా. రండి" విజయ కేకవేసింది.

"అప్పుంగా నాదేనా అక్కా? నేను స్వీటిదనుకున్నాను" అని అంజని చేయి పట్టుకున్నాడు.

"రండి" ఆగంతకుడిని ఆహ్వానించాడు. వధూవరులు ఒకవైపు వెళ్ళారు. ఆగంతకుడు జనంలో కలిసిపోయాడు.

ఒక చివర బల్లదగ్గర వధూవరులకు వడ్డించారు. శ్రీహర్ష అల్లరికి ముద్ద దిగటంలేదు అంజనికి.

ఒకసారి పచ్చడి మాయం చేస్తాడు. మరోసారి అప్పడం మాయం చేస్తాడు.

తన విస్తట్లో ముద్ద వదిలి, అంజని కలిపిన ముద్ద లాక్కున్నాడు. ఆమెకు అందరూ చూస్తున్నారని భయంగా వుంది.

"శ్రీ! నీ అల్లరి చూస్తున్నాను...." నవ్వుతూ హెచ్చరించింది విజయ.

"అబ్బా! కాసేపు నీవు ఒకచోట కూర్చో విజ్జీ" రాజశేఖర్ విసుక్కున్నాడు.

"ఏయ్ అంజూ! ఏమిటంత మూడీగా వున్నావు?"

"మీ అక్కాతమ్ముళ్ళని చూసి...." అనబోయి ఏం లేదన్నట్టు తలాడించింది.

"రెండు గ్రాముల నాలుక బరువు, రెండు కిలోగ్రాముల తలా డిస్తారా?" అని అడిగాడు.

"వదిన మనస్సే చూస్తుంది" అన్నది పెరుగు వేసుకుంటూ.

"సాంబారు, చారుండగానే పెరుగు వేసుకున్నావేం? నేను తినిపించేదా?" అన్నాడు అల్లరిగా.

"మీరిలా మాట్లాడితే నేను వెళ్ళిపోతాను" అన్నది బెదిరింపుగా.

"అమ్మయ్య! ఇప్పటికి చలనం వచ్చిందన్నమాట" అంటుండగానే మరో మూలనుండి స్నేహితులు అరిచారు.

నవ్వులమధ్య, కేరింతలమధ్య విందు ముగిసింది. చేతులు కడు



క్కుని వస్తుంటే తాంబూలం యిచ్చారు.

తాంబూలం తీసుకుని అంజనివైపు రెండడుగులు వేశాడు శ్రీహర్ష.

"బాబూ...." ఆగంతకుని గొంతువిని, అటువైపు వెళ్ళాడు శ్రీహర్ష. అంజని ఒక్క నిముషం నిలబడి, విజయ వున్నచోటుకు వెళ్ళింది.

"అంజూ! మేం భోజనాలు చేసివస్తాము, నీ గదిలో కాస్సేపు విశ్రాంతి తీసుకో" అన్నది విజయ.

ఉపాధ్యాయుడి మాటకు తలాడించినట్టు తలాడించి, తనకై కేటాయించిన గదిలోకి వచ్చి, ఫ్యాన్ వేసుకుని కూర్చుంది. అలసట, నిద్రలేమి ఆమెను గాఢసుషుప్తిలోకి తీసుకువెళ్ళాయి.

"అంజూ!"

"ఊం....వచ్చారా?" చటుక్కున లేచి కూర్చున్నది.

"వచ్చింది తమ్ముడు కాదు, నేను!" విజయ చిలిపిగా నవ్వింది.

"రాత్రంతా కారు ప్రయాణంకదా! నిద్రలేదు" సంజాయిషీ యిచ్చింది.

"పరవాలేదు. ఈ నగలు, బట్టలు మార్చుకుని స్నానం చేసిరా" అన్నది.

"ఇప్పుడా?" ఇబ్బందిగా చూసింది.

"ఇప్పుడనే కాదు, మరెప్పుడయినా స్నానం చెయ్యనిదే మా తమ్ముడి గదిలోకి వెళ్ళొద్దు, అర్థం అయిందనుకుంటాను" అన్నది సూటిగా చూస్తూ.

తల ఆడించింది అంజని.

"అమ్మా, మా బంధువులంతా పాతకాలం వారు. వెర్రిగా ఏవో వేడుకలు అంటుంటారు. అవేం పట్టించుకోవద్దు. ఈ ఒక్కరోజు యిక్కడ గడిపి రేపు ఊరికి వెళుతున్నారు" అన్నది, ఆమె బీరువాలోనుండి హిమకుసుమంలావున్న వెంకటగిరి చీర, రవికె తీసియిస్తూ.

"విజ్జీ! హర్ష వున్నాడా? స్నేహితులు వెళ్తామని పిలుస్తున్నారు" హడావుడిగా రాజశేఖరం వచ్చాడు.

"లేదే? అంజూ, నీకేమయినా చెప్పాడా?"

"అది కాదొదినా! మేము భోజనాలకు వెళుతుంటే ఒకతను పల్లెటూరి ఆయనలా వున్నారు. అయిదు నిమిషాలు మాట్లాడాలంటూ పిలిచారు. భోజనం అయ్యాక మళ్ళీ కనిపించాడు. ఆయనవెంట వెళ్ళారు" అన్నది మెల్లగా.

విజయ కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"ఎనీ హౌ, నేను వెళ్ళి వాళ్ళను పంపిస్తాను. సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ యిక్కడ వుంది కాబట్టి, నీ తమ్ముడు ఇక్కడికే వస్తాడు. రాగానే బయటకు పంపించు" అన్నాడు రాజశేఖరం వెనుకకు తిరుగుతూ.

"ఉహూ! గదిలోకి పంపించాలి" అన్నది అల్లరిగా.

"ఆల్‌రైట్! నీ యిష్టం" అని అతను వెళ్ళిపోయాడు.

"స్నానంచేసి బొట్టు పెట్టుకొని, శ్రీహర్ష గదిలోకి వెళతావా, నేను వచ్చి పంపేదా?" విజయ అడిగింది.

అంజని తల వంచేసింది. అవును, కాదు అని జవాబు చెప్పలేదు. ఆమె శరీరం చిగురుటాకులా కంపించటం గమనించకపోలేదు.

విజయ ఆప్తిగా అంజని భుజాలచుట్టూ చేయి వేసింది.

"నాకు తెలుసు అంజనా! మాకు డబ్బు, హోదా యివ్వకపోయినా, తన హృదయంలో దాచుకుని కాపాడే తల్లి వుంది. నీకు అన్నీ వున్నా ఆ అనురాగం కరువయింది. ప్రతి నిముషం భయపడతావు. ఈ ఇంట్లో అలాంటి భయాలు వద్దు. ఇకనుండి అమ్మకు ముగ్గురు బిడ్డలం" అన్నది ఆప్యాయంగా.

"థాంక్స్ వదినా...." అన్నది చెమర్చిన కళ్ళు ఒత్తుకుని.

"మా శ్రీహర్షకు చీటికి, మాటికి కన్నీళ్ళు పెట్టేవారంటే పరమ చిరాకు. వాడు గలగల పారే సెలయేరు లాంటివాడు. నువ్వే చూస్తావుగా" అన్నది మృదువుగా బుగ్గ పిండుతూ.

"వదినా! ఆయన యిష్టాలు, అయిష్టాలు చెప్పావుకాదు."

"నాల్గు రోజుల్లో తెలుసుకుంటావుగా! ఒక్క విషయం మాత్రం గుర్తుపెట్టుకో అంజనా! అతని అర్ధాంగిగా నీకు అవి నచ్చకపోయినా



తప్పదు. అతను అమ్మను బాధపెట్టినవారిని మాత్రం క్షమించడు...." అన్నది.

"అమ్మ లేని నేను అమ్మను బాధపెడతానా?"

"నువ్వు బాధపెడతావని కాదు అంజనా! వాడి స్వభావం చెప్పాను. మనచుట్టూ రోజూ చూస్తాం, అత్తా కోడళ్ళంటే ప్రత్యర్థుల్లా కొట్లాడుకుంటారు" అన్నది.

"విజ్జమ్మా! సరక్క వెళ్ళిపోతుందట, మళ్ళీ రేపు వస్తుందా? బొట్టు పెట్టి, చీర యివ్వమ్మా!" లలితమ్మ పిలిచింది.

"ఓ....మరచిపోయానమ్మా!" విజయ వెళ్ళిపోయింది.

లలితమ్మ లోపలికి వచ్చింది. కోడలి చుబుకం పట్టి తల పైకి ఎత్తింది.

"నిదుర వస్తుందా తల్లీ?"

జవాబు చెప్పబోతూంటే నోట్లోమాట నోట్లోనే వుండిపోయింది.

"సరే స్నానం చెయ్యి" ఆమె వెళ్ళిపోయింది.

అంజని హృదయం నిండుగా గాలి పీల్చింది. మెల్లగా బాత్‌రూమ్ లోకి వెళ్ళింది.

మొదటిసారి తనను చూసినప్పుడు శ్రీహర్ష అన్న మాటలు గుర్తుకు వచ్చాయి ఆమెకు.

"అక్కా, చిన్నప్పుడు కోతిపిల్లలా వుండేది, ఇప్పుడు నాతిలా కనిపిస్తుంది" అక్కకూ, తనకూ వినిపించేలా.

విజయ నవ్వింది.

'ఎంత అల్లరివాడు!' అనుకొంటూ స్నానం చేసింది. బట్టలు వేసుకుని, ఒదులుగా జడ అల్లుకుంది.

"విజ్జీ! ఆ జడ ఆ అమ్మాయి స్వంతమేనంటావా? అలా చూడకు, ఇవ్వాళ రేపు జానెడు జుట్టులో బారెడు సవరం పొదుపుకొని పొడువాటి జడ అల్లుకుంటారు" అన్న శ్రీహర్ష కామెంటు గుర్తుకు వచ్చింది.

ఇప్పుడు నిదానంగా విప్పుకుంటుంది జడ. ఆ రోజు రోషంగా జడ విప్పింది.

వీపునిండా పరుచుకున్న వెంట్రుకలను చూశాడు. అల్లరిగా కళ్ళు చికిలిస్తూ నవ్వాడు.

"వాడి మాటలకంత విలువిస్తుంటే యెలా పిల్లా?" విజయ కూడా నవ్వింది. అంజన నవ్వుతూ జడ అల్లుకుని, లైట్‌గా పౌడర్ వేసుకుని, బొట్టు పెట్టుకుంది. అంటీ అంటనట్టు కాటుకరేఖ దిద్దుకుంది.

"ఏదింకా రాలేదు. ఎప్పుడూ యింతే. నా పెళ్ళినాడు, పెళ్ళికూతురు పీటకోసం వెతకాల్సివచ్చింది. అంజూ! కొంగునే ముడివేస్తావో, అనురాగబంధం వేస్తావో నీ యిష్టం. అన్న అలిసిపోయింది" అని సౌరభాలు వెదజల్లుతున్న పూలు తలలో తురిమింది విజయ.

"చూడు అంజనా! మా అమ్మ దాదాపు స్వీటీ పుట్టేవరకూ నవ్వటం ఎరగదు. నాన్నగారు పోవటంతో ఆమె జీవచ్ఛవమైంది. ఆమె అంటే మా ఇద్దరికీ ఒక విధంగా చెప్పాలంటే ప్రాణం. నీకూ ప్రాణం కావాలని అనుకోము కానీ, హర్ష ముందు అమ్మను అవమానించే మాట ఎప్పుడూ అనకు...." అన్నది మృదువుగా.

"వదినా! ఎందుకు నా గురించి సందేహిస్తున్నావు? నేనీ ఇంటికి కోడలుగా వచ్చినా, నాకు కరువైన అమ్మ అనురాగం పొందాలనే వచ్చాను" అన్నది కళ్ళలో తడి తళుక్కుమన్నది.

"ఛ....ఛ....మీరు ఒకరిని ఒకరు అర్థం చేసుకోవటానికి పనికి వస్తుందని చెప్పాను" అన్నది కళ్ళు వత్తి.

ఆమె వెంట బయటకు వచ్చింది. విజయ తన గదిముందు ఆపి, ఆమె గొంతు దగ్గర సెంట్ స్ప్రే చేసింది.

"అదే శ్రీహర్ష గది. వెళ్ళు...." అని చిలిపిగా నవ్వుతూ బయటకి వెళ్ళింది.

అంజని వణికే కాళ్ళతో గదిలో అడుగుపెట్టింది. ఆమె సినిమాలలో తప్ప భార్యాభర్తలు మొదటిరాత్రి గడిపేది చూడలేదు. అలాగే పూలదండలు వ్రేళ్ళాడుతూ, మిఠాయిలతో వుంటుందని వూహించింది. తెల్లని దుప్పటి పరచిన డబుల్‌కాట్, దిండు, కాళ్ళవైపు తెల్లని దుప్పటి వున్నాయి. ఒకవైపు పుస్తకాల రాక్, రెండవవైపు అలమరలో అతనికి

జిల్లా గ్రంథాలయ సంస్థ, నెల్లూరు
శాఖా గ్రంథాలయము, సూళ్లూరుపేట



వచ్చిన కప్పులు అస్తవ్యస్తంగా పడివున్నాయి.

'ఈరోజే కదూ గృహప్రవేశం!' అనుకుంది. వాటిని సర్దిపెట్టింది. ఆ కప్పులన్నీ అతనికి ఎందుకు వచ్చినాయో స్టాండ్‌పై చెక్కబడివున్నాయి. అవి చదువుకుంటే, ఆమె హృదయం గర్వంతో ఉరకలు వేసింది.

తను! ఏ కళా? అభిరుచీ లేదు.

అందరూ ఎడ్యుకేషన్ అంటూ, ఆటల పోటీలు అంటూ హడావుడి పడుతుంటే పుస్తకం పట్టుకుని ఓ మూల కూర్చునేది.

గది బయట అడుగుల చప్పుడైంది.

నిటారుగా నిల్చుంది అంజని. శ్రీహర్ష వస్తున్నాడు. తను మూగ పోయినట్టు వుండకూడదు. ఆమెకు అరచేతుల్లో, నుదుట చెమటపట్టింది.

"అమ్మా! అంజూ...." అన్న చిరపరిచితమైన గొంతు విని యిటు తిరిగింది.

"మీరా నాన్నా...." అన్నది తేలికగా నిట్టూరుస్తూ.

"అవును అంజూ! నేను వెళ్ళిపోతున్నాను. అల్లుడు స్నేహితులతో బయటికి వెళ్ళినట్టున్నాడు" అని జేబులోనుంచి రెండువేల రూపాయలు తీసి బల్లమీద పెడుతూ, కోటేశ్వరరావు.

"రేపు హనీమూన్‌కు వెళ్తున్నారట, ఇది నీ దగ్గరుంచమ్మా! అన్నయ్య, వదిన ప్రవర్తన పట్టించుకోవద్దు" ఆప్యాయంగా ఆమె భుజం తట్టి అన్నాడు.

"మీ ఆరోగ్యం జాగ్రత్త నాన్నా!" అన్నది.

"నాకేమిటమ్మా దుక్కలా, ఉక్కుముక్కలా వున్నాను. నీ వివాహమే బాధ్యతగా వుండేది. అదికూడా తీరిపోయింది" అన్నాడు నవ్వుతూ.

అతన్ని సాగనంపుతూ బయటికి వచ్చింది.

"ఈ ఇల్లు మీదికాదా అన్నయ్యా! ఇంత రాత్రి వెళ్ళిపోవటం దేనికి?" లలితమ్మ కాస్త నిష్ఠూరంగా మాట్లాడింది.

"ఇంకా రోజులు ముందున్నాయేమో, ఎవరు చూశారు" నవ్వాడాయన.

"అర్థం అయింది. మనవలు పుట్టాక వచ్చి వుంటారు" విజయ నవ్వింది.

అందరి దగ్గరా సెలవు తీసుకొని కార్లో ఎక్కారు. స్వీటీ చెయ్యూపింది. ఆయనా నవ్వుతూ చెయ్యూపారు.

అతని దృష్టి మాత్రం లలితమ్మ, విజయల మధ్య నిలబడిన అంజని పైనే నిలిచింది. తెల్లటి దుస్తుల్లో అంతకంటే తెల్లని మల్లెపూలు తలలో తురుముకుని దేవకన్యలా వుంది.

ఆమె కళ్ళల్లో మెరుపులేదు, మసకగా కదులుతున్నాయా కళ్ళు. అతడు నిశ్చలంగా వెనక్కి వాలాడు.

"వీడు యింకా ఎప్పుడు నేర్చుకుంటాడే క్రమశిక్షణ! ఎక్కడికి వెళ్ళాడు?" విసుక్కుంది లలితమ్మ.

ముగ్గురూ ఇంట్లోకి వచ్చారు.

"స్వీటీ! వెళ్ళి పడుకోమ్మా!" విజయ గదివైపు వెళ్ళబోయింది.

"ఉహూ! ఆంటీతో కబుర్లు చెప్పాలి" వచ్చి అంజని కుచ్చెళ్ళలో ముఖం దాచుకుంది.

"ఓ నాటీ! ఈరోజు ఆంటీ కబుర్లుచెప్పే మూడ్‌లో లేదు" అని లాక్కుంది విజయ.

స్వీటీ తల్లిని విదిలించి పారేసింది. అంజన చటుక్కున స్వీటీని ఎత్తుకుంది. రెండు బుగ్గలు గాఢంగా చుంబించింది.

"ఉండనివ్వండి వదినా...." అన్నది. చూపులతోనే వాపాస్తే తెచ్చి మీకిచ్చేస్తానన్నట్టు చెప్పింది.

తనకోసం అభిమానం కురిపించే ప్రాణి వుందంటే వారి కోసం తన ప్రాణాలు ఇవ్వగలదు.

"ఆంటీ! నీ పేరేమిటన్నావ్?" ఆరిందాలా అడిగింది.

"నా పేరు అంజని, అందరూ 'అంజనా' అంటారు. మా డాడీ 'అంజూ' అంటారు" అన్నది ఆ పిల్ల మాటలకు ముచ్చటపడుతూ.

"ఐసీ! నా పేరు శ్వేత! మా మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ



'స్వీటీ' అంటారు. ఆంటీ! నీకు పాటలు వచ్చా?" అన్నది కళ్ళు మిటకరిస్తూ.

"రావమ్మా" అన్నది మంచం చివర్న దింపుతూ. స్ప్రింగ్ కాట్‌పై ఎగురుతూ ఒకటే కబుర్లు.

బయట కారాగిన చప్పుడయింది. అంజని హృదయం లయ తప్పింది. వారే వచ్చివుంటారు అనుకుంది. చటుక్కున వచ్చి కిటికీ దగ్గర నిలబడింది. టాక్సీవాడికి డబ్బులిచ్చి రాజశేఖరం దిగాడు.

అప్రయత్నంగా ఓ నిట్టూర్పు వదిలింది.

"ఆంటీ! ఆర్ యు డమ్?" స్వీటీ భుజంపై ఇచ్చిన పించ్‌కు కెవ్వుమంది అంజన.

"ఏమిటి?" విజయ పరుగున వచ్చింది.

"ఏంలేదు వొదినా....ఫన్" అన్నది ఎర్రబడిన ముఖం దించుకుని.

ఆమె నవ్వి వెళ్ళిపోయింది. స్వీటీ పరుగునవచ్చి అంజని మెడకు చేతులు వేసింది.

"సారీ ఆంటీ! మరే....మామయ్య చాలా బాగా పాడతాడు."

"నిజమా?" కళ్ళు మిటకరించింది, స్వీటీని అనుకరిస్తూ.

"అదిగో! అపైన కబోర్డులో టేప్‌రికార్డర్ వుంది. నాకందదు" అన్నది స్వీటీ.

అంజని అందుకొంది టేప్స్. తీసి చూసింది. ముఖేష్‌వి, రఫీవి, స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావువి వున్నాయి.

ఘంటసాల పాటలున్న టేప్ తీసి రికార్డర్‌లో పెట్టింది. ఆన్ చేసింది.

"రావే నా చెలియా....రావే నా చెలియా...." అన్న పాట వినిపించింది, కానీ పాడింది ఘంటసాల కాదు.

ఆర్కెష్ట్రా లేదు.

"మామయ్య పాట....మామయ్య...." స్వీటీ చప్పట్లు కొట్టింది. అంజని వళ్ళు ఝల్లుమంది తన భర్తకు ఆటవచ్చు, పాటవచ్చు. తనకేం

వచ్చు? తను మామూలు మనిషి, అతి మామూలు యువతి.

అదో ఆగిన శబ్దం అయింది.

చటుక్కున స్వీటీని ఎత్తుకుని కిటికీ దగ్గరకు వచ్చింది. ఎంతమందిలో వున్నా గుర్తించగలదు శ్రీహర్షను. అతడు నడుస్తుంటే భుజం కాస్త వంచుతాడు.

అతనే, అసహనంగా టై వదులు చేసుకుంటూ ఇంట్లోకి వెళతున్నాడు.

"మావయ్య వచ్చాడు...." స్వీటీ ఆమె చేతులలో నుంచి ఒక్క గెంతు గెంతి, పరుగెత్తుకుపోయింది,

అంజని అలాగే కిటికీ రెక్కను ఆనుకుని నిల్చుంది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. "రావే నా చెలియా! అతను ఆహ్వానించినట్టుంది. ఆమె అణువణువు శ్రీహర్షను ఆహ్వానించటానికి ఉత్సాహంతో ఉప్పొంగిపోతోంది. ఏ చిన్న శబ్దమైనా అతని అడుగుల సవ్వడే అనుకుని చూస్తుంది.

టేప్ తిరిగి దానంతట అదే ఆగిపోయింది.

పాట ఆగిపోగానే స్పృహ వచ్చినదానిలా, టేప్ తీసి, టేప్‌రికార్డర్ యథాస్థానంలో వుంచింది.

'స్వీటీని పిలిచినట్టుగా బయటకు వెళ్తే?' రెండడుగులు వేసింది. లజ్జాభారంతో అడుగులు తడబడ్డాయి.

'అందరేమనుకుంటారు? పెళ్ళికూతురికి ఇంత ఆరాటమా అనుకోరు?' లైట్ ఆర్పి బెడ్‌లైట్ వేసి కూర్చున్నది.

తన తొందర తనదే కాని, అతను స్నానం చేసేవరకు పదిహేను నిమిషాలు పడుతుంది.

అంతా నిశ్శబ్దంగా మారింది. ఇంట్లో కూడా ఒక్కొక్క దీపం ఆరియింది.

శ్రీహర్ష మాత్రం గదిలోకి రాలేదు. అసహనంగా లేచింది అంజని. అప్పుడే నల్గురు వస్తున్నట్టు పాదాల ధ్వని వినిపించింది. ఆమె టక్కున లేచి నిలబడింది. పడకగదివరకు అమ్మ అక్క సాగనంపారు కాబోలు!



చిన్నగా నవ్వుకుంది.

పాదాల శబ్దం దూరం అయింది, ఆ శబ్దాన్ని చీల్చుకుని శ్రీహర్ష మాటలు గంభీరంగా, స్పష్టంగా వినిపించాయి.

"అమ్మా! మీ మాటలు కాదన్నానా ఎప్పుడయినా? ఇంత చరిత్ర విన్నాక అంజనిని నా భార్యగా ఎలా స్వీకరిస్తాను? ఆ అమ్మాయిని వెళ్ళిపొమ్మనమ్మా.... వెళ్ళిపొమ్మను" అతని మాటలు మొదట అర్థం కానట్లుంది. తరువాత పిడుగుపాటుగా వినిపించాయి. తనను ఉద్దేశించినవే అని తెలిసే సరికి నిలువెల్లా కంపించిపోయింది.

"శ్రీ మొండితనం చేయకు! అన్నయ్యను గిట్టనివాళ్ళెవరో చేసిన అభూతకల్పన. అయినా నువ్వు చెప్పిందంతా నిజమే అనుకుందాం. ఆ అమ్మాయి తప్పేమిటో చెప్పు" లలితమ్మ గొంతు కంచులా వినిపించింది.

"ఆ కోటేశ్వర్రావు కూతురుగా పుట్టటమే ఆ అమ్మాయి చేసిన తప్పు."

అంజని తల తిరిగిపోసాగింది. కాళ్ళలో నిస్సత్తువ ఆమెను నిలబడనీయలేదు. మరుక్షణమే కళ్ళముందు చీకట్లు అలుముకున్నాయి.

"కోటేశ్వరరావు కూతురుగా పుట్టటమే ఆమె తప్పు!"

"ఆ అమ్మాయిని వెళ్ళిపొమ్మనమ్మా! వెళ్ళిపొమ్మను" అంటున్న రెండు వాక్యాలే ఆమె చెవుల్లో రొదపెడుతున్నాయి.

ఏమాశించి తండ్రి చెప్పగానే ఈ వివాహానికి అంగీకరించింది?.... ఏం వినవలసి వచ్చింది?

"అమ్మా! నా ఆవేశం, ఆవేదన అర్థం చేసుకోవేం? ఆ అమ్మాయి ఈ ఇంట్లో వుంటే నేను హంతకుడిగా మారుతాను"- అది శ్రీహర్ష కంఠమే. కొన్ని గంటలక్రితం అనురాగం, ఆప్యాయత రంగరించి గొంతులో పోసినట్టు అనిపించింది. ఆమె చెవులు మూసుకుని, అలాగే మంచంపై వరిగిపోయింది.

## 2

నిదురమాత్ర పడిలినా బద్ధకం వదల్లేదు లలితమ్మకి. ఆమె జ ఇచ్చిన టీ త్రాగి కూర్చుంది.

"శ్రీ ఏం చేస్తున్నాడమ్మా?" కూతుర్ని అడిగిందామె.

"ఇంకా నిదుర లేపలేదు" అన్నది తల్లి జుట్టు వేళ్ళతో కొ వెనక్కి ముడివేస్తూ.

"అంటని లేచిందా?"

"లేచింది. పాలు త్రాగి, స్వీటీతో కబుర్లు చెబుతుంది" అన్నది మెల్లగా.

"విజమ్మా! కోటేశ్వరరావు మామయ్య అండదండలే లేకపోతే మిమ్మల్ని చదివించేదాన్నా? ఈ ఇల్లు, నీ పెళ్ళి అన్నీ ఆయన చలు కష్టమే. శ్రీహర్షకి మతిపోయింది" అన్నది కాస్త ఆవేశంగా.

"వారికి మతిపోయింది, మనకు పోలేదుగా. మామయ్య తత్వ లోపలో పిటూరీలు చెప్పుతుంటారు. ఆవేశంలో మాట్లాడుకునేకంటే మౌనంగా వుండటం మేలు నువ్వు పూర్తిగా విశ్రాంతి తీసుకో" అం సన్నగా టేపురికార్డరు పెట్టి వెళ్ళిపోయింది విజయ.

"దోలాయాంచల దోలాయా...." అంటూ ఎమ్. ఎస్. సుబ్బలక్ష్మి సుమధురంగా పాడుతుంది.

లలితమ్మ కళ్ళు మూసుకుని దిండుపైకి వాలింది.

"కోటేశ్వరరావు ఎవరమ్మా, ఎవరు? మా నాన్నను చంపిన హంత కుడు, మైగాడ్! ఇంకా ఏదో అనుకున్నాను...." అని రాత్రి రావటం, రాగానే కొడుకన్న మాటలు గుర్తుకువచ్చాయి.

'అమృతమూర్తి అన్నయ్య హంతకుడా? కాదు' అని ఆమె మనసు పదేపదే అంటున్నది ఒక్కసారి ఇరవైమూడేళ్ళ వెనక్కి వెళ్ళింది...

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కడుతున్నారప్పుడు. అప్పుడప్పుడే ప్రారంభించిన ప్రాజెక్టు, గుడిసె హోటళ్ళు అక్కడక్కడ స్టాఫ్ కట్టిన



క్వార్టర్లు తప్ప జనసంచారమే వుండేది కాదు. కంట్రాక్టర్ కోటేశ్వరరావు, ఆనందరావు, అక్కడ ఓ గుడిసెలోనే క్లబ్బు ప్రారంభించారట.

"ఆనంద్ బాబూ! మీరు త్వరగా వివాహం చేసుకుని ఫ్యామిలీని తెచ్చుకోండి. ఈ ఒంటరితనం భరించలేము" అనేవాడట రావ్.

"మరి మీరు వివాహం చేసుకుని ఫ్యామిలీని తెచ్చుకోరేం?"

"ఆనంద్ బాబూ! మరిచిపోయి కూడా డబ్బు కోరిచి గొప్పింటి అమ్మాయిని చేసుకోకు" అని సలహా యిచ్చేవాడట.

ఆ రోజులలోనే తను పదవతరగతి పరీక్షలు వ్రాసి, సెలవులకు పిన్నికూతురు వివాహానికి వెళ్ళింది.

తనకు తల్లీ, తండ్రి లేరు. పెత్తండ్రి ఇంట్లో అనాథగా పెరుగుతుంది. నాయనమ్మ ప్రేమతప్ప తనకేం తెలియదు. పిన్నికూతురు పెళ్ళికి నాయనమ్మే బలవంతంగా పంపింది.

వరుని స్నేహితుడట ఆనంద్ బాబు. మూడవరోజు కబురువచ్చింది. కానీ కట్నం లేకుండా ఆనందబాబు తనను వివాహం చేసుకుంటానన్నాడని నాయనమ్మ పొంగిపోయింది.

"నా తల్లీ! నీవు అదృష్టవంతురాలివే. ఎంత కట్నంపోస్తే ఇంజనీరు అల్లుడుగా వస్తాడు" లలితని హృదయానికి హత్తుకుని ముద్దు పెట్టుకుంది. తన పెదనాన్న స్వార్థంతో వివాహానికి అంగీకరించలేదు. నాయనమ్మ కంట తడి పెట్టుకుని, తనకున్న కొద్దిపాటి నగలు, తన పెద్ద చీర ఇచ్చి, చేతిలో ఓ కొబ్బరికాయ పెట్టి ఆనందబాబు యింటికి పంపించింది. కన్నీటితో అప్పగింతలు పెట్టింది.

"నాయనా! ఈ రోజునుండి దానికి తల్లివి, తండ్రివి నీవే" అన్నది

కోటేశ్వరరావు, మరిద్దరు స్నేహితులు కలిసి గుడిలో తన వివాహం ఆనందబాబుతో చేశారు.

ఆనందబాబు ఇంట్లో వాళ్ళు ఈ వివాహానికి అంగీకరించలేదు. అతనికి తల్లిదండ్రులు లేరు. కాని ముగ్గురు అన్నదమ్ములున్నారు.

"నీ ఇష్టప్రకారమే వివాహం చేసుకున్నాక, మా యింట్లో స్థానం లేదు. ఓ పేద విద్యార్థికి చదువు చెప్పించాం అనుకుంటాం" అన్నారు.

"నాకెవరూ భిక్ష వేయలేదు. నాన్నగారి డబ్బుతోనే చదివించారు. నేనేం నేరం చెయ్యలేదు. నా ఇష్టం వచ్చిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. తప్పా?" అని పోట్లాడి వచ్చేశాడు.

ఆనాడే ఇద్దరూ తమ బంధువులతో బంధనాలు త్రెంచుకుని, అనురాగబంధంలో ఏకమయ్యారు. తనకు ఆత్మీయుడుగా, అన్నగా, తండ్రిగా నిలిచింది ఒక్క కోటేశ్వరరావు మాత్రమే.

ఆనందబాబు ఏనాడూ తనవారిని గుర్తుచేసుకునే అవకాశం ఇవ్వలేదు లలితకు.

"లల్లీ.....లల్లీ....." ఉన్నంతసేపూ పిలుస్తూనే వుండేవాడు.

"ఏమిటి ఆనందబాబూ! లల్లీ అంటూ మా చెల్లెలి పేరు ఖూనీ చేస్తావ్?" అని నవ్వేవాడు రావు.

"అలా ఖూనం చేస్తేనే ఆ మాత్రం పలుకుతుంది" అనేవాడు నవ్వుతూ. ఆనందం అంటే ఏమిటో అతని సాహచర్యంలో తెలుసుకుంది. కాఫీ, టిఫిన్, భోజనం అన్నీ ఆయనతో కలిసి తీసుకోవలసిందే. లేదా వస్తే వూరుకునేవాడు కాదు.

"ఏయ్ లల్లీ! నువ్వు పిండిబొమ్మలా వుంటే నాకు నచ్చదు" అనేవాడు. కోటేశ్వరరావును తమతోపాటే భోజనం చెయ్యమనేవాడు. పిలుస్నప్పుడల్లా భోజనం చేసేవాడు. ఆయన ఎక్కువగా తిరిగేవాడు.

"అన్నయ్యా! వదినను, బాబుని తీసుకురా" అనేది.

"ఆమె రాదమ్మా! ఆమె దగ్గరకు నేను వెళ్ళాలి" అని నిరాశగా నిట్టూర్చేవాడు.

అప్పుడే తమ ఆనందానికి ప్రతిరూపంగా విజయ పుట్టింది. విజయను చూడగానే ఆయన పొందిన అనుభూతి, ఆనందం వర్ణించనలవి కానిది. లత మరిచిపోలేదు. తీయని స్మృతిగా హృదయంలో పదిలంగా దాచుకుంది.

తన చుట్టూ ఓ ప్రపంచం వుంది. సుఖదుఃఖాలుంటాయని, అక్కడ వింతలూ, విశేషాలు జరుగుతాయని మరిచిపోయింది లలిత. ఆమెకు భర్తతోటిదే లోకం, కూతురే ప్రపంచం. అతనే కూతురికి ఏరికోరి విజయ అని



పేరు పెట్టుకున్నాడు.

తనిద్దరికీ బట్టలు, విజయకు మురుగులు తెచ్చి బహూకరించాడు కోటేశ్వరరావు.

బట్టలు తీసుకున్నాడు ఆనందబాబు. బంగారు మురుగులు కోటేశ్వరరావు జేబులో వేశాడు.

"చూడు రావ్! మానసికంగా మనమధ్య స్నేహబంధం వుండవచ్చు కాని, వృత్తిరీత్యా మీరు కాంట్రాక్టర్, నేను యింజనీరును. ఇలాంటి విలువయిన కానుకలు తీసుకువస్తే అపార్థాలకు తావిచ్చినవారం అవుతాము" అన్నాడు.

"ఆనందబాబూ! నాకు తోబుట్టువులు లేని లోటు తీర్చింది లలితమ్మ. ఆ అభిమానంతోనే ఇచ్చాను" అన్నాడు.

"అభిమానం ఖరీదయిన వస్తువులతో వెలకట్టలేము" అన్నాడు నిక్కచ్చిగా. కోటేశ్వరరావు చిన్నబుచ్చుకున్నా, ఆనందబాబు నైతికంగా దిగజారిపోలేదని పొగిడేవాడు.

అతని కుటుంబ జీవితం అంత సాఫీగా సాగిపోవటంలేదని అర్థం అయింది. అతను డబ్బున్నవారి ఇల్లరికపుటల్లుడని, ఆమె ఇతన్ని లెక్క చెయ్యదని, కొడుకును కూడా దూరంగా పబ్లిక్ స్కూల్లో వేసిందని తెలిసేది. అప్పుడప్పుడు సరుకులు తెచ్చే బాలరాజు ఈ వార్తలు చేరవేసేవాడు.

విజయ సంవత్సరం పిల్ల అప్పుడే ఆనందబాబు హడావుడిగా వచ్చాడు. ఇంటిముందు జీపు ఆగివుంది.

"లల్లీ త్వరగా తయారవ్వు. మనము విజయవాడ వెళుతున్నాము" నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వచ్చాక బయటికి వెళ్ళటం అదే ప్రథమం. సంతోషంగా తయారయింది.

అతనే పనిమీద విజయవాడ వెళ్ళినా లత మాత్రం నాయనమ్మను చూచి, తన కూతుర్ని చూపించుకుని వస్తుంది.

జీపులో ఏటన్నా బయలుదేరితే చాలు- గలగల కబుర్లుచెప్పే ఆనంద్‌బాబు మౌనంగా, గంభీరంగా వుంటాడు.

"ఆనంద్! ఏమిటంత సీరియస్‌గా వున్నారు?" కూతుర్ని చేత్తో హత్తుకుని ఎడమచేయి అతని భుజంపై వేసింది.

"నువ్వే అంటావు కారు నడిపేవాడు ఏకాగ్రతగా నడపాలని ఇలా నడిపితే సగం ప్రమాదాలు తప్పుతాయని" భుజంమీదున్న ఆమె చేతిని, తన బుగ్గతో భుజానికేసి నొక్కాడు.

అదీ నిజమే అనుకుంది.

విజయ లేచింది. విజయను పాలుపడుతూ, తండ్రిపైకి దూకుతానంటే కంట్రోల్ చేస్తుండగా విజయవాడ చేరుకున్నారు.

కృష్ణానది ఒడ్డునే ఆపారు. ఆశ్చర్యంగా చూస్తుండగానే నాయనమ్మ శవం వచ్చింది. లలితమ్మకు కంటనీరు కరువయింది. పిచ్చిచూపులు చూసింది.

"అబ్బో! ముసలమ్మ ఆవిడగారికోసం ఎంత విలపించింది. కంట తడి కూడా లేదు" అన్నారు బంధువులు.

ఆరోజే నాయనమ్మ దహనసంస్కారాలుచేసి, పుట్టింటివారి ఋణం పూర్తిగా తీర్చుకుని వచ్చేసింది.

"లల్లీ అమ్మమ్మగారేం చెప్పింది? బంధువులందరినీ నాలోనే చూసుకొమ్మని అనలేదూ? అప్పుడే మరిచిపోయావా?" అక్కున చేర్చుకుని కన్నీరు ఒత్తాడు ఆనంద్. రెండురోజులు సెలవుపెట్టి ఆమె మళ్ళీ బాధపడకుండా నవ్విస్తూ గడిపాడు.

అతని లాలనలో అన్ని కష్టాలు మరిచిపోయిందామె,

ఇది కావాలని అడగాల్సిన పని వుండేదికాదు లలితకు. అన్నీ అతనే తెచ్చేవాడు. అతను చేసే అతి ఖర్చులు చూసి ఆమె అలక సాగించేది. "మీకు వెనుక ముందు లేదు, నా సంగతి సరేసరి. విజయ భవిష్యత్తు కోసమైనా మనం పొదుపు చేసుకోవాలి" అని.

అతను పకపకా నవ్వేసేవాడు.

"లల్లీ, పిచ్చిపిల్లీ! చెవుల్లోని దుమ్ముదులిపి మరీ విను. మా విజయ డాక్టర్ చదువుతుంది. బోలెడు డబ్బు సంపాదిస్తుంది" అంటూ ఎగరేసి పట్టుకునేవాడు.



"కూతురి చదువుకయినా డబ్బుండాలా వద్దా?" అన్నది చిరుకోపంగా.

"వద్దు. మా అమ్మాయి అన్నింటా ఫస్టు. స్కాలర్‌షిప్పుతో చదువుతుంది" అనేవాడు.

వారి ఆనందాన్ని అధికం చెయ్యటానికి అన్నట్టు మరో ఏడాది తిరిగేసరికి కొడుకు పుట్టాడు.

"మా నాయనమ్మ పేరు శ్రీలక్ష్మమ్మ. శ్రీ కలిపి శ్రీధర్ అని పెడతాను" అన్నది లలిత.

"ఉహూ! మా నాన్నగారి పేరు హన్మంతరావు. 'హ'తో పెట్టాలి" అన్నాడు. ఇద్దరూ చర్చించుకుని శ్రీహర్ష అని పేరు పెట్టుకున్నారు. ఆ జీవితం, ఆ వేగం ఇప్పటికి లలిత కళ్ళముందు తిరిగినట్టే వుంది.

ఉదయం తను లేచి టిఫిన్ కాఫీ చేసేది. అప్పుడు ఆనంద్, పిల్లలు లేచేవారు. పిల్లలను పాలుపడుతూ ఆయనకు కాఫీ టిఫిన్ ఇచ్చేది. విజయను ఒడిలో కూర్చోబెట్టుకుని, టిఫిన్ తినిపిస్తూ ముద్దుమాటలు నేర్పేవాడు ఆనంద్.

"నీ పేరేమిటమ్మా?"

"డాటర్ విజయ...."

"డాటర్ వేలే....అదిగో వాడు మై సన్" అని ఉడికించేవాడు.

"నాన్నకేం తెలియదు. డాటరంటే....ఇండిసన్ ఇత్తాను" అనేది.

"చూడు లల్లీ...." కిలకిల నవ్వుతున్న కూతుర్ని గర్వంగా ముద్దు పెట్టుకునేవాడు.

"మరి నీ తమ్ముడి పేరేమిటమ్మా?"

"సీహర్ష....ఇంజనీర్...." కళ్ళు పెద్దవి చేసేది.

"ఓ మై స్వీట్...." ఇద్దరు పిల్లలను ఎత్తుకుని, కాఫీ త్రాగించమని నోరు చాపేవాడు.

అతనికి కాఫీ అందిస్తుంటే అదొక అపూర్వ అనుభవంలా వుండేది.

"లల్లీ! పంచదార బొత్తిగా మరిచిపోయావోయ్" అనేవాడు.

"రెండు చెంచాలు వేశాను. అసలు మీరు పసనాల స్వాములయి

పోయాడు" ఉడుక్కుని తనో సిప్ తీసుకునేది.

"ఇప్పుడు బాగుంది. ప్రతిరోజూ ఇలాగే కాఫీ త్రాగాలి" అన్నాడు. లలితకు సిగ్గు ముంచుకు వచ్చేది.

అతన్ని సాగనంపుతూ వెళ్ళి ఇద్దరి పిల్లలతోపాటు అతనిచ్చే ముద్దు అందుకుని లోపలకు వచ్చేది. పనావిడ వచ్చి ఇల్లు తుడిచి, గిన్నెలు కడిగి నీళ్ళు తెచ్చేలోపల, ఇద్దరు పిల్లలకు స్నానం చేయించి, తనూ స్నానం చేసేది. పదిన్నర ప్రాంతంలో అలసిపోయిన పిల్లలు నిదురపోయేవారు. అప్పుడు చకచకా స్టవ్వు వెలిగించి వంటచేసేది. పిల్లలను లేపి, విజయకు అన్నంపెట్టి మధ్యమధ్య శ్రీహర్షకు పెడుతూ, వాళ్ళను కూర్చోబెట్టేది. విజయకు చిన్నప్పటినుండే క్రమశిక్షణ అలవాటు అయింది.

"విజ్జీ! నువ్వు అన్నం తినేశావుకదా! నాన్నగారు అలసి ఆకలితో వస్తారు. విసిగించక ఆడుకోవాలి" అనేది లలిత.

"ఓ.కే. మమ్మీ...."

"మమ్మీ అనొద్దన్నానా" అని బెదిరించేది.

"సారీ....ఆయామ్ వెరి వెరీ సారీ...." విజయ తండ్రి మాటలను అనుకరించేది. నిజంగానే తండ్రి వచ్చేసరికి తన చిన్న కుర్చీలో కూర్చుని సీరియస్‌గా, బొమ్మల పుస్తకం ముందేసుకుని చదివేది.

"విజ్జూ!" అంటూ ఎగరేసి ముద్దుపెట్టుకునేవాడు ఆనంద్ వస్తూనే.

"నాన్నా! నా చదువు పాడుచేస్తున్నావు" అనేది సీరియస్‌గా.

"సారీ...." అతను ఆమెను దింపి లెంపలు వేసుకువచ్చి, కాళ్ళు కడుక్కుని భోజనానికి కూర్చునేవాడు.

రంగు రంగుల బొమ్మలు ముందేసి శ్రీహర్షను కూర్చోబెట్టేది. వాళ్ళు భోజనం చేస్తుంటే విజయ లాలింపులు, బెదిరింపులు వినిపించేవి.

"శ్రీ....ఊరుకోరా....అల్లరి చెయ్యొద్దు, నాన్నారు అలసి వస్తారు" అనేది.

"అమ్మ....చెబితే వినవు రెండు వేస్తాను. బుద్ధిగా ఆడుకో...."

కూతురి మాటలకు తండ్రి పక పక నవ్వి పొలమార్చుకునేవాడు. రోజుకు ఒక్కసారయినా కూతురిచేత 'నేను డాక్టరీ చదువుతాను, తమ్ముడు ఇంజనీరు చదువుతాడు' అనిపించుకుని సంతోషించేవాడు.



మధ్యాహ్నం అరగంట విశ్రాంతి తీసుకుని వెళ్ళిపోయేవాడు. తను పిల్లలతో కాసేపు ఆడుకుని, ఏదయినా చదువుతూ గడిపేది. సాయంత్రం నాలుగుకాగానే లేచి పిల్లలను ముస్తాబుచేసి, కుక్కర్ పెట్టి తనూ ముస్తాబయి టీ చేసి రెడీగా వుండేది.

ఆనంద్ రాగానే కాసేపు పేపర్ చదువుకుని, స్నానంచేసి, టీ త్రాగి, పైజామా, లాల్చీ వేసుకుని తయారు అయ్యేవాడు.

అతను శ్రీహర్షను ఎత్తుకుంటే, తను విజయను నడిపిస్తూ, భుజానికి పాలసీసా, నీళ్ళబాటిల్, బిస్కెట్లు, చాక్లెట్లు వున్న బ్యాగు తీసుకునేది. డామ్ చుట్టుపక్క తిరిగివచ్చేవారు.

భోజనాలు కాగానే పిల్లలు నిదురపోయేవారు. ఇద్దరినీ పెద్ద మంచం మీద పడుకోబెట్టి, దిండ్లుపెట్టి, దోమతెర దించేవాడు.

"నేను పిల్లల ప్రక్కన పడుకుంటాను" అనేది అల్లరిగా.

"వాళ్ళకు స్వేచ్ఛగా వుండాలి" అనేవాడు చేయిపట్టిలాగుతూ.

"నేను మన పెళ్ళి అయ్యేవరకు నాయనమ్మ ప్రక్కనే పడుకునే దాన్ని."

"అందుకే అలా పుల్లలా వున్నావ్. నా పిల్లలు ఆరోగ్యంగా కళకళలాడుతూ వుండాలి" అని ఆమెను మాట్లాడే అవకాశం యిచ్చేవాడు కాదు.

రోజులు రాకెట్ స్పీడుతో తోసుకుపోతున్నాయి. ఒకరోజు షికారు నుండి తిరిగివస్తుంటే, సన్నగా చినుకులు ప్రారంభమయ్యాయి. త్వరగా నడుస్తుండగానే కోటేశ్వరరావు జీపు వచ్చింది. అతని ప్రక్కనే ఆగింది.

వర్షం వస్తుంది, కాదనలేక యెక్కారు.

"ఏమన్నయ్యా! అటు రావటమే మానేశావ్?"

"మీ ఆయన రావద్దన్నాడమ్మా" అన్నాడు ఓరగా ఆనంద్‌ని చూస్తూ.

"రావ్! నిన్ను కోటేశ్వరరావుగా, నా స్నేహితుడుగా ఆహ్వానిస్తాను. కాని ఒక ఇంజనీరుగా ఒక కంట్రాక్టర్‌గా రావద్దంటాను" అన్నాడు.

"ఆయన రావద్దంటే ఊరుకుంటారా అన్నయ్యా? మీరు రండి" అన్నది.

"తమాషాకన్నానమ్మా. ఏ మంత్రంతో కట్టేశావో కాని. పని అయితే ఒక్క నిముషం బయట వుండడు. మీ అనుకూల దాంపత్యం చూచి కన్ను కుడుతుందేమోనని భయం" అన్నాడు నవ్వుతూ.

వాళ్ళను ఇంటిదగ్గర దింపేశాడు లలితమ్మ బలవంతం చూస్తే కాఫీ త్రాగాడు.

"లల్లీ! మీ అన్నయ్యకీమధ్య చేదుపదార్థాలే రుచిస్తున్నాయి. నీ కాఫీ కషాయంలా వుంటుంది" ఆనంద్ బట్టలు మార్చుకుంటూ అన్నాడు.

"కుటుంబంలో కరువైన శాంతిసౌఖ్యాలు మత్తులో దొరుకుతాయేమోనని...." అన్నాడు బొంగురు గొంతుకతో రావు.

"రావ్! నాకంటే ఒకటి రెండు సంవత్సరాలు నువ్వే పెద్ద అనుకుంటాను. జీవితంలో పరాజయాన్ని సవాలుగా తీసుకోవాలి, కాని మత్తులో శాంతి వెతుక్కోవటం పిరికివాళ్ళ లక్షణం" అన్నాడు తీక్షణంగా.

లలితకేదేం అర్థంకాలేదు.

"అవును ఆనంద్! ఇప్పుడు స్కూటర్ ఎంతో అవసరం" అన్నాడు.

"స్కూటర్ ఏం ఖర్మ! మేము నల్గురం కారు కావాలేమో" అన్నాడు వెటకారంగా.

"నల్గురితో నారాయణా అనుకుంటేనే సుఖం" అన్నాడు.

"రావ్! నువ్వేనా ఈ మాట అంటున్నది. అడుగజాల దూరం రాయి వచ్చింది పేపర్లో. అసత్యమైతే అని నువ్వే వ్రాయకుంటే నేనెలా వ్రాస్తాను?" కోపంగా అడిగాడు ఆనంద్.

"అదికాదు ఆనంద్...."

"నాకు తెలుసు. మిగిలినవాళ్ళు మీరిచ్చిన లంచానికాశపడి, ప్రభుత్వం రాయివుంటే పదింతలు ఇస్తారని ఆడుతున్న నాటకంకదూ?" తీక్షణంగా వుందా ప్రశ్న.

ఆనంద్ అంత తీవ్రంగా మాట్లాడడం ఎరుగని లలిత వణికి



పోయింది.

"నేను అనను ఆనంద్! నాతోపాటు చాలామంది వున్నారు. ఓ.కె. నీకెలా అర్థంచేయాలో నాకు తెలియటంలేదు" దీర్ఘంగా నిట్టూర్చాడు రావ్.

"నీవు చెప్పే విషయం అర్థంకానిది అయినప్పుడు నువ్వు బాధపడాలి. ప్రభుత్వం డబ్బే తలాకొంత పంచుకుందాం అనుకుంటున్నారు. లక్షలు మీరు ఆర్జించి వేలు మాకివ్వాలని తాపత్రయపడుతున్నారు. మనిషికి మనసు, విశ్వాసం అనేవి వుండాలయ్యా" అన్నాడు కోపంగా.

"ఆనంద్ బాబూ! మీరీ సమాజంలో బ్రతుకుతున్నారు. ఆ విషయం మరిచిపోతే ఎలా?"

"రావ్! కొందరు రోజూ చస్తూ బ్రతుకుతారు. ఆ బ్రతుకు నాక్కర లేదు. బ్రతికినన్ని రోజులు మహారాజులా బ్రతుకుతాను" అన్నాడు నిట్టూర్పు వదిలి వెళ్ళిపోయాడు.

"ఏమిటండీ! వాళ్ళతో మనకెందుకండీ" భయంగా చూసింది లలిత.

"చూడు లల్లీ! మనతో పొసగదు అనుకుంటే ట్రాన్స్‌ఫర్ చేయిస్తారు. మనకీ ఊరు శాశ్వతమా చెప్పు" అన్నాడు అనునయంగా.

"కోటేశ్వరరావుతో మాట్లాడిన గొంతుకు, తనతో మాట్లాడుతున్న గొంతుకు పోలికే లేదసలు.

ప్రతిరోజు ఓ కొత్త అనుభవంలా, అందంగా, ఆనందంగా సాగిపోతున్నాయి రోజులు. అమృతపు ఘడియలు అల్పాయుష్కాలని తెలియదు ఊహించనయినా లేదు.

"విజయను రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించాలి లల్లీ. రేపు హైద్రాబాద్‌కు నువ్వూ రాకూడదూ?" అన్నాడు. అన్నీ తయారుచేసింది. అప్పుడు బస్సులలో సీట్లకు ఇప్పుడున్నంత రద్దీ వుండేదికాదు.

"ప్రొఫెషనల్ కోర్సుకు పంపాలంటే, మొదటినుంచే జాగ్రత్తగా చదివించాలి లల్లీ" అన్నాడు.

అతను వస్తాడు వస్తాడని చూస్తుండగానే జీపు తీసుకుని కోటేశ్వరరావు వచ్చాడు.

"లలితమ్మా! పిల్లలను తీసుకుని రా, మనం హైద్రాబాద్ వెళ్ళాలి"

అన్నాడు. అతని గంభీర వదనం చూచి ఏదో కీడు శంకించింది.

"ఆనంద్ ఏడి అన్నయ్యా?"

"బెనాల్లో చిన్న దెబ్బ తాకిందమ్మా! అందుకని ఆస్పత్రికి తీసుక వెళ్ళారు" అన్నాడు.

"అన్నయ్యా...." ఆర్తనాదంచేసి వణుకుతూ నిలబడిపోయింది.

"పద తల్లీ! నువ్వు ధైర్యంగా వుండాలి...." పిల్లలను ఆయనే జీపు ఎక్కించాడు. ఆమె ప్లాస్కు తీసుకుని ఎక్కేసింది.

తల్లి కాస్త సీరియస్‌గా వుంటే పిల్లలు బుద్ధిగా వుంటారు. ఉస్మానియా ఆస్పత్రిముందు జీపు ఆగింది.

"అమ్మా...." అని బావురుమన్నారు. హెల్పర్ బాలరాజు ఆనంద్ శవాన్ని అతని ఆఫీసు పనిచేసేవారు బయటికి తీసుక వస్తున్నారు. ఆ క్షణంలోనే తన ప్రాణం ఎందుకు పోలేదో ఇప్పటికీ అర్థంకాదు లలితకు.

ఆమెకు ప్రపంచమంతా శూన్యంగా కనిపించింది. భర్త శవం ప్రక్కన ఏడుస్తూ కూర్చుంది. కోటేశ్వర్రావు అతని అన్నలకు కబురు చేశాడు. వాళ్ళు వచ్చి దహనసంస్కారాలు చేసి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోతుంటే కోటేశ్వర్రావు వెనకాల వెళ్ళాడు.

"ఆనంద్‌బాబు భార్యాబిడ్డల గురించి ఏమాలోచించారు?"

"ఆలోచించవలసిన అవసరం మాకులేదు. అందుకు పెద్దలు ఓ సాంప్రదాయం పెట్టారు-పెద్దల ఇష్టప్రకారం వివాహాలు జరగాలని. అలా జరిగితే మా ఇంటికి కోడలుగా మాకు బాధ్యత వుండేది" అన్నారు.

"అలా అంటే ఎలా బాబూ? ఇద్దరు పసిపిల్లలతో ఆమె ఎక్కడికి వెళుతుంది?"

"అది ఆమె సమస్య."

వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆనాడు లలితకు అత్తింటితో వున్న బంధం తెగిపోయింది. ఆమెకు ఆ క్షణంలో పిల్లలకు ఇంత విషం ఇచ్చి, తనూ తీసుకుందామన్నంత విరక్తి కలిగింది. కాని తనకు అమృతం పంచి యిచ్చిన ఆ మాతృమూర్తి ప్రతిరూపాలను పెంచి, పెద్దచేయాలి. నాలుగు సంవత్సరాలు పొందిన అను



రాగం, అనుభూతితో తను జీవితాంతం ఎంత కష్టమయినా భరించగలదు.

"అమ్మా! నాకెవరూ తోబుట్టువులు లేరు. ఆదరణ, ఆప్యాయత నీ దగ్గర పొందాను. అన్నగా నా యింటికి ఆహ్వానిస్తున్నాను రామ్మా" అన్నాడు. ఆ క్షణంలో ఏం చేయాలో తోచని లలిత అతని వెంట వెళ్ళింది. కోటేశ్వర్రావు త్రాగుడును బానిస. గంభీరత్వాన్ని ఎందుకు స్వంతం చేసుకున్నాడో అర్థం అయింది. పదీ, పదిహేను గదులున్న ఆ ఇల్లు శూన్యంలో భయంకరమయిన నిశ్శబ్దంతో వున్నది.

కోటేశ్వర్రావు మామూగా ధనవంతులకున్న అవలక్షణాలన్నీ వున్నాయి. కొడుకు హాస్టల్లో వుంటాడట. భార్యకు క్లబ్బులు, టూర్‌లు పని వారి రాజ్యం. ఆ ఇంట్లో పిచ్చెత్తినట్టు వుంటుంది.

ఆనంద్‌బాబు కర్మ క్లుప్తంగా ముగిసింది. పదిరోజులలో చాలా విషయాలు అర్థమయ్యాయి లలితకు కోటేశ్వర్రావు అంటే పనివారికున్న విలువ లేదు అతని భార్య దృష్టిలో.

"మీకు కలిగిన కష్టానికి చాలా విచారిస్తున్నాను" అన్నది ఒకసారి తన గదికి వచ్చి. అంతే ఆ ఇంట్లో మళ్ళీ ఎలాంటి చలనం లేదు. కోటేశ్వర్రావ్ ప్రాజెక్టుకు వెళ్ళిపోయాక ఆమెకు ఒంటరితనంతో పిచ్చి ఎత్తుతుందేమో అనిపించింది.

"అన్నయ్యా! స్వంత అన్నయినా చూడనంత ఆదరణతో చూశారు కాదనను. ఈ జ్ఞాపకాలతో బ్రతకలేను. కాస్త మనసు కావాలంటే నాకేదో వ్యాపకం" అన్నది.

ఆమె భావం గ్రహించాడు. ఆమె చదివిన బడికెళ్ళి సర్టిఫికెట్లు తెచ్చాడు. ఆమెను ఒక ప్రైవేట్ బడిలో ఉపాధ్యాయినిగా చేర్చాడు. ఇప్పటి మాదిరి క్రమం యింత దిగజారిపోయిన పరిస్థితులు లేవు. నిరుద్యోగ సమస్య అంతగా లేదు.

ఉత్తరాయణం, దక్షిణాయణం అప్పట్లో లేదు.

తెలిసగానే సైకిల్ బడిలో ఉద్యోగం దొరికింది. ప్రభుత్వ ఉద్యోగం చేయాలని సమర్థత వున్నా, ట్రాన్స్‌ఫర్స్ వుంటాయని ప్రయత్నించలేదు. లలితమ్మ నిజంగా ఆనంద్‌ను మర్చిపోయిందా? తాత్కాలికంగా

అతని జ్ఞాపకాలను దూరం చేసుకుందా? దినమంతా పనిచేసి అలసి నిద్ర పోయేది.

"అన్నయ్యా! ఈ ఇంట్లో ఎంత ఆదరణ లభించినా, దుర్వినియోగం చేసుకోవడం మంచిదికాదు" అన్నది. వేరుగా వెళతానని చెప్పలేక అతను నవ్వాడు.

"నాకు తెలుసమ్మా. ఆ అవుట్‌హౌస్‌లో గదులు అద్దెకిచ్చే వుద్దేశం వుంది. అక్కడే వుండు. కొత్త. పిళ్ళిద్దరు పెద్దవాళ్ళు అయితే దిగులుండదు. నువ్వు బడికి వెళితే పిళ్ళిద్దరూ దిగాలుపడతారు. ఇక్కడ పనివారికలవాటు పడ్డారు" అన్నాడు.

అంతకంటే వేరేమార్గం కనిపించలేదు.

పునాదులు బావుంటాయి, మంచి స్కూల్లో చేర్పిస్తానన్న అనం లేదు. ఇప్పుడు అతని అభిప్రాయం బయటపడితే కోటేశ్వరరావు చెప్ స్తాడు. అది తనకిష్టంలేదు.

అందుకే అతి మామూలు బడిలో చేరింది విజయ.

కాని పిల్లలిద్దరికీ తండ్రి తెలివితేటలు వచ్చాయేమో, అన్నింటా ఫస్టే.

అదొక్కటే ఆమె బతుక్కి ఆలంబన. స్కాలర్‌షిప్‌లు తెచ్చుకున్నారు.

ఆమెకు ప్రాజెక్టు విషయాలు తెలియవు. ఓరోజు యథాలాపంగా వార్తాపత్రిక తిరగేస్తే 'త్రాగి' తన యజమాని అయిన ఇంజనీర్ రామనాథ్‌ను హత్య చేసినందుకు, బాలరాజ్ అనే హెల్పర్‌కు ఇరవై ఒక్క సంవత్సరాలు జైలుశిక్ష పడింది అన్న వార్తచదివి ఒక్కక్షణం బాలయ్య కోసం జాలిపడింది.

తనిప్పుడు ఎవరిపట్లయినా జాలిపడే స్థితిలో వుందా! కన్నీరు ఒత్తుకుంది.

రామనాథ్ భార్యాపిల్లలు ఆమె కళ్ళముందు మెదిలారు. దర్జాగా, కిలకిలలాడుతుండేవారు పాపం అనుకుంది. అన్నయ్య రాగానే విషయం కనుక్కుందాం అనుకుంది.



అప్పుడే కోటేశ్వరరావింట్లో పెద్ద తుఫాను బయలుదేరింది. అతని భార్య కమల అరుస్తూ వచ్చింది.

"రామ్మా లలితా! ఆ అబద్ధాలకోరు, దగాకోరు నీ ముందయినా నోరు విప్పుతాడేమో, రా" అంటూ చెయ్యిపట్టి లాక్కువెళ్ళింది.

లలిత వెళ్ళేసరికి కోటేశ్వరరావు బోనులో పులిలా హాల్లో పచార్లు చేస్తున్నాడు. అతని మామ బూతులు తిడుతున్నాడు.

"మీరుండండి పప్పా! లలిత నీపై ప్రమాణంచేసి చెప్పమను. దిక్కులేని మరదల్ని చేరదీసి కాపురం చేస్తున్నాడో లేదో?" అపరకాళిలా లేచింది కమల.

బిక్కుబిక్కున చూసింది లలిత.

"ప్లీజ్ లలితా! నువ్వు ఈ ఇంటికి వచ్చిననాడు పనివారు చెవులు కొరుక్కున్నా నిన్ను ఒకమాట అడగలేదు. నీ ముఖంలో అమాయకత్వం నన్ను చెడుగా వూహించనీయలేదు" అన్నది ఏడుస్తూ.

లలిత విచలిత అయింది.

"ఆమెనెందుకు బలవంతం చేస్తావు? ఆమెపై ఆ నమ్మకం వుంచావు. సంతోషం. ఊర్మిళను ఆదుకుందామని తెచ్చాను. ఆమె విద్యావంతురాలుకాదు. ఏంచేయాలో తోచలేదు. నువ్వింత అభాండం వేశావు కాబట్టి నీ అనుమానం నిజం చేస్తాను" అన్నాడు దృఢంగా.

"మాశారా...." హిస్టీరియా వచ్చినట్టు ఏడ్చింది కమల.

"ఏమిటన్నయ్యా? నాకేం అర్థంకావటంలేదు" అన్నది కమల.

"లలితా వీళ్ళు ఇల్లరికపుటల్లుడని నన్ను ఓ పురుగుని చూచినట్టు చూచారు. ఆమెకు క్లబ్బులు, పార్టీలు కావాలి. నాకు భార్య కావాలి. నాకు దూరపు బంధువుల అమ్మాయిని ఆదుకుందామని తెచ్చాను. నాకు లేని వూహలు ఆమెకు కలిగాయి. ఊర్మిళను నేను వివాహం చేసుకుంటాను" అన్నాడు.

"వద్దన్నయ్యా ఛ....ఛ.... వదినముందే అలాంటి మాటలు అనటం పాపంకదూ?" అన్నది విహ్వల అయినట్టు చూచి.

"ఆ పాపపుణ్యాలు మీ వదిన బేరీజువేయాలి. నేనేమయినా ఆమెకు అవసరం లేదు. భార్యగా నా అవసరాలు తీర్చిందా అడుగు...." అన్నాడు. ఇద్దరూ వాదించుకున్నారు. రెచ్చిపోయారు.

పేదరికానికి, ఐశ్వర్యానికి మధ్య జరిగిన పోరాటం అది. చివరకు కోటేశ్వరరావు ఇల్లువిడిచి వెళ్ళి ఊర్మిళను వివాహం చేసుకున్నాడు.

లలిత చాలా బాధపడింది. కమలను, పిల్లవాడిని ఆమె నిశితంగా గమనించింది. అహం తప్ప చెడ్డవాడుకాదు.

పేదరికం అంటే చులకన. తనేం చెయ్యాలో తెలియలేదు. ఒకరోజు కోటేశ్వరరావే చెప్పాడు.

"లలితమ్మా! ఆనంద్ మీద అభిమానంతో అతని కయిష్టమైన త్రాగుడు మానాను. నాకు ఒక తోడు కావాలనిపించిందమ్మా! నేను కమల దగ్గర పొందలేనిది ఊర్మిళ అందిస్తూందమ్మా" అన్నాడు.

"మీ ఆనందం చూచుకున్నారేతప్ప వదిన మనస్సు- బాలాజీ భవిష్యత్తు ఆలోచించలేదు" అన్నది కినుకగా.

"మీ వదినకు మనస్సు అంటూ వుందా?" అన్నాడు కోపంగా. ఆ తరువాత కమల తండ్రి, కొడుకుని తీసుకొని లండన్ వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు లలితమ్మను ఆ ఇంట్లోనే వుండమని అనుమతి యిచ్చింది.

సంవత్సరాలు గడుస్తున్నాయి.

ఓరోజు పెద్ద మిఠాయిపొట్లాం తీసుకుని వచ్చాడు కోటేశ్వరరావు.

"ఏమిటన్నయ్యా?" ఆశ్చర్యంగా అడిగింది.

"నీకు కోడలు పుట్టింది. రెండవది ఏమిటంటే నా జీవితానికి పట్టిన శని వదిలింది" అన్నాడు.

"నాకు రెండో విషయం అర్థంకాలేదు. మొదటి విషయానికి హార్దికాభివందనలు" అన్నది లలిత.

"మామయ్యా! శ్రీకంటే పెద్దదాన్ని నేను. నాకు మగడు పుట్టకుండా తమ్ముడికి పెళ్ళాం ఎలా పుట్టింది?" అన్నది విజయ.

ఇద్దరూ పడీపడీ నవ్వారు. ఆయన విజయను ఎత్తుకుని, "నీ మగడు లండన్‌లో వున్నాడు" అని, మిఠాయిపెట్టి పిల్లలను బయటికి పంపాడు.



అతని మామగారు పోయారని చెప్పాడు.

ఆమె ఆశ్చర్యంగా చూచింది.

"నాకు తెలుసమ్మా! మామపోతే సంతోషమా అంటావ్! మా సంసారంలో ఆయన జోక్యమే కమల జీవితాన్ని బలిగొన్నది. అమ్మాయిని ఒక ఇంటికి యిచ్చినప్పుడు వాళ్ళ కాపురం వాళ్ళను చేసుకోనివ్వాలి. ప్రతి నిమిషం వారి ప్రమేయం వుంటే ఆ కాపురంలో అశాంతి మిగులుతుంది" అన్నాడు. అతను అన్నవాండ్లో నిజం వుందని నిరూపిస్తూ కమల తిరిగి వచ్చింది. ఆమె భర్తను ఏమనలేదు. రెండవ కాన్పులో ఊర్మిళ, పుట్టిన పిల్లవాడు పోయాడు. మనసాప ఉంజని కమల పంచన చేరక తప్పలేదు.

అప్పుడే బంజారాహిల్స్‌లో కొత్తమేడ కట్టుకుని వాళ్ళు వెళ్ళిపోయారు. కమల అంజనిని బాగా చూడటంలేదని బాధపడేవాడు. బాలాజీ ఒళ్ళంతా అహంకారం నింపుకుని వచ్చాడు.

తను అనారోగ్యంగా వున్నానని, తన కొడుకుని భర్త నిర్లక్ష్యం చేస్తాడని కమల తన చిన్నమ్మ మనవరాల్ని ఇరవై ఒకటో సంవత్సరంలో బాలాజీకి వివాహం చేసింది. మరునటి సంవత్సరమే ఆమె చనిపోయింది.

బాలాజీ, పద్మలు అహంభావానికి ప్రతిరూపాలని వారి వివాహంనాడే తెలుసుకుంది. కమలమ్మమీది గౌరవంచేత వెళ్ళింది రిసెప్షన్‌కు. అందరికీ నమస్కారం చేస్తూ ఆహ్వానిస్తున్న బాలాజీ లలితమ్మను చూడనట్టే నటించాడు.

తనే గిఫ్ట్ యివ్వడానికి వెళ్ళింది.

"కంగ్రాచ్యులేషన్స్ బాబూ" అన్నది.

"థాంక్స్! పద్మా! ఈవిడ దిక్కులేని స్త్రీ. మా డాడీ తెచ్చి అవుట్‌హౌస్‌లో వుంచాడు" అని పరిచయం చేశాడు.

కళ్ళనీళ్ళ పర్యంతం అయినా, చిరునవ్వుతో బయటికి వచ్చింది. 'ఇంకా నయం పిల్లలను తెచ్చానుకాడు. మరీ శ్రీహర్ష తనను ఏమన్నా సహించడు' అనుకుంది.

విజయ హౌస్‌సర్జన్సీ చేస్తుండగా లలితమ్మ ఆరోగ్యం దెబ్బతిన్నది. కోటేశ్వరరావ్ సెలవు పెట్టించాడు.

మద్రాసులో సీటు వచ్చేవరకు శ్రీహర్షకోసం ఎంత తాపత్రయ
పడ్డాడు! విజయ పెండ్లి చేయగలిగేదా?

అసలీ ఇల్లు కట్టించింది ఆయనే. అలాంటి అమృతమూర్తి భ
ర్తను హత్యచేస్తాడా? ఎవరు చేశారీ అభూతకల్పన?

# 3

“రికార్డు ఆగిపోయిందత్తయ్యా!”

లలితమ్మ తల ఎత్తింది. అంజని రికార్డు ప్లేయర్ ఆఫ్‌చేస్తుం
రాత్రి చూచిన అందాలబొమ్మైనా అన్నట్టుంది.

అంజూ! శ్రీకి టీ యిచ్చావా?” అని అడిగింది, రాత్రి ఏం జరి
నట్టు.

అంజని భీతహరిణేక్షణలా అయింది. బిక్కున చూసింది.

“వాడికి టీ యిచ్చి, నేను పిలుస్తున్నానని చెప్పి తీసుకురా” అన్నది

అంజని ఒకసారి అత్తగారివంక చూచింది. ఆమె కళ్ళు అప్
యతను కురిపిస్తున్నాయి. మెల్లగా గదిలోనుండి వంటగదివైపు వెళ్ళింది
అక్కడ పనిమనిషిని అడిగి కప్పు, సాసరు తీసుకుని, ఫ్లాస్కులోని
వంపుకుంది. ఆ కప్పు ట్రేలో పెట్టుకుని, శ్రీహర్ష ఉన్న గదిలోని
వెళ్ళింది. అతను గెస్టురూమ్‌లో వున్నాడని స్వీటీ చెప్పింది.

గదిలో అడుగుపెడుతుంటే ఆమె కాళ్ళు వణికాయి. ముందు కట్
సుని అప్పుడే బాత్‌రూమ్‌నుండి తల తుడుచుకుంటూ వచ్చాడు శ్రీహర్ష.
ఇద్దరి కళ్ళు అరసెకండ్ కలుసుకున్నాయి. అంజని తల వంచుకుంది.

“టీ....” అన్నది అతి ప్రయత్నంమీద నోరువిప్పి.

“వద్దు” అటు తిరిగి తనకేం పట్టనట్టు నిర్లక్ష్యంగా అన్నాడు.

అలాంటి నిర్లక్ష్యపు మాటలు పెద్దమ్మచేత, వదినచేత, అన్నయ్య
చేత, బంధువులచేత విన్నది. అప్పుడు ఒక రకమైన నిర్లిప్తత ఆవహించేది.
ఈరోజు గట్టుతెగిన వాగులా దుఃఖం ముంచుకువచ్చింది.



మీరైతే ఏంచేస్తారు?

ట్రే బల్లమీద పెట్టి వస్తున్న దుఃఖం అదిమిపట్టి అలాగే
నిల్చుంది.

అతను బట్టలు వేసుకొని అక్కడ దువ్వెనకోసం వెతికి అది కని
పించలేదేమో ఆ గదిలోనుండి వెళ్ళిపోయాడు.

తన తండ్రి హంతకుడా? ఆమెకు రోషం ముంచుకువచ్చింది. ఎవ
రికీ ఏ చిన్నబాధ కల్గినా సహించలేడు. అలాంటి తండ్రి హత్యలు చేస్తాడా!
అతను తనలాగే దురదృష్టవంతుడు. లేని నిందలు మోస్తున్నాడు. అన్నా,
వదిన అనవసరంగా ఎన్నిసార్లు అనరు?

మెల్లగా అత్తగారి గదివైపు వచ్చింది. కర్టెన్ తొలగించుకుని పోబో
యిందల్లా, భర్త గొంతు వినిపించాక ఆగిపోయింది.

“శ్రీ! అమ్మంటే ఏమాత్రం గౌరవమున్నా, ఆమె బ్రతకాలనుకుంటే
తొందరపడి నిర్ణయాలు తీసుకోకు. ఒక్కసారి బాలరాజును యిక్కడకు
తీసుకురా” అన్నది మెల్లగా.

“అదికాదమ్మా! అబద్ధం చెప్పాల్సిన అవసరం ఏముంది?

“శ్రీ! నిన్ను చూస్తే నవ్వు వస్తోందిరా. కని, పెంచి, ఇంత పెద్ద
వాడిని చేసిన తల్లి మాటలకంటే ఒక అనామకుడి మాటలకు విలువ
యిస్తావా....”

“అమ్మా! అదేంలేదు. అతన్ని తీసుకువస్తాను” అన్నాడు తల్లి
తలప్రక్కన వున్న దువ్వెన తీసుకుని తల దువ్వుకుంటూ.

అతన్ని వెనుకనుండి చూస్తూ నిలబడిపోయింది. చిత్రకారుడు గీసిన
చిత్రంలా వున్నాడు.

ఎవరీ బాలరాజు? తను ఏం అపకారం చేసిందని తన భర్త మనసు
విరిచేస్తున్నాడు? అతనే గనుక రాకుంటే తన బ్రతుకు మరో విధంగా
వుండేది. తను అల్లరిగా అతని జుట్టుతో ఆడుకుంటూ దువ్వేది. ఆమె
వూహలు ఎటో వెళ్ళాయి. అలా, అలల్లా మధురంగా సాగుతున్నాయి.

“అమ్మా! అంజనీ....అంజూ....”

అత్తగారివంకే ఏమిటన్నట్లు చూసింది.

“వచ్చిననాడే ఇంటి బాధ్యత అప్పగించటం భావ్యంకాక

పోయినా, నా అనారోగ్యం, నన్ను అసహాయురాలిని చేస్తుందమ్మా? విజయ ఒక్కసారి హాస్పటల్‌కు వెళ్ళివస్తానన్నది. పనివాడు టిఫిన్ తెచ్చేస్తుంటాడు. శ్రీకి, నాకు పట్రా" అన్నది.

అక్కడనుండి చకచకా వంటింట్లోకి వచ్చింది. పంట్రి దగ్గర పని చేసే యలమంద పూరీలు వత్తుతున్నాడు. వేయించిన పూరీలు ప్లేట్లలో సర్దింది. యలమంద ముసిముసిగా నవ్వాడు.

"ఉండు బుజ్జమ్మా! నేను తీసుకువస్తాను" అన్నాడు.

"వంటపని చూడు" అని, ప్లేట్లు తీసుకుని గదిలోకి వచ్చింది మోకాలితో స్టూలు జరుపుతూ, ట్రే పెట్టటానికి వంగింది.

ఆమె జడవెళ్ళి కొరడాదెబ్బలా శ్రీహర్ష ముఖానికి తాకింది. అ జడని భయంగా వెనక్కి వేసుకుంది.

"భలే....భలే! మామయ్యను అలాగే కొట్టాలే. అమ్మమ్మా నా జుట్టు కత్తిరించకేం" చప్పట్లు కొడుతూ బుట్టబొమ్మలా, గళ్ళ ఫుల్ వాయిల్ స్లీవ్‌లెస్ ఫ్రాక్ వేసుకుని వచ్చింది స్వీటీ.

"జుట్టు పెంచుకుని మగణ్ణి కొట్టటానికే అయితే యింకా చాలా టైముందే తల్లీ! బ్రేక్‌ఫాస్ట్ చేశావా?" లలితమ్మ అడిగింది.

"ఓ యస్! అత్తయ్య తినిపించింది" శ్రీహర్ష భుజాలపై స్వారీ చేస్తూ అంది.

"స్వీటీ! నా షర్టు [illegible]. దిగు" అన్నాడు శ్రీహర్ష కాస్త కోపంగా.

"అమ్మమ్మా! రాత్రి మామయ్య మిరపకాయ బజ్జీలు తిన్నాడా?" అన్నది నవ్వుతూ. విజయ భర్తను ఆ మాటని ఏడిపిస్తుంది ఎప్పుడూ.

"యు నాటీ...." పకపక నవ్వాడు.

ముగ్ధురాలయినట్టు చూసింది అంజని.

లలితమ్మ లేచి కూర్చుంది. అంజని ప్లేటు ఆమెకిచ్చింది. ఆమె పూరీ నుంచి, కూర తీసుకుని, మొదటి ముద్ద కొడుక్కి అందించింది. చిన్నప్పటినుండి అది ఆనవాయితీలా ఇంట్లో వుంటే తల్లి ఎత్తిన మొదటి ముద్ద పిల్లలకు పెడుతుంది.

"మామయ్య అబద్ధాలకోరు. రాత్రి....రాత్రేమో తనకేం దొరికిన



అత్తయ్యకిస్తానని ప్రామిస్ చేశాను" అన్నది స్వీటీ.

శ్రీహర్ష ఉలిక్కిపడ్డట్టు చూశాడు. స్వీటీ నవ్వు అతన్ని సవాలు చేసినట్టు నిలిచింది.

లలితమ్మ మిగిలిన ముక్క అతని చేతికిచ్చి, అంజనివైపు చూసింది.

"అంజూ! ఇలారా...." దగ్గరగా పిలిచింది. శ్రీహర్ష చేయి యాంత్రికంగా ముందుకువచ్చింది. అంజని లజ్జాభారంతో తలవంచుకుంది. అతని చేతిలోని పూరీ తీసుకుంది.

తను తీసుకోకపోతే తల్లి తీసుకోదని, శ్రీహర్ష టిఫిన్‌ప్లేటు అందుకున్నాడు. లలితమ్మ తన చేతిలోని ప్లేటు కోడలికిచ్చింది.

"మీరు తీసుకోండత్తయ్యా! నేను తెచ్చుకుంటాను" అన్నది.

"నేను తెస్తున్నాను బుజ్జమ్మా!" యలమంద మరో ప్లేటు పూరీలు, టీలు తీసుకువచ్చాడు.

మౌనంగా అందుకుంది అంజని.

ఉపహారము ముగిసింది. శ్రీహర్ష లేచాడు. బయటికి వెళ్ళ అన్నాడు.

"శ్రీ! కరిగిపోయిన కాలం మళ్ళీ రాదు. ఈ పూట మీరిద్దరూ ఊటీకి వెళ్ళిరండి" అన్నది.

"అలాగే" అన్నాడు ప్రతిఘటించకుండా.

అత్తాకోడళ్ళిద్దరూ ఆశ్చర్యంగా చూశారు.

అతని ఆలోచనలు వేరుగా సాగుతున్నాయి. తనకిప్పుడు అప్ప కన్నా ముఖ్యం తల్లి ఆరోగ్యం.

"శ్రీ! ఇద్దరు పచ్చగావుంటే ఓర్వలేనివారు ఎన్ని మాటలయి అంటారు, విడదీస్తారు. అలాంటప్పుడే వివేకంతో పనులు చేయాలి" త పంకించాడు.

అతనికి అడక తెరలో పోకచెక్క గుర్తుకువచ్చింది. మెల్లగా బ టికి వచ్చాడు.

లలితమ్మ అంజనిని దగ్గరగా తీసుకుని నుదురు చుంబించింది.

"పిచ్చిపిల్లా! ఒక్క రాత్రికే ముఖం ఎలా పీక్కుపోయి

చూడు" అన్నది ఆప్యాయంగా.

ఆ మాత్రం ఆప్యాయతకే ఘనీభవించిన ఆమెలోని దుఃఖం ద్రవించి అశ్రురూపంలో బయటికి వచ్చాయి.

"అంజూ! కొందరి జీవితాలు పరీక్షతో ప్రారంభమవుతాయి. వాటి ఎదుర్కోవాలి మొండిగా" అన్నది.

ఎన్నో మాట్లాడాలని వున్నా, నోటమాట రావటంలేదు. ఆమె మాట్లాడే అవకాశమే యివ్వలేదాయె.

"వాడిది అతి సున్నితమైన మనసు. ఎవరో విరిచేయాల ప్రయత్నం చేస్తున్నారు. నువ్వు ఆ అవకాశం యివ్వవద్దు" తన పమిటలో ఆమె కళ్ళు ఒత్తింది.

"అంజూ....అమ్మా" బయటనుండి శ్రీహర్ష గొంతు విని ఇద్దరూ ముఖాలు చూసుకున్నారు.

మరో మగగొంతు వినిపించింది. శ్రీహర్ష నవ్వు వినిపించింది. అంజన లేచి రెండడుగులు వేసింది.

శ్రీహర్ష, అతనితోపాటు ఓ పెద్దమనిషి వచ్చారు. ఆయన ఖద్దరు బట్టల్లో హుందాగా వున్నాడు. పట్టిచూస్తే శ్రీహర్షకు పోలికలు కనిపిస్తాయి.

"అమ్మా! పెదనాన్నగారు వచ్చారు. నీకు ఆరోగ్యం బాగా లేదంటే ఇక్కడికే వచ్చారు" అన్నాడు.

లలితమ్మ మంచం దిగి, పమిట సర్దుకుంది.

"లేవకమ్మా, లేవకు. ఏమిటి సుస్తీ?" అన్నాడు ఎంతో బాధపడుతున్నట్టు ముఖంపెట్టి.

"ఏముంది పెదనాన్నా! నిన్నంతా అన్నింటికి తానే అన్నట్టు తిరిగింది. అదిగాక లేని బంధువులు తేనివాడే. ఉన్న మీరయినా ఆహ్వానం పంపినా రాలేదని బాధ. కూర్చోండి."

అక్కడున్న కుర్చీలో అతను ఆసీనుడయ్యాడు.

"రా అంజూ! చేయిపట్టి చనువుగా తీసుకువెళ్ళి అతనికి నమస్కరించాడు.



అంజనికి అతను ఆశీర్వదించటం, హర్ష జవాబు చెప్పటం ఏం తెలియదు. భర్త స్పర్శలోని విద్యుత్తు అణువణువు పరవశించింది.

"అంజూ! స్వీట్లు, కాఫీ పట్రా" అన్న శ్రీహర్ష గొంతు విని, ఉలిక్కిపడి అతని చేతిలోని తన చేయి తీసుకుని వెళ్ళింది.

అందరూ హాల్లోకివచ్చి కూర్చున్నారు. అతను ఇల్లు దేగ కళ్ళతో పరిశీలించటం అందరూ గమనించారు.

"నేను ఉండలేనురా అబ్బాయ్! మీ పెద్దమ్మ అందరితో మా...న్నాడని, తన తమ్ముడి కూతుర్ని చేసుకుంటానని గర్వంగా చెప్పింది. ఒక్క మాట, పలుకు లేకుండా ఆహ్వానంపస్తే ఆమెకు కోపం వచ్చింది మరి" అన్నాడాయన. ఆయన పేరు పద్మనాభరావు.

"పెదనాన్నా! అన్నది మీరేనా, విన్నది నేనేనా!" శ్రీహర్ష నాటకీయంగా అడిగాడు.

"చాల్లేరా. కలతలు ఎప్పుడూ వుంటాయా? నేను అన్నీ మరిచిపోతాను" అన్నాడాయన.

"విని మరిచిపోయే మాటలే అన్నారా? విజయ వదినా అమె పెళ్ళికి పిలవటానికి వెళితే కూర్చోమనయినా అనలేదు" శ్రీహర్ష నవ్వాడు అవమానాన్ని లోపలకు నెట్టి.

"కాని నాది చాలా దుడుకు స్వభావం పెదనాన్నా! అంజనిలాంటి ముగ్ధ అయితేనే కాపురం చేస్తుందని అమ్మకు బాగా తెలుసు. ఆమె నిర్ణయంలో పొరపాటుండదని నా నమ్మకం. ఐ బిలీవిట్...." అన్నాడు సగర్వంగా.

"ముగ్ధ" అన్న పదం అంజని హృదయం గిలిగింతలు పెట్టింది. ఆమె చకచక జాంగ్రీలు సర్ది, వేయించిన జీడిపప్పు ప్రక్కనపోసి తెచ్చి పద్మనాభరావు ముందుంచింది.

"నాకేది?" అల్లరిగా అడిగాడు శ్రీహర్ష. ఆమె త్వరగావెళ్ళి మరో ప్లేటు తెచ్చి అతనికి ఫలహారం పెట్టింది.

"ఇప్పుడే పూరీ తీసుకున్నాను. సగం నువ్వు తీసుకో అంజూ! పెదనాన్నా, ఈ ఇల్లూ, ఈ సామానులన్నీ అంజూ తెచ్చుకున్నవే" అన్నాడు.

"ఆ....! ఎవరయినా నీ చదువును, నిన్నుచూస్తే రెండు లక్షల కట్నం యిస్తార్రా! మీ పెద్దమ్మ చాలా నిరాశపడింది" అన్నాడాయన.

"అది తప్పదు పెదనాన్నా! అక్క పెళ్ళికి మీరు కన్యాదానం చెయ్యనందే అమ్మకూడా నిరాశపడింది" అన్నాడు.

"చూడమ్మా! అన్నీ మా ఆనంద్ బుద్ధులే. ఒకసారి భోజనానికి రావాలి" అన్నాడు. అతను ఎం.పి. ఎక్కువగా ఢిల్లీలోనే వుంటాడు. స్వీటీని తీసుకుని రాజశేఖరం వచ్చాడు.

"శ్వేతా! తాతయ్యకి నమస్కరించు" అన్నది లలితమ్మ.

స్వీటీ నమస్కరించింది. రాజశేఖరానికి పరిచయం చేశాడు శ్రీహర్ష. అతను నమస్కరించాడు.

"బావగారు ఇంజనీరు కాని, ఉద్యోగం చెయ్యాలన్న ఆసక్తిలేదు పెదనాన్నా! చిన్న చిన్న కాంట్రాక్ట్సు చేస్తాడు" అన్నాడు.

"లెక్కపెట్టిచ్చిన డబ్బులు దేనికి సరిపోతాయి?"

"డబ్బు గురించి కాదండి, ట్రాన్స్‌ఫర్ గొడవలుంటాయి. విజయకు క్లినిక్ వుందాయె" అన్నాడు రాజశేఖరం.

అంజని అతనికి టిఫిన్, కాఫీ తెచ్చి యిచ్చింది. స్వీటీ తండ్రి భుజాలపై స్వారీ మొదలుపెట్టింది.

"స్వీటీ ఒంటరిదై మరీ గారాబం ఎక్కువయింది బావా!" అన్నాడు శ్రీహర్ష.

"ఆ మాత్రం దానికి ఆలోచన ఎందుకోయ్? సంవత్సరం లోపున మా స్వీటీకి ఓ ప్లేమేటును యివ్వండి" అన్నాడు. అతనికి చాలా నిశ్చింతగా వుంది. రాత్రి అంజని స్పృహ తప్పటం, శ్రీహర్ష కోసం భోజనం చేసినట్టు గుసగుసలాడటమూ, దాంతో లలితమ్మ అప్‌సెట్ అవటం తలుచుకుంటే జాలివేసింది. భయం కలిగింది. స్కూటర్‌పై విజయను తీసుకువెళ్ళి వదిలి వచ్చాడు.

వచ్చేసరికి ఇంట్లో వాతావరణం ఆహ్లాదకరంగా కనిపించింది. 'అమ్మయ్య' అనుకున్నాడు.

"అల్లుడుగారూ! మీరు, మావాడు సతీసమేతులయి భోజనానికి



రావాలి. 'ఈరోజు రండి' అంటూ నేనో తారీఖు యిస్తే మీకు కుదరక పోవచ్చు. అందుకే మీరు ఖాళీగా వున్నప్పుడు వస్తామని ఫోన్ చెయ్యండి" అతను విజిటింగ్ కార్డు టేబుల్‌పై వేశాడు.

"అలాగేనండీ! సాయంత్రంలోగా ఫోన్ చేస్తాను. మీరడగటము, మేము కాదనటమునా?" వినయంగా చేతులు జోడించాడు రాజశేఖరం.

"బావా! నేను....నేను డ్యూటీ వెళుతున్నాను."

"నేను పోస్టుపోన్ చేయిస్తాలేవోయ్" అన్నాడు పద్మనాభరావు కారువరకు సాగనంపి. వినయంగా నమస్కరించాడు రాజశేఖరం.

శ్రీహర్ష ఈరోజు కొత్త బావగార్ని చూశాడు. తను ఐదు నిమిషాలు అతనిముందు అంజనితో చనువుగా వుండటానికి ఎంత యాతనపడ్డాడు!

అయినా బావను అర్థం చేసుకునే సమయమెప్పుడు దొరికిందని! వివాహమయ్యాక, విజయ హౌస్‌సర్జెన్సీ చేసి కాపురం పెడదామనుకుంటే స్వీటీ పుట్టింది. అప్పుడాయనకు రామగుండం ట్రాన్స్‌ఫర్ అయింది.

స్వీటీకి ఒక సంవత్సరం దాటుతుండగా విజయకు గవర్నమెంట్ ఆస్పత్రిలో అప్పాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చింది.

వెళ్ళాలా, మానాలా అని ఆలోచిస్తుండగా, ఆమెకు ఆమె ప్రొఫెసర్లు సలహా యిచ్చారు-

"విజయా! కేవలం ఎం.బి.బి.ఎస్. అయితే లాభంలేదమ్మా! నువ్వు క్లెవర్ స్టూడెంటివి. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేయాలి" అన్నారు.

క్లినిక్ పెట్టమని గైనకాలజీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసింది.

సెలవులకే రాజశేఖర్ వచ్చేవాడు.

ఒకసారి అతను ఉద్యోగానికి రిజైన్ యిచ్చి వచ్చేశాడు. కోటేశ్వరరావు సలహాతో చిన్న కాంట్రాక్ట్సు మొదలుపెట్టాడు.

విజయ చాలా ఖచ్చితమైన మనిషి. కొత్త ఇంట్లోకి వచ్చేటప్పుడు అందరం ఒకేచోట వుందామని శ్రీహర్ష, తల్లి అన్నారు.

"పొద్దంతా బయటతిరిగే మగరాయుళ్ళం మనము. ఆడవారు కలిసి వుండాలి. మీ అక్కనడుగు" అన్నాడు.

"రాజా! ఆ మొహమెప్పుల మాటలు నాకు నచ్చవు. ఏ పరిస్థితిలో

కూడా కలిసివుండటం కుదరదు శ్రీ! నువ్వు, నేను ఒక తల్లి పిల్లలం అను కుంటాం. కలసిపోతాం. ఇద్దరు పరాయివారి రాకవల్ల మనిద్దరం పరస్పరం ద్వేషించుకోవద్దు" అన్నది.

"అలా అయితే నాకు వివాహమే వద్దు" అన్నాడు కోపంగా.

ఫూలిష్‌గా మాట్లాడకు. అదిగాక నాకుకూడా విసుగు వచ్చినప్పుడు రిలాక్స్ కావటానికి ఒక ఇల్లంటూ వుండాలి. అది పుట్టిల్లయితే సుకిసుంచిది. అమ్మను నువ్వో తోడుండాలని ఇన్నాళ్ళు ఇక్కడున్నాను. నాకోసం ఇల్లు చూసుకున్నాను" అన్నదామె.

వెంగళరావు నగర్‌లో ఓ క్వార్టర్ అద్దెకు తీసుకుంది.

అక్కడకు సామాను వెళ్ళింది. వివాహం తరువాత వాళ్ళు వెళ్ళి వుండటానికి నిర్ణయించుకున్నారు.

"ఏమోయ్! అలా నిల్చున్నావ్" ఖుజం చరిచాడు రాజశేఖరం.

"అయినా సాగనంపుడు?" అన్నాడు కాస్త కినుకగా, మరి కాస్త ...రింపుగా. రాజా గలగలా నవ్వేశాడు.

"తప్పేముందోయ్! ఎం.పి.గా వున్నాడు. ఎప్పటికైనా అవసరం ...డు. మనము వెళ్ళి అతన్ని ప్రాధేయపడలేదు. బంధుత్వం తప్ప కుంటూ తనే వచ్చాడు. కాస్త మర్యాదగా మాట్లాడితే నష్టమేమిటి?" అన్నాడు. అతను తమాషాకు అనటంలేదని తెలిసిపోయింది.

శ్రీహర్ష ఏదో అనబోయాడు.

"ఓ, అందరూ ఇక్కడే వున్నారా?" నవ్వుతూ వచ్చింది విజయ. చేతిలోని చైన్ తీసి కూతురి మెడలో వేసింది.

"కాఫీ తీసుకుంటావా వదినా?"

"అప్పుడే చార్జీ పుచ్చుకున్నావా అంజూ! అడక్కిద్ద అర్ధ మొగుడు అనుకోని మాత్రం కాఫీ తీసుకురాకు. అలసిపోయిన ఒక డాక్టర్‌కు ఇవ్వాలని తీసుకురా!" అన్నది.

"అయ్యో....! అక్కయ్యా, నువ్వు రచయిత్రివవుతూ డాక్టర్ వయ్యావే" అన్నాడు శ్రీహర్ష.

"మమ్మీ! తాతయ్యొచ్చాడు" అన్నది స్వీటీ.





"కోటేశ్వర్రావు మామ వచ్చారా అమ్మా!"

"కాదక్కా! ద గ్రేట్ పెదనాన్నగారు....ఎం.పి.గారు. అల్లుడు గారు శ్రీశ్రీ రాజశేఖరంగారు సముచితరీతిన సాగనంపారు" అన్నాడు.

"ఓ....నిన్న రిసెప్షన్ అని గుర్తులేదటనా?"

"పొలిటీషియన్స్‌కి మతిమరుపు, మాటతప్పడం కామన్ కంప్లై యింట్స్‌లే అక్కా! ఏదో చెప్పాడు" శ్రీహర్ష.

"ఇదిగో శ్రీ! నువ్వు చిన్నవాడివి. చూసీచూడనట్టు ఊరుకోవాలి. కోరి గుద్దుకు వెంట్రుకలు తీసే ప్రయత్నం చేయకు" కసురుకున్నాడు ...రం.

విజయ భర్తవైపు చూసింది.

"అదికాదు విజయా! కొన్ని విషయాలలో పట్టు విడుపు వుండా లన్నారు. నీ క్లినిక్ నిన్ను వదిలిపెట్టిందా?" మాట మార్చేశాడు రాజా.

"లేదు. నేనే దాన్ని వదిలివచ్చాను" అన్నది నవ్వకుండానే.

విజయ ముఖం మీద చిరునవ్వు లేకపోతే గిలగిలలాడిపోతాడు రాజా. ఆమెకు కోపం వచ్చిందని అర్థం.

అందరికంటే ఎక్కువ కూతుర్ని, అల్లుడ్ని అర్థం చేసుకున్నది లలితమ్మ. అందుకే ఆమె నవ్వుకుంది.

"అంజనీ!" కోడల్ని పిలిచింది.

కాఫీ తెచ్చి విజయకిచ్చింది.

"ఏమత్తయ్యా" మృదువుగా అడిగింది. ఆమెకు ప్రాముఖ్యమిచ్చి మాట్లాడేవారున్నారంటే ఆమెకు చాలా ఆనందంగా వుంది.

"చూడమ్మా! నా బీరువాలో వదిన కోసం కొన్ని బట్టలున్నాయి. రాజాకి డబ్బే కావాలన్నాడు. కవర్లో డబ్బువేసి వుంచాను. తెచ్చి బొట్టుపెట్టి వాళ్ళకివ్వు" అన్నది లలితమ్మ.

"సరి నాకు!" స్వీటీ అమ్మమ్మతో పోట్లాటకు సిద్ధం అయింది.

"నీ పరికిణా మొదటే కట్టుకున్నావు కదే!" అన్నది.

"అదంతా చిన్నపిల్లలేం తెలుసత్తయ్యా? స్వీటీ నీకు డబ్బులిస్తా నమ్మా" అన్నది అంజని.

"థాంక్యూ అత్తయ్యా!" పెద్దమనిషిలా జవాబు చెప్పింది.

విజయకు బట్టలుపెట్టి, కోడలిచేత సారె, పసుపు కుంకం ఇప్పించి తృప్తిపడింది లలితమ్మ.

"మనమూ, హర్ష ఒకేసారి వెళ్ళిపోతే అత్తయ్య ఒంటరిగా ఎలా వుంటుంది?" రాజశేఖరం అనుమానం వెలిబుచ్చాడు.

"స్వీటీ, పనివారుంటారు! శేఖరం మనము సాయంత్రం వెళ్ళిపోదాం. నాకు రెండు మూడు రోజులలో ఫోన్ వస్తుంది" అన్నది విజయ.

అప్పుడే కోటేశ్వరావు డ్రైవర్ వచ్చాడు.

"అమ్మా! అయ్యగారు బిల్డర్స్ యూనియన్ మీటింగంకుపోవాల్నంట. బండి అవసరం అయితే, వాడుకుంటారని పంపిండు" అన్నాడు డ్రైవర్ స్వామి.

"మీటింగం ఏమిటయ్యా బాబూ?" శ్రీహర్ష అడిగాడు.

"అదేనండి, సభ జెప్తరు చూడు."

"మీటింగుకు వచ్చిన తిప్పలా యిది?" హర్ష నవ్వేశాడు.

రెండు ట్రిప్పులలో విజయ సామాలన్నీ వెంగళరావు నగర్‌లో చేర్చింది. అప్పటికి భోజనాల సమయం అయింది. అందరూ భోజనాలు చేశారు. లలితమ్మ నవ్వుతూ కొసరి వడ్డిస్తుంటే హర్ష తల్లినే చూస్తుండి పోయాడు. ఆమె చెప్పకపోయినా ఆమె సంతోషము, సుఖము తనతో పాటని గ్రహించాడు శ్రీహర్ష.

రాత్రి ఆవేశంలో అన్నవానికే ఆమె బాధపడింది. 'ఆమె కేమన్నా జరిగితే తను జీవితాంతం బాధపడేవాడు' ఆలోచిస్తూ అలాగే కూర్చుండి పోయాడు శ్రీహర్ష.

## 4

అసంభంగా తన ఇంట్లో అడుగుపెట్టిన అంజని, భర్త హాల్లోనే అగిపోవటం చూచి తనూ ఆగిపోయింది.

"రండి మీ గది పైన వుంది" అన్నది.

జిల్లా గ్రంథాలయ సంస్థ, నెల్లూరు

 గ్రంథాలయము, సూళ్లూరుపేట 

అప్పుడే బయటకి వచ్చిన బాలాజీ పెళ్ళిద్దర్నీ చూసి ముఖం చిట్లించాడు.

"నాన్న పిలుచుకువచ్చాడా?" నిరాదరణగా అడిగాడు.

"నాన్న బిల్డర్స్ యూనియన్....యూనియన్ మీటింగుకు వెళ్ళారట అన్నయ్యా!" అన్నది తడబడుతూ.

ఆ తడబాటువల్ల ఆమెకా ఇంట్లో వున్న స్థానం, స్వేచ్ఛ అర్థమయ్యాయి. అతనికి జాలి కల్గింది.

బాలాజీ పలుకరించనయినా లేదు. తన గదిలోకి వెళ్ళిపోయాడు. ఆ క్షణంలో అంజనిని అక్కున చేర్చుకుని వద మనింటికి అని లాక్కుపోవా లనిపించింది. చకచక ఆమె వెంట పైకి నడిచాడు. అతని జాలి, కరుణ గడ్డకట్టడానికి అయిదు నిమిషాలు పట్టలేదు. గదిలో అడుగు పెట్టగానే కోటేశ్వరావు బస్ట్‌సైజు ఫోటో కనిపించింది.

మరిచిపోయిన కోపం మళ్ళీ తుఫానులా వచ్చింది. అంజని మంచాలు దిండుతో దులిపింది.

"అంజనీ! నేనొక్క విషయం చెప్పాలి" అన్నాడు గుమ్మంములో నిలబడి.

"కూర్చోండి!" అన్నది మెల్లగా మంచం చూపుతూ.

"నేను కూర్చోవటానికి రాలేదు. నిన్నిక్కడ దిగవిడిచి వెళ్ళాలని వచ్చాను. నా పని అయిపోయింది. నేను వెళుతున్నాను" అన్నాడు వెను దిరిగి.

"నన్ను దిగవిడిచిపోవటానికి వచ్చారా?" అపనమ్మకంగా అడిగింది.

"అవును. రాత్రి మీ నాన్నగారి అసలుస్వరూపం తెలిసింది. అతడు హంతకుడని గ్రహించాక నీతో వుండటం జరుగని పని అంజనీ! ఈ నిర్ణయం వెనకాల ఎంత మథన వుందో తెలియదు."

ఆమె ముఖంలో రంగులు మారిపోయాయి. మంచం కోడు ఆసరాగా చేసుకొని నిలదొక్కుకుంది.

ఆ భయంకరమైన రాత్రి గడిచిపోయింది. "ఏమండీ..." ఆమె గొంతు వణికింది.

"భయంకరమైన భవిష్యత్తుంది అంజనీ! నన్ను క్షమించు. తండ్రిని నిలువునా చంపిన మనిషి కూతురితో కాపురం చెయ్యను, చెయ లేను" అన్నాడు దృఢ నిశ్చయంతో.

ఉదయం యెంత ప్రేమగా పిలిచాడు! హనీమూన్‌కు వెళుతున్నా తల్లితో చెప్పాడు. మళ్ళీ ఏం ముంచుకువచ్చిందో! అంజని చాలా పిరి పెరిగిందా ఇంట్లో భయపడుతూ. అందుకే ఆమెకు అతన్ని నిలదీసి అ అంటే భయం పట్టుకుంది.

ఆమె ప్రశ్నించబోయే విషయం అర్థం అయినట్టే అతను జవా చెప్పాడు.

"నువ్వు అమానుషమే అనుకో, స్వార్థమే అనుకో నా జీవితం ఒక్కగదికాదని, దానితో అమ్మ సంతోషం ముడిపడి వుందని అ అయింది. అమె ముందు నాటకం ఆడాను...."

అతని ఒక్కొక్క మాట తుపాకీగుండులా తగిలాయి హృ యానికి. "ఆ" అంటూ ఆశ్చర్యంగా చూసింది. నోట్లోనుండి శబ్ద రాలేదు.

"మా పెదనాన్న మమ్మల్ని అవమానించాడు. మేము బాధప చూడాలనుకునే శాడిస్ట్ మెంటాలిటీ అతనిది. అతనిముందు ఉన్నతంగా పించాలని నీ విషయం గొప్పగా మాట్లాడాను. ఇందులో ఏదయినా పొ పాటుంటే క్షమించు. ఏ నేరం హత్యకంటే ఎక్కువయిందికాదు. వస్తా అతను చకచక ముందుకు నడిచాడు. అంజని అయోమయంనుండి తేరు ముందుకు వచ్చింది. మెట్లవరకు వెళ్ళిన అతను తిరిగి వచ్చాడు.

"చూడు! మెట్లవరకు వెళ్ళిన అతను తిరిగి వచ్చాడు.

"చూడు! మీ నాన్న రాగానే మొసలికన్నీళ్ళతో మా అమ్మ దగ్గ కొచ్చి ఈ విషయాలు చెబితే యింకో హత్య అవుతుంది" అన్నాడు.

"మరి....మరండి...." మాట రాలేదుగాని కన్నీరు వచ్చింది.

"నువ్వు చెప్పదలచింది మీ నాన్నతో చెప్పు. మీ నాన్న నష్ట హారంగా మా కుటుంబానికి సహాయం చేశాడు. ఛీట్ అండ్ డిసీట్.... అతని ముఖం, కండరాలు బిగుసుకున్నాయి.



"నేను ఊటీ వెళ్ళినట్టు అమ్మకు తెలుసు. నేను ఈ రాత్రి హోటల్లో గడిపి రేపు బెంగుళూరు వెళతాను. జాబ్ దొరికితే వెళ్ళిపోతాను. అప్పుడు యిల్లు నీదే. అద్దెకిచ్చుకో...." అని చరచర దిగి వెళ్ళిపోయాడు. ఆమె తలుపు ఆసరా చేసుకుని నిల్చుండిపోయింది. కళ్ళముందు చీకటి వల యాలు ఏర్పడ్డాయి.

తడుముకుంటూ వచ్చి తన మంచంపై వాలిపోయింది. ఆమెకంతా అంధకార బంధురంగా వుంది. ఏమిటి? ఎందుకు జరిగింది అని ప్రశ్నించు కుంటే జవాబు దొరకదు. ఆమె జీవితమంతా సమస్యల మయమే. అయిదు సంవత్సరాలు ఏదీ తెలియక హాయిగా, సంతోషంగా బ్రతికింది. ఆ తరువాత ప్రారంభం అయింది అసలు సమస్య. చిన్న గుడిసెలాంటి యింట్లో తను, తండ్రి, తల్లి వుండేవారు. తండ్రి జీపులో బయటికి వెళితే తిరిగివచ్చేటప్పుడు రంగు రంగుల బొమ్మలు, రకరకాల తినుబండారాలు తెచ్చేవాడు. అప్పు డప్పుడు కొత్తచొక్కాలు, చొక్కా గుడ్డలు తేవటం బాగా గుర్తు.

ఓరోజు తల్లి బాగా కోపం తెచ్చుకుంది.

"ఇంత చిన్నపిల్లకు యిన్ని గౌన్లు ఎందుకు? డబ్బు తగలెయ్యటం కాకపోతే...." అన్నది అతనికి బట్టలు అందిస్తూ.

"ఊర్కో! నా జీవితంలోకి నవ్వు, సంతోషం తెచ్చిన నా లక్ష్మికి ఆ మాత్రం ఖర్చు చేసుకోలేనా? ఈ విషయంలో నువ్వు యింకేమయినా అంటే దోస్తీ కటఫ్...." ఆప్యాయంగా అంజనిని ఎత్తి ఆ చెంపా ఈ చెంపా ముద్దుపెట్టుకునేవాడు.

అంజనిని షికార్లకు తిప్పటానికి ఓ కుర్రాడిని కుదిర్చాడు. కొన్నా ళ్ళకు మంచి యింట్లోకి మారాడు.

తనకు ప్రత్యేకంగా చిన్న మంచం చేయించాడు. తల్లిదండ్రుల గదికి ఆనుకుని తన గది వుండేది. తను ఓరోజు తల్లిపై పడిపోయింది. ఎన్నడూలేనిది తండ్రి బెదిరించాడు. దాంతో అలక సాగించింది.

"అమ్మపై అలా దూకవచ్చా అంజూ?" ఎత్తుకుని బుజ్జగించాడు.

"నాకు....నాకు నా గదిలో భయంవేసింది" అంది వెక్కుతూ.

"నా తల్లీ" హృదయానికి హత్తుకుని ముద్దులు పెట్టాడు.

"మీ అమ్మ మనకో చిన్న పాపాయినిస్తుంది. అందుకే ఆమె ఆరో-
గ్యం బాగాలేదు. నువ్విలా సతాయిస్తే యింకా నొప్పి అవుతుంది.
భయంవేస్తే నా దగ్గరకు రావాలి" అన్నాడు నచ్చచెబుతూ.

"మంచిది నాన్నా!" అన్నది. అప్పుడే తల్లి బలహీనంగా నడు
దని అర్థమయింది.

కాళ్ళు చేతులు పుల్లల్లావుంది, పొట్ట ఎత్తుగా కనిపించింది. 'క
తనపై కోపగించటానికి సరియైన కారణం వుండే వుంటుంది' అను

ఒకనాడు అర్ధరాత్రి యింట్లో గొడవగా వుంది. తల్లి బాధగా అ
యిటూ తిరుగుతుంది.

"ఏమయింది? అమ్మా...." అంజని లేచింది.

"నువ్వు పడుకో అంజూ! అమ్మ మనకు రేపు ప్రొద్దున బుజ్జిపా
యిని యిస్తుంది" అన్నారాయన. అలాగే పడుకుని నిదురపోయింది.
ఆంజనేయస్వామి భక్తురాలట. అందుకే కూతురి పేరు అంజని అని పె
నంది. కొడుకు పుడితే అంజనీకుమార్ అని పెడతానని అంటుంది. త
దండ్రులు ఏవో వాదించుకోవటం వినిపించింది. అలాగే నిదురలోకి
పోయింది.

మర్నాడు మెలకువ వచ్చేసరికి యెలమంద, అతని భార్య వున్నా
రింట్లో. వాళ్ళెందుకో ఆందోళన పడుతున్నారని అర్థమైంది.

సాయంత్రం తండ్రిరాగానే వాళ్ళిద్దరూ తండ్రి కాళ్ళకు చుట్టు
పోయి ఏడ్చారు. తండ్రి తనను గుండెలకత్తుకుని ఏడ్చాడు.

"నాన్నా అమ్మ....పాపాయిని తెస్తుందా?"

ఆయన కుమిలి కుమిలి ఏడ్చారు.

"మీ అమ్మ దేవత తల్లీ! అందుకే దేవుడి దగ్గరకు వెళ్ళిపోయింది"
అన్నారు.

జనం రావటం, పలకరించటం, ఏడుపులు చూస్తుంటే తన తల్లి చ
పోయిందని అర్థమయింది.



తండ్రిని వన్నాను. నా సంపాదనలో సగభాగం ఆమెది. అండర్‌స్టాండ్"
అరిచాడు.

"ఐసీ.... సగభాగం ఇస్తారా?" వళ్ళు మారాటు బాలాజీ దంపతులు.
ఏమనుకున్నాడోగాని, కోటేశ్వరరావు అంజనిని హాస్టల్‌లో చేర్పించాడు.
అక్కడా అంతే! ఆ అమ్మాయిలు ద్వంద్వార్థాలు వచ్చేలా మాట్లాడుకోవటం,
నవ్వడం, వెక్కిరించటం చేస్తుంటే దిగులుగా, బిక్కుబిక్కుమంటూ ఓ మూల
నిలబడిపోయేది.

"నల్ల పుట్టగ నామాల కాకి కనిపించదేం?" ఓ అమ్మాయి అడి-
గింది.

"ఉష్! ఆ మూల వుంది" అన్నదింకో అమ్మాయి.

"నామాల కాకి" అనేది తనకు పెట్టిన ముద్దుపేరని గ్రహించటానికి
అట్టేకాలం పట్టలేదు అంజనికి.

నిట్టూర్చి ఊరుకోవడంతప్ప మరేం మాట్లాడలేకపోయింది. కొన్ని
రోజులు వెక్కిరించి తన జోలికిరావడం మానేశారు అమ్మాయిలు. కాని
అడగకుండా తన బట్టలు, వస్తువులు తీయటం మాత్రం మానెయ్యలేదు. తను
తగాదా పెట్టుకునేదికాదు.

"అంజూ! హర్ష మద్రాసు చదువుకోవటానికి వెళుతున్నాడు. లలి-
తత్త భోజనానికి రమ్మంది" అని తన తండ్రి తీసుకువచ్చాడు.

ఆరోజు తన మనసులో శ్రీహర్ష రూపం హత్తుకుపోయిన రోజు.
అతని స్నేహితులు వచ్చారు.

"నాకు సాగర్‌లోనే ఆలస్యం అయిందమ్మా. అబ్బాయికి స్నేహితు-
లకు వడ్డించలేకపోయావా?" అన్నాడు కోటేశ్వరరావు- తన తండ్రి.

"కొడుకు ముఖ్య అతిథి అన్నయ్యా" అన్నది లలితమ్మ, భోజనాలు
అయినంతసేపు ఒకరిని ఒకరు దొంగచూపులు చూసుకుంటూ గడిపారు.
అదో మధురమైన అనుభూతి.

అందరూ డాబా దిగి వస్తుంటే, మెట్లమీద గట్టిగా తన చేయి గిల్లాడు.

"కెవ్వు" మంది తను. అందరూ ఏమయిందంటూ యెదురు వచ్చారు.

"ఏమయింది? గండుచీమలున్నాయి, కుట్టిందా?" అంటూ అమాయ

కంగా ఆరాతీశాడు శ్రీహర్ష.

"అమ్మో గొప్ప యాక్టర్" అనుకుంది మనసులో గిల్లినచోట ర కుంటూ.

"విజయా! కాస్త మందు వేయవే తల్లీ" అన్నది లలితమ్మ.

"అక్క పూర్తి డాక్టరుకాదు" అంటూ అల్లరిగా అంజని వ చూశాడు. అంజని గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. తను గసుక వే తీస్తే గిల్లినట్టు తెలుస్తుంది. ఎలా?

"అయ్యగారూ!" అంటూ యలమంద వచ్చి పెత్తల్లి పడిపోయింద చెప్పాడు. అందరూ ఆదరాబాదరాగా పరుగెత్తారు.

అప్పటికే ఆమె స్థితి మిణుకు మిణుకుమంటున్న దీపంలా ఉం అందరిని ఒకసారి చూచి, ఆఖరిశ్వాస పీల్చింది కమలమ్మ.

ఆమె మరణంతో బాలాజీ మరింత విజృంభించాడు. తండ్రి బయ గడిపేవాడు. సెలవులువస్తే తనతో దూరప్రయాణాలు చేసేవాడు. ఒకసా ఢిల్లీ అంతా తిప్పి చూపాడు. మరోసారి బొంబే తీసుకువెళ్ళాడు. దాదా భారతదేశంలోని ముఖ్య స్థలాలన్నీ తిప్పాడు ఒక్క బెంగుళూరు, మైసూర్ తప్ప.

"నాన్న బృందావన్ గార్డెన్‌కి వెళదాం" అన్నది.

"నువ్వూ, శ్రీహర్షా వెళతారామ్మా?" అన్నాడు నవ్వుతూ.

"పో నాన్నా!" నవ్వుతూ పారిపోయింది. శ్రీహర్ష ఉత్తరాలు రాస్తే ఊరించి ఊరించి తనకు చెప్పేవాడు తండ్రి.

"అంజూ! మీ ఇంటికి ప్లానమ్మా" ఓ రోజు బ్లూ ప్రింట్లు పట్టుకొని వచ్చాడు తండ్రి.

"మీ ఇల్లేమిటి నాన్నా?" ఆశ్చర్యంగా అడిగింది. అప్పుడు తను ఫైనలియర్‌కి వచ్చింది.

"మరి నా బంగారుతల్లి అద్దె యింటికి కాపురం వెళుతుందా? మీ కోసం ఇల్లు కడుతున్నానమ్మా. ఈ సంవత్సరం మీ యిద్దరి చదువులు అయి పోతాయి" అన్నాడు.

ఆ రోజునుండి గాలిలో తేలిపోయింది.



తనకంటూ ఓ ఇల్లు వుంటుంది. తనకే స్వంతం. కమలా సదన్‌లో చేసినట్టు అవమానం చేయరు. బాలాజీ మూడ్సు గమ్మత్తుగా వుంటాయి. యిష్టం వున్నట్టు ప్రవర్తిస్తాడు. అతనికి అంజని గదే బావుంటుంది. నెలకొక సారయినా గదులు మారుతుంటాడు.

తండ్రి అనుకున్నట్టే ఇల్లు పూర్తయింది. ఇద్దరి పరీక్షలు అయ్యాయి. రిజల్ట్సు కూడా వచ్చాయి.

అప్పుడే ఇల్లు కూడా పూర్తయింది.

పెళ్ళి పనులు చకచక సాగిపోయాయి.

"మీరు పెద్దలు అనుకున్నారు. అమ్మాయి ఇష్టం ఏమిటో కనుక్కు-న్నారా?" అని కొందరు పెద్దలు సలహా యిచ్చారు.

అప్పుడే తన గుండెల్లో సన్నని మంట బయలుదేరింది. నిజమే! కాని తండ్రికి చెప్పే ధైర్యం లేదు. బట్టలు, నగలు కొన్నారు. అన్నీ విజయే ఎన్నుకున్నది. పెళ్ళికి రెండు రోజులు ముందు వచ్చాడు శ్రీహర్ష.

అతన్ని తీసుకువెళ్ళి బట్టలు కొనిపెట్టాడు తండ్రి.

"బాబూ! నాకు తోచినవి ఇవి. నీకేం కావాలో అడిగితీసుకో. వచ్చే నెలలో కారు వస్తుంది. బొంబేలో ఎవరో టొయొటాకరోలా అమ్ముతారట. అది చూడమన్నాను. ఆలస్యం అవుతుందనుకుంటే ఫియెట్ కొందాం" అన్నాడు.

"అబ్బే! ఇప్పుడు కారెందుకండీ? స్కూటర్ చాలు" అన్నాడు శ్రీ హర్ష.

"నా తృప్తికోసం కొంటున్నాను" అన్నారాయన.

"మీరు అలాగే మీ అమ్మాయి పేర ఓ పెట్రోల్ బంక్ కూడా తెర వండి" అన్నాడు.

"అదేమిటి బాబూ?"

"మరేమిటి మామయ్యా! కారు మీరిచ్చినా, పెట్రోలు పోసుకునే స్తోమత వుండాలికదా!" గలగల నవ్వేశాడు శ్రీహర్ష.

"అంజనీ! కాఫీ తీసుకురామ్మా!" తండ్రి కేక విని, యాలమ
కాఫీ పంపింది.

"మీ అమ్మాయి బురఖా వేసుకుందా మామయ్యా?" శ్రీహర్ష
టం వినిపించింది.

"పెళ్ళంటే సిగ్గుకదా బాబూ! అందులో అంజు భయస్థురా"
అన్నాడు తండ్రి.

"అయితే ఈ ఉంగరం తనకోసం మద్రాసులో కొన్నాను.
కివ్వండి" అనటం వినిపించింది.

ఆమెకు వెళ్ళాలో మానాలో తెలియలేదు. తండ్రి లోపలికి
బలవంతంగా హాల్లోకి పంపాడు.

కళ్ళెత్తి చూడాలంటే భయం. కాళ్ళు తడబడ్డాయి. చేతులు
కాయి.

"కళ్ళెత్తి చూడు, నేను రాక్షసుడిలా కనిపిస్తున్నానా?"

కళ్ళెత్తి అతని కళ్ళల్లోని ప్రేమారాధనకు కరిగిపోయింది.
అతని ప్రక్కన కూర్చుంది.

"ఇదిగో ఉంగరం!" చిన్న నీలంరంగు పెట్టెతీసి అందించ
చేయి చాపింది. అతను నవ్వేశాడు. దగ్గరగా జరిగాడు.

"ఇంత ట్యూబ్‌లైట్‌తో కాపురం ఎలాగో...." చనువుగా
తొడిగాడు. ఆ చేతిని సున్నితంగా పెదవులకు తాకించుకుని వదిలివేశా
అప్పుడు చూసింది. ఎరుపురంగు బ్యాండుపైన నీలం, అక్ష
అక్షరాలు ఎ.ఎస్. పెనవేసుకున్నట్టున్నాయి.

ఒకటి తన పేరులో మొదటి అక్షరం, రెండవది శ్రీహర్ష పే
లోది. అవి రెండూ పెనవేసుకున్న తీరుచూస్తే ఆమెకు ఆనందం కలిగి
గబగబ లేచి గదిలోకి పారిపోయింది.

అంతటి అమృతమూర్తి హృదయంలో ఎంతటి విషం ని
పోయింది? తనేం చేయాలి? తనేం చేస్తుంది? ఆలోచిస్తూ కూర్చు
పోయింది.

# 5

గణగణమని ఫోన్ మ్రోగటంతో ఈ లోకంలోకి వచ్చింది అంజని.
కళ్ళు ఒత్తుకొని వెళ్ళి ఫోన్ ఎత్తింది.

"హల్లో....నాన్నా! నేనే. మీకు చెప్పిపోదామని....పరవాలేదు....
వెళ్ళరండి....ఆయన బయటకు వెళ్ళారు....అవసరంలేదు....అవసరమను
కుంటే అలాగే తీసుకుంటాను. ఇక్కడ దొరకనివి అహమ్మదాబాద్‌లో ఏం
దొరుకుతాయి? మీ ఇష్టం...." తండ్రి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అర్జం
టుగా అహమ్మదాబాద్ వెళ్ళాల్సిన పని ఏర్పడిందట. తనకు సెండాఫ్ ఇవ్వ
లేనని బాధపడుతుంటే దుఃఖం ముంచుకువస్తోంది.

శాపగ్రస్తుడేమో తన తండ్రి. ఒక్కనాడు శాంతిగా వుండగా చూడ
లేదు. తన దుఃఖం, ఒంటరితనం మరచిపోవాలని ఎన్నో అసోసియేషన్స్‌తో
సంబంధాలు పెట్టుకున్నాడు. ఈనాడు తెంచుకోవాలన్నా కష్టమే.

బయట చిరపరిచితమైన చిరబురలాడే కంఠం వినిపించింది.

"ఆవిడగారొచ్చారా?" పద్మ గొంతు అది.

"కాదు, ఆయనగారితో కలిసివచ్చింది" అన్నాడు బాలాజి.

"పెళ్ళికి ముందే కొంపకట్టాడు. పనిమనిషిని పంపాడు. మళ్ళీ
ఇక్కడేం పనిట?"

"ఏమో! వెళ్ళి అడుగు. కొంపలోకి సామానుబండవద్దూ?"
అన్నాడు.

"మనం వెంటనే డాక్టరు దగ్గరకు వెళ్దాం పద" అన్నదామె. అంజనికి
అర్థమయింది. వదినగారు పిల్లలకోసం తిరుగని డాక్టరు లేదు, వెళ్ళని దేవ
స్థానం లేదు. మొదట మాత్రలు వాడారు. రెండు సంవత్సరాలనుండి పిల్లల
కోసం తిరుగుతున్నారు.

ఇంకా నయం- హర్ష వుంటే ఎంత గొడవ జరిగేది?

వాళ్ళతో తనకేమిటి? తన భర్త తనతో ప్రేమగా వుండాలి. దానికి
తనేం చేయాలి? ఆలోచిస్తూ, క్రిందకివచ్చి కాఫీ త్రాగింది.

పనమ్మాయి కొడుకు గట్టిగా పాఠం చదువుతున్నాడు. 'ధైర్యే
సాహసే లక్ష్మీ' అంటూ.

పనమ్మాయి కొడుకు గట్టిగా పాఠం అప్పజెబుతున్నాడు. పని
పికి చదువురాదు. అయినా పాఠం అప్పగించుకుంటుంది. వాడు తప్పుచె
టంలేదు. అయినా మళ్ళీ చెప్పమంటుంది.

వాడు బిక్కమొహం వేసుకున్నాడు.

"మా సార్ అలాగే చెప్పారమ్మా. ధైర్యము, సాహసము, ల
దేవిని ప్రతిబింబించాలని, అవి వుంటే అన్నీ వున్నట్టే."

"అట్టానా? ఆయన్ను అద్భుతలే."

అంజని వెళ్ళి కుర్రాడిని పంపించింది. వాడు పరుగెత్తాడు.

"ఏమిటే! వాడు చెప్పింది నిజమే. మళ్ళీ చదువు, మళ్ళీ చదు
అంటావేం?" అన్నది కాస్త కోపంగా.

"ఏంజేయను అంజమ్మా! మాకు ప్రయివేటు చెప్పించే 
ఉన్నాయా? ఇట్ట సదివిస్తేనన్న నోటికి వస్తుందేమోనని నా ఆస...
అన్నది, కడిగిన గిన్నెలు తెచ్చి లోపల పెడుతూ.

అంజని వెనక్కు తిరిగింది.

"అల్లుడేడమ్మా! పదహార్ల పండగ జెయ్యరా? ఈ ఇంట్ల ఆడదిక్కు
లేదు. మీ అత్తగారికేమయింది?" అని అడుగుతున్నా జవాబు చెప్పాల
పించలేదు.

ఆమె బుర్రను ఒకే ప్రశ్న తొలుస్తున్నది. భర్తను ఎలా తనవాడిగా
చేసుకోవాలి?

'ధైర్యే సాహసే లక్ష్మి' ఆ ధైర్యం కావాలి. ఎలా వస్తుంది
బజారులో దొరికేదా కొనుక్కురావటానికి?

ఆమె ఆలోచిస్తూ కూర్చుంది. అప్పుడే హడావుడిగా విజయ
వచ్చింది.

"అంజూ....!" ఆమె గొంతులో జాలి ధ్వనించింది.

"మీరా వదినా! పైకి వెళదాం రండి" విజయను తీసుకెళ్ళింది.
అప్పటివరకు పడిన ఆరాటం ఆవిరి అయిందేమో అన్నట్టు ఆమె కళ్ళ
పడింది.

"ఛ....ఛ....ఇదేం పని?" కోపంగా లేపింది విజయ.



లేచి కళ్ళు తుడుచుకుంది. విజయ కూర్చున్నాక ఆమె ప్రక్కన
కూర్చున్నది.

"అంజూ! ఆడదంటే కాళ్ళావేళ్ళా పడటం కాదని నువ్వు గ్రహిం
చాలి. ధైర్యంగా వుండాలి. ఇందాక శ్రీహర్ష వచ్చాడు" అన్నది.

బేలగా చూసింది అంజని.

"అతను ఆవేశంలో వున్నాడు. నేను ఏం మాట్లాడినా మళ్ళీ తన
విషయాలు చెప్పను అన్నాడు. హోటల్ సరోవర్‌లో వుంటున్నాడు.
నువ్వే వెళ్ళి తేల్చుకో" అన్నది.

"నేను తేల్చుకోవాలా? నా మాట వింటాడా?" అన్నది దిగులుగా.

"అంజూ! ఇది నీ జీవితసమస్య. నీ తండ్రి నిర్దోషి అని నిరూపించే
బాధ్యత నీపై వుంది. నేను నిలదీస్తే మూడో వ్యక్తిని అవుతాను."

"నాకు....నాకు నిలదీయటం రాదు...."

"ఆ బేలతనమే వద్దంటున్నాను. నువ్వు వెళ్ళి పోట్లాడమనటంలేదు.
అతని ఆరోపణకు ఆధారం చూపించమను. అర్థంలేని నిందలు నువ్వా
ఆరోపిస్తే తనేం చేస్తాడో నిలదీయి" అన్నది విజయ.

"నాకు....నాకు భయం" అన్నది అమాయకంగా.

"అంజూ!" విజయ కోపంగా లేచింది. కళ్ళు ఎర్రబారాయి.

"పిరికిగా రోజూ చస్తూ బ్రతికేకంటే ఒకేసారి చావటం మేలు.
ఎవరో నీ గురించి ఎందుకు మాట్లాడతారు? నీ జీవితం ఎందుకు బాగుపడ
స్తారు?" అంటూ రెండడుగులు వేసింది.

"అదికాదు వదినా?!"

"ఏదికాదు, వాడు కొడతాడా? అతను ఆరోపించిన నేరం నిరూ
పించమని అడుగు, అసలు నిన్నింత పిరికిదానిలా పెంచిన మామయ్యను
అనాలి" అన్నది గది బయటకు వస్తూ.

"నా మాట విను వదినా."

"ఊహూ! ఇప్పుడుకాదు. నేను ఎదురుపడగానే 'మీరు చదువుకున్న
వారే ఎవరో అనామకుడు చెప్పిన మాటలను ఆధారం చేసుకుని నన్ను
హింసించటం న్యాయమా, సంస్కారమా?' అంటూ విరుచుకుపడిసనాడు

మాట్లాడుతాను" అని రెండేసి మెట్లు ఒకేసారి దిగింది విజయ.

తన గదిలోకి పోబోయిన బాలాజీ హాల్లో లైటు వెలిగించాడు.

"ఓహో! డాక్టర్‌గారా, సంతానం కలగకపోవటం ఎవరి లో
అంటారండి?" అన్నాడు. వెటకారమో, నిజాయితీయో తెలియదు.

"బాలాజీ....! సారీ బావా! రేపు వెంగళరావు నగర్‌లో నా ఇ
క్లినిక్ వున్నాయి. కన్సల్టేషన్ ఫీజు పాతిక రూపాయలు తేవటం మ
పోను. హాయ్ పద్మా!" అని చకచక నడిచి వెళ్ళిపోయిందామె.

అంజని కళ్ళు పెద్దవిచేసి చూసింది. ఆ ఇంట్లో అంతమాట బాలా
పద్మను తండ్రికూడా అనటం ఎరుగదు తాను. నిజంగా ధైర్యస్థు
ఎవరూ శాసించలేరు.

"విజయ ఎందుకు వచ్చింది?" బాలాజీ తీక్షణంగా అడిగాడు.

"నాన్న కొంప కట్టించినా, కొంపలోకి తినుబండారాలులేక సే
వచ్చాను. ఉపవాసం వుండి కాపురం చెయ్యమని ఉపదేశించటానికి వచ్చిం
అన్నది విసుగా. చకచకా గదిలోకి వెళ్ళిపోయి రాబోయే తుఫా
ఎదుర్కొటానికి సిద్ధపడింది.

అరగంట గడిచినా ఎవరూ రాలేదు. ఆ సంఘటనతో ఆమెకు కొం
ధైర్యం వచ్చింది. ఒక నిర్ణయానికి వచ్చి సరోవర్‌కు ఫోన్‌చేసింది. రి
నిస్టు పేరడిగి, మాట్లాడితే ఆయన లేరనిచెప్పింది.

మరో అరగంటకు ఫోన్ చేసింది. ఈసారీ అంతే. లేరని చెప్పిం
అతను కావాలనుకునే లేడనిపిస్తున్నాడని అర్థం అయిపోయింది.
చేయాలో తోచలేదు. రాత్రంతా అశాంతంగా గడిపింది.

భోజనం చేయలేదు. ఆ ఇంట్లో ఒకరి విషయాలు ఒకరు పట్టిం
కోరు కాబట్టి సరిపోయింది. ఐదుగంటలకు లేచి, త్వరగా తయారు
బయటికివచ్చి, ఆటో ఎక్కింది. ఆటోకంటే ముందుగా హృదయ
పరుగెత్తింది. డబ్బులిచ్చి పైకివెళ్ళి బెల్ కొట్టబోయింది. తలుపు తెర
కుంది. అక్కడ అంజనిని చూచి అతను తెల్లబోయాడు.

అంజనికి కాళ్ళు వణుకుతున్నాయి. నోరు తడిచేసుకుంది.

"మీ కాళ్ళపై పడి కాపురం చేస్తానని దేబిరించటానికి రా



ఒక్క విషయం మాట్లాడాలని వచ్చాను" అన్నది. తన ధైర్యానికి తనే ఆశ్చర్యపోయింది.

అతను మౌనంగా దారి వదిలాడు. ఆమె గదిలోని సిగరెట్ పీకలు చూచి ఆశ్చర్యపోయింది.

"మీరు....మీరు సిగరెట్ కాలుస్తారా?"

"నిన్ననే ప్రారంభించాను" అన్నాడు. చకచక ఫోన్ దగ్గర కెళ్ళి టీలు పంపించి, దాంతోపాటు గది తుడవడానికి మనిషిని పంపమని ఆదేశించాడు.

"జస్ట్ ఎ మినిట్" అతను బాత్‌రూమ్‌లో దూరాడు.

ఆమెకు సిగరెట్ పీకలను చూస్తే శరీరంలోని అణువణువు వెదజల్లినట్టుంది. తను వివాహం మూలంగానే కదా ఈ విపత్తు సంభవించింది. రేపు త్రాగుడు నేర్చుస్తాడా తన భర్త!

అతని ప్యాంటు, షర్టు హాంగర్‌కి తగిలించింది. సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె తెచ్చి కిటికీలోనుండి గిరాటేసింది. పనివాడువచ్చి గది శుభ్రం చేసి, నీళ్ళు తెచ్చిపెట్టాడు.

బల్లకు రెండువైపులా కుర్చీలు వేసింది.

బాత్‌రూమ్‌లో నుండి వచ్చిన శ్రీహర్ష ఒక్క నిమిషం ఆమె మెడవంకా, జాకెట్టు క్రింది భాగంవంక చూశాడు. మెల్లగా వంగాడు మెడ చుంబించటానికి. రెండు వరసల గొలుసున్న పలకలో 'కె.రావు' అన్న అక్షరాలు కనిపించి, నిటారుగా అయ్యాడు.

సోప్ వాసనతోపాటు, ఊపిరిపీల్చిన శబ్దం వినిపించేసరికి ఇటు తిరిగింది. ఇద్దరూ ఒక్క క్షణం ఒకరిని ఒకరు చూచుకున్నారు. అంజనికి అతని హృదయంలో తలదాచుకుని, మనసులోని అశాంతి ఆవిరి అయ్యేవరకు ఏడ్వాలనిపించింది.

అప్పుడే తలుపు తీసుకుని, టీ తెచ్చాడు సర్వరు. అంజని వెళ్ళి అవతలి కుర్చీలో కూర్చుంది.

టీ బల్లమీద పెట్టి వెళ్ళాడు సర్వర్. అంజని కప్పు అందుకుని అతనికిచ్చింది. అతను మౌనంగా అందుకున్నాడు.

తను ఇవ్వాలని తెలిసినా, ఇవ్వలేకపోయాడు, తన నిశ్చ దృఢంగా వుండాలి.

మౌనంగా తను టీ అందుకుని త్రాగింది. విజయ చెప్పిన మా ఒకసారి మననం చేసుకుంది.

“థ్యాంక్స్ ఫర్ ది టీ. మా నాన్నపై ఆరోపించిన నేర ఆధారం వుందా?” అడుగుతుంటే గొంతు వణికింది.

అతను టీ కప్పు క్రిందపెట్టి అటు, ఇటు వెదికాడు.

“మీ సిగరెట్టు ప్యాకెట్టు, అగ్గిపెట్టె పారేశాను. నా వలన మీకెలా కష్టం కలుగదని హామీ ఇస్తున్నాను. విడిపోయే స్థితే వస్తే నేరం నా నెత్తి వేసుకుంటాను. మీరు ఈ అలవాట్లకు బానిస కావద్దు.” గొంతు వణు తుంది.

“నేను అబద్ధాలాడి మీ జీవితాలతో ఆడుకుంటున్నానా?” కొ రోషంగా అడిగాడు.

“కాదు. మా నాన్న చాలా కష్టపడి పైకివచ్చిన వ్యక్తి. అతనంటే గిట్టనివాళ్ళు ఎందరో వుంటారు. అబద్ధాలు చెప్పొచ్చుగా!” అన్నది ధైర్యం కూడదీసుకుని.

“ఒక హత్యకాదు. ఒక హత్యను దాచే ప్రయత్నంలో మరో హత్య చేశాడు. అన్యం, పుణ్యం ఎరుగని వ్యక్తిని జైలుకు పంపారు....” అన్నాడు ఆవేశంగా.

“అంత ఆవేశం ఎందుకండీ? మీకు ఎవరో అలా చెప్పివుంటారు, నాకు మరో రకంగా చెప్పవచ్చును. చెప్పినవారే హత్య చేసి మా నాన్న పైకి తోశారంటాను” అన్నది కాస్త రోషంగా.

“అంటే ఆధారం వుండవద్దూ?” అన్నాడు తేలికగా.

“అదే నేనూ అడుగుతున్నాను. మా నాన్న దోషి అని నిరూపించే ఆధారాలు చూపించండి. మిమ్మల్నేమీ అడగను. మా నాన్న చేసిన నేరానికి ఆయనకూ, ఆయన కూతురిని అయిన నేను శిక్ష అనుభవిస్తాను” అన్నది. ఎంత గంభీరంగా వుండబోయినా, దుఃఖం తన్నుకువచ్చింది.

“అయామ్ సారీ అంజనీ! నిన్నిలా బాధపెడుతున్నందుకు నేనెంత



కుమిలిపోతున్నానో నీకు తెలియదు. మీ నాన్న బదులు జైలుకు వెళ్ళిన వ్యక్తి తిరిగివచ్చాడు. కలుసుకుందామా?” అన్నాడు.

“తప్పకుండానండీ! నిజానిజాలు తెలిస్తే, తప్పుచేసినవారు దండింపబడతారన్న తృప్తి జీవితాంతం మిగిలిపోతుంది” అన్నది. అతను లేచి బట్టలు వేసుకుంటున్నాడు.

ఈ అజ్ఞాత వ్యక్తి ఎవరో తమ జీవితాలలో ప్రవేశించకపోతే ఎంత హాయిగా, ఎంత మధురంగా, ఓ శృంగార కావ్యంగా గడిచేది! గాఢంగా నిట్టూర్చింది. భర్తను పరాయివాడుగా దూరంగా వుంచడం తనకు చేతకావటంలేదు. తను బండరాయా!

అతని ముఖం చూస్తే రాత్రి ఏం తిన్నట్టు అనిపించలేదు. మంచో, చెడో అన్నీ అతనితోనే ముడిపడివున్నాయి తనకు అనుకుంది.

“నాకు ఆకలిగా వుంది” అన్నది.

అతను ఒకసారి ఆమెవంక చూచి, వెళ్ళి టెలిఫోన్ చేసి, టిఫిన్‌కు ఆర్డరు చేశాడు.

“అదేమిటి, ఒకే ప్లేటు చేశారు?”

“నాకు ఆకలిలేదు” అన్నాడు కాస్త విసుగ్గా.

“అయితే వద్దులెండి. నేరంపై అరెస్టుచేసిన వారినికూడా నేరం రుజువు అయ్యేవరకు గౌరవంగా చూస్తారు....” ఆమె కళ్ళు నీటితో నిండుకున్నాయి.

“మైగాడ్! ఆడవాళ్ళకున్న ఘటాయుధం....” మళ్ళీ ఫోన్‌చేసి ఇంకో ప్లేటు ఇడ్లీ తెప్పించుకున్నాడు.

భారమైన హృదయాలతో ఉపహారం ముగిసింది. బాయ్ వెళ్ళి టాక్సీ తీసుకువచ్చాడు. ఇద్దరూ ఎక్కారు. శ్రీహర్ష కారులో కూర్చున్నాక, సోఫాలో కూర్చున్నా వెనుకచేయి బార్లా చాచటం అలవాటు. తన భుజాల వెనుకగా పడిన చేతులు చూస్తుంటే ఆమె ఊహలు ఎక్కడెక్కడో ప్రయాణం చేస్తున్నాయి. అతని చేయి తనకు రక్షణ ఇస్తున్నట్టు అనుభూతి పొందింది.

“ఈ ప్రయాణం ఆగకుండా ఇలాగే సాగిపోతే....” అనుకోబోయి

పైటే అనేసింది.

"ఏమిటి?" పరధ్యానంగా వున్న శ్రీహర్ష ఇటు తిరిగాడు.

"ఏంలేదు....ఏంలేదు" అన్నది కంగారుగా.

"బాలరాజు ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో వున్నాడు. అత
ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది" అన్నాడు.

"బాలరాజంటే?"

"అదే మీ నాన్న, మా నాన్న కలిసి నాగార్జునసాగర్‌లో పనిచే
సప్పుడు అక్కడ గవర్నమెంట్ ఫ్యాన్‌గా పనిచేసిన వ్యక్తి" అన్నాడు

"ఓ....ఐసీ....." అంటుండగానే మారేడ్‌పల్లిలో ఓ పాత బంగా
ముందాగింది టాక్సీ.

పైన నర్సింగ్‌హోం పేరుంది. అతను టాక్సీని పొమ్మని చెప్పా
ఇద్దరూ నర్సింగ్‌హోంలో అడుగుపెట్టారు.

"హాయ్ శ్రీహర్షా! విజయ ఎలా వుంది?"

"హాయ్ జాన్! అక్కయ్యకేం పి.జి. చేస్తోంది" అని కరచాలన
చేశాడు అతనితో.

"హూ ఈజ్ దిస్ డేమ్? ఓసారి నీ వెడ్డింగ్‌కార్డు వచ్చింది. ఆరోజ
మేం బయటికి వెళ్ళాం! అప్పుడే అమ్మాయిని తీసుకువచ్చారు....ఫ్యామిలీ
ప్లానింగ్ కోసమా?" అన్నాడు కన్నుగీటుతూ.

"లేదు....లేదు. మా నాన్నకు తెలిసినవాళ్ళు హాస్పత్రిలో వుంటే
వచ్చాను" అన్నాడు.

"దెన్ ఐ విల్ సీ యూ" అతను వెళ్ళిపోయాడు. ఇద్దరూ బాలరాజ
వున్న గదిలోకి వెళ్ళారు.

"బాలరాజూ!" పిలిచాడు శ్రీహర్ష.

"నువ్వా? రా బాబూ!" అతని కళ్ళల్లో సంతోషం వెల్లివిరిసింది.
అతను లేచి కూర్చుని, వెనుకగా వచ్చిన అంజనిని చూశాడు. అతని కళ్ళు
ఎర్రగా మారాయి.

"ఇంకా ఈ కొరివిని వెంటబెట్టుకుని తిరుగుతున్నావా బాబూ!"
అన్నాడు కోపం, కసి మిళితమైన కంఠంతో.



"అవును బాలరాజూ! ఆమెను నీ నోటినుండి వింటేగాని నిజం నమ్మ
దట. అందుకు తీసుకువచ్చాను" అన్నాడు స్టూలు లాక్కుని కూర్చుని.
అక్కడున్న కుర్చీలో కూర్చుంది అంజని.

"మీ యబ్బకూడా వస్తే బాగుండేదేమో!" అన్నాడు మొరటుగా.

అతని భాషకు అంజనికి బాధ కలుగలేదు. తను ఇలాంటి వాటికి
అలవాటుపడింది.

"ముసలాడు వచ్చాడా?" అని తన అన్న తండ్రిని గురించి ఎన్నో
సార్లు అడగటం తెలుసు.

"అతను ఏమయితే మనకేమిటి? చెప్పు" అన్నాడు శ్రీహర్ష కొస్త
దగ్గరగా జరుగుతూ.

అతను కళ్ళుమూసుకుని గతంలోకి వెళ్ళాడు.

ఆ రోజు కెనాల్‌లో త్రవ్వుతున్న వారి ముఖాలు ప్రసన్నంగా
మారాయి. నెలరోజుల తరువాత రాయి తేలిపోయి, మట్టి కనబడింది. వృత్తి
ధర్మంగా పనులు చేస్తారే తప్ప, అందరికీ ప్రాణాలు అరచేతుల్లోనే
వుంటాయి. బ్లాస్టింగ్ చేయాలి. మందుగుండుసామాను కాస్త తేమగా వుంటే
పేలదు. పేలలేదని వదిలేస్తే చాలు కాస్త పొడికాగానే సిగరెట్టు కాల్చి అజా
గ్రత్తగా పడేసినా చాలు. అంటుకుని పేలుతుంది. అలా కొందరి ప్రాణాలే
పోతాయి.

ఒకసారి ఒక కూలీ చనిపోయాడు. అది కంట్రాక్టర్ల పొరపాటని
అందరూ అంగీకరించారు. చాలామంది కంట్రాక్టర్స్ వున్నా, అందరికీ పరి
చయం అయినవాళ్ళు, అందరితో తిరిగేవారు కోటేశ్వర్రావు, బాల్‌రెడ్డి, లాల్
గార్లు. ఒకరోజు త్రవ్వుతూ మందుగుండు పేలి ఒక కూలి చనిపోయాడు.
స్పాట్‌మీదున్న గవర్నమెంటు స్టాఫ్‌కు పార్టీ యిచ్చి, అది బయటికి పొక్క
కుండా దాచిపెట్టారు. ఆ కూలి కుటుంబం అపోహబోవని అక్కడే కూలీ
చేసుకున్నారు.

ఆ విషయం తెలిసిన ఆనందరావు కంట్రాక్టర్లను కేకలువేశాడు.

"రోజు కొకడు చస్తుంటే కంపెన్సేషన్ ఎలా యిస్తాము?" కోపంగా
అరిచాడు లాల్.

"నూటకోట్ల రూపాయల ప్రణాళికతో కడుతున్న ఈ ఆనకట్ట అందులో ఎందరు ఆహుతి అవుతారో తెలియదు. వారి బాధ్యత మన లేదంటారా?" ఆనంద్‌బాబు కోపంగా అడిగాడు.

"ప్రభుత్వమయినా తండ్రిపోతే ఆ స్థలం కొడుక్కు యిస్తారు. మేము మాకు చేతనయింది ఆ కొడుకులకు కూలి యిచ్చాము" అన్నాడు రెడ్డి.

"రెడ్డిగారూ! ఇంత అమానుషంగా మాట్లాడపోతే, ఆలోచించ పోతే, మీరు డబ్బు సంపాదించలేరన్నది నాకు తెలుసు. ఆ డబ్బు శాశ్వతం కాదని నాకు తెలుసు. ఆ కుటుంబానికి చిన్నమొత్తం సహాయంచేస్తే మీకు వచ్చే నష్టం ఏమిటి? మొన్న మీరు మా స్టాఫ్‌కు యిచ్చిన పార్టీ ఖర్చు అయిదువందలు. ఆ అయిదువందలిస్తే ఆ కూలి కూతురికి పెళ్ళి అయ్యేది" అన్నాడు.

"సరే ఆనంద్‌బాబూ! అలాగే యిస్తాం. శాంతించండి" అన్నాడు కోటేశ్వరరావు.

ఆనంద్‌బాబు అంతమాత్రానికే చాలా సంతోషించాడు.

అతని చేతులమీదుగానే మూడువందల రూపాయలు కూలీ కిప్పించాడు. ఆనంద్‌బాబు వెళ్ళిపోయాడు.

అప్పుడు ముగ్గురు కంట్రాక్టర్లు కూర్చుని మందుకొడుతున్నారు. బాల రాజు వాళ్ళకు కావలసినవి అందిస్తున్నాడు.

"ఈ ఆనంద్ కొరకరాని కొయ్యలా వున్నాడు. రేపు మన కెనాల్ విషయంలో గొడవచేస్తే?" రెడ్డి అడిగాడు.

"మహా...మహావాళ్ళే డబ్బుని చూసి ఉబ్బిపోతారు. అతనో లెక్కా! మిగతావాళ్ళకంటే ఓ ఐదువేలు ఖర్చు" అన్నాడు లాల్.

చేతిలో సిగరెట్టు దూరంగా పారేశాడు కోటేశ్వరరావు.

"డబ్బుకు లొంగే మనిషి కాదు. పదిమైళ్ళరాయి వచ్చిందంటే అతను అంగీకరించడు" అన్నాడు ఆలోచిస్తూ.

"మీకెలా తెలుసు?" లాల్ రోషంగా అడిగాడు.

"అతనికి కూతురు పుట్టింది. ముచ్చిక చేసుకోవాలన్న ఉద్దేశంతో



ముదుగులు చేయించాను. తిప్పికొట్టాడు" అన్నాడు నిట్టూర్చి.

"అది చిన్నమొత్తం అని బయటపడలేదేమో?" అన్నాడు రెడ్డి.

"మొన్న కొడుకు పుట్టిన తర్వాత స్కూటర్ ఆఫర్ చేశాను. అతను గంభీరంగా మారిపోయి, తన ఇంటికే రావద్దన్నాడు" అన్నాడు కోటేశ్వరరావు.

"అయితే వీడికి ట్రాన్స్‌ఫర్ తప్పదన్నమాట" పళ్ళు కొరికాడు రెడ్డి.

"ఈసారి వెళ్ళినప్పుడు మినిస్టర్‌గారితో ఓ మాట అంటాను" హామీ యిచ్చాడు లాల్.

అప్పటికే ముగ్గురికీ డోస్ ఎక్కువయింది. నవ్వుతూ మాట్లాడు తున్నారు.

"బాలరాజూ! నువ్వు....నువ్వు ఆనంద్‌కు పనిచేయాలి. కాని అతను చవట....నీతో పని చేయించుకోడు. మేము చేయించుకుంటున్నాము. చేసింది చాలు. వెళ్ళు" అన్నాడు రెడ్డి.

బాలరాజు బ్రతుకుజీవుడా అని బయటపడ్డాడు. అతనికి తనకు తెలి సిన వార్త ఆనంద్‌కు తెలియచేయాలని వుంది. అందరిలో ఆయనే అంద రినీ సమానంగా చూస్తాడు. ప్రతివారినీ గౌరవించి మాట్లాడతాడు. సూపర్ వైజర్ అందరినీ అడ్డగాడిదలు, రాస్కెల్స్ అనే పిలుస్తాడు. ఆనంద్ అంటే అందరికీ గౌరవము. ఏ కూలీకి దెబ్బతగిలినా దగ్గరుండి కట్టుకట్టిస్తాడు.

బాలరాజు వెళ్ళేసరికి ఆనంద్ కొడుకు, కూతురితో ఆడుకుంటు న్నాడు. ఆయన సైటుమీద నిరంకుశంగా పనిచేయించే ఇంజనీర్. ఇంట్లో ప్రేమమూర్తి అయిన భర్త. అనురాగమూర్తి అయిన తండ్రి.

"రా బాలరాజూ రా! ఏమిటి తీరిక దొరికింది....? లల్లీ! పాయసం వుందాలి. మన బాలయ్యకు యివ్వు" అన్నాడు.

ఆయన దగ్గరున్న చనువువల్ల అక్కడున్న మోడా లాక్కుని కూర్చు న్నాడు. లలిత కప్పులో పాయసం పోసి తెచ్చి యిచ్చింది.

"ఏం బాలయ్యా! కొత్తగా కనిపించటంలేదు?" అన్నారు.

"ఏమిటి ఆనందబాబూ! మరీ ఇంత సత్తెకాలం మనుష్యులయితే

ఎలా? మీరు పని చెయ్యవలసినవాడిని. వాళ్ళ తాత జాగీరా?" అన్నా

"బాలరాజూ! నీకు దమ్ముంటే ఎదిరించి పనిచేయలేనని చెప్పు ఆఫీసువేళలో వచ్చివెళ్ళు" అన్నాడు కొడుకును ముద్దాడుతూ.

"వీళ్ళు మీలాంటి ఇంజనీరుగారినే ట్రాన్స్‌ఫరు చేయించాలని చూస్తున్నారు. నన్ను బ్రతకనిస్తారా?" అన్నాడు బాలరాజు.

"ఆ సంగతి నాకు తెలుసు బాలరాజూ! ప్రభుత్వ యంత్రాంగంలో పొరపాటంతా. ఒక్కొక్క ఇంజనీరు చిన్న జీతాలతో ఆస్తులు ఎలా సంపాదిస్తున్నారో ఆరా తీయవలసిన అవసరంలేదా?"

"అదంతా బాగానే వుందయ్యా! మీరొక్కరు మడిగట్టుకుంటే మీకు సన్మానం చేస్తారా?"

"రాజూ! మనం ఏ పని చేసినా ఒక ఆశయంతో చేయాలిగాని ఎవరు పొగుడుతున్నారన్నది కాదు. ఈ సైటులో పనిచేసే ఉద్యోగులలో నిశ్చింతగా నిదురపోయేది ఒకరో యిద్దరో. లంచం తీసుకున్నాక ఆ భయంతో త్రాగుడు అలవాటు చేసుకుంటారు" అన్నాడు నిర్లక్ష్యంగా.

"అదికాదు బాబూ! నల్గురు నడిచిన దారిలో మనమూ నడిస్తే...."

"నాకు నాగార్జునసాగర్ పుట్టిల్లుకాదు, నాకు ఎక్కడయినా ఒక్కటే" అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

"అక్కడా ఇలాంటివారే వుంటారు బాబూ."

"ఉండనియ్య. మన నిజాయితీ మనకు రక్ష" నమ్మకంగా ఆత్మ విశ్వాసంతో అన్నాడు.

ఆ రాత్రి బాలరాజు కంట్రాక్టర్, మిగతా ఇంజనీర్లు, సూపర్‌వైజర్స్ కలిసి చేసుకున్న పార్టీ చూశాడు. అందరూ ఆనందంగా వున్నారు. ఒక్క ఆనంద్‌బాబు లేడు. అది అపశకునంగా తోచింది.

"ఎవరు చేస్తారీ పని?" వొకతను అడిగాడు.

"ఇంగ్లీషులో మాట్లాడండి" రెడ్డి ముద్దముద్దగా అన్నాడు.

"మనకు కోటి రూపాయలలో సగం దక్కాలంటే ఎవరో ఒకరు చేయక తప్పదు. రామనాథంగారు, కోటేశ్వరరావుగారు చేస్తారు" అన్నాడు లాల్.



"అవును! అతనికి సన్నిహితులు మీరు. అనుమానించటానికి ఆస్కారం వుండకూడదు" మరికొందరు అన్నారు.

"ఏమిటది?" అంటూ అడగబోయిన బాలరాజు తను వాళ్ళకు నౌకరు, అడిగేహక్కు లేదనుకుని బయటికి వచ్చాడు. ఆ రాత్రి జీపు డ్రైవరు, బాలరాజు కలిసి త్రాగారు.

"ఆ ఆనంద్‌బాబు పిచ్చోడురా, యాభై వేల రూపాయలు....లేదా, అతన్ని ఏం చెయ్యనున్నారు....రాయి వున్నదంత రాయనున్నారు.... అందరాఫీసర్లకంటే గొప్పోడా....ఆఁ"

ఆనంద్‌బాబుపై ఏదో కుట్రపన్నారని తెలుసు. ఏమిటన్నది బాలయ్యకు తెలియదు. అతని మనసంతా ఆరాటంగా వుంది.

ఆనంద్‌బాబు నిక్కరు వేసుకుని తలపై టోపీ పెట్టుకుని వచ్చాడు. కాలువ ప్రక్కన పందిరి వేశారు. అక్కడ ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు కంట్రాక్టర్లు, సీనియర్ ఇంజనీరు రామనాథం వున్నారు.

దూరంగా నలుగురు కూలీలు మట్టి ఎత్తుతున్నారు. బాలరాజును దూరం పంపించారు. అయినా అతనికేదో భయం. అందుకే అక్కడక్కడే తచ్చాడుతున్నాడు.

స్వచ్ఛంగా, హృదయపూర్వకంగా నవ్వుతూ సైటుకువచ్చాడు.

"హల్లో! ఈరోజు ఇక్కడకాదా వర్క్?" అతను నవ్వుతూ అడిగాడు.

"లేదు ఆనంద్‌బాబూ! లెక్కలు పూర్తికానిదే, పనిసాగదు." అన్నాడు కోటేశ్వరరావు.

"నిన్ననే అయిపోయాయికదా" ఆశ్చర్యంగా చూశాడు.

"వీళ్ళంతా కెనాల్లో రాయి వుందంటున్నారు. మీరేమో రెండు మైళ్ళే అంటున్నారు. మేము నష్టపోవాలా?" రెడ్డి అడిగాడు.

"ఎవరూ నష్టపోనక్కర్లేదు. రండి మరోసారి చూద్దాం" చకచకా నడిచాడు ఆనంద్‌బాబు.

అతని వెనక వీళ్ళంతా వెళ్ళారు.

టెంట్‌లో టీ చేస్తున్న బాలరాజు కళ్ళకు పద్మవ్యూహంలోకి వెడు

తున్న అభిమన్యుడిలా కనిపించాడు ఆనంద్‌బాబు. నీళ్ళు మసిలి పొంగా వెనక్కివచ్చి టీపొడి వేసి, పంచదార కలిపి, పాలుపోసి, ఆ టీ గ్లాసులలో నింపాడు. త్వరగా వెళదాం అనుకుంటుండగానే సైటు దగ్గర నుం కేక, అరుపులు వినిపించాయి.

బాలరాజు పరుగు పరుగున వెళ్ళాడు. కెనాల్లో దెబ్బలు తగి ఆనంద్‌బాబును కూలీలు చేతులపై మోసుకువస్తున్నారు.

"బాబూ!" బాలరాజు కేకపెట్టాడు.

ఆనంద్‌బాబును జీపులో తీసుకుని హాస్పత్రికి బయలుదేరారు. బా రాజుకు అర్థమయింది. అది ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనకాదని, కావాలని చేశారని. ఆ విషయం పైకి అంటే తన పీక పోతుందని తెలుసు రాయిలా నిలబడిపోయాడు.

"పాపం బంగారంలాంటి మంచి మనసు. ఆ అయ్యమీదే పడాలా?" కూలీలు కన్నీరు పెట్టారు.

బాలరాజు అప్పటికింకా చిన్నవాడు. కావాలని బండ పడేశారని రిపోర్టు చేస్తే తనమాట వింటారా? పోలీసుల నోరు మూయించే డబ్బు వాళ్ళ దగ్గరుంది.

ఆ విషయం ఆలోచిస్తూ తన గుడిసె చేరుకున్నాడు.

"ఇంత జొరమేందయ్యా?" భార్య సుక్కమ్మ కంగారుగా అడిగింది.

మాట్లాడక పడుకున్నాడు. రాత్రంతా భయంకరమైన కలలే. రెండవ రోజు భార్య అడగనే అడిగింది.

"ఏమయిందయ్యా! రేతిరంతా 'వద్దు.... వద్దు.... ఆనంద్‌బాబు తప్పుకోండి, వద్దు....రాయి వస్తుంది....అక్కడ మందుగుండు సామానుంది' ఒకటే బస్లడు" అని ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"సుక్కీ....ఒసేయ్ సుక్కీ....ఆనంద్‌బాబు....అదేనే తెల్ల నిక్కర్లు వేసుకునే ఇంజనీరుబాబు సచ్చిపోయిండంట, పీనుగ వచ్చిందట సూసివద్దాం పద...." అని పక్కింటి రాములు పిలిచింది.



"ఆనంద్‌బాబు...." ఒక్క కేకపెట్టి లేచాడు బాలరాజు. ఆందర్నీ తప్పించుకుని అతని ఇంటిముందు వాలాడు.

అందానికి మారుపేరుగా, ఆనందానికి నిర్వచనంగా, చిరునవ్వుల గనిగా వుండే లలితమ్మ, మూర్తీభవించిన శోకదేవతలా శవం ప్రక్కన పడివుంది. ఆయనను హాస్పత్రిలో పోస్టుమార్టమ్ చేశారట. నిండా తెల్ల బట్ట కప్పారు.

నీచుడు, ఛండాలుడు కోటేశ్వరరావు ఇద్దరు పిల్లలను ఎత్తుకుని తిరుగుతున్నాడు.

"అమ్మా! వీడు పరమదుర్మార్గుడు. నీ భర్తను పొట్టన పెట్టుకున్న పాపిష్ఠివాడు. ఆ ఇద్దరి పిల్లల గొంతునొక్కి కెనాల్లో పడేస్తాడు" అని చెప్పాలనిపించింది. నోట్లోనుండి మాట రానేలేదు. అతను తేరుకునేలోపలే ఆనంద్ అన్నలు వచ్చి దహనసంస్కారాలు చేసి వెళ్ళిపోయారు.

"చెల్లెమ్మా...." అంటూ కోటేశ్వరరావు లలితమ్మ పంచ చేరాడు. పాపపరిహారం కోసం కాబోలు.

ఆనాటినుంచి బాలరాజు ఎవరుపడితే వాళ్ళు చెబితే పని చేయనని మొండికేశాడు. ఆ భయంకరమైన స్థలంలో తనుండరాదు. తను వాళ్ళకు సేవలు చేయలేదు. ది సోబిడియెన్స్ క్రింద ట్రాన్స్‌ఫర్ చేస్తారు. అదే తనకు కావలసింది.

కాని పూర్తిగా ఇంజనీరు గారింటిపై వుండాలని రామనాథం ఇంటికి వేశారు. బాలరాజుకు చాలా కసిగా వుంది. రామనాథాన్ని చూస్తే అసహ్యం వేసేది. వాడికి గౌరవమిచ్చేదేమిటని అసహ్యం వేసేది. తనకు వివాహం కాకపోయి, సుక్కమ్మ తన జీవితంలోకి రాకపోయివుంటే తెగించి వాడి పని పట్టేవాడు.

ఒకరోజు బాలరాజు అయన కాటేజ్‌ముందు వేసిన తోటకు నీళ్ళు పెడుతున్నాడు. రామనాథం కోపంగా వచ్చాడు.

"ఏరా బాలయ్యా! ఒళ్ళు కొవ్వెందా?"

"నేనేం చేశానండీ?" కసిగావున్నా మర్యాదగానే అడిగాడు బాలరాజు.

"ఇంట్లో వంటపని చేతకాదన్నావుట. ఆడవారి బట్టలు ఉతకనన్నావుట. ఏమిటి కథ!" అన్నాడు.

"నాకు రాని పనులు ఎలా చేస్తానండీ?" అన్నాడు బాలయ్య.

"ఆనంద్‌బాబు పెళ్ళాం అందంగా వుందేదనా చీరలు పెట్టి వుతికి ఆరేసేవాడవు" అన్నాడు వెటకారంగా.

బాలయ్యలో దాగివున్న దావాగ్ని ఒక్కసారి బయటకు వచ్చి వెళ్ళి రామనాథం కాలరు పట్టుకున్నాడు.

"ఒరేయ్ కంట్రాక్టర్ల తొత్తుకొడకా! ఆ దేవుడి పేరెత్తేపాటి ఆయన తనతో సమానంగా చూచిండు రా. అడ్డమైనగడ్డి తిని ఆయన పెంచుకోలేదు. ఇత్రి ఎందుకని ఒక్కవక్క తాడును కట్టె, మరో తను పట్టుకుని నిల్చుందిరా ఆయమ్మ. నువ్వు వస్తే నీ కడుపుకు పొయ్యాలని ఆ కొన చెట్టుకు కట్టబోతే నేను పట్టుకున్నానురా నాకొడకా...." అన్నాడు ఇంకా బండబూతులు తిడుతూ.

రామనాథం రెచ్చిపోయాడు. తన చేతికింద పడివుండాల్సిన క్లాస్ ఎంప్లాయ్ ఇన్ని మాటలనటమా!

బాలరాజును నెట్టి రెండు చెంపపెట్లు యిచ్చాడు. బాలరాజు పోయాడు.

ఒరేయ్! డబ్బుకాశపడి తోటి ఇంజనీర్ని చంపిన రాక్షసుడా నిన్ను వదులుతానా?" మళ్ళీ లంఘించబోయాడు.

అప్పుడే బయటనుండి వచ్చిన ఇద్దరు సూపర్‌వైజర్లు, కోటేశ్వర రావ్ కూలీలు కలిసి బాలరాజును బయటకు లాగారు.

"ఏమిటి రామనాథంగారూ! ఫోర్తుక్లాస్ ఎంప్లాయితో చెయ్యి టం ఏం బావుంది?" కోటేశ్వరరావు మందలించాడు.

"వాడి నోరు పెద్దదయింది, పొగరు బలిసింది. నమస్కారం అటుంచి మనం వస్తున్నా లేవడు...." అన్నాడు కోపంగా.

"మీలాంటి దగాకోర్ల దగ్గర పనిచేయడమే సిగ్గుచేటు ఉ



దండాలు పెట్టాలట్రా వుండాకోర్...." బాలరాజు కోపంగా కాండ్రించి ఉమ్మేశాడు.

"ముందు నువ్వు నడువు...." జీపు డ్రయివర్ లాగాడు.

"పోతాన్రా! వాడి అంతుచూసి పోతాను. ఒరే రామనాథం! ఏనాటి కయినా నా చేతిలో చస్తావ్, గుర్తుంచుకో...." అన్నాడు అరుస్తూ.

"వీడ్ని ట్రాన్స్‌ఫర్ చేయించాలండి" అన్నాడు రామనాథం.

బాలరాజు తనకేం తెలియదని మొత్తుకున్నాడు, గొడవ చేశాడు. అతని మాటలు ఎవ్వరూ వినలేదు.

న్యాయం గుడ్డిదని మరోసారి నిరూపణ జరిగింది. బాలరాజును దోషిగా నిలబెట్టటానికి రెండు బలమైన సాక్ష్యాలున్నాయి.

ఒకటి పదిమంది ముందర బాలరాజు రామనాథాన్ని చంపుతానని ప్రగల్భాలు పలికి, సవాలు చేశాడు.

రెండవ అంశము అతని భార్య సాక్ష్యమే అతన్ని అధఃపాతాళానికి తొక్కివేసింది.

"నేనింట్లో లేనుండ్రీ. ఆయన ఎప్పుడొచ్చి పడుకున్నాడో తెల్వదు. నేను రేతిరి ఏడుగంటలకు చూచిన" అన్నది.

రామనాథం ఆరుగంటలకు చచ్చిపోయాడుట. బాలరాజు ఇంట్లోకి రాగా ఎవరూ చూడలేదు.

బాలరాజును జైలుకు పంపుతుండగా నుక్కమ్మ ఏడుస్తూ వచ్చింది.

"ఆడికి మనమేం నష్టం జేసినము! ఆ కోటేశ్వరరావు రామనాథం గోన్ని చంపిండట, నువ్వెందుకనబోయినావయ్యా" భోరున ఏడ్చింది.

కొందరు కూలీలు అదేమాట చెప్పారు.

"ఆలిద్దరూ ఒక్కటేకదా, రామనాథాన్ని ఎందుకు సంపుతడు?" ఆశ్చర్యంగా అడిగాడు బాలరాజు.

"అదంతా ఓ కథంట, ఆనందబాబు ప్రమాదంలో పోలేదంట, ఈల్లంత కల్సి చంపిండ్రంట" మహాకతను చెప్పాడు.

"ఈ దెబ్బకు బయపడి ఆ రోజున్న జూనియర్ ఇంజనీర్, ఇద్దరు సూపర్‌వైజర్లు లాంగ్‌లీవ్ పెట్టారు" అన్నాడు మరో ఫోర్తుక్లాస్

ఎంప్లాయ్! అతను కొత్తగా వచ్చాడు.

"ఒరేయ్ కోటిగా...." బాలరాజు పిడికిళ్ళు బిగుసుకున్నాయి. క్షణంలో చేతికున్న సంకెళ్ళు త్రెంచుకుని వెళ్ళి అతన్ని చంపి రావా లనివుంది. తనకు ఎలాగూ శిక్ష పడింది. ఒకసారి హంతకుడయ్యాడు మరోసారి నిజంగా చేసి చూపితే.

పేదవాడికోపం పెదవికి చేటు. బాలరాజు కట్టుదిట్టాలతో జైలుకు వెళ్ళాడు.

ఒకటికాదు, రెండుకాదు సుదీర్ఘమైన ఇరవై ఒక్క సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించాడు. చేయని నేరానికి శిక్ష పడింది. అప్పుడప్పుడు సుక్కమ్మ వచ్చి చూసివెళ్ళేది.

"మనమే అన్యాయం అయిపోయినామయ్యా! ఆ కోటేశ్వరరావు తన పాపం బాపుకోవటానికి ఆనంద్‌బాబు పిల్లలను దీసుకెల్లిండు" అన్నదో సారి.

"సుక్కీ....అమ్మగారితో చెప్పవే వాడు త్రాసుపామే...." అన్నాడు.

ఆ తరువాత సుక్కమ్మ రాలేదు. బాలరాజు పినతండ్రి కొడుకు వచ్చి చెప్పలేక చెప్పలేక చెప్పాడు.

"సుక్కమ్మ మారుమనువు చేసుకున్నదిరా" అని.

బాలరాజుకు ప్రపంచమంతా గిర్రున తిరిగింది. ఒక్కసారి తన పెళ్ళి, తామిద్దరు చేసుకున్న బాసలు, పంచుకున్న మధురక్షణాలు గుర్తుకు వచ్చి, "సుక్కీ" అని పళ్ళు కొరికాడు. ఆ నాలుగు గోడలమధ్య వుండి ఏం చేయలేడు, కాబట్టి నాల్గురోజులు అన్నం మానేశాడు.

కడుపులో ఆకలి అతని కళ్ళు తెరిపించింది. ఈ సమాజంలో ఇంకా స్త్రీ ఒంటరిగా నిబ్బరంగా జీవించే పరిస్థితిలేదు. అదేకాక....తన జీవితం నాశనమయిందని సుక్కమ్మది కావాలనుకోవటం అన్యాయం. అందుకే భార్యపై కోపం చల్లారి జాలిగా మారింది.

ఆ తరువాత అతని హృదయంలో భార్యగాని, చుట్టూవున్న బంధువులుగాని లేరు. ఒకటే ధ్యేయం. ఒకటే గమ్యం. బయటికి వస్తూనే కోటేశ్వర్రావును సర్వనాశనం చేయాలి.



జైలునుండి విడుదలయి బయట ప్రపంచంలోకి వచ్చాడు. బయట సుక్కమ్మ, బాలరాజు పినతండ్రి కొడుకు వున్నారు.

ఆమెను చూసి ముఖం తిప్పుకున్నాడు.

"నన్ను...మన్నించయ్యా. నిన్ను మరచిపోయికాదు. నాకు బలుపు ఎక్కి కాదు. ఈ జనారణ్యంలో ఆడది వుండలేదయ్యా" అన్నది సుక్కమ్మ. ఆమె జుట్టు పాపట్లో తెల్లబడింది.

అతనామెను జాలిగా చూశాడు. వేదాంతిలా నవ్వాడు.

ఆమె భర్తకు పళ్ళకొట్టుందట. జాంబాగ్‌లో వుంటున్నారట ఇంటికి రమ్మని తీసుకువెళ్ళింది. కన్నీటితో ఆతిథ్యం యిచ్చింది.

"నువ్వు చేస్తానంటే మాకు తెలిసినవారి ఫ్యాక్టరీలో పని వుందయ్యా" అన్నది సుక్కమ్మ.

తను ఒకప్పుడు తాళికట్టిన భార్య పరాయిదానిలా పలుకరిస్తుంటే అతనికి మతిపోయింది. అక్కడ వుండలేకపోయాడు.

"ఎక్కడకి ఎల్తావయ్యా?" సుక్కమ్మ అడిగింది.

"ఆ కోటిగాడిని చంపి నిదురపోతాను. ఆనందుబాబును చంపి నందుకు, నన్ను జైలుకు పంపినందుకు పగతీర్చుకుంటాను" లేచాడు.

"కోపం వద్దయ్యా, ఆనంద్‌బాబు కొడుక్కు, కోటేశ్వరరావు కూతురునిచ్చి వివాహం చేస్తారు" అన్నది సుక్కమ్మ.

"అబద్ధం....అంతా అబద్ధం. లలితమ్మ కంఠంలో ప్రాణముండగా ఆ పని చెయ్యదు" ఆవేశంగా లేచాడు.

"అయ్యోరామ, నా చెల్లెలిబావ యలమంద అక్కడే కొలువు చేస్తున్నాడు. ఈరోజు లలితమ్మ ఇంట్లో విందట...." అన్నది సుక్కమ్మ, బాలరాజు మతిపోయింది.

డబ్బున్నవారు పుణ్యాన్ని కొంటారుకాబోలు. తన పాపం దాచిపెట్ట డానికి ఎంత ఎత్తు వేశాపురా!

"సుక్కీ! ఆ కోటిగాడి బ్రతుకు బజార్లో పెట్టనిదే నిదురపోను. నాకు మిగిలినపని అదొక్కటే...." అని బయలుదేరాడు. ఆవేశం, అసూయ అతని అంతరంగాన్ని హాలాహలంగా మార్చింది.

"అదీ బాబు ఈ బాలరాజు చెప్పేకథ. ఆరోజు జరిగిందిచెప్పి జ్వరంతో పడితే మీరిక్కడ చేర్పించారు, నాకు బ్రతకాలనిలేదు. శత్రువులను మట్టుపెట్టనిదే చావాలనిలేదు...." అన్నాడు ఆవేశంగా.

నిశ్చలంగా, శిల్పంలా అతను చెప్పేది అంతా జాగ్రత్తగా లెక్చరర్ పరీక్షలముందు ఇంపార్టెంట్ పాఠంచెబితే వింటున్న విద్యార్థిగా విన్నది అంజని

శ్రీహర్షకు మొదటిసారి విన్నప్పుడు కల్గిన ఆవేశం కలుగలేదు. కొన్ని విషయాలదగ్గర ఆగి ఆలోచించవల్సిన స్థితి ఏర్పడింది. అతను విన్నావా అన్నట్టు అంజనివైపు చూశాడు.

ఆమె తలాడించింది.

"బాలరాజుగారూ! మీరు చెప్పినదంతా విన్నాను. మా నాన్న ఆనంద్‌గార్ని, రామనాథంగార్ని చంపగా మీరు చూడలేదు. ఎవరో చెప్పారు అది మీరు నమ్మారు, అవునా?" మెల్లగా, స్పష్టంగా అడిగింది.

"మీరు చదువుకున్నోళ్ళు కావచ్చు, మాటలతో మాయజేస్తున్నానని అనుకోకండి. మీ అబ్బ, ఆ రెడ్డి, లాల్ ముగ్గురూ కలిసి చేశారీపని. కావాలంటే అక్కడ ఇంకా పాతగుడిసెలున్నాయి. అడుగుచెప్తారు" అన్నాడు కోపంగా.

"మరి ముగ్గురు కలిసినప్పుడు అనర్థం జరిగింది. మరి అందరినీ వదిలి మా నాన్నను పట్టుకున్నావేం?" ఆవేదనగా అడిగింది అంజని.

"ఎవ్వరినీ వదలాలని అనుకోలేదు. అనాడు తెగింపు చేద్దామంటే నాకు పెళ్ళాముంది. ఇంకా న్యాయం, ధర్మం వున్నాయనుకుని తెగింపు చేయలేదు. ఈరోజు అన్నిటికీ తెగించాను...." అతని ముఖం ఎర్రగా మారిపోయింది.

"బాలరాజూ! ఆవేశం పనికిరాదు. నువ్వు నా కోసమైనా బ్రతకాలి. మా నాన్న మంచితనం నీ నోటిగుండా పదేపదే వినాలి. మా నాన్న గురించి అమ్మ చెప్పిందిగాని నీ అంత స్పష్టంగా, అందంగా చెప్పలేదు. నీవేమోగాని, వాళ్ళపై నాకు అభిమానం వుందనుకుంటున్నావా?" అన్నాడు అటరం పట్టిపడే కంఠంతో.

"బాబూ...." శ్రీహర్ష రెండు చేతులు తన గుప్పిట్లో బిగించి హృద



యానికి ఆన్చుకున్నాడు.

ఆ దృశ్యం ఎందుకో అంజనిని పిచ్చిదాన్ని చేసింది. బాలరాజు తన అదృష్టాన్ని హస్తగతం చేసుకోవాలని వచ్చిన రాక్షసుడిలా కనిపించాడు.

అతన్ని తీక్షణంగా చూసింది. బాలరాజు ఆ చూపుల్ని లెక్కచేయ నట్టు ముఖం తిప్పాడు.

"కొందరి పాపాలు తొందరగా పండుతాయి. మరికొందరివి ఆలస్యంగా పండుతాయి. ఆ లాల్‌గాడు చిన్న కుర్రదాన్ని పెళ్ళి చేసుకున్నాడట. అదికాస్తా దొరికినంత చేజిక్కించుకుని లేచిపోయింది. అడు పిచ్చిపట్టి తిరుగుతున్నాడు" అని వికటంగా నవ్వాడు.

"ఈ ఊళ్ళోనేనా?"

"అవునయ్యా! పత్తర్‌గట్టీలో వుండేది. అప్పులోళ్ళు ఇల్లు స్వాధీనం చేసుకున్నారంట. ఆ ఇంటిముందు అడుక్కుతింటూ, రాళ్ళేరి లెక్కపెట్టు కుంటూ తిరుగుతున్నాడు. ఒక దెబ్బచాలు ఆడి ప్రాణాలకు. కాని వాడు చావకూడదు. ఇంకా బలహీనమైన బ్రతుకు బ్రతకాలి" అన్నాడు కసిగా.

"ఆ ఆవేశమే వద్దన్నాను?" కసిరాడు శ్రీహర్ష.

"అవును బాబూ! గతం గుర్తొస్తుంది. దాంతోపాటు ఆవేశం వస్తుంది. ఏం చేయను...." అసహాయంగా చూశాడు. శ్రీహర్ష లేచి, కొన్ని నీళ్ళల్లో గ్లూకోజువేసి త్రాగించాడు. అది అంజనికి చాలా అసహ నంగా వుంది.

"బాబూ! అప్పుడాడి దర్జా చూడవల్సింది. పట్టులాల్చితప్ప మరేం వెయ్యలేదు. అన్ని ప్రేళ్ళకు రవ్వల ఉంగారాలంటి...." పక పక నవ్వాడు బాలరాజు.

శ్రీహర్ష అతన్ని చూశాడు.

"అన్నీ కాళ్ళొచ్చి నడిచిపోయాయి" నా కొడుక్కు. ఆ రెడ్డి గాడేనా కారు యాక్సిడెంట్‌లో పోయిండట. ఆడిపెళ్ళాం మామూలు మని షిలా మాలి లేకపోయినా వ్యవసాయం చేస్తుందట. ఇక్కడ న్యాయం జరక్కపోయినా అక్కడ జరిగింది బాబూ!" అన్నాడు పత్తివలుకుతూ.

అంజనికి ఏం మాట్లాడాలో తెలియలేదు. ఆమెను ఎవరయినా గట్టిగా

మాట్లాడితే భయం పట్టుకుంటుంది. ఈమాత్రం ధైర్యం చేసిందంటే ఊహించని ఆనందం తలక్రిందులు కావటంతో వచ్చిన తెగింపు, అన్న మాటలని చెప్పవచ్చు. గంభీరంగా వున్న భర్తనుగాని, బాలరాజు గాని పలుకరించలేకపోయిందామె.

అసహనంగా కదిలింది.

బాలరాజు ఒకసారి ఆమెవంక చూశాడు.

"ఇదిగో....నీకు నీ అబ్బమీద అంత నమ్మకముంటే వెళ్ళి అ చేయి నీ తలపై పెట్టుకుని, నీ మీద ప్రమాణంచేసి నిజం చెప్పమ అన్నాడు నిర్లక్ష్యంగా.

"మా నాన్న....మా నాన్న అలాంటిదేమయినా వుంటే మొద చెప్పేవాడు" అంది వణకే గొంతుకతో.

"చూడూ! నేనే వెళ్ళి అనాడున్న కొందరిని తెచ్చేవాడిని. న నన్నిక్కడ కట్టేశాడు. మీ అన్నయ్యను అడగరాదు? నీవంటే వల్లమాలి ప్రేమ. నువ్వు పెండ్లి పెండ్లానికి పుట్టలేదని, దేవతలాంటి లలితమ్మగారి స్నేహంచేసి, నీకు భర్తను సంపాదించాడు. అందుకని నీవు ఒట్టేస్తే నిజ చెబుతాడు" అన్నాడు బాలరాజు.

"మా నాన్నకు ఆ అనర్థాలతో సంబంధం లేదనుకుంటే...."

"నీయబ్బ అబద్ధాలు ఆడినట్టు లెక్క" అన్నాడు దృఢంగా.

"అన్నీ మీరన్నవే నిజంకావు. నిజమని నిరూపించాలి. అప్పటి నాకు, మా నాన్నకు నేనే శిక్ష వేసుకుంటాను" అంది ఆవేశంగా లేచి.

"నువ్వు విశ్రాంతిగా పడుకో. నేను బెంగుళూరునుండి వచ్చాక క స్తాను" శ్రీహర్ష కూడా లేచాడు.

ఇద్దరూ ఒకరివెంట ఒకరు బయటికి వచ్చారు.

అక్కడ ఆటోరిక్షాలుగాని, టాక్సీలుగానీ ఏం దొరకవు.

"ఇక్కడ కూర్చుంటావా? నేను వెళ్ళి ఆటోరిక్షా తీసుకువస్తాను" అన్నాడు ఆమె వైపు చూడకుండానే.

"మీతో నేనూ వస్తాను. దొరికినచోటే ఎక్కుదాము" అన్నది.

అతనితో అలా నడుస్తూ జీవితమంతా గడిపేయాలని వుంది. ఆమె



చిత్రంగా అనిపించింది. ఆమెకు బాధగాలేదు. ఎవరయినా తనని నొప్పించే మాట అంటే కళ్ళమ్మట నీళ్ళు జలజల రాలిపడేవి. ఇప్పుడు ప్రయత్నించినా కళ్ళమ్మట నీళ్ళు రావటంలేదు.

నిజంగా బాలరాజు చెప్పినదాంట్లో తండ్రిపాత్ర ఎంత?

తను అడిగితే నిజం చెబుతాడా?

ఆనంద్‌బాబు అదృష్టవంతుడేమో! అల్పాయుష్కుడేగాని, అనంతమైన ప్రేమ సంపాదించాడు.

తన తండ్రి దురదృష్టవంతుడు. ప్రతి నిముషం ప్రత్యర్థులను ఎదుర్కోవటంతోనే సరిపోతుంది.

ఆయన ప్రేమించి, అభిమానించే వ్యక్తి తను. తను నిలదీసి అడిగితే ఏదయినా నిజం బయటికి వస్తే, తను ఏవగించుకుంటే, నిందిస్తే.... ఆయన బ్రతకగలడా?

తనకోసం భార్య, కొడుకుతో శాశ్వతవిరోధం తెచ్చుకున్న తండ్రి.

తనకోసం కోడలి చెప్పులు మోసిన తండ్రి!

భగవాన్! ఆయనను అసహ్యించుకుని, ఏవగించుకునే పరిస్థితి కల్పించకు.

"చావాలనుకుంటే రోడ్డే కావాలా?" శ్రీహర్ష కంఠం కటువుగా వినిపించేసరికి ఈ లోకంలోకి వచ్చింది.

తన చేతిలో వున్న ఆమె జడ వదిలేశాడు అతను. అప్పుడు తెలిసింది ఆమెకు నొప్పి.

"అబ్బా!" అని ముచ్చెనగుంతనలో రాసుకుంది.

ఆమె ముఖంలో రెపరెపలాడుతున్న బాధ చూడగానే శ్రీహర్ష కోపం ఒక్కసారి దిగిపోయింది.

"ఒక్కనిముషం ఆలస్యం అయితే ఆ వ్యాన్ క్రింద పడేదానివి" అన్నాడు. దూరంగా పెట్రోలు బంకుదగ్గర నిలబడ్డ వ్యాన్‌ను చూపించాడు.

"క్షమించండి" అన్నది తల వంచుకుని.

"నీ భుజం అందలేదు. నీ జడ అందింది. పొడవాటి జడ వుండటం ఎంత వుపయోగమో తెలిసింది" అన్నాడు కాస్త నవ్వుతూ.

అతడు మాట్లాడే తీరుచూస్తే అతను ద్వైదీభావాలతో సతమతమవుతున్నట్లు అర్థంచేసుకుంది.

"ఆటో ఎక్కి ఇంటికి వెళ్ళు. మీ నాన్నగారితో నిజానిజాలు చెప్పించు" అన్నాడు అతను.

"అలాగే! ఇప్పుడు మాత్రం ఇంటికి వెళ్ళను. మీరు బెంగుళూరు వెళ్ళేవరకు అక్కడే వుంటాను. నాన్న ఇంట్లో లేరు" అంది.

అతను ఇబ్బందిగా కదిలాడు.

"మీకు వేరే పనుంటే, నావల్ల ఆటంకం అనుకుంటే వద్దులే" అంది నిరాశ నిండిన గొంతుతో.

"అబ్బే! వేరే ఏం పనిచేయలేను. ఇప్పుడు ఊటీలో వున్నవారిని ఇక్కడ కనిపిస్తే అప్పుడు వార్తలందుతాయి" ఆటోను కేకవేశాడు. ఇద్దరూ ఎక్కారు.

అతనికి దూరంగా కూర్చోవటం ఆమెకు చేతకావటంలేదు. అయినా తప్పదు. కుదుపులకి అదుపుతప్పిన ఆటో వాళ్ళను దగ్గరగా చేర్చేది. ఇద్దరూ ఉలిక్కిపడ్డట్లు సర్దుకుని జరిగేవారు. హోటల్ రూమ్‌కి రాగానే అతను భోజనాలకు ఆర్డర్ చేశాడు.

"బేరర్! రెండుకప్పుల బాసుంది పట్రా...." అనటం విని అంజని హృదయం పొంగిపోయింది.

ఆమె తొమ్మిదోతరగతి చదువుతుండగా కాబోలు లలితమ్మ, విజయ, శ్రీహర్షతోపాటు హోటల్‌కెళ్ళారు. వాళ్ళిద్దరూ ఐస్‌క్రీం కావాలన్నారు.

"అంజూ! నీకేం కావాలి? చెప్పు" లలితమ్మ లాలనగా అడిగింది.

"వాళ్ళు....వాళ్ళేవి తీసుకుంటే అవే" అంది కంగారుగా.

ముగ్గురూ ఫక్కున నవ్వారు.

"చూడు అంజూ! వాళ్ళు తీసుకునేది కాదు- నీ ఇష్టం చెప్పమ్మా!" లాలింపుకు కరిగిపోయింది.

"నాకు బాసుంది కావాలత్తయ్యా!" అన్నది.

"గుడ్! అలా వుండాలి. నీకిష్టమైనవి నువ్వు తినాలిగాని, వాళ్ళేవి తింటే అది తిని సరిపెట్టుకోవల్సిన కర్మేమిటి అంజూ!" మందలింపుగా



లలితమ్మ అన్నది.

ఆనాటి విషయం ఇంకా భర్తకు గుర్తుందంటే....ఆమె మానసం విహంగమైపోయింది. ఆనంద నాట్యం చేసింది.

"థాంక్స్ ఫర్ యువర్ కైండ్‌నెస్...." అన్నది అతన్నే సూటిగా చూస్తూ. అతను తన భావాలు దాచిపెట్టాలని బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. అతనొచ్చాక తనూ వెళ్ళి ముఖం కడుక్కువచ్చింది.

భోజనంకూడా వచ్చింది. "బాసుంది అయిపోయిందట. గులాబ్ జామున్ కావాలేమో అడగమన్నారు" అన్నాడు.

"అడిగింది అయిపోయిందని మీకు చెప్పింది తింటావా! బయటి నుంచి తీసుకురా" అని అయిదు రూపాయలనోటు గిరాటువేశాడు.

"పరవాలేదు" వారించింది అంజని. అతను వెళ్ళిపోయాడు.

"మీరు మంచి మనసుతో నా కిష్టమైనవి పెట్టించాలన్నా, తినేగీత నాకు ఉండవద్దూ!" అన్నది పేలవంగా నవ్వుతూ.

అతనేదో చెప్పబోయి విరమించుకున్నాడు.

భోజనాలు చేశారు.

"కాసేపు విశ్రాంతి తీసుకుంటారా?" పక్కదులిపింది.

"వద్దు అంజనీ! పిక్చర్‌కి పోదాంపద" అన్నాడు చటుక్కున లేస్తూ. ఒకే గదిలో తనకు దూరంగా ఉండటానికి అతనూ బాధపడుతున్నాడని అర్థం అయింది.

ఇద్దరూ మేటినీ చూసి వచ్చారు. టీ త్రాగాక, మెల్లగా ఆమె చేయి తన చేతితో నొక్కిపట్టాడు.

"చూడు అంజనీ! వ్యక్తిగతంగా నువ్వంటే నాకు ద్వేషం లేదు- అభిమానం, ఆరాధనే తప్ప. కాని మీ నాన్న విషయం విన్నాక, నా మనసును నచ్చచెప్పుకోలేకపోతున్నాను. నువ్వు నా స్థానంలో వుండి ఆలోచించు. నువ్వయితే ఏం చేస్తావు?" అని అడిగాడు.

"తన తండ్రిని చంపిన వారిని యెవరూ క్షమించరు. నేను క్షమించను కాని...."

"అర్థం అయింది మీ నాన్న చంపినట్టు ప్రత్యక్ష సాక్ష్యాలు కావాలి.

అవునా?" అతను లేచి ఆమె భుజాలపై చేతులువేసి, కళ్ళలోకి సూటి
చూశాడు.

"రామనాథం, కోటేశ్వరరావు అతనికి ఆత్మీయులు. వాళ్ళ
అనుమానం రాదనుకోవటంలో అర్థం ఏమిటి?"

ఆమె మాట్లాడలేకపోయింది.

"రామనాథంగారితో బాలయ్య పోట్లాడినప్పుడు వున్నదీ, బాలయ్య
ప్రగల్భాలు విన్నదీ మీ నాన్నేనని అంగీకరిస్తావా?"

ఆమె మాత మాట్లాడలేదు.

"వెళ్ళి అతని వెర్షన్ ఏమిటో విను. ఆ తరువాతే మనము కబు
కునేది" అన్నాడు.

ఆమె నిట్టూర్చింది.

నిన్నటావేశం ఉదయంలేదు. ఉదయపు ఆవేదన మధ్యాహ్నాని
తగ్గింది. మధ్యాహ్నపు కోపం ఇప్పుడులేదు. కాలమే ఈ గాయం మాన్పు
తుందనుకుందామె. కాని అతన్ని వదిలిపెట్టి వెళ్ళాలంటే మనసు అంగీ
రించటంలేదు.

"ఆటో వచ్చింది సాబ్" కుర్రాడు చెప్పాడు.

"పద నిన్ను ఎక్కించి వస్తాను" అన్నాడు తన చేతులు తీసు
కుంటూ. ఒక్కసారి అంజనికి పూనకం వచ్చినట్టు అయింది. మునిగాళ్ళపై
లేచి అతని పెదవులు, బుగ్గలు చుంబించింది.

"ఐ లవ్ యూ....ఐ లవ్ ఫర్ యూ.... ఐ డై ఫర్ యూ" అని
సుడిగాలిలా బయటపడింది.

"అంజనీ...." అని అతను తేరుకుని పిలిచేలోపలే ఆమె ఫస్ట్
ఫ్లోర్‌కు వచ్చేసింది.

అతనలాగే నిలబడిపోయాడు.

లారీతో సామానులు తెచ్చిన కూతురిని చూసి ఆశ్చర్యపోయింది
లలితమ్మ.

"అమ్మా! శ్రీకేమో బెంగుళూరులో ఉద్యోగం దొరికే అవకాశ
వుందట. ఈ ఇల్లు అద్దెకిచ్చెయ్యమన్నాడు, ఆ అద్దె నేనే ఇస్తాను" అన్నది



"మామయ్యకు చెప్పావా?"

"చెబుతాడేమో లేమ్మా, వాడిని అడగకు. కొత్తదంపతులు ఒంటరిగా
వుండాలనుకుంటాడు" అన్నది.

"అంతేనా? మొన్న రాత్రి విషయం మనసులో పెట్టుకున్నాడా?"
లలితమ్మ గాభరాగా అడిగింది.

"ఏదయినా ఇప్పుడేం మాట్లాడవద్దమ్మా. కొన్నాళ్ళు ఒంటరిగా
వుంటే వాడికే తెలుస్తుంది బరువు, బాధ్యత. ఆ అమ్మాయి ప్రపంచజ్ఞానం
నేర్పుతుంటుంది" అన్నది.

లలితమ్మకు అదీ నిజమే అనిపించింది. తన జీవితంలో ఎవరి
ప్రమేయమూ లేకపోవటంవల్ల అనుభవాలు, పొదుపు తెలిశాయి అనుకుంది.
సాయంత్రంవరకు సామాన్లుసర్ది, స్నానం చేసింది విజయ.

హాల్లో రాజశేఖరం కూతురితో కబుర్లు చెబుతున్నాడు.

"హాయ్ రాజా!"

"హాయ్! నీ పేషెంట్లకు మరో రెండు రోజులు ఈ ఇంటి అడ్రసు
తెలియకూడదని ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

"ఎందుకేమిటి?" జడ అల్లుకుంటూ కూర్చుంది విజయ.

"మనం సినిమాకెళ్ళి ఎన్నిరోజులైంది?" అన్నాడు కినుకగా.

"ఇప్పుడు సినిమాకు వస్తే అక్కడ హాయిగా నిదురపోవాలి.
అయామ్ ఎక్సాస్టెడ్...." అన్నది.

"మమ్మీ! జూకి వెళ్దాం" అన్నది స్వీటీ.

"నిన్ను చూస్తున్నాంచాలు తల్లీ" అన్నది విజయ.

"నో మమ్మీ...." స్వీటీ వచ్చి తల్లిని పిడికిళ్ళు బిగించికొట్టింది.

"విజ్జమ్మా! పక్కింటమ్మాయికి కడుపులో నొప్పట. గిలగిలా తన్ను
కుంటుంది. వెళ్ళి ఒక్కసారి చూడమ్మా. స్వీటీ నువ్విలా రా! స్నానంచేయి
స్తాను" అన్నది లలితమ్మ.

"ధనోస్మి! అయిందా?" నీరసపడిపోయాడు రాజా. విజయ
ఫక్కున నవ్వి, స్టెత్ తీసుకుని వెళ్ళిపోయింది.

ఆమె పేషెంటుని టెస్ట్ చేసింది. వివరాలు అడిగి తెలుసుకుంది.

ఇంటికివచ్చి రెండు టాబ్లెట్లు యిచ్చింది.

డ్రాయింగ్‌రూంలో నుండి రాజశేఖరం కంఠం స్పష్టంగా వి స్తుంది.

"చూడండి! ఇక్కడ ఎంత ఖర్చయింది అన్నది కాదు ము ఎంత ఘనంగా జరిగింది అన్నదే ముఖ్యం. అన్ని పత్రికలలో ఫో పాటు అడ్వర్‌టైజ్‌మెంట్ ఇవ్వండి" అంటున్నాడు.

ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి. పేషెంటు తాలూకు మనుష వెళ్ళిపోయాక అక్కడే నిలబడింది.

రాజశేఖరం హడావుడిగా వచ్చి, తన డ్రాయర్ సొరుగు నాలుగయిదు ఫోటోలు తీశాడు.

"విజ్జీ! ఇందులో ఏది స్మార్ట్‌గా వుందో చెప్పు?"

"ఎందుకు?"

"ముందు చెబుదూ" అన్నాడు కాస్త విసుగ్గా.

ఒక బస్ట్‌సైజ్ ఫోటో తీసి చూపించింది. చుక్కల అప్ష నిర్లక్ష్యంగా వదిలివేసిన జుట్టుతో ఎంతో బావున్నాడు.

"నీకు టేస్ట్‌లేదు విజ్జీ! ఈ టై కట్టుకున్న ఫోటో బావుంది" అన్నా ఇంకొకటి పైకితీసి.

"గండుపిల్లిలా వున్నారు" అన్నది నవ్వుతూ.

"థ్యాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్...." అని బీరువాతీసి అ వందల రూపాయలు తీశాడు.

"డబ్బెందుకు?" విజయ ముఖం చిట్లించింది.

"అవతల పెద్దమనుష్యులున్నారు వచ్చి చెబుతాను" అతను వె పోయాడు. ఆమె అక్కడే నిలబడిపోయింది.

"షంక్షను ఘనంగా జరగాలి. ఆర్గనైజేషన్‌లో కొన్ని పద్ధ మీరు నేర్చుకోవాలి. నేను ప్రిసైడ్ చేస్తున్నాను. నా సీటు ఎలా మధ్యలో వుంటుంది. ఒక ప్రక్కన సినీతార ఇందుశ్రీకి కుర్చీ, మ ప్రక్కన మినిస్టరుగారిది వేయించండి" అన్నాడు.

"ఆ మాట మీరు చెప్పాలా సార్! ఇందుశ్రీ మేకప్‌లో వస్తు



మీరు మేకప్ లేకుండానే సినిమాస్టార్‌లా వున్నారు సార్" ఒకతను అన్నాడు.

"అందరూ అదేమాట అంటారు. మన మెంబర్స్‌ని ఓ పదిమందిని వెనుక కూర్చోపెట్టు. నేనన్న ప్రతి మాటకు చప్పట్లు కొట్టించే ఏర్పాట్లు చేయి" అన్నాడు.

"మీకెందుకండీ! మీరన్న ప్రతి మాటకు వన్స్‌మోర్ అనిపిస్తాను" అన్నాడు ఆర్గనైజర్.

"అలాగే ఓ ఫోటోగ్రాఫర్‌ను ఏర్పాటుచేయండి. అన్ని యాంగిల్స్‌లో నన్నే తీయాలి" అన్నాడు.

"ఆమాట మీరు ప్రత్యేకంగా చెప్పాలాసార్?" అన్నారు వాళ్ళు.

"ఇంకేమయినా వున్నాయా?" ఓ మిత్రుడు అడిగాడు.

"అన్నట్టు బాగా గుర్తుచేశావయ్యా! దండలు కట్టించేటప్పుడు నా దండ పెద్దగా కట్టించండి" అన్నాడు.

"మంచిది సార్...." ఈసారి నీరసంగా వినిపించింది ఆర్గనైజర్ గొంతు. అది గ్రహించాడు రాజశేఖరం.

"అదనంగా ఏదయినా ఖర్చు అయితే నేను భరిస్తానయ్యా, మీకెందుకు-క్లాసుగా వుండాలి ఏర్పాట్లు."

"ఆ మాటన్నారు చాలు" వాళ్ళు లేచారు నమస్కరించి.

"మీకు శివానంద్ అనే కవి తెలుసా?"

"తెలియకపోవటం ఏమిటండీ! మాకు ఎప్పుడూ సన్మాన పత్రాలు వ్రాసి ఇస్తుంటాడు" అన్నారు వారు.

"వారినోసారి కమ్మను" అతను లోపలికి వచ్చాడు. అక్కడ కుర్చీలో కూర్చుని చెక్కిట చేయి చేర్చిన విజయ కనిపించింది. ఆమె ఏదో దీర్ఘ ఆలోచనలో వున్నది.

ఆమె వివాహము అయ్యాక ఒకే ఇంట్లో గడిపినా, సంసారజీవితం పంచుకుందేగాని తన చదువులోపడి, భర్తను అర్థంచేసుకోలేదు. ఆ అవకాశం రాలేదు.

కొత్త వ్యక్తిని చూసినట్టు చూసిందామె.

"ఇప్పుడు విను డియర్! ఇందుశ్రీకి నేషనల్ అవార్డు వచ్చి సందర్భంలో అభినందోత్సవం జరుపుతున్నారు. నన్ను అధ్యక్షత వహిం మన్నారు. కాస్త క్లాసుగా వుండాలని నేనే ఐదువందల రూపాయ ఇచ్చాను" అన్నాడు తేలికగా.

విజయకు కళ్ళు తిరిగినంత పనయింది. మూడురోజులక్రితం వి లాంగుల సహాయార్థం ఓ చిన్న కార్యక్రమం ఏర్పాట్లుచేసి, రెండు టి కొనమంటే తను ఊళ్ళో వుండనని వారిని పంపించివేసిన భర్త, ఈరో అయిదువందలిచ్చాడా? వెళ్ళినా, మానినా అది వికలాంగుల సహాయ అని తనే టికెట్టుకొన్నది విజయ.

"భోజనం చేద్దామా?" చేతులు కడుక్కుని వచ్చాడు.

ఆమె లేచి అతన్ని అనుసరించి డైనింగ్ హాల్లోకి వెళ్ళింది. ఆమె ఏం తింటుందో కూడా తెలియలేదు.

"విజ్జమ్మా! దొండకాయ పెరుగుపచ్చడి నీ కిష్టమని చేశానమ్మా" అన్నది లలితమ్మ.

"నాకు ఆకలిలేదమ్మా!" అని చెయ్యి కడిగేసుకుంది.

ఆమెకు మనసంతా వికలమయింది. ఒకవైపు అంజని ఆర్ద్రపూరి మైన అభ్యర్థన బాధిస్తుంటే, మరోవైపు ఇన్నాళ్ళయినా భర్తను తన అర్థంచేసుకోలేకపోయానన్న బాధ ఆమెను అణువణువు దహించివేస్తుంది.

మెల్లగా గదిలోకివచ్చి నీరసంగా మంచంపై వాలిపోయింది.

లలితమ్మ మనుమరాలికి కథలు, పద్యాలు చెబుతుంది.

"అమ్మమ్మా! నీకు ట్వింకిల్ ట్వింకిల్ అన్న రైమ్ రాదా?"

"వస్తుంది తల్లీ! మొదట తెలుగులో నేర్చుకో. వేమన పద్యాల్లో వున్న జీవిత సత్యం ఎక్కడుంది!"

"అదేమిటమ్మా?"

"నీకు చెప్పినా అర్థంకాదుగాని పద్యం బైహార్టు చెయ్యి. అబ్బ ఎప్పుడు పల్కు ఆడంబరముగా.... సజ్జనుండు పల్కు చల్లగాను...."

"అమ్మా! స్వీటీని పడుకోనివ్వు" విసుగ్గా అరిచింది విజయ.

లలితమ్మ కూతురి మూడ్స్ ఆఫ్ అయ్యాయని అర్థం చేసుకుంది

గ్రంథాలయ సంస్థ, నెల్లూరు
శాఖా గ్రంథాలయము, సూళ్ళూరుపేట



విజయకేమో ఆ పద్యం భర్తకు వర్తించదేమో అనుకుంది. ఆమెకు తన పెత్తండ్రి విషయంలో భర్తచూపే ఆదరణ, గౌరవము గుర్తుకు వచ్చింది. ఆమె అటు ఇటు దొర్లింది.

"విజ్జీ! ఒంట్లో బాగాలేదా?" రాజశేఖరం వచ్చి నుదురుతాకిచూచాడు. మృదువుగా అతని చేయి తొలగించింది.

"మనసే బాప్పండలేదు" అనబోయి ఆగిపోయింది.

"ఒకరు కాకపోతే మరో యిద్దరు కూలీలను పెట్టుకో. పనంతా నెత్తిన వేసుకుంటావు. నువ్వు డాక్టరువు అన్న విషయం మర్చిపోకు...." అన్నాడు లాలనగాను.

అతను వెళ్ళి బట్టలు మార్చుకుని, తెల్లని పైజామా, జుబ్బా వేసుకుని, పెద్దలైటు తీసివేసి, జీరోబల్బు వేశాడు.

అతన్ని చూస్తుంటే ఆమె అడగదలచిన మాటలు పైకిరాలేదు. అతనో ప్రేమమూర్తిలానే పరిచయం ఆమెకు. అతను బయటకు వెళ్ళి హార్లిక్స్ తీసుకుని వచ్చాడు.

"విజ్జీ....లే" ఆమె లేచింది. కళ్ళు తడి అవుతున్నాయి.

"ఇంకొక ఆరునెలలు ఓపికపట్టు డార్లింగ్, సెకండ్‌హాండ్ కారు కొంటాను. నిన్ను స్కూటర్‌మీద తీసుకువెళుతుంటే ఎంత బాధగావుందో చెప్పలేను" అన్నాడు ఆమె వీపుని నవరిస్తూ.

"విజయా! నువ్వయితేనే కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడుతావు" అంటూ తన స్నేహితులు తెలిసినవారు అడిగేవారు. అలాంటిదీ తానింత వెనుక-ముందాడుతుందేం? ఈ అనురాగబంధం అతి సున్నితమైనది. జాగ్రత్తగా ముడివేయాలి, లేకపోతే ఏముంది తెగిపోతుంది.

హార్లిక్స్ సగంతాగి మిగతా సగం భర్త కందించింది.

"థ్యాంక్స్ డియర్" అతను తాగి నోరు పుక్కిలించివచ్చాడు.

విజయ తల దగ్గరున్న గ్లాసులో నీళ్ళు తీసుకొని తాగింది.

అతను పడుకోగానే అతని హృదయానికి తల ఆన్చి తనూ పడుకుంది.

"రాజా!"

"ఊఁ!" అన్నాడు ఆమె వీపులో వేలుతో గీతలు గీస్తూ.

"మనిద్దరం నీతిగా, నిజాయితీగా బ్రతకాలని కోరుకుంటానుగాని కార్లు, మేడలు లేవని ఎప్పుడయినా అన్నానా!"

"ఓ డియర్! ఎంత సున్నితంగా ఆలోచిస్తావేం! నేను ఏం కోరుకుంటానో తెలుసా! నా ప్రియాతి ప్రియమైన విజయకు, నా స్వీటీకి లోటు రాకూడదని కోరుకుంటాను" అన్నాడు.

"లోటు...డబ్బుతో పూడ్చేలోటు సంతోషాన్నివ్వదు రాజా..." ఆమె మాట పూర్తికాకముందే కాలింగ్‌బెల్ వినిపించింది. విజయ లేవబోయింది.

"నువ్వుండు. నేను చూస్తానెవరో" రాజశేఖర్ లేచి బయటికెళ్ళి అయిదు నిమిషాల తర్వాత టెలిగ్రామ్ పట్టుకుని వచ్చాడు.

"ఎవరు నాయనా?" ఆమె గదిలోనుండి లలితమ్మ వచ్చింది.

"మీ ముద్దుల కుమారుడత్తయ్యా! బెంగుళూరు చేరినట్లు టెలిగ్రామిచ్చాడు" అన్నాడు రాజశేఖర్.

"ఊటీ వెళతాం అన్నారుగా."

రాజశేఖరం నాలుక కరుచుకున్నాడు. జవాబుకోసం తడుముకున్నాడు. ఆమెకేం చెప్పాలి?

గదిలో వున్న విజయ విన్నది. ఆమెలేచి బయటకి వచ్చింది.

"శ్రీ టెలిగ్రామూ! వాడు బెంగుళూరు, మైసూరు చూసుకుని ఊటీ వెళతానన్నాడు...." అని టెలిగ్రామ్ తీసుకుంది.

"వీడికి కుదురెప్పుడొస్తుందో...." ఆమె నవ్వుకుని లోపలికి వెళ్ళింది లలితమ్మ.

విజయ తేలికగా నిట్టూర్చి గదిలోకి వచ్చింది. తలుపు గొళ్ళెం వేసింది.

"విజ్జీ! మీ తమ్ముడి పద్ధతి నాకేం నచ్చలేదు" అన్నాడు.

"రాజా! ఒకరికి నచ్చని విషయాలు మరొకరు చాలా చేస్తుంటారు ఇదిలోకం" అని అవతలి ప్రక్కగా వచ్చి మంచంపై వాలింది.



"డాక్టరమ్మగారు వేదాంతం మాట్లాడుతున్నారే?"

"శ్రీహర్ష కాదు, బాలరాజు చెప్పిన విషయం వింటే నాకే కంపరంగా వుంది. నిజానిజాలు తెలియవుకాబట్టి, మనసును దిటవు చేసుకున్నాను" అన్నది విజయ.

"సెంటిమెంటల్ ఫూల్స్ అంటాను. ఒకవేళ నిజంగానే అతను అవసరానికి చంపించాడనుకో. ఇప్పుడది మనసుకు తీసుకుని, తను బాధపడి, ఇతరులను బాధపెట్టటం మూర్ఖత్వం అంటాను" అన్నాడు కాస్త విసుగ్గా.

"ఏమంటున్నారు?" అంది ఆశ్చర్యంగా.

"అవును విజ్జూ! ఇప్పుడు మీ నాన్న తిరిగివస్తాడా? ఆయన తెలిసో, తెలియకో చేశాడు. దానికి ప్రాయశ్చిత్తంగా మీ జీవితాలు తీర్చిదిద్దాడు. నేనయితే ప్లస్ పాయింట్స్ చూస్తాను" అన్నాడు నిదానంగా.

"రాజా! మీరు....మీరేనా?" దెబ్బతిన్నట్లు చూసింది విజయ.

"నేనే విజయా! మనిషి ఎప్పుడూ ప్రాక్టికల్‌గా ఆలోచించాలి" అన్నాడు ఆమెకు దగ్గరగా జరుగుతూ.

"మీ నాన్నను ఎవరయినా చంపితే, మీరు డబ్బిస్తే ఊరుకుంటారా? బాలరాజు కథనం ప్రకారం మీ నాన్నదే మూర్ఖత్వం అంటాను. నల్గురు నడిచేదారిలో నడవాలిగాని, ఆదర్శాలు అన్నం పెట్టాయా? అవసరాలు తీర్చాయా? ప్రభుత్వం డబ్బు? ఎక్కడిది, ప్రజల సొమ్ము. దాన్ని వాళ్ళు అనుభవిస్తారు, నలుగురితో నారాయణా అంటే పోలా?" అన్నాడు చిరాకుగా.

"రాజా! నేను అడుగుతున్న విషయం వేరు. నలుగురితో నారాయణ అనొచ్చునో లేదో తర్వాత, మీ నాన్నను చంపిన వ్యక్తిని ఆదరిస్తారా?" తీక్షణంగా అడిగిందామె.

అతను కాస్త తగ్గాడు.

"అదికాదు విజ్జీ! అతను చంపించాడో లేదో, కాని మీ కుటుంబాన్ని ఎంతలా ఆదుకున్నాడు? మీ నాన్న వున్నా అన్నీ చేయడేమో! మా నాన్నని ఇదే పరిస్థితులలో ఎవరయినా చంపితే మా నాన్నే మూర్ఖుడు అంటాను. చంపినవాళ్ళు పరిస్థితుల ప్రభావం చేత ఏదో చేశారు మంచివారు కాబట్టే

శత్రువు కుటుంబాన్ని ఆదుకున్నారు."

"ఆపండి...." ఆమె రెండు చెవులు మూసుకుని గట్టిగా తల లించింది. చటుక్కున లేచి కిటికీ దగ్గర కెళ్ళింది. రాజశేఖర్ నిజంగా మాట అంటున్నాడా? తనను హాస్యం చేస్తున్నాడా? ఆమెకు అర్థంకాలే

"మై స్వీటీ! నువ్వెప్పుడూ నవ్వుతూ వుండాలి" అన్నాడు.

"రాజా! నేను నవ్వాలంటే నువ్వు నవ్వించాలి. పురుషుడు అన్యాయాల వెనుక, అక్రమాలచాటున స్త్రీ వుంటుంది. నన్ను అల స్త్రీగా అంచనావెయ్యకు. నా తృప్తికోసం సంపాదించనవసరంలేదు" అన అతనికి తన మనసులోని మాట స్పష్టంగా ఎలా చెప్పాలో అర్థంగాలే

"విజయా!"

"అవును! నువ్వు ఇంజనీరింగ్ చదివావు. నీ భార్య డాక్టరు. విహీనురాలు కాదు. సినిమాతార ప్రక్కన కూర్చోవాలని, మంత్రికా దండ వేయించుకోవాలనే తాపత్రయం ఎందుకు?"

"ఓ....మైగాడ్...." అన్నాడు రాజశేఖరం. మరునిముషమే పకా నవ్వేశాడు.

విజయను అలాగే వెనుకనుండి లేపి, తెచ్చి మంచంలో పడు బెట్టాడు. ఆమెకు మాట్లాడే అవకాశం యివ్వలేదు.

"నీకిష్టంలేని పనులు కలలోకూడా తలపెట్టను సరా...." అ చెవిలో గుసగుసగా చెప్పాడు.

## 6

కోటేశ్వరరావు ఆనందంతో ఒక నిముషం గది గుమ్మంలో బోయాడు. అతనికి ఈ ప్రపంచాన్ని జయించినంత సంతోషంగా వు అతనికి గదిలోనుండి తెరలు, తెరలుగా నవ్వులు వినిపిస్తున్నాయి.

"ఏయ్ అంజూ! మీ నాన్న రాగానే కేస్ ఫైలు చేస్తాను. న నిర్లక్ష్యం చేశావని...." శ్రీహర్ష గొంతు గండు కోకిల కూసినట్టు పించింది.



"బాగుంది- మీకు కావల్సినవి నడిచివస్తాయా? వెళ్ళి పనివారికి చెప్పి రావద్దా?" అంజని బ్రతిమాలుతుంది.

"ఊహుం! నువ్వంటే నాకేం వద్దు!" మళ్ళీ నవ్వులు. గదిలో ఏం జరిగిందో ఊహించుకున్నాడు.

"ఊర్మి! చూశావా, మన కలలు ఈనాడు పండాయి" చెమర్చిన కళ్ళు ఒత్తుకున్నాడాయన.

"నాన్నా! మీరు....మీరిప్పుడే వచ్చారా?" గదిలోనుండి వచ్చిన అంజని అతన్ని చుట్టుకుపోయింది. ఆయన మౌనంగా తల నిమిరాడు. అతను కూతురి ముఖం చూసి ఆశ్చర్యపోయాడు. నాలుగు లంఖనాలు చేసి నట్టుందా ముఖం. తల దువ్వుకున్నట్లు లేదు. వెంట్రుకలన్నీ చిందరవంద రగా వున్నాయి.

అతను ఒక్కసారి తన ఊహాలోకం వదిలి వాస్తవంలోకి వచ్చాడు. దారిలో బాలాజీ కనిపించాడు.

"అంజని దగ్గర్నుండి టెలిగ్రాం వచ్చిందా?" అని అడిగాడు.

"ఆమె ఇంట్లోనే వుంది. మహా పొగరు బలిసిందిలే. ఆ మగడిని చూసుకునేగా గీర! మాకే ఎదురుచెప్పింది" అన్నాడు రోషంతో బుసలు కొడుతూ.

కోటేశ్వరరావుకు కోపం, బాధ కలుగలేదు. గర్వంగా వుంది ముసిముసిగా నవ్వుకున్నాడు. శ్రీహర్ష, విజయల స్వభావం అతనికి బాగా తెలుసు. రాతిని మాట్లాడిస్తారు.

అతను కూతురు, అల్లుడు ఎలా దర్శనమిస్తారో రకరకాలుగా ఊహించుకున్నాడు. తను ఇద్దరి నవ్వులు విన్నానని భ్రమపడ్డాడు.

"హర్ష ఏడమ్మా?"

అంజని తన భావాలను, దుఃఖాన్ని బలవంతంగా అదిమిపట్టింది.

"ఉన్నారు నాన్నా! మీరు టీ త్రాగుతారా?"

"నీకు ఒంట్లో బాగాలేదా అంజూ?" ఆయన సోఫాలో కూర్చుని కూతురును కూర్చోబెట్టుకున్నారు.

"బావుంది నాన్నా...." అంది, తన వేలతనం బయటపెట్టకుండా

విశ్వప్రయత్నంమీద కన్నీరు ఆపుకుంది.

ఆమె వెళ్ళి తండ్రికి మంచినీళ్ళు, టీ తెచ్చింది. ఆయన కూతుర్ని పరికించి అసలు విషయం అర్థం అయ్యిందని నవ్వుకున్నాడు.

టీజింగ్‌లో, కలుపుగోలు తనంలో శ్రీహర్ష ఫస్ట్. అంజని వాళ్ళని హేళనచేస్తూ వుంటాడు. అందుకనే ఆ ముఖం మాడ్చుకున్నాడు.

ఆయన టీ త్రాగుతుండగా ఫోన్ వచ్చింది.

వెళ్ళి ఫోన్ తీసింది అంజని. అవతలి గొంతు వింటూనే ముఖంలో రంగులు మారాయి. ఎందరిలో వున్నా ఆ గొంతు గుర్తు గలదు.

"లలితమ్మను! అన్నయ్య వచ్చారా?" అని స్పష్టంగా వినిపించింది.

"రాంగ్ నంబర్" అని పెట్టేసింది. అంజని ముఖాన చెమటపట్టింది. 'ఈ విషయం అమ్మకు తెలిస్తే మరో హత్య చేసినవారు అవుతారు' శ్రీహర్ష గొంతు అజ్ఞాతంగా వినిపించింది.

అతను స్నానంచేసి వచ్చాడు.

"అంజూ! ఈసారి నిశ్చింతగా వున్నాను టూరులో. హర్ష వాళ్ళింటికి వెళ్ళాడా?" అతని ప్రశ్నకు అంజని ఆవేశంగా జవాబు చెప్పింది.

"అవును నాన్నా! నన్ను శాశ్వతంగా ఇక్కడే వుండమని వెళ్ళారు. మీరు కట్టించిన ఇల్లు అద్దెకిచ్చుకొమ్మని వెళ్ళారు. ఇచ్చాను కూడా. ... గారుంటున్నారు. నాపై కోపం, ద్వేషం లేవుట. కాని మీ కూతుర్ని ... కాపురం చెయ్యరుట" అంది. తన మాటలే తన గొంతుక అడ్డు అయ్యాయి. మాటకు తోడు ముద్దలు వేస్తాం అన్నట్టు కన్నీరు ముత్యాల్లా రాలిపడింది.

"అంజూ....! అమ్మా...." అతను లేచి వచ్చి ఆమె రెండు భుజాలు పట్టుకున్నాడు.

ఆ పిలుపులోని మార్దవం, ఆమె హృదయాంతరాళంలోని సు... మైన అనురాగబంధాన్ని మీటింది.

ఆమెను పెద్దమ్మ నిష్ఠూరోక్తులతో గాయపరిచింది. ఒక్కనాడూ తండ్రితో చెప్పలేదు.



అన్నా, వదిన తదితర బంధువులు రాబందుల్లా పీక్కుతిన్నారు. ఒక్కనాడూ తండ్రిముందా విషయాలు ఎత్తలేదు. ఈ రోజు ఆగలేకపోయింది. అతని గుండెలో తలదాచుకుంది.

"నాన్నా....నాన్నా! మీరు హంతకులట. ఆనందబాబును చంపిన కిరాతకులట. మీ దగ్గర పనిచేసే బాలరాజుట. ఆయనకేమేమో చెప్పాడు. అవన్నీ నమ్మి, నన్నిక్కడ వదిలిపోయారు." కూతుర్ని గాఢంగా హృదయానికి హత్తుకుని ఓదార్చాలనుకున్న కోటేశ్వరరావు ప్రక్కలో బాంబు పడినంతగా వులిక్కిపడ్డాడు. మెడకు పాము చుట్టుకున్నంతగా భీతిజెందాడు. కూతుర్ని వదిలేశాడు.

"ఏమిటమ్మా....ఏమన్నావ్?"

"అవును నాన్నా! ఆ బాలరాజును నేను కలిశాను. మీరు, రెడ్డిగారుట, లాల్‌గారుట...." అని జరిగింది క్లుప్తంగా, నాలుగు ముక్కల్లో చెప్పిందామె.

'భగవంతుడా! ఇంకా నీ పరీక్ష ముగిసిపోలేదా?' ఆయన తల పట్టుకొని సోఫాలో కూర్చుండిపోయాడు.

"నాన్నా! నాతో అబద్ధం చెప్పకండి. ఎంత చేదయినా భరిస్తాను. మీరు మామగార్ని....అదే ఆనందబాబుగార్ని చంపారా?" వచ్చి అతని భుజాలు పట్టుకుని కుదిపింది.

కోటేశ్వరరావు పిచ్చిగా కూతుర్ని చూశాడు. నాలుగు రోజులకే ఎంత మార్పు?! ముగ్ధ అనుకున్న కూతురు ఆడపులిలా చూస్తోంది.

"చెప్పండి నాన్నా! వాళ్ళు అన్నది అబద్ధం అయితే వారిని వెంటాడి, వేటాడి మీకు క్షమార్పణ చెప్పిస్తాను. వాళ్ళన్నది నిజమే అయితే...." ఆమె మాట్లాడలేకపోయింది.

కూతురు ఆవేశంగా మాట్లాడినందుకు కోపంగాలేదు. ఒక విధమైన తృప్తి, సంతోషం కలిగాయి కోటేశ్వరరావుకు. ఆ తెగువ, ధైర్యం వుంటే ప్రపంచాన్ని జయించవచ్చు.

"అహాఁ అంజూ! నేనే హంతకుడిని అయితే...."

ఆమె ఒక్కక్షణం తండ్రివంక చూసి, ముఖం తిప్పుకుంది.

"ఇన్నాళ్ళు మీ కూతురిగా పుట్టినందుకు గర్వించిన నేను, రేపటి నుండి మీ కూతురిగా పుట్టినందుకు నేను కుమిలి కుమిలి ఏడుస్తాను. వాళ్ళ చేతులు పట్టుకుని బ్రతిమాలుతాను. ఇందులో నా తప్పేంలేదని, హంతకుని కూతురితో కాపురం చెయ్యరని తెలిస్తే, మరో వివాహం చేసుకుని సుఖంగా వుండమని అనుమతిస్తాను" అంది ఆవేశంగా.

ఆయన రెండు నిమిషాలు ఆమెను నిశితంగా గమనించి, గాఢంగా నిట్టూర్చాడు.

అంజని గబుక్కున వెళ్ళి ఆయన ప్రక్కన కూర్చుంది. ఆయన చెయ్యి తీసి తన తలపై పెట్టుకుంది.

"నాపై ప్రమాణంచేసి అంతా నిజమే చెప్పండి నాన్నా! మీ ప్రియమైన కూతురిపై ప్రమాణం చెయ్యండి....కాదు కాదు-అమ్మపై ప్రమాణం చెయ్యండి" అంది.

ఆమె వాలకం చూస్తే మాటలను కక్కించేలా వుంది.

"చెప్పండి నాన్నా....చెప్పండి. ఆనందబాబు హత్యతో మీకు సంబంధం వుందా?" తీక్షణంగా, స్పష్టంగా అడిగింది. ఆమె ఆవేశం కరిగి అశ్రు రూపంలో బయటికి వచ్చింది.

"ఉందనుకుంటే వుంది. తప్పించుకుంటే లేదు."

అంజని ఆయన చెయ్యి వదిలివేసింది. ఆడపులిలా లేచి, ఆయన భుజాలు పట్టుకు వూపేసింది.

"ఈ డొంకతిరుగుడు సమాధానం కాదు నాన్నా! నాకు నిజం కావాలి. అది ఎంత చేదైనాసరే భరిస్తాను" అంది ఆవేశంగా.

"నువ్వు ఆవేశపడి లాభంలేదు అంజూ! ఇరవై ఏళ్ళుగా నాలో నేనే కుమిలిపోతూ, గుండెల్లో దాచుకున్న భారాన్ని ఈ రోజు నేను నీతో చెప్పి దింపుకుంటాను" అన్నాడు. ఆయన కనుకొలుకుల్లో నీళ్ళు నిలిచాయి.

అంజనికి గంభీరమూర్తి, చిరునవ్వుతో, ఆప్యాయతగా దగ్గరకు తీసుకునే తండ్రే కనిపించేవాడు. కాని, ఈ రోజు ఓ కొత్త వ్యక్తిని, విషాదమూర్తిని చూసిందామె. మలినమైన ఆయన ముఖం చూడగానే ఆమెలోని



స్త్రీ పసిదిగా మారిపోయింది. బాణంలా అతని ఒడిలో దూరి, పమిటతో ఆయన కళ్ళు ఒత్తింది.

"వద్దు నాన్నా వద్దు. మీరు కంటతడి పెట్టొద్దు. ఫరవాలేదు. ఆవేశంలోనో, ఆశకు లోబడో హత్యచేస్తే చేశారు. నేను అంతా మరిచిపోతాను నాన్నా. మనిద్దరం ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోదాం" అంది తొందర తొందరగా.

ఆయన కూతురి తల నిమిరాడు.

"అంజూ! అంతా వినమ్మా! విన్న తర్వాత నేను దోషినని నిర్ణయిస్తే అలాగే అనుభవిస్తాను" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. ఆయన ఆమెను దూరంగా జరిపాడు. డ్రాయరు సొరుగులాగి, అందులో చక్కగా బైండ్ చేసిన ఓ డైరీ తీశాడు.

"అంజూ! నేను సాగర్‌లో పనిచేసే రోజుల్లో నాకంతా అయోమయంగా వుండేదమ్మా. మీ పెద్దమ్మ నిర్లక్ష్యం, మీ తాత అహంకారం భరించలేక నా హృదయావేదన రోజూ వ్రాసుకునేవాడిని. మీ అమ్మ నా జీవితంలో అడుగుపెట్టేవరకు జరిగిన విషయాలు రోజూ వ్రాశానమ్మా! మెల్లగా, ప్రశాంతంగా చదువు" అన్నాడాయన. ఆయన లేచి బయటికి పోబోయాడు.

"నాన్నా...." భయంగా ఆయన చెయ్యి పట్టుకుంది.

"పిచ్చితల్లీ! నేను చేసిన చెడు పన్లలో యిదొకటి. నువ్వు నిలదీస్తే నా హృదయం తేలికైంది. అపవాదులు అన్యాయంగా భరించిననాడు కూడా ఆత్మహత్యను తలచుకోలేదమ్మా!" అన్నాడు మెల్లగా. ఆయన కంఠం కంపిస్తోంది.

"నాన్నా! అత్తయ్య చూచాయగా వినే చాలా అప్‌సెట్ అయింది. అందుకే ఆమెకు ఏమీ చెప్పలేదు. మేమిప్పుడు ఊటీల్లో వున్నాము" అంది అర్థంచేసుకొమ్మనే ధోరణిలో.

అర్థం అయిందన్నట్టు తల పంకించాడు ఆయన. తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు.

ఆమె మెల్లగా డైరీలు తీసుకొని, కుర్చీలో కూర్చుంది. ఫోన్ రింగ

యింది. క్రిందనుంచి పైకి కనెక్షన్ యిచ్చినట్టున్నారు.

"హల్లో....నేను అంజనిని.... మీరు.... మీరేనా.... మీరేనా

ఆమెను హర్ష గొంతు వినేసరికి దుఃఖం పొంగుకువచ్చింది.

"అంజనీ!" అతని గొంతు కంచులా మ్రోగింది.

"చెప్పండి..." అంది ఆనందతరంగాలలో ఓలలాడినట్టు అవుతు మనసును అదుపులో పెట్టుకుని.

"మీ నాన్న వచ్చాడా?"

అంజని మనసు కలుక్కుమన్నది. ఏనాడూ తండ్రిని ఏకవచ పిలవటం ఎరగదు.

"వచ్చేవుంటాడు. వెళ్ళి అమ్మదగ్గర మొసలికన్నీరు కార్చి, చేయలేదని చెబుతాడు. అన్నట్టు మరిచేపోయాను. నువ్వ అడిగి కున్నావా?" అన్నాడు.

"అడిగాను....లేదు....చదవాలి....అదికాదు...."

"అంత కంగారుపడ్డు. నువ్వు అడుగు, మానెయ్యి అది నీ కానీ అమ్మకీ విషయాలు తెలియకూడదు. నాకు మిగిలిన ఆస్తి ఒక్కర్తే" ఆఖరు మాటలు అంటుంటే అతని కంఠం వణికింది.

"బావా...." ఎన్నో చెప్పాలనివున్నా ఆమెకు నోరు రాలేదు. సింది. అతడు కాస్సేపు మౌనంగా వున్నాడు. తనూ బాధపడుతున్నా అర్థమయింది అంజనికి.

"బావా! ఎక్కడుంటున్నావు?" ధైర్యంచేసి అడిగింది.

"ప్రస్తుతం కెంపగౌడ టౌన్‌షిప్‌లో ఒక స్నేహితునితో వు న్నాను. టాటా ఇన్‌స్టిట్యూట్‌లో జాబ్ రావచ్చు" అన్నాడు.

"నాన్నతో అన్ని విషయాలు కనుక్కునేవరకు రోజూ ఫో చెయ్యండి బావా...." అన్నది ఆమె గుండెల్లో దాచిన అనురాగమ మాటల్లోకి మార్చి.

"మీ నాన్నలా నేను లక్షాధికారిని కాను. అమ్మ విషయం జాగ్ర అని ఫోన్ పెట్టేశాడు.

ఫోన్ అలాగే హృదయానికి హత్తుకుంది. ఫోన్‌పై వున్న



చేతికి కనిపించిన ఉంగరంలో పెనవేసుకున్న ఎ.ఎస్. అక్షరాలను కాసేపు చూచి, ఫోన్ పెట్టి, వాటిని పెదవులకు తాకించుకుంది. ఆమెకు పదవ తరగతి పాసైననాటి సంఘటన గుర్తుకువచ్చింది. అప్పటికి తనకి తెలిసీ తెలియని వయసు. రిజల్ట్స్ చూడగానే ఎక్కడలేని ఆనందం కలిగింది. తండ్రి ఇంట్లో లేడు. తన ఆనందంతో పాలుపంచుకునే వ్యక్తి ఒక్క లలితమ్మే అనిపించింది. అంతే పేపరు పట్టుకుని పరుగులు పెట్టింది. చెప్పులు వేసుకోవటం కూడా మరిచిపోయింది. లలితమ్మ ఇంట్లో అడుగుపెట్టి విసురుగా బయటకి వస్తున్న శాస్త్రీని ఢీకొన్నది. ఇద్దరూ లుంగచుట్టుకుపోయి లోపలి గదిలో పడ్డారు అంజని చేతిలోని న్యూస్‌పేపర్ జారి దూరంగా పడిపోయింది. తేరుకుని చూసేసరికి క్రిందపడిన శ్రీహర్షపై దాదాపు హత్తుకున్నట్టు తనుంది.

"సారీ...." లేవబోయింది.

అతను అల్లరిగా నవ్వాడు. ఆమెపై చేయి బిగించాడు.

"బావా! వదులు అను, వదులుతాను" అన్నాడు. బలవంతంగా అతన్ని వదిలించుకుని లేచింది. భయంగా దిక్కులు చూసింది.

"బ్యూటిఫుల్ సీన్...." పకపక నవ్వుతూ విజయ వచ్చింది.

"ఏమిటి విజ్జూ?" లలితమ్మ వచ్చింది. ఆమెను చూడగానే కొండంత ధైర్యం వచ్చింది.

"అత్తయ్యా!" వెళ్ళి ఆమె హృదయంలో తలదాచుకుని, తను పాసయినట్టు చెప్పింది.

"కంగ్రాచ్యులేషన్స్...." ఆమె నుదురు, బుగ్గలు ముద్దుపెట్టుకుంది.

"మీరిద్దరూ కంగ్రాచ్యులేషన్స్ చెప్పండి" అన్నది లలితమ్మ.

"ఉహూ! నువ్వు అత్తయ్యవైతే నేనేమౌతాను చెప్పమ్మా...." ప్యాంటుకు అంజని పాదాల దుమ్ము అంటితే దులుపుకుని, తాపీగా కుర్చీలో కూర్చున్నాడు హర్ష.

లలితమ్మ ఫక్కున నవ్వింది.

"ఇంతకీ నువ్వేదేమిటి? నిన్ను బావా అని పిలవాలంటావ."

"అంతే, అలా పిలిస్తేనే అభినందించేది, స్వీట్ తెప్పేది" అన్నా[illegible]

"అంజూ! విన్నావుగా మీ బావ కోరిక" అన్నది లలితమ్మ.

"ఛా....నాకేం వద్దు" వచ్చినంత వేగంగా పరుగెత్తబోయింది. [illegible] ఒక జడ హర్షకు దొరికిపోయింది.

"వాడు వదిలిపెట్టడే అంజూ! బావ అను" లలితమ్మ డబ్బు[illegible] లోపలికి వెళ్ళింది. అప్పటికే విజయ లైబ్రరీకి వెళ్ళింది.

"వదులు బావా!" అన్నది మెల్లగా.

"ఒక్కసారేనా?" అన్నాడు. అంజని బేలగా చూసింది. న[illegible] నవ్వి వదిలిపేశాడు. ఆమె పరుగెత్తుకువచ్చింది.

సాయంత్రం స్వీట్ తీసుకునివచ్చి, తండ్రిముందు బుద్ధిమంతు[illegible] తలవంచుకుని, ఏ కాలేజీలో చేర్పిస్తారు? ఏ గ్రూపు? అంటూ మాట్లాడి వె[illegible] పోయాడు.

అందుకే....ఈరోజు అతనికిష్టమైన 'పిలుపు' బావ అని పిలిచి[illegible] అతనూ బాధపడి వుండాలి. లేకపోతే ఆ పేరుతో పిలిచినందుకు మంది[illegible] వాడే.

ఆమె తండ్రి ఇచ్చిన డైరీలు తీసుకుని గదిలోకి వెళ్ళింది. [illegible] తండ్రి రహస్యం ఇంకెవరికైనా తెలుస్తుందన్నట్టు తలుపులు వేసుకుని, [illegible] కీలు పరదాలులాగి, టేబిల్ లైటువేసి డైరీ తీసింది.

## 7

తారీఖు....వ్యతిరేకమైన స్వభావాలు. భిన్నలింగాల మధ్యే ప్రేమా[illegible] రాగాలు అంకురిస్తాయంటారు. కాని ఈరోజు నా మనసు ఆనంద్‌బాబుపై[illegible] లాగుతుందేమిటి? ఇంత చిన్న వయసులో ఇంజనీరుగా వచ్చాడు. కరచా[illegible] నం చేస్తుంటే ఆ చేయి ఎంత మృదువుగా వుందో, ఎంత మృదుగంభీరమై[illegible] కంఠమది. 'సీయూ మిస్టర్ రావ్' అన్న మాటలింకా చెవుల్లో వున్న[illegible] వున్నాయి. స్త్రీకి వుండవలసిన మృదుత్వం, లాలిత్యం వున్నాయి....

ఆ తరువాత భార్య ప్రవర్తన తన బాధ వ్రాసుకున్నాడు.



....తారీఖున ఆనంద్‌బాబుతో ఓ గంట మాట్లాడే అవకాశం కలిగింది. అబ్బ మనిషి ఎంత అందమో మనసు అంతే అందం. నిక్కచ్చిగా మాట్లాడే స్వభావం. అతను కాఫీ చేస్తుంటే, అతను అమ్మాయి అయి, నా ప్రియురాలయితే అన్న వింత ఆలోచన వచ్చింది. నా ఆలోచన నాకే నవ్వు వచ్చింది....

ఆ తరువాత అంతా మామూలే. తన పరిచయం రోజురోజుకు, ఆనంద్‌బాబుతో పెరగటం, ఒకరిని ఒకరు పరిహాసాలాడుకోవటం, వంట చేసుకోవటం అంతా వ్రాసి వుంది.

....నా జన్మలో మరిచిపోలేని రోజు. ఆనంద్‌బాబు వూరెళ్ళి వివాహితుడై వచ్చాడు. సిగ్గుల పెళ్ళికూతుర్ని పరిచయం చేశాడు. ఆనంద్‌కు తగినట్టుంది. అబ్బ ఎంత అందమైన జంట అనిపించింది. ఆమె ఓర చూపులు, దొంగ జల్లలు చూస్తుంటే ముచ్చట వేసింది. ఒక్కనాడయినా కమల అలా పిలిచిందా? 'అన్నయ్యా కాఫీ' అన్నప్పుడు ఎంత మురిసిపోయానో!' నిజంగా లలిత నా చెల్లెలయితే ఎంత బావుండును. ఆ రాత్రి అక్కడనుండి కదలాలనిపించలేదు. కాని నూతన దంపతుల ఏకాంతం పాడుచెయ్యటం యిష్టంలేక ఊరుకున్నాను. అయిష్టంగా వచ్చాను.

....లలితచేత 'అన్నా' అనిపించుకోవాలని వుంటుంది. కానీ ఈమధ్యన ఆనంద్ నన్నుచూస్తే ముఖం చిట్లిస్తాడు. అతనికి నా త్రాగుడు ఇష్టంలేదు. నా బాధ చెప్పాను. దానికి పరిష్కారం త్రాగుడు కాదంటాడు. అందుకే తప్పించుకు తిరుగుతున్నాను. మరీ ఇంత నీతి నిజాయితీగల మనుష్యులీ ప్రపంచంలో బ్రతకలేరేమో....

ఆనంద్ కంట్రాక్టర్లకో సవాల్ అయ్యాడు. వాళ్ళందరికీ కోపం వస్తుంది. ఒక్క పైసా ముట్టుకోడు, పార్టీలకు రాడు. కూలీలకు ఏ చిన్న అన్యాయం జరిగినా సహించడు. ఆనంద్ శ్రేయోభిలాషిగా ట్రాన్స్‌ఫరైతే బావుండును, అని కోరుకుంటున్నాను....

మధ్యలో కొన్ని తన గొడవలు, ఆనంద్‌బాబుతో త్రాగుడుపై, లంచాలపై జరిగిన గొడవలు వ్రాసుకున్నాడు.

మరునటి సంవత్సరం డైరీ తిప్పింది అంజని.

....ఆ రోజు ఆనంద్ ముఖం వింతకాంతితో వెలిగిపోతుంది. సాధారణంగా కూతురికి నామకరణం చేశాడు. నేనొక్కడినే అతిథి. కాంట్రాక్టర్ లంతా అతడిని బుట్టలో పెట్టడానికిదే ఛాన్స్ అన్నారు. కాసుల కడియాలూ, గొలుసు, గౌను, బట్టలు తీసుకుని వెళ్ళాను. మొదట ఏమీ అనలేదు. భోజనాలయ్యాక పాప గౌను, లలిత చీర ఉం కున్నాడు. మిగతావి తిరిగి యిచ్చేశాడు. 'రావ్! నువ్వు కంట్రాక్టరువి, ఇంజనీరును, ఈ ఖరీదయిన వస్తువులు అంగీకరించానంటే నీ క నష్టే, అభిమానం వస్తువలతో కొలువకు' అని హెచ్చరించాడు. ప్రతి అతనిముందు నేనోడిపోతున్నాను. ఆ ఓటమి అతిమధురంగా ఉం

ఆ తరువాత రెండు సంవత్సరాల డైరీలు చదివింది, విశేషం లేదు. తమకు, ఇంజనీర్లకు, వర్కర్స్ కు జరిగే గొడవలు, ఆనంద్ బాబు కంటుకావటం వ్రాశాడు. ఆ పేజీలు అలవోకగా తిప్పేస కొన్ని చిరిగిపోయాయి.

....ఆ రోజు ఒకవైపు ఆనందం, మరోవైపు విచారం ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆనంద్ బాబుకు కొడుకు పుట్టాడట. శ్రీహర్ష పేరు పెట్టారు. అందంగా వున్నాడు. వాళ్ళ ఆనందమైన కాపురం వచ్చాను. నా క్వార్టర్ లో రెడ్డి, లాల్, మరో సూపర్ వైజర్ కూర్చు 'మన బిల్ సంగతి అడిగావా?' అంటూ నిలదీశారు. ఒక్క మైలే వున్నట్టు స్టేట్ మెంట్ తయారుచేశారు. ఆనంద్ బాబు సంతకం పె తరువాత సంగతి, ఆ బిల్ ఇచ్చే ధైర్యం వుందా నాకు? హెచ్చ వాళ్ళు వెళ్ళిపోయారు....

ఆ తరువాత కూలీలకు అన్యాయం, ఆనంద్ బాబు కల్పించుకో ఆయన భార్య తెచ్చే ఒత్తిడి వ్రాసుకున్నాడు.

....ఈరోజు ఎంత భయంకరమైన వార్త చెప్పాడు! ఆనంద్ పట్ల అధికార్లకి కూడా మంచి అభిప్రాయం వుందట. ట్రాన్స్ ప్రయత్నం ఫలించలేదు. 'అతడీ లోకంలోనే వుండడు' అన్నాడు.

నాకు కొంత సహాయమివ్వండి. నచ్చచెబుతాను అని ప్రతిమాలా లాభం లేకపోయింది. వాళ్ళు మొండిపట్టు పట్టారు. నాకేం చేయ



తోచటంలేదు. వాళ్ళు వెళ్ళిపోయాక, వెంటనే ఆనంద్ బాబు ఇంటికి వెళ్ళాను. లలిత ముందు ఈ విషయం చర్చించకూడదని ఆనంద్ ను బయటికి పిలిచాను.

"ఏమిటి రావ్? రేపు విజ్జీని హాస్టల్లో చేర్పించాలి. హైదరాబాద్ వస్తావేమిటి?" అన్నాడు ఉత్సాహంగా.

"ఆనంద్! నువ్వు రమ్మంటే వస్తాను. నాదొక్కమాట వింటావా?" అన్నాను కంగారుగా.

"వినడానికేం భాగ్యం? చెయ్యటానికి ఆలోచిస్తాను. చెప్పు, ఆ స్టేట్ మెంట్ పై సంతకం పెట్టాలికదూ!" నవ్వాడు. ఆ నవ్వు స్వచ్ఛంగా, పచ్చిపాలవలే కనిపించింది నాకు.

"వాళ్ళంతా తెగించారు ఆనంద్! నామాట విను" అన్నాను.

"మీరు కొలిచే దేవుడు వచ్చినా వినను. తెగించి ఏం చేస్తారు? విషయం చెప్పు? నువ్వుకూడా వారిలో చేరిపోయావా?"

"ఆనంద్...." అరిచాను.

"నీవు ఒక్కడవు నావైపు వుంటేచాలు. చూడు రావ్, మనిషి ఎంత సంపాదించినా వెంట తీసుకుపోయేది ఏంలేదు. న్యాయంగా ఆలోచించవేం?" అన్నాడు.

"నేనొక్కడిని ఆలోచిస్తే ఏమవుతుంది? ఆనంద్ స్నేహితుడిగా, లలిత అన్నగా నిన్ను అర్థిస్తున్నాను. నువ్వు సెలవపెట్టి వెళ్ళిపో.... వెళ్ళిపో...." రెండు చేతులు పట్టుకుని ప్రతిమాలాను.

"రావ్! మీరేనా మగాళ్ళు? అసలు నన్నేం అనుకుంటున్నారు? గాజులు పెట్టుకున్న అమ్మాయి ననుకుంటున్నారా?" అన్నాడు రోషంగా.

ఆ విషయంలో ఏం మాట్లాడినా తను నా ముఖం చూడనన్నాడు. ఇక లాభంలేదు, పిలుచుకుని ఎప్పుడో లలితమ్మకే చెప్పాలి. ప్రేమతో ఆమె సాధిస్తుంది అనుకుని వచ్చేశాను. ఆ కాళరాత్రి నేను మిగిలిన కంట్రాక్టర్స్ దగ్గరకు వెళ్ళి ఏదో చెప్పి! అతను దారికి వస్తున్నాడని అబద్ధం ఆడితే ఆనంద్ బ్రతికేవాడే. నా బసకు వెళ్ళి చిత్తుగా త్రాగి, మత్తుగా పడుకున్నాను. మర్నాడు నా దగ్గరున్న పనివాడు నా ముఖాన

నీళ్ళు చల్లాడు.

"ఏమిట్రా గాడిద....." అంటూ లేచాను. వాడు క చూశాడు.

"అయ్యా! ఆ రెడ్డి జీపుడ్రయివచేసొచ్చాడు. ఈ రోజుల్లో బాబు పీడపోతుందన్నాడు. నాకు భయంగా ఉందయ్యా" అన్నాడు మంద. వెంటనే నోరు పుక్కిలించి స్నానం చెయ్యగానే వెళ్ళాను. వెళ్ళేసరికి యాక్సిడెంటు అయింది. అది కావాలని జరిగిందని నాకు కాని ఏం చేయలేని అసహాయస్థితి. ఆ నిముషంలో మాట్లాడితే బాబు ప్రాణానికేముప్పు. అందుకే అతడిని తీసుకుని హాస్పత్రికి పరుగె లాభం లేకపోయింది. మళ్ళీ వచ్చి భార్యను తీసుకువెళ్ళాను. లలిత చూస్తే కడుపు తరుక్కుపోయింది.

వాళ్ళందరినీ ఒక్కసారి చంపేయాలనిపించింది. ఆనంద నిర్లక్ష్యంవల్ల చనిపోయాడన్నది నన్ను కృంగదీస్తుంది. నేనేం చేయ అమాయకురాలిని ఎలా ఓదార్చను? నా ద్రిష్టే కొట్టివుంటుంది. ఆ చూచిన ప్రతివారూ ఒక నిముషం ఆగిపోవటం నేనెరుగనిది కాదు, తుడా! నా త్రాగుడు ఎంత అనర్థం సృష్టించింది! ఏ అందాన్ని వాడినో ఆ అందాన్ని చేతులారా బూడిదచేసి వచ్చాను.

....ఉన్మాదిలా రెడ్డి, లాల్ కూర్చున్నచోటికి వెళ్ళాను. ఎంతగా నటించారు! 'నిజంగా చంపాలని మా ఉద్దేశం కాదు రావ్. కాలో, చెయ్యో విరగగొట్టి ఆరునెలలు హాస్పత్రిలో వేద్దాం అను అనుకోకుండా ప్రమాదం జరిగింది' అన్నారు. 'మీరు నీచులు, రాక్షసులు....' కసిగా తిట్టాను. వాళ్ళ గురించి పోలీసులకు చెబు బెదిరించాను. పిచ్చిగా తిరిగాను. వాళ్ళు చాలా పకడ్బందీగా ఏర్పాటు ఎవరూ సాక్ష్యం ఇవ్వరు.

ఆనంద్‌బాబు స్థలంలో రామనాథంగారు వచ్చారని విని పోయాను. నాకు తెలుసు. కోర్టులో ఎవరూ నిరూపించలేనంత పకడ్బ చేశారు. నేను చేసే అల్లరి, ఆగడం భరించలేక ఒక ఒప్పందానికి లక్షరూపాయలు ఆనంద్‌బాబు పేర బాంక్‌లో వేస్తాం కంపెన్సేషన్, గ



చెయ్యొద్దన్నారు. నేను గొడవచేసినా వారికి వచ్చిన నష్టం ఏమీలేదు. ఆ లక్ష ఖర్చుపెట్టి ఏదయినా చెయ్యగలం అన్నారు. అది విని నాకు మతి పోయింది. నేను ఆలోచిస్తుండగా ఆనంద్‌బాబు అన్నల జవాబు వచ్చింది. 'తమ్ముడు తమని సంప్రదించి వివాహం చేసుకోలేదు కాబట్టి తమ బాధ్యత లేదని' వ్రాశారు. నేను మా మామ, భార్యపై ఆధారపడినవాడినే. అందుకే ఆ డబ్బు తీసుకున్నాను. పిల్లల బాధ్యత తీసుకున్నాను. లలితమ్మకీ విషయం చెప్పాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను. కాని ఆమె ప్రాణం వదులుతుంది గాని, ఈ డబ్బు తీసుకోదని తెలుసు. ఇది పంతాలకు, పట్టింపులకు సమయం కాదు. పసిబిడ్డల భవిష్యత్తు దృష్టిలో వుంచుకుని నేనో నిర్ణయానికి వచ్చాను. మనసు శాంతించింది. అదేరోజు వెళ్ళి ఆనంద్ అస్తికలు నెత్తిన ఉంచుకుని, 'ఆనంద్! బ్రతికివుండగా నీ కోర్కె తీర్చలేకపోయాను. నీ మరణానికి కారణమైన ఈ మద్యాన్ని ముట్టను' అంటుంటే నా తల పగిలి కారినట్టు కన్నీరు కారింది. ఆనంద్ జ్ఞాపకార్థం నాకు వున్న ఒక్క పాస్ట్ టైమ్ వదిలివేశాను. ఒంటరితనం, ఆనంద్ మరణం నన్ను కాల్చుకుతినేది. పిచ్చివాడినయిపోతానేమోనని భయం పట్టుకుంది...." అంజని కంటినుండి కారిన నీరు అక్షరాలపై పడి అలుక్కుపోయినట్టు అయింది.

ఆమె కళ్ళు వొత్తుకుంది.

ఆ తరువాత లెక్కలు, కలవవలసిన మనుషుల లిస్ట్ వుంది.

"నా మనసు కాస్త కుదుటపడింది. రోజా నేను, ఆనంద్ కలిసి తిరిగేచోట్ల తిరిగి వస్తేగాని మనశ్శాంతి దొరికేదికాదు. ఆ రోజు మా బంధువు మామ వరస అయిన అతని టెలిగ్రాం వచ్చింది. అత్త పోయిందట. వాళ్ళు చాలా బీదస్థితిలో వున్నారు. వెళ్ళి డబ్బిచ్చి అంతా చేయించాను. కాని అత్త వదిలిపోయిన ఊర్మిళను ఏం చేయాలో తోచలేదు. ఆ రెండు కళ్ళు నన్ను వెంటాడుతున్నట్టే వున్నాయి." మళ్ళీ కొన్ని పేజీల గ్యాప్, ఆ సంవత్సరం విశేషాలు ఏమీ లేవు.

"....నాకు తెలియదు లాల్, రెడ్డికి రామనాథం బెదిరింపులు ఎక్కువయ్యాయి, నా ఎదురుగానే బాలరాజు అందరినీ ఎదిరిస్తున్నాడు. అప్పను

ఆనంద్ స్వభావం అలాంటిది. అందరూ ప్రేమిస్తారు. అనుకున్నాను
చేతిలో దోషులుగా చిక్కినంత దురదృష్టం ఇంకొకటి లేదేమో. ఒక్క
తప్పు చేసినవాడు తలెత్తుకు తిరగలేదేమో, పైగా ఆ తప్పు
వెంటాడుతుంటే, చిరాకు, కోపం ఎక్కువవుతాయి. ఆ చిరాకు
మీద ప్రదర్శించాను. నన్నూ ఆ కోవలోనే చేర్చి బాలరాజు అన
వాడు. ఆ రోజు మరో భయంకరమైన సంఘటన జరిగిపోయింది.
వుండగానే మిమ్మల్ని ఒక్కొక్కరిని చంపుతానని బాలరాజు శపథం
రామనాథం చెయ్యి చేసుకున్నాడు. అతను శాపనార్థాలు పెట్టి వెళ్ళిపో
మందు పార్టీ అంటూ నన్ను కవ్వించారు. నా మందుతోనే
తిలోదకాలిచ్చానని చెప్పాను. నేను ఇంటికి వెళ్ళిన గంటకే రామ
మరణవార్త అందింది. నాకు మతిపోయింది. అతన్ని ఎవరో కసిగా
చంపారు. పిస్టల్, తుపాకీ ఉపయోగించలేదు. బాలరాజుకే బలమైన
అవకాశం వున్నాయి. పోలీసులు ప్రశ్నించినప్పుడు నేను విన్నది చె
దాంతో బాలరాజుకు శిక్ష పడింది. బాధపడటం తప్ప ఏం చేయలేకపో
ఆవేశంలో ఏం చేశాడో అతనికే తెలియలేదు."

అంతే రాసివుంది.

అంజని గాఢంగా నిట్టూర్చింది. ఆమె తలపై నుండి పెద్ద
దిగింది. తన తండ్రి తనతో అబద్ధం చెప్పాడు. అయినా డైరీలు
అంతరంగానికి ప్రతిబింబాలు. శ్రీహర్షకు ఫోన్ చేయాలని ఫోన్
వచ్చింది. అప్పుడు గుర్తుకువచ్చింది శ్రీహర్షకు ఫోన్‌లేదని.
స్నేహితునితో వుంటున్నాడని. నిట్టూర్పు వదిలి వెనక్కు వచ్చింది.
తండ్రి డైరీలు తిరగవేసింది. తన తల్లి ఊర్మిళ ప్రవేశం వరకు
ఆ తర్వాత లెక్కలు, ముఖ్యమైన కార్యక్రమాలు నోట్‌చేసి వున్నా
బాలరాజుకు మతిపోయింది. తన తండ్రి హంతకుడు కాడు.
తీసుకువెళ్ళి ఆయన్ని నిలదీస్తాను. ఏమనుకున్నాడో అసలు....కళ్ళు
కుని బయటికి వచ్చి, వంటావిడచేత టీ తెప్పించుకుని త్రాగింది.

"నాన్నా...." అంటూ క్రిందికి వచ్చింది. కోటేశ్వరరావు
బయటకు వెళ్ళాడు. తన ఆనందం ఎవరితోనైనా పంచుకుంటే తప్ప



వుండదేమో. ఆనందంతో తన గుండె బ్రద్దలౌతుంది. ఆమెకా క్షణంలో
విజయ గుర్తుకువచ్చింది. వడివడిగా వెళ్ళి ఫోన్ తిప్పింది.

"హల్లో...." అవతలి కంఠం వింటూనే ఫోన్ పెట్టేసింది.

ఎంతమందిలో వున్నా గుర్తించగలదు. అది లలితమ్మ కంఠం. ఆశా
భంగం కలిగినట్లు కూర్చుండిపోయింది.

8

విజయ లోకల్‌గా ప్రింటయ్యే ఒక వార్తాపత్రిక పట్టుకుని, దాన్ని
పరిశీలనగా చూస్తూ కూర్చుంది. దాదాపు రోజు విడిచి, రోజు ఆ పత్రికలో
భర్త ఫోటో వస్తుంది.

"మమ్మీ! నీ ఫోటో రాదేం మమ్మీ?" స్వీటీ వచ్చి ప్రశ్నించింది.
పిల్లముందు తను బయటపడితే వాళ్ళకి ఆసక్తి పెరుగుతుంది. అందుకే
వార్తాపత్రిక ప్రక్కన పడేసి కూతుర్ని దగ్గరగా తీసుకుంది.

"స్వీటీ! నీవు ఎ, బి, సి, డి లు అన్నీ నేర్చుకున్నావా?"

"ఓ యస్ మమ్మీ! అప్పుడప్పుడు అప్పగించేశాను. అదిగో డాడీ....
తల్లి చేతులు తప్పించి రాజశేఖర్ పైకి దూకింది. అతను కూతురు చేతిలో
క్యాడ్‌బరీస్ పెట్టాడు. ఆమె రెండు బుగ్గలు ముద్దుపెట్టుకున్నాడు.

విజయ భర్తను కొత్తగా, చిత్రంగా చూసింది.

"ఏమిటోయ్! అంత ముద్దుగా వున్నానా కళ్ళు వెడల్పుచేసి మరీ
చూస్తున్నావ్?" వచ్చి ఆమె ప్రక్కన సోఫాలో కూర్చున్నాడు.

ఆమె నోరు విప్పలేదు. చిన్నగా మందహాసం చేసింది.

"విజ్జీ...." అతడామె నడుంచుట్టూ చెయ్యివేశాడు.

"ఇది హాలు! పడకగది కాదు" గుసగుసలాడింది విజయ.

"ఇంట్లో ఏమూలయినా సరసాలు ఆడవచ్చునని, భర్తకు ఒక్కడికే
లైసెన్సు వుంది డియర్! ఏమిటీమధ్య గంభీరముద్రలు ఎక్కువగా చూపు
తున్నావ్? ఇదంతా తమ్ముడి గురించి బెంగేనా?"

"ఉండదా నాయనా? తండ్రిలేక, ఒకరికి ఒకరుగా పెరిగారు" అంటూ
లలితమ్మ అల్లుడి ముందు మంచినీళ్ళు, కాఫీ పెట్టింది.

"ఉండకూడదని అనటం లేదత్తయ్యా! నన్ను నిర్లక్ష్యం చేస్తు అంటున్నాను. ఇదివరలో నవ్వుతు నిర్వచనంగా వుండేది లేదా అమ్మాయి? గంభీరముద్రలు, వేడినిట్టూర్పులు భరించలేకుండా వున్నా" అన్నాడు. దానికి కూడా విజయ రియాక్టు అవలేదు.

"చూశారా! వాగి, వాగి వాడే వూరుకుంటాడని జవాబు చెప్ప లేదు" అత్తగారితో ఫిర్యాదు చేశాడు.

ఆమె ముసిముసిగా నవ్వింది.

"నా పిల్ల తండ్రిలేక, ఏదో నా పెంపకంలో పెంకిగా అయ మన్నించు నాయనా!" అందామె.

"ఛ....ఛ అవేం మాటలండీ! సరదాకంటే మీరు సీరియస్ మాట్లాడుతున్నారు?" కాఫీ తీసుకుని రాజా నవ్వేశాడు.

"రాజా! మనం పిక్చర్‌కు వెళదామా?"

"అహా! నేడెంత సుదినం! నా జన్మ తరించింది. దేవి కరుణించి బందాహాజరు" అతను లేచి తయారయి వచ్చాడు.

"విజ్జూ లే, తయారవ్వు" అన్నాడు.

"ఇంకేం తయారు? పదండి" లేచింది విజయ.

అతను ఆగిపోయాడు. విజయ మామూలు కటావ్ వాయిల్‌చీర క కుంది. వదులుగా ముడి చుట్టుకుంది. నల్లని చుక్కబొట్టు తప్ప చేతుల అలంకారాలు లేవు. గాజులు కూడా తీసివేస్తుంది హాస్పటల్‌కి వెళ

"విజయా! వెళ్ళి చీర మార్చుకురా" అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్టు.

"రాజా! ఎవరయినా నా గురించి అడిగితే మా పనిమనిషని చెప్పు" అంది అసహనంగా.

రాజా పకపక నవ్వేశాడు.

"విజ్జూ! అందరూ నువ్వెంత ఇస్తావో ఆ జీతానికి రెట్టింపు యిస్తాను. ఆ పనిమనిషిని మాకు పంపించు అంటారు" అన్నాడు అర్థ చూస్తూ. విజయ కోపం కరిగిపోయింది.

ఆమె చిన్నగా నవ్వింది.

"నాకు బట్టలు మార్చుకునే ఓపికలేదు రాజా!" అని పర్సు తీసి



లకు గాజులు ఎక్కించుకుంది.

"ఈ కాలం పిల్లలకు అంతా తొందరే. ఉద్యోగం లేదని వాడిని ఎవరన్నా పోరారా? బెంగుళూరులో అటువంటి ఉద్యోగం చూసుకున్నాడట. మా హర్ష వస్తానురా అంటే, తనే హోటల్లో వుంటున్నాడట" లలితమ్మ ఎవరితోనో అంటోంది. "ఏం అల్లరి చేసినా యిప్పుడేగా? ఉండనియ్యండి" అంటోందామె.

ఆమె ఎదురింట్లో దిగిన మ్యూజిక్ టీచరు.

"వారికోసమేనమ్మా నేను జీవిస్తోంది. కాని అమ్మాయి హోటల్లో ఒంటరిగా వుంటుందని నా భయం" అంది లలితమ్మ.

"మొన్న మీ వియ్యంకుడు, కోడలు కోటిలో కనిపించారు" అన్నదామె. విజయ గుండెల్లో రాయిపడింది.

"మీరెవర్ని చూసి ఎవరనుకుంటున్నారో. అన్నయ్య ఊళ్ళోకి వస్తే నన్ను చూడకుండా ఇంటికి వెళ్ళడు" లలితమ్మ తేలికగా తీసిపారేసింది.

ఆ క్షణం గండం గడిచినా, ఇది దినదినగండంలాంటి సమస్య. ఎలా పరిష్కరించాలో అర్థంకాలేదు.

"విజ్జూ!" బయటనుండి రాజశేఖర్ కేక వినిపించింది.

విజయ సర్దుకుని బయటికి వచ్చింది. స్కూటర్ ఎక్కి కూర్చుంది.

"రాజా! మనం సినిమాకు వెళ్ళటంలేదు. ఇందిరాపార్కుకు వెళుతున్నాము" అంది విజయ.

"ఆడవారి మాటలకు అర్థాలు వేరులే."

"రాజా! నీ జోకులు కేకుల్లా రుచిగా వున్నాయనుకునే మూడ్‌లో లేను" అంది కాస్త కోపంగా.

"ఏం జరిగింది విజ్జూ?" అన్నాడు. ఆమె జవాబు చెప్పలేదు.

మరో అయిదారు నిముషాలకు స్కూటరు ఇందిరాపార్కు ముందాగింది. ఇద్దరూ దిగారు.

ఇద్దరూ అడుగులు కొలుస్తున్నట్టు వెళ్ళి ఒకచోట కూర్చున్నారు.

"కారాలు మిరియాలు నూరుకున్నావ్? ఏమిటో యిప్పుడు చెప్పు?" అన్నాడు రాజా.

"మీరు మా ప్రొఫెసర్ దగ్గరకు వెళ్ళి హాస్పిటల్ హాస్పి ఉన్నట్టు, ఇరవై తారీఖున అతనికి ప్రమాదంగా వున్నట్లు సర్టిఫికెట్లు కున్నారు కదూ?" తీక్షణంగా చూసింది.

"నీకెవరు చెప్పారు? అలాంటి సర్టిఫికెట్లు రోజుకెన్నో యిస్తారు ప్రొఫెసర్" అన్నాడు నిర్లక్ష్యంగా.

"మా ప్రొఫెసరు ఎన్ని సర్టిఫికెట్లు ఇస్తాడో నాకు అనవస రాజా! నేనడుగుతున్నది నువ్వు సర్టిఫికెట్ తెచ్చావా లేదా అని?" నిల పట్టు అడిగింది.

"తెచ్చాను. ఇప్పుడేమైంది? ఆ రోజు అక్కడ దొమ్మీ జరిగిం కూలీలు హాస్పెల్‌తో గొడవపడ్డారు. అతను అక్కడున్నాడంటే పోలీసు డబ్బు గుంజాలని చూస్తారు అందుకే...."

"అందుకు చేశావో, ఎందుకు చేశావో నాకనవసరం. నా పే వాడుకోవద్దని చెబుతున్నాను" అంది కోపంగా.

"విజ్జీ! నీ పేరు చెప్పకపోతే ఓ వందో, రెండువందలో ఖర్చుపెట్టే వారము" అన్నాడు నిర్లక్ష్యంగా.

"ఆ రెండువందలు కూలీలకు ఇస్తేపోలా?" అంది.

"విజ్జీ! నీ ఆశయాలు అనుకోవటానికి తేలికగా వుంటాయి. ఆచ రించటానికి బరువుగా వుంటాయి. వెధవలకు ఇలా చిన్న చిన్న విషయా లలో డబ్బులివ్వటం అలవాటుచేస్తే ఎందుకు పనికివస్తారు? మేము క కాంట్రాక్టు కట్టిపెట్టి, ఇంట్లో కూర్చోవాల" అన్నాడు విసురుగా.

"ఓహో! చాలా ఎదిగిపోయారు రాజా!" అంది. ఆమెకు భర్తను చూస్తే, కోపమూ, జాలి ఒక్కసారిగా వస్తున్నాయి.

"అవును! ఎదిగిపోయాను. ఎదిగిపోతాను. నలుగురూ నడిచే దారిన నడుస్తాను" అన్నాడు.

విజయ అతనివంక ఆశ్చర్యంగా చూసింది. అతను ఉద్యోగం వది ఇంజనీరింగ్ కాలేజీలో వచ్చిన లెక్చరర్ పోస్ట ఆఫర్ వదిలి, కంట్రాక్టరుగా పేరు రిజిష్టరు చేయించుకున్ననాడు ఏమన్నాడు?

"విజ్జీ! కంట్రాక్టర్లు అనగానే రక్తంపీల్చి డబ్బుచేర్చే మనుషుల



కనిపిస్తారు. దాన్ని తలక్రిందులుచేసి, ఇక్కడ నీతిగా, నిజాయితీగా వుండొచ్చని నిరూపిస్తాను" అన్న రాజశేఖరమేనా?

న్యాయాన్ని కొనలేని, అమ్మలేని అమాయకులకు అన్యాయం చేసి, అబద్ధపు సాక్ష్యం పుట్టిస్తున్నాడు. ఇదెంత అన్యాయం?

తను అతడిని రెండుమూడు విషయాలు అడుగుదామనుకుంది. కాని జవాబు ఆమెకు తెలుసు.

ఆరోజు భర్త స్కూటర్ రాక బస్సులో వస్తుంది. ఇద్దరమ్మాయిల సంభాషణ విన్నది.

"పేపర్ తెరిస్తే చాలే, సాంస్కృతిక కార్యక్రమాలలో ఈ పిచ్చి వాడి ఫోటో వుంటుంది" అన్నదో యువతి.

"వాడు పిచ్చివాడా! ఛ....ఛ....టై, సూటు, బూటు ఎంత అందంగా వున్నాడో" అన్నది రెండో అమ్మాయి.

"అందమా పాడా! వేషాలు. డబ్బుందికదా అని రోజూ ఫోటోలు పేపర్లో వేయించుకోవటమేనా? అసలీ ఎడిటర్స్‌కి బుద్ధిలేదు" అంటుందా యువతి.

కుతూహలంగా ముందుకు వంగి వాళ్ళిద్దరి తలల మధ్యగా వార్తాపత్రిక చూసిన విజయ ముఖం పాలిపోయింది. ఆ ఫోటోలో వున్నది మరెవరో కాదు, తన భర్త. తను అమితంగా ఆరాధించే భర్త.

సాంస్కృతిక సంఘాలవారి సంగతి తనకు బాగా తెలుసు. డబ్బు ఇచ్చేవాడున్నాడంటే ఇంద్రుడు, చంద్రుడు అంటూ కాకా పడతారు. కొంచెం పొరపాటు దొర్లితే చాలు, తిరిగి ముఖం చూడరు వాటికి తన భర్త రాజపోషకుడు కదా!

తన కొలీగ్, తనతోపాటు పోస్టుగ్రాడ్యుయేషన్ చేసిన ప్రమీల కనిపించింది.

"ఏమిటోయ్! ఇంపోర్టెడ్ కారు కొని నాకు చెప్పవా?"

"ఇంపోర్టెడ్ కారు కాదే తల్లీ, ఇండియాలో దొరికే ఫియెట్ కూడా కొనలేదు ఇప్పుడే. అయినా నేను కారు కొన్నట్టు నీకు కలకాని వచ్చిందా?"

విజయ నవ్వింది.

"సంగనాచి, తుంగబుర్రవిషకిరి. మా అమ్మ దాక్టరుని, లావు... మాట్లాడక బావుండదు. స్వయంగా మీవారు....శ్రీవారు, ఆ కారు తీసి... ఏరోపోర్టుకు వచ్చి, సినిమాతార చిత్రగారిని రిసీవ్ చేసుకుని బ్లూ మూ... తీసుకువెళ్ళారు" అన్నది.

ఈసారి విజయ పకపకా నవ్వింది.

"అబ్బబ్బ! ఏం కథచెప్పావే తల్లీ! ఆ కారు ఏ నిర్మాతదో... వుంటుంది. అందులో మావారు ఎక్కి వుంటారు...."

"కాదు....కాదు! ఇదిగో చిత్ర నిర్మాతల ఆహ్వానంమీద రా... మా తమ్ముడు మెంబరుగా వున్న అసోసియేషన్‌వాళ్ళు పిలిస్తే వచ్చి... మీవారు కమిటీ ఛైర్మన్. వారే స్వయంగా" చెప్పారు అన్నది.

"జోక్‌చేసి వుంటారు" అని కొట్టిపారేసింది.

మర్నాడు మరో దాక్టరు చెప్పారు! రాజశేఖర్ కార్లో తిరుగుతు...డని. ఆ కారెక్కడిదో అర్థంకాలేదు.

పదిరూపాయల ఎక్స్‌ట్రా పాకెట్‌మనీకోసం తాపత్రయపడే ... దగ్గర వందలకువందలుంటున్నాయి. ఏ సాంస్కృతికసంఘం కార్య... జరుపుకున్నా అక్కడ రాజశేఖరం వుంటున్నాడు.

"విజ్జూ! ఇలా మాట పలుకు లేకుండా కూర్చుందామనే ... ఇక్కడికి రమ్మన్నావా? రాజశేఖరం గట్టిగా అరిచేసరికి తేరు... విజయ.

"కాదు రాజా! కొన్ని విషయాలు అమ్మ వినకూడదని ఇక్క... రమ్మన్నాను. ఒకవంక శ్రీహర్ష అలా వుంటే, రెండోవంక మనం పో... కోవటం అంత మంచిది కాదేమో...."

"ఇంకా ఏమయినా అడిగేవి వున్నాయా?"

"ఉన్నాయికాని సక్రమమైన జవాబు వస్తుందని ఆశలేదు" అ... ఆమె ఎటో చూస్తూ.

"నేనేం అంత పిరికివాడినికాదు."

"అందుకే కాబోలు నాకు చెప్పకుండా దాచావు."



అదిరిపడ్డాడు రాజశేఖరం.

"విజ్జూ....నీకు....నీకెలా తెలిసింది?"

"ఎలా తెలుసు అన్నది కాదు ముఖ్యం. నిజమా, కాదా అన్నది కావాలి."

"నిజమే!" అన్నాడు రాజశేఖరం.

"సరే పదండి" లేచింది విజయ. అతను లేచాడు. ఆమెను అనుసరించి, స్కూటర్ వరకు వచ్చాడు.

"విజయా! ఒక పార్టీ అవసరం లేదనుకుని, ఇన్‌స్టాల్‌మెంట్‌పై ఇచ్చారు. అప్పు తీరాక నీకు చెబుదాం అనుకున్నాను" అన్నాడు.

విజయ యింకా అతను మనది కాదంటాడేమో, సరదాకు స్నేహితులదగ్గర తీసుకుని నడుపుకున్నానని అంటాడేమో! ఓ వార్నింగిచ్చి పంపుదామనుకుంది.

"చూడు రాజా! కారు, వాచి, రేడియోలాంటి వస్తువులు యిలా తీసుకోవడు. మనము రెండుమూడు సంవత్సరాలలో కొందాము" అని మృదు అని హెచ్చరించాలనుకుంది, అతను కారు కొన్నాననేసరికి హతాశురాలైపోయింది.

"రాజా!....నిజంగా....నిజంగా మీరామాట అంటున్నారా?"

"నిజమే" ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

విజయకు ఆవేశంలాంటిదే వచ్చింది. అతని చేయిపట్టి యిటు తిప్పింది.

"మీరేనా ఆ మాట అంటుంది? 'ఆపోక్‌లో మంచి హైబున్నాయి విజ్జూ! తీసుకోనా' అంటూ మీరు వేలకు వేలుపెట్టి కారుకొంటూ నాతో ఒక్కమాట చెప్పకూడదనుకొన్నారంటె, మీరు మారిపోయారనుకోవాల్సి వస్తుంది" అన్నది బాధగా.

"లేదు విజ్జీ....లేదు...." ఏదో చెప్పబోయాడు.

"వద్దండి....వద్దు. ఒక పొరపాటును కప్పిపుచ్చుకోవడానికి మీరు మరో నాలుగు అబద్ధాలు ఆడటం బాధగా వుంటుంది" అన్నది.

"మారే కాలాన్ని అర్థం చేసుకోమంటున్నాను విజ్జీ!"

"ప్రయత్నిస్తాను."

అతను స్కూటర్ తీశాడు. ఆమె ఎక్కింది. అలా అతని వెనుక కూర్చుని, అతను నడుముచుట్టూ చేయివేసి, అతని వీపుకు తల ఆనించి కూర్చుని, స్వర్గం అంటే ఇదేకాబోలు అనుకున్న సన్నివేశాలు ఎన్నో వున్నాయి. ఈరోజు అంత సన్నిహితంగా కూర్చోలేకపోయింది. దూరంగా పట్టుకుని కూర్చుంది.

ఇంట్లో విజయను దింపి అతను వెళ్ళిపోయాడు.

విజయ మెల్లగా ఇంట్లో అడుగుపెట్టింది. లలితమ్మ ఆశ్చర్యంగా చూసింది.

"సినిమాకు వెళతామన్నారుకదా?"

"టికెట్లు దొరకలేదమ్మా! మీరెక్కడికి బయలుదేరారు?"

"స్వీటీ స్నేహితురాలి పుట్టినరోజుట. మీరిద్దరూ బిజీగా వుంటారు. పసిది దానికేం తెలుసు? ఒకటే మారాము. తీసుకువెడుతున్నాను" అన్నది.

లలితమ్మ, స్వీటీ వెళ్ళిపోగానే విజయ కోటేశ్వరరావుకి ఫోన్ చేసింది.

"హల్లో మామయ్యా! నాపై నిష్ఠూరం వేస్తే నేను ఏం చేయను? ఇప్పుడు కోరేది ఒక్కటే. వాడు వాస్తవం గ్రహించేవరకు ఈ నాటకం ఆడక తప్పదు....మీరు ఎప్పటిలా రావాలి" అని ఫోను పెట్టేసింది.

ఆమెకు ఊహ తెలిసిన దగ్గరనుండి ఒకటే తపన. తను ఫస్టు మార్కులు తెచ్చుకోవాలనే ఆరాటపడేది. ఆర్థికపరమైన యిబ్బందులుగాని, ఆస్తులు పాస్తులులేవనిగాని ఆరాటపడలేదు. ఆ తరువాత తల్లి సంబంధం చూశాము అంటే, అతని రూపు, చదువు చూసింది నచ్చాయి. అతన్ని పరీక్షగా చూడటం, అతని అభిరుచులు ఏమిటో, తను ఎరుగదు. వివాహమయి, హనీమూన్‌నుండి రాగానే డ్యూటీలు, పేపర్స్, మళ్ళీ పోస్టుగ్రాడ్యుయేషన్ సీటుకోసం తపన, ఆమెకు భర్త ఆశయాలను ఎలా అర్థంచేసుకోవాలో అర్థంకాలేదు, ఆలోచిస్తూ కూర్చుండిపోయింది.

# 9

బెంగుళూరులో ఉద్యోగం దొరికింది శ్రీహర్షకు. మల్లేశ్వరములో ఒక చిన్న పోర్షను అద్దెకు దొరికింది. రెండుగదులు, ఒక చిన్న వంటిల్లు వుంది.

తల్లిని తీసుకొచ్చి నిశ్చింతగా వుండవచ్చుకాని, అంజని ఓ సమస్య అయి కూర్చుంది అతనిపాలిట.

వంటపని, ఇంటిపని అతనికి బాధలేదు. మరో నెలరోజులుపోతే బాలరాజు ఆరోగ్యం కుదుటుకుంటుంది. అతనువచ్చి తనదగ్గరుంటాడు. అంజనిని వదిలించుకోవచ్చు. కాని తల్లికెలా అర్థం చేయాలి? విద్యార్థిదశ ఎంత హాయిగా వుండేదో!

"అత్తయ్యా! మనుష్యులు ఎక్కడయినా, తోటిమనుష్యుల్ని మింగుతారా? పెద్దమ్మ 'అమ్మను మింగావు' అంటుంది" అని అమాయకంగా అడిగే ఓ పాప అతని కళ్ళముందు కనిపించింది.

"అబ్బా! అంజని–నువ్వు మనుషుల్నికాదు నా మనఃశాంతినే మింగేశావు" అని నుదురు రాసుకున్నాడు.

"యాకప్పా విచారం?" అని ప్రక్కన కాపురముండే గోవిందరాజన్ వచ్చాడు. అతను శ్రీహర్షతో పనిచేస్తాడు. అతనే ఇల్లు చూసింది.

"ఏంలేదు గోవింద్! మీ భోజనాలు అయ్యాయా?"

"భోజనం సాయంగాలమే చేస్తిమి. లైటు కాలిపోవును" అన్నాడు. శ్రీహర్షకు నవ్వు వచ్చింది. ఇప్పుడిప్పుడే ఈ విశాల ప్రపంచాన్ని చూస్తున్నానేమో అనిపించింది.

"నిమ్మ హేణతి....దేవా! కన్నడమే వస్తుంది. నీ పెండ్లామును తీసుకురా-నా పెండ్లామునకు తోడు వుంటుంది" అన్నాడు.

"మంచిది" అన్నాడు. అతను ఆ క్షణంలో ఒంటరిగా వదిలిపోతే బాగుండుననిపించింది కాని అతను వదిలితేనా?

"రెండు మంచాలెత్తిపెట్టు, ఓ భోజనాలబల్ల ఎత్తిపెట్టు...." అతని వాక్ప్రవాహానికి అడ్డు వుండదనుకుంటుండగా ఆపద్బాంధవిలా ఇంటివారి

అమ్మాయి వచ్చింది.

"శ్రీహర్ష అంకుల్! యువర్ లెటర్...." ఆమె నీరిరంగు [illegible] అతనిపైకి విసిరింది.

శ్రీహర్ష ఉత్తరం అందుకుని ఆశ్చర్యపోయాడు. ప్రమీ[illegible] చూచి అంజనికి తన అడ్రస్ ఎవరిచ్చారు? అక్కయ్యే అయివుం[illegible] ఉత్తరం విప్పాడు. తన తండ్రి నిర్దోషి అని విన్నపము. అతని చే[illegible] వణికాయి.

చదవాలా, చించి పోగులుపెట్టాలా అని ఆలోచిస్తూండగా, గో[illegible] రాజన్ పై అడ్రస్సు చూశాడు.

"అంజని, అంటే మా చెల్లాయి. అప్పుడూ ఎగిరిపోక అట్లవుంటే లేచి సామాన్లు ఎత్తిపెట్టి తయారుకా" అన్నాడు.

జవాబు చెప్పలేదు. లేచి మెల్లగా, గదిలోకి వెళ్ళాడు.

"జాబుకూడా రహస్యంగా చదువాలా? తెలివి...." అతను [illegible] వెళ్ళిపోయాడు.

శ్రీహర్ష తేలికగా నిట్టూర్చాడు. ప్లాస్టిక్‌వైరు అల్లిన కు[illegible] ఒకటి కొన్నాడు. దానిపై నడుమువాల్చి ఉత్తరము విప్పాడు.

"బావా....!

నాకు తెలుసు. నా తాలూకు మనుషులన్నా, నేనన్నా మీకు [illegible] వస్తుందని. నేను రేపు రాత్రికి బయలుదేరి ఎల్లుండి వస్తున్నాను. [illegible] లాండ్స్‌లో దిగుతున్నాము. సరాసరివచ్చి, మన యిల్లు అంటూ చూచు[illegible] అదృష్టంలేదు. సమూహంలో అన్నీ మీ నిర్ణయమే నాకు శాసనము.

—నీ అంజు."

ఆ ఉత్తరంలో విన్నపాలు, వేడుకోలు వుంటాయనుకున్నాడు. [illegible] ఎంత నిబ్బరంగా రాసింది ఉత్తరం.

"అంజూ!" అతని హృదయం ఆక్రోశించింది.

ఉత్తరంలో తేదీ చూచాడు. అదేరాత్రి బయలుదేరుతున్నా[illegible] మాట. తెల్లవారితే బెంగుళూరులో వుంటారు. ఎలా ఆహ్వానించగల[illegible] కోటేశ్వరరావు ఎదురుపడితే గొంతునొక్కకుండా వుండగలడా?



కర్రైతే పెంచేస్తారు ?

"తమ్ముడూ! ఉత్తరమొచ్చిందటగా? రెండురోజులు నువ్వేం వంటా వార్పు పెట్టుకోకు. అంతా మా ఇంట్లోనే" రాజన్ భార్య కోమల వచ్చి చెప్పింది.

"ఎందుకండి హోటలుందిగా" ఒకనాటి సంఘటన గుర్తు తెచ్చుకుని అన్నాడు.

"అదేం కుదరదప్పా! పద...." ఆమె లాక్కుపోయినంత పని చేసింది. శ్రీహర్షకు వెళ్ళక తప్పలేదు. ఆరోజు ఏదో పండుగకూడాను. గోవిందరాజన్ ఇంట్లో మీరెప్పుడు అడిగినా 'అన్నసారు' అంటూ ఉదయం చెబుతారు. 'సారుఅన్న' అని సాయంత్రం చెబుతారు. భార్యాభర్తలిద్దరికి భోజనంమీద ఖర్చుపెట్టటం శుద్ధ దండుగ అని తెలుసు అంటాడు.

"ఏమప్పా! అన్నసారు నిమ్మ ఉరగాయ వున్నది. రెండు ఉల్లిగడ్డలు సరిలేదా?" కోమల అడిగింది. పండుగరోజు 'అన్నసారేనా' అని ఆశ్చర్యపోయాడు.

"ఉల్లిగడ్డ భయమే. ఆ అన్నసారే వడ్డించు" అన్నాడు గోవింద-రాజన్.

శ్రీహర్ష ఆరోజు రుచులు, విటమిన్స్ అంటూ ఆలోచించే స్థితిలో లేడు. మరో రోజైతే ఇంటైరెస్టుగా ఓ బాణం వదిలేవాడు.

"మనవాళ్ళకు ఇంటి ప్రణాళికలను గూర్చి ఓ క్లాసు పెట్టాలోయ్! అటు భోజనానికి ఎంత, ఇటు బట్టలకెంత ఖర్చుపెట్టాలో తెలియజేయటానికి."

ఈరోజు అతని మూడ్స్ ఆఫ్ అయ్యాయి. అంజని ఆగమనము ఎలా ఎదుర్కోవాలో అర్థంకాలేదు అతనికి.

"ఏమప్పా! మజ్జిగ, నిమ్మ ఊరగాయ రుచికి, ఆరోగ్యానికి మంచిది" అన్నాడు.

"అయితే మీరు రోజూ తీసుకోండి. నా ఆరోగ్యానికేం ధోకా లేదు" అన్నాడు.

అతనికి వాళ్ళ కాఫీ త్రాగాలన్నా భయమే. గ్లాసులన్నీ కడిగి ఒక చోట పోసినట్టు వుంటుంది. ఉదయం ఆ కాఫీ అవాయిడ్ చెయ్యటానికి

తనకు కాఫీ అలవాటులేదని, వాళ్ళు చూస్తే ప్రమాదమని కాఫీ మానే
అతనికో సత్యం అర్థమైంది. మన జీవితం మనదే కాని మనం అను
స్వేచ్ఛ లేదని, మనిషి సంఘజీవి.

అతనొచ్చి ఇంట్లో పడుకున్నా నిదుర రాదు. ప్రతిచోట
అణువులో అంజని కనిపిస్తుంది. తను హైద్రాబాద్ బండెక్కేస్తే! ఎం
పలాయనవాదం. మళ్ళీ ఉత్తరం తీశాడు తండ్రి విషయం ఎక్క
కూతురు ప్రమాణం చేయమంటే అబద్ధం ఆడలేదని తెలుసు. నిజమే
వుంటాడు. ఇప్పుడెందుకు వస్తున్నట్టు. నిజం చెప్పి క్షమార్పణ కోర
కాబోలు! తనేనా అంత పిరికివాడు.

అతను స్టేషన్‌కి వెళ్ళాలని అలారమ్ పెట్టుకున్నాడు. కాని
స్యంగా నిదురపోవటంవలన మెలుకువరాలేదు. మర్నాడు అరున్నరకు మె
కువ వచ్చింది. కంగారుగాలేచి ముఖం కడుక్కున్నాడు. తనకి ఇష్టం
లేకపోయినా, అతను తనకు చదువు చెప్పించాడు. సమాజంలో ఓ
వసతి కల్పించాడు. అందుకయినా తను వెళ్ళి రిసీవ్ చేసుకోవాలి. త్వ
తయారై ఉడ్‌లాండ్స్ చేరుకున్నాడు. అతను రిసెప్షన్ దగ్గ
కోటేశ్వరరావు గురించి అడుగుతుండగానే 'బావా' అన్న కంఠం తీయ
రిస్తూ పిలిచింది.

అతను తల తిప్పాడు. అతని ఎదురుగా అంజని నిలబడి
అప్పుడే హోటల్‌కు వచ్చినట్లుంది. నలిగిన బట్టలు, చెదిరిన జుట్టు,
ర్తుగా వుంది. నుదుట దిద్దుకున్న ఎర్రని కుంకుమ చెదిరి బొట్టు కాని
వటంలా తయారయింది. కళ్ళకాటుక విస్తరించి, కళ్ళక్రిందవరకు ప్రా

"రా బావా! పైకి వెళదాం" అన్నది.

అతనామెను పరీక్షగా చూశాడు. అసలే సన్నగా బంగారుతీ
వుండేమనిషి, మరింత చిక్కిపోయింది. చక్కనమ్మ చిక్కినా అంద
అన్నట్లుంది.

"మీరు బాగా నల్లబడ్డారు" అన్నది.

"అంజూ!" ఆమె చేయి పట్టుకున్నాడు. అతనికి ఎన్నో చెప్పా
వుంది. కాని నోటమాటరాలేదు. ఆ చేయి పట్టుకుని నడుస్తుంటే, అన్నీ



ఎన్నో కబుర్లు చెబుతున్నట్టు ఫీలయ్యాడు.

"ఏంటి...." గది తలుపులు తీసింది. పులిబోనులోకి అడుగుపెడు తున్నట్టు అనిపించింది. కాని గదిలో ఎవరూ లేరు.

"మీ నాన్నగారు...." సంశయంగా చూశాడు.

"అవతలి గదిలో వున్నారు" అన్నది. ఆమె అణువణువు అతని స్పర్శతో పులకించిపోయినట్టు ఆమె తీరు చెబుతుంది. అతనికి బాధగానే వుంది. తను సమాగమం ఇంత నీరసంగా, నిశ్శబ్దంగా అయినందుకు. కాని అతనిముందు పదేపదే ఒక ఊహాచిత్రం కనిపించి- అది అతని తండ్రిది- పెళ్ళి హత్యాచారాలు చెయ్యకపోతే తనూ అందరిలా తండ్రిచాటు బిడ్డలా ఎంత ఉదాత్తంగా పెరిగేవాడు' తను మౌనంగా నిలబడటం చూచిన అంజని బాధపడింది.

"కూర్చోండి బావా!"

"ఊఁ...." అతను కూర్చున్నాడు.

"స్వీటీ మీకు తీపితీపి ముద్దులు పంపింది."

"ఏ పర్స్‌లో వేసింది?" నవ్వుతూ అడిగాడు.

"ఊహూ...." నా పెదవులపై అని చెప్పబోయేటంతలో గదిలోని ఫోన్ మ్రోగింది. విసుగ్గా ఫోనెత్తింది.

"వచ్చారు నాన్నా....ఉన్నారు. టిఫినా, లేదు, ఇప్పుడేగా వచ్చింది" కరిగిపోతున్న కాఠిన్యం శ్రీహర్ష గుండెల్లో మళ్ళీ పేరుకుపోయింది. అతని ముఖం జేవురించింది.

"బావా! కాఫీ వస్తుంది. ఐదునిమిషాలు ఈ మాగజైన్స్ చూస్తుండండి. నేను వచ్చేస్తాను" అని బాత్‌రూంలో దూరింది అంజని.

అతను గాఢంగా నిట్టూర్చాడు. పరిస్థితులు జీవితాన్ని ఎంత తారుమారు చేస్తాయి. తను ఏమనుకుని వివాహం చేసుకున్నాడు. తనదైన అంజని దూరంగా వుండవలసిన దుస్థితి. మూడు సంవత్సరాలక్రితం కాబోలు, ఒకరోజున విజయ పిక్చర్ ప్రోగ్రామ్ పెట్టింది. అంజని కూడా వచ్చింది.

"కాలేజీనుండి వచ్చినట్టున్నావ్ అంజూ, ముఖం కడుక్కోరాదూ"

అన్నది లలితమ్మ.

బాత్ రూమ్ వైపు వెళ్ళింది అంజని. తను ఉంగరం మరిచి పో తెచ్చుకుందామని వెళ్ళాడు. ఆమె ముఖంనిండా సబ్బు పట్టించి, చెంబ తడుముతుంది, అతను వెళ్ళి అల్లరిగా ఆమె ముందు నిలబడ్డాడు. ముతూ తన ముఖం రెండు చేతులతో పట్టుకుని, కెవ్వుమని, కళ్ళ సబ్బు నురుగు కళ్ళల్లోకి పోగానే "అబ్బా" అన్నది.

"ఏమయింది.....ఏమయిందే తల్లీ?" లలితమ్మ పరుగెత్తుకువచ్చే అప్పటికే కళ్ళు కడిగేసుకుంది అంజని.

"అబ్బ! చూడమ్మా నీ కోడలు అమాయకురాలు, వేలికి వే బేధం తెలియదు అంటావు. నా ముఖానికి సబ్బునురుగు పులిమింది చూ అన్నాడు అల్లరిగా నవ్వుతూ.

"ఈ వేషాలు నా దగ్గర వెయ్యకురా" ఆమె ముసిముసిగా నవ్వు మందలించింది.

ఈనాడు సరిగంగ స్నానాలు చేసినా తమనెవరూ అడగరుగానీ విచిత్రమైన నాటకం ఆడుతుంది.

"అంజూ! నీకు తండ్రి లేడనుకుని నాతో వచ్చెయ్, ఇద్దరం తీరాలకు వెళ్ళిపోదాము" అనబోయి పైకే అన్నాడు.

"ఏమిటండీ?" అంజని తల తుడుచుకుంటూ బయటికి వచ్చి అతను తన పొరపాటు తెలుసుకున్నాడు. ఆమె రెట్టించే అవకాశం రాకు వెయిటర్ కాఫీ తీసుకువచ్చాడు. అంజని తనే అందుకుని భర్తకిచ్చింది.

కాఫీ మౌనంగా అందుకున్నాడు.

"మీరు ఆఫీసుకు వెళ్ళాలా?"

అంజని ప్రశ్న విని తెల్లబోయాడు. ఎంత నిర్భయంగా, స్ప అడుగుతున్నది. ఒక్కమాటకు మూడుసార్లు తడుముకునే అంజని అన్న ఆశ్చర్యం కల్గింది.

తెగింపు మనిషికి ధైర్యసాహసాలు కల్గిస్తాయని మరిచిపో

"అవును చేరింది మొన్నమొన్నేగా సెలవు ఇవ్వరు."

"అయితే మధ్యాహ్నంగాని, సాయంత్రంగాని మాట్లాడుకుందా



అది, తన కప్పు తీసుకుని కాఫీ సిప్ చేస్తూ.

ఇద్దరిమధ్య మాటలు పెరగటంలేదుగాని, కాలం తిరుగుతుంది.

"బావా! ఫలహారం చేస్తారా? భోజనమా?"

అమాయకంగా, కళ్ళలో ఆరాధన నింపుకున్న అంజని అలా అడుగుతుంటే నిర్లక్ష్యం చేయలేకపోయాడు.

"భోజనం చేసి వెళతాను" అన్నాడు.

"అదే మంచిది, నేను భోజనంచేసి సాయంత్రం మీరొచ్చేవరకు పడుకుంటాను" అన్నది.

అతను తలాడించాడు.

అంజని లేచి భోజనానికి ఆర్డర్ చేసింది.

"బావా! వదిన వచ్చి చూసిపొమ్మని చెప్పిందండి" అన్నది అతి సహజంగా.

"ఈ ఆదివారం వెళతాను."

"ఏం? మేమీ ఊరు వచ్చామనా?"

"తెలివిమీరిపోతున్నావ్."

"పరిస్థితుల ప్రభావం కావచ్చు."

"ఓహో!"

"నేను మీకు ముందే చెప్పాను, మీ అంతట మీరు కోరేవరకు మీ నుండి నేను ఏమీ ఆశించనని. వదినగారిని చూడాలని వుంటే వెళ్ళండి. అంతేగాని నా సముఖంలో ఆదివారం గడపటం కష్టం అనుకోవద్దు" అన్నది.

అతను జవాబు చెప్పలేదు.

భోజనాలు వచ్చాయి. ఇద్దరూ మౌనంగా భోజనం ముగించారు.

శ్రీహర్ష ఆఫీసుకి వెళ్ళినా మనసు పనిమీద లగ్నం చేయలేకపోయాడు. అన్యమనస్కంగా సాయంత్రం వరకు గడిపాడు. అతని హృదయం పదేపదే అంజనిని కోరుకుంది.

ఆమెతో మాట్లాడాలని, ఆమె సన్నిధిలో అన్నీ మరిచిపోవాలని

వుంది. ఆమెను పదేపదే చూడాలని మనసు తహతహలాడుతుంది. అనుకున్నదానికంటే ముందే హోటల్ చేరాడు. తలుపు తట్టబో తలుపు తీసుకుని బైటికి వస్తున్నాడు కోటేశ్వరరావు.

"అంజూ! అబ్బాయ్ వచ్చే వేళయింది, నేను వెళ్ళిపోతా అనటం విన్నాడు. మాటన్న తరువాత మనిషిని చూశాడు.

పలకరిస్తే పౌరుషంగా మాట్లాడతాడేమోనని కోటేశ్వరరావు కరిస్తే ఏదో జవాబు చెప్పాలని శ్రీహర్ష అనుకున్నాడుగాని అనట చెప్పలేదు. ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

అతను తన గదిలోకి వెళ్ళాక శ్రీహర్ష అంజని గదిలోకొ

"ముఖం కడుక్కుంటారా? స్నానం చేస్తారా?"

"ముఖం కడుక్కుని వస్తాను" అని బాత్‌రూంలో దూరాడు. ఇల్లు తీసుకున్న దగ్గర్నుండి సరైన స్నానంలేదు. వేడినీళ్ళుండే స్నానం చెయ్యలేదు. స్టౌపై కాగేవరకు ఆగే తీరిక, ఓపిక లేవు. త్వరగా రెండు చెంబులు నీళ్ళు పోసుకుని బైటపడతాడు. వేడినీళ్ళ చూడగానే అందులోకి దిగిపోవాలనే కోరిక కల్గింది.

అంతే నీళ్ళప్పి షాంపూ పోసి టబ్బులో దిగిపోయాడు అతను యము, బయట అంజని ఎదురుచూస్తోందని కూడా మరిచిపోయి విశ్రాంతిగా ఒరిగాడు.

అంజని చాలాసేపు బైట అతనికోరకు చూసింది. అతను రాలేదు, పైగా నీళ్ళుపడిన శబ్దం కాపటంలేదు. ఏమైవుంటుంది?

ఆమె ఆగలేక తలుపు తోసింది. అతను అరమోడ్పు కన్ను చూస్తూ, నిశ్చలంగా నీళ్ళలో పడుకున్నాడు. సబ్బునురగ చేత్తో అటు ఇటు కదుపుకున్నాడు.

"బావా—" అంజని పకపక నవ్వింది.

అతను అప్పుడే స్పృహలోకి వచ్చినట్టు కళ్ళు పూర్తిగా చూశాడు.

"అంజూ!" ఆమె నవ్వుతుంటే మైమరిచి చూశాడు. ముత్యా ఉన్న పలువరస తళుక్కుమన్నది. అతను చెయ్యిపట్టి లాగాడు. ఆమె



టబ్‌లో పడింది. ఆమె తల అతని తలతో ఢీకొన్నది.

"అబ్బా!"

"సారీ...." అంటూనే అతని పెదవులు, ఆమె ముఖం, గొంతు పరామర్శించాయి. ఇద్దరూ ఈ లోకాన్నే మర్చిపోయారు.

"అంజూ...."

అతని చేతులు అప్రయత్నంగా ఆమె జాకెట్టును తడిమాయి.

ఇద్దరి మనసులు ఉద్రేకంతో వూగిపోతున్నాయి.

బయట బెల్ నిర్విరామంగా వినిపించింది.

"అంజూ....! ఎవరో చూడు, తొందరగా తడిబట్టలు మార్చుకో" అన్నాడు శ్రీహర్ష.

"ఊహూఁ....!" అతని మెడకు రెండు చేతుల్తో పెనవేసింది.

"వాళ్ళు మనకేమైందోనని తలుపులు విరగగొడతారు" అన్నాడు. అయిష్టంగా లేచి బట్టలు వదిలి పెద్దతుండు ఒంటినిండా చుట్టుకున్నది. కాలింగ్‌బెల్ ఆగిపోయింది. ఫోన్ మ్రోగింది.

విసుగ్గా ఫోనెత్తింది అంజని.

"ఏమిటి నాన్నగారూ! స్నానంచేస్తున్నాను" అన్నది.

ఆ మాటలు బాత్‌టబ్‌లో వున్న శ్రీహర్షకు వినిపించాయి. అతను ఒక్కసారి స్పృహ వచ్చినవాడిలా లేచాడు. గబగబా ఒళ్ళు తుడుచుకుని బట్టలు వేసుకున్నాడు.

తండ్రితో మాట్లాడటం ముగిశాక టీ ఆర్డర్ చేసి వచ్చింది అంజని. ఆమె బట్టలు మార్చుకుని తల తుడుచుకుంది.

"ఏమన్నాడు మీ నాన్న? నీతో అబద్ధం చెప్పాడా?" అతి మామూలుగా అడిగాడు శ్రీహర్ష.

"ఆయన మనసుకు ప్రతిబింబం అయిన డైరీలు చదవమని ఇచ్చారు" అన్నది ఆమె పొడిగా.

ఒక్క నిమిషంలో దొరికే అమృతం దొరకలేదు. తను దురదృష్ట వంతురాలు. ఆమె ఒక నిట్టూర్పు వదిలింది.

"టీ త్రాగి మనం చాముండేశ్వరి దేవాలయం చూచివద్దామా?"

అన్నది. అతను ఎందుకన్నట్టు చూశాడు.

"ఆలయ ప్రాంగణంలోనైనా నేను నిజం చెబుతానన్న నమ్మ కల్గించటానికి, అదీగాక నాన్నగారివెంట వచ్చి ఎప్పుడో చూశాను తిరి మీతో చూడాలని వున్నది. అక్కడినుండి చూస్తే పట్టణమంతా కనిపి అన్నది.

"సరే...." అన్నాడు పొడిగా. అంతటిలో టీ వచ్చింది.

# 10

ఇద్దరి ముందున్న కాఫీ చల్లారిపోయింది. కోటేశ్వరరావు లంఖణాలు చేసిన వ్యక్తిలా కూర్చున్నాడు. అంజని అతడిని చూస్తు చివరకు తనే మాట్లాడింది.

"నాన్నా! ఇక మీకు నేను, నాకు మీరు మిగిలాము. మీరు దూరమయితే బ్రతుకలేను నాన్నా! మీరు ధైర్యంగా వుండండి" అన్న బ్రతిమాలుతూ.

"ధైర్యం? ఇంకెక్కడి ధైర్యం అంజూ...." అతని కళ్ళ నీళ్ళు జలజల రాలాయి. అతనికి ఓ గట్టి నమ్మకం ఏర్పడింది. తన నైతి చదివితే మారిపోతాడని, తనను నిరాదరించిన కూతురిని స్వీకరిస్తా భావించాడు. కాని శ్రీహర్ష కఠినంగా వుండిపోయాడు. పైగా అసహ్యిం కున్నాడు.

"ఆ పాపిష్టి డబ్బుతో మాకు చదువులు చెప్పించావా! సిగ్గులే అంతకంటే మా గొంతులు నులిమి, మా నాన్నగారి చితిలో పడేస్తే సం షించేవారము" అన్నాడు రోషంగా.

"మా అమ్మ....ఆమె కోసం వూరుకున్నానుగాని లేకపోతే" అత పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"బాబూ!"

"అలా పిలవకండి. మిమ్మల్ని దేవుడనుకున్నాను. మీ డబ్బు



పిర్రైతే ఏంచేస్తారు ?

చదువుతున్నానని కృతజ్ఞత చూపాలనుకున్నాను. మా నాన్నను నిలువునా చంపిందేకాక, ఆయన ఆత్మను ఘోషించేలా లంచం తీసుకున్నారు. ఆయన క్షమలేనిపని చేశారు, అది జన్మ జన్మలకు మరిచిపోలేని విషయము" అన్నాడు కోపంగా.

"అదికాదు బాబూ! ఆ పరిస్థితి...."

"ఆ పరిస్థితిలో మా పెదనాన్నలు ఆదుకోలేదని తెలుసు. ఆదుకోక పోతే చనిపోయేవారమంతేగా? దానికి నాకేం బాధలేదు. ఆయన ఆశయాలకు విరుద్ధంగా ఆ డబ్బు తీసుకుని మమ్మల్ని చదివించి మీరేం ఘనకార్యం చెయ్యలేదు. నిలువునా హత్యచేశారు. అది మా అమ్మకూడా సహించదు. మీ అమ్మాయిని తీసుకెళ్ళి మీరేం చేసుకుంటారో మీ ఇష్టం. నేను మాత్రం ఈ విషయంలో ఎలాంటి సహాయము చెయ్యలేను" అన్నాడు ఎటోచూస్తూ. కోటేశ్వరరావు ముఖం చూడటం ఇష్టంలేనట్టు.

"బావా!" అంజని అదిరిపాటుగా చూసింది.

"అవును అంజనీ! చట్టరీత్యా విడాకులకు ప్రయత్నించే వాడిని. కాని అది అమ్మ సహించలేదు. అమ్మకు అసహ్యం కల్గించే పనులుచేసి, నువ్వే నా జీవితం నుండి తప్పుకో" అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్టు.

"తప్పుకోకపోతే?"

"నాన్నగారు ఎలాగూలేరు. అమ్మను దూరంచేసి పుణ్యం కట్టుకున్నా వాళ్ళౌతారు" అన్నాడు. నిర్లిప్తంగా అన్నా ఆ కంఠము తీక్షణంగా వుంది.

"నాన్నా! మీరు....మీరు నా గురించి వారితో తగవు పెట్టుకోవద్దు" అంజని ప్రతిమాలింది.

కోటేశ్వరరావు అసహాయంగా చూస్తూ వుండిపోయాడు. శ్రీహర్ష చరచర దిగి వెళ్ళిపోయాడు.

అంజని బలవంతంగా దుఃఖం దిగబట్టింది. ఆమెకు తెలుసు తన జీవిత సమరం ప్రారంభం అయిందని. శ్రీహర్ష వుండగా ఆర్డర్ చేసిన కాఫీ వచ్చింది. కాని తండ్రి కూతురు మౌనంగా కూర్చుండిపోయారు. కాఫీ చల్లారిపోయింది.

అంజని లేచివచ్చి తండ్రి పక్కన కూర్చుంది. ఆమెకు తండ్రి

గుర్తుకువస్తే గుండెల్లో బాకు దిగినట్టు వుంటుంది. ఆర్తిగా అతని ...
నిమిరింది.

"నాన్నా! ఇష్టంలేని కాపురం పొసగదు. మనం నిర్దోషుల మని ...
మనకు అన్యాయం జరుగదు" అన్నది ఓదార్పుగా, అంతకంటే పొందిక...
మాట్లాడటం ఆమెకురాదు.

"అంజూ! అమ్మా! తల్లీ ఏమాశించి ఈ వివాహంచేశాను. ...
జరిగిందమ్మా! నా దురదృష్టము నిన్ను కాల్చేస్తుందనుకోలేదు" అతను
ఆడపిల్లలా దుఃఖించాడు.

"ఛ....ఊరుకో నాన్నా!....ఊరుకో...." ఓదార్చింది.

ఆ పూట దుఃఖం మర్నాడులేదు. మర్నాటి దుఃఖం వారం రోజులు
లేదు. ఇద్దరూ బృందావన్ గార్డెన్స్, మైసూరు వెళ్ళి మహారాజా పాలె...
చూసివచ్చారు.

"అంజూ! హైద్రాబాద్ వెళ్ళిపోదామా?"

"నాన్నా! నేనొక్కమాట అడుగుతాను కోపంరాదుకదా?"

"కోపమా? నీపైనా?" ఆయన నీరసంగా నవ్వి ఆమె తల
నిమిరాడు.

"నాన్నా....నాన్నా...." తన విషయం చెప్పలేకపోయింది.

"భయందేనికి అంజూ?"

"అదికాదు నాన్నా! నేను హైద్రాబాదువస్తే ఎప్పుడో అప్పుడు
అత్తయ్య కంటపడక తప్పదు. నేను ఇక్కడే వుంటాను" అంది.

"ఇక్కడా? వుండి ఏం చేస్తావమ్మా?"

"నాన్నా! ఏదయినా కాలేజీలోచేరి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తాను,
లేదా ఉద్యోగం...." అన్నది జంకుతూ.

"నువ్వు....నువ్వు ఉద్యోగం చేస్తావా తల్లీ!" అతను కూతురి
తలను ఆర్తిగా గుండెల కదుముకున్నాడు.

"చేస్తే తప్పేమిటి నాన్నా! ఈ ప్రపంచం చాలా పెద్దది. ఎన్నో
విషయాలు తెలుసుకోవాలి" అన్నది.

మరో నాల్గురోజులు తర్జన భర్జన చేశాక ఆమెను చదివించటానికి



నిశ్చయించుకున్నాడు.

ఎం. ఎస్సీలో చేరే అవకాశములేదు. ఎం.ఏ. చేద్దామనుకుంది. ఆ
సాయంత్రం కోటేశ్వరరావు స్నేహితుడు వచ్చాడు. మాటల సందర్భంలో
అతనితో కూతురు చదువు విషయం చెప్పాడు.

"నన్నేం చేయమంటావ్ పుట్టన్నా?"

"బుద్ధిమంతురాలిలా చదువుకుంటానంటే వద్దనటం దేనికి? లా
చదివించు" అని కలహా యిచ్చాడు. అతను 'లా' కాలేజీలో ప్రొఫెసర్.
అతను చూసుకుంటానని హామీ యిచ్చాక అతని సలహా మేరకు శేషాద్రి
పురంలో వున్న ఓ 'లా' కాలేజీలో చేర్పించాడు అంజనిని.

కెంపగౌడ సర్కిల్‌లోనే రామయ్య ఫ్లాట్స్ వున్నాయి. అక్కడొక
చిన్న ఫ్లాట్ తీసుకుని అంజనిని వుంచేశాడు.

"హాస్టల్‌లో వుంటాను నాన్నా" అన్నది. ఈ బాదర బందీ యెందు
కని అంజని అభిప్రాయం.

"అప్పుడప్పుడు నేను వస్తుంటాను తల్లీ! మార్చినాటికి హైద్రాబాద్‌లో
నా పనులు ముగించుకుని వస్తాను. అక్కడ కాకుల్లా పొడిచే బంధువుల
మధ్య వుండలేను" అన్నాడాయన.

"మీ ఇష్టం నాన్నా...." అందామె.

అతను కావలసినవి కొనిచ్చి ప్రయాణం అయ్యాడు.

"వచ్చేటప్పుడు నువ్వు తోడున్నావని ప్రయాణం బోరుకాలే
దమ్మా! ఇప్పుడు ఫ్లయిట్‌లో వెళతాను" అన్నాడు.

"అలాగే నాన్నా!" అన్నదామె. పుట్టన్న కొడుకు టిక్కెట్లు కోసం
వెళ్ళాడు.

రెండు పడకగదులున్నాయి. డ్రాయింగ్ కమ్ డైనింగ్ రూమ్,
చిన్న వంటిల్లు వుంది. రెండు పడక గదులమధ్య బాత్‌రూమ్ వున్నది.
అంజనికి ఇల్లు అలంకరించాలని ఎంతో కుతూహలము. కాని, తనింట్లో
ఏనాడూ ఆ స్వేచ్ఛ దొరకలేదు. వివాహం కాగానే తనకు కట్టించి యిచ్చిన
ఇంటిని సర్దుకుందామనుకుంది. కాని విధి వక్రించింది. ఆమె గాఢంగా
నిట్టూర్చి, తనకు వచ్చిన ఇల్లు సర్దుకుంది. తండ్రిని పంపించింది అంజని.

"జాగ్రత్తమ్మా! ఎన్నడూ ఒంటరిగా వుండలేదు. వెళ్ళగానే ఫోన్ చేస్తాను. ప్రక్కనే ఇంజనీరుగారి ఫ్లాట్‌లో ఫోన్ వుంది. అయ చెప్పి వుంచాను పుట్టన్న. అవసరం అనుకుంటే నువ్వు చెయ్యి" అన్నా

"అలాగే నాన్నా! వెళ్ళి అత్తయ్యను పలుకరించు."

"అవునమ్మా వెళ్ళాలి. ఇన్నాళ్ళు ఆమెను చూడకుండా వుండలే న్నాడు తండ్రి.

టాక్సీ వెళ్ళిపోయింది. ఎయిర్‌పోర్టుకు వస్తానంటే వచ్చేటప్పు ఒంటరిగా రావాలి వద్దన్నాడు కోటేశ్వరరావు. తలుపులు వేసుకున్న క్ష నికి ఎలాంటి తెగింపు కలిగింది... అది నిర్వచించలేనిది. మనిషి తన ప్రయ త్నాలు అన్నీ విఫలమయ్యాక ఆఖరున అలవర్చుకునే తెగింపులాంటి కలిగింది. ఆమెకు ఎన్నో ఆలోచనలు వస్తాయి.

స్త్రీ జీవితంలో పురుషుడి పాత్ర అవసరమే కాని, అతను లేకపో జీవించకూడదా? అలా ఆలోచిస్తూ ఆ రాత్రి నిదురపోయింది. మర్నాడు ఉదయం లేచి ముఖం కడుక్కుంటుండగానే చాముండి వచ్చింది.

చాముండి పుట్టన్న కుదిర్చిన పనిమనిషి.

కాఫీపెట్టి తెచ్చింది. ఆ అమ్మాయికి తెలుగురాదు. అంజనికి కన్నడం రాదు. ఇద్దరూ తమకు వచ్చిన భాషలో మాట్లాడుతారు. అర్థంకాకపో మైమ్ చేయటమే.

"ఫోన్‌కాల్ ఫర్ యు...." ఓ పదమూడేళ్ళ అమ్మాయి వచ్చింది. ఆమెవెంట ప్రక్క ఫ్లాట్‌లోకి వెళ్ళి ఫోన్ అందుకుంది.

"బి సీటెడ్" ఆ అమ్మాయి మోడా జరిపింది.

తండ్రి ఫోన్ అది. రాత్రే చేద్దామనుకుంటే, అవతలివాళ్ళను కష్ట పెట్టినట్టు అవుతుందని చేయలేదట. జాగ్రత్తలు చెప్పాడు. అంజని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. అన్నింటికీ 'మంచిది నాన్నా' అంటూ తలాడిం ఫోన్ పెట్టేసింది.

"థాంక్యూ!" అని తలెత్తి ఆశ్చర్యంతో బిగుసుకుపోయింది. ఫ్లాట్ ఓనర్ వసంతరావుతో శ్రీహర్ష కూర్చుని వున్నాడు. అతను ఆశ్చర్యంతో అంజనినే చూస్తున్నాడు.



"హర్షా! అంజని అని పక్క ఫ్లాట్‌లో వుంటుంది. ఆమె లా కాలేజీలో చేరింది. తండ్రి పెద్ద కంట్రాక్టర్. మా జూనియర్, మీ తెలుగు వాడే" పరిచయం చేశాడు.

"ఓ....ఐసీ...." తల పంకించాడు శ్రీహర్ష.

"డోంట్‌వర్రీ బేబీ! మా నందిని వుంటుంది. మీరిద్దరూ హాయిగా వుండండి" అన్నాడు వసంతరావ్.

అంజని తలాడించి వచ్చింది. ఆమె హృదయం ఒక రకంగా సంతోషంగా వుంది. మరోరకంగా ఆందోళనగా వుంది.

ఆమెకు తెలియకుండానే ఆమె హృదయం శ్రీహర్షని చూడాలని కోరుకుంటోంది.

"అన్న, సారు, ఉర్లగడ్డ పల్లె సాకేస్రీ!" చాముండి అడిగింది.

అంజనికి ఒక్కముక్క అర్థంకాలేదు. అన్న అంటే అన్నమని తెలుసు. వండాలా అని అడుగుతుందని అర్థమయింది. తలాడించింది. వంట చేస్తున్న శబ్దం వినిపించింది.

కాలింగ్‌బెల్ మోగింది. తలుపు తీసిన అంజని ఆశ్చర్యపోయింది. శ్రీహర్ష నిలబడి వున్నాడు.

"మీరు....మీరా? రండి" ఆహ్వానించింది. అతనొచ్చి కూర్చున్నాడు.

"నువ్వు హైద్రాబాద్ వెళ్ళలేదా?" పొడిగా అడిగాడు.

"లేదు! మీరు మీ అమ్మగారికంట పడవద్దన్నారు. మీరు లేని నెల రోజులే ఆమె ఫోన్ వస్తే నరకం అనుభవించేదాన్ని. రాంగ్ నంబరని పెట్టేసేదాన్ని. ఆ అవస్థనుండి తప్పించుకోవాలని...." అన్నది.

"అమ్మకోసమే వున్నాను అంటావు!"

"నిజమంటే! మేము అబద్ధాలకోరువాళ్ళం, మోసగాళ్ళ కుటుంబం నుండి వచ్చినదాన్ని. నమ్మటం, మానటం మీ ఇష్టం."

"మాటలు బాగా నేర్చావ్" అన్నాడు కాస్త కోపంగా.

"మరి బ్రతికేదెలా? చాముండీ....కాఫీ."

"ఇప్పుడేం వద్దు" లేవబోయాడు.

"అందులో విషం కలుపను....బావా" అనబోయి నాలుక కరుచు కున్నది.

"ఆడవారికి అపార్థాలు కల్పించటం బాగా చేతనవును, అందు క్కాదు. ఇప్పుడే వసంతరావుగారింట్లో త్రాగాను" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. వెళ్ళి అతని వడిలో తలవాల్చి అతని మెడ చుట్టూ చేతులువేసి సేదదీరాలని వున్నది. కాని అతనన్న మాటలు తగులుతుంటే అభిమానం ఆమెను లేవనీయటంలేదు.

వీరి ప్రమేయం లేకుండా చాముండి కాఫీ తెచ్చింది. మెల్లమీద వెళ్ళి వెళ్ళిపోయింది. ఆమె కదిలే ప్రయత్నం చేయలేదు. శ్రీహర్షే తనొక కప్పు తీసుకుని, ఆమెకు ఒకటి అందించాడు.

"థాంక్స్!" అన్నది.

కాఫీ త్రాగి అతను లేచాడు. అతని మనసు ప్రశాంతంగా లేదని ఆమెకు అర్థమయింది. అతను మెట్లు దిగేవరకు బయట నిల్చింది. అతను వెళ్ళిపోగానే గదిలోకి వెళ్ళి తల పట్టుకుని మంచంపై పడుకుంది. ఆమె యాంత్రికంగా కాలేజీకి వెళ్ళివస్తున్నా, ఆశగా వసంతరావు గుమ్మంవైపే చూసేది.

శ్రీహర్ష వస్తాడేమోనని ప్రతిక్షణం ఆమె హృదయం విడువని చూసేది.

ఒకనాడు నందిని విసుగ్గా వచ్చింది.

"ఏమిటి?" ఇంగ్లీషులో అడిగింది.

"ఏం లేదక్కా! ఆఫీసుకు డాడీకి ఫోన్‌చేస్తే ఆ హర్ష మహారాజ పలికాడు" అన్నది విసుగ్గా ఇంగ్లీషులో.

అంజని అణువణువు ఆత్రుతతో విన్నదామె మాటలను.

"అయితేనేం! ఆడపిల్లను కదా, అందగత్తెను కదా, కాసేపు మాట్లాడి 'మీ డాడీని పిలవనా' అని అడగొచ్చుకదా. "వసంతరావ్ లేరు" అని ఫోన్ పెట్టేశాడు" అన్నది కోపంగా.

అంజని గర్వంగా వకపక నవ్వింది.

"నీకెందుకమ్మా అంత కోపం?"

"ఏమిటో అక్కా! అందమైన అమ్మాయిలతో నిర్లక్ష్యంగా మాట్లాడే మగవారంటే నాకు ఎలర్జీ...." అన్నది కోపంగా.

"అయితే డాడీకి నేను ఫోన్ చేయనా?"

"ఆ మహారాజే ఎత్తుతాడక్కా! నాన్నగారి ఆఫీసు ఎక్స్‌పాండ్ చేశారు, ఇంకా పైకి కనెక్షన్ లేదు. నాన్నగారి సీట్లో యితను కూర్చుంటాడు" అన్నది విసుగ్గా.

"అది తెలిసే చేశావా?"

"ఊఁ...." అన్నది గారంగా.

ఒక్కసారి ఉలిక్కిపడింది అంజని. ఆమెకు నిజం దాచడం ప్రమాదము అనిపించింది.

"నందీ! నేను చెయ్యనా?"

"అంత నీరసుడితో సరసమేమిటీ?" మూతి తిప్పింది.

అంజని నందినివెంట వెళ్ళింది. ఫోన్ డయల్ చేసింది.

"హల్లో! శ్రీహర్ష, సూపర్‌వైజర్ కంపెనీ హియర్...."

ఒక్కసారి అంజని గుండె లయ తప్పింది.

"ఓ....మీరా! నేను....నేను అంకుల్‌కోసం ఫోన్ చేశాను" అన్నది.

"నువ్వు....నువ్వా అంజనీ!" అతని గొంతులో మార్దవం స్పష్టంగా వినిపించింది. నందిని కాస్త రిసీవర్ ప్రక్కకు జరిపి, తన చెవి పెట్టింది.

"అంజూ! ఆరోగ్యం బావుందా? అవునూ అంకుల్ కూతురేమిటి పనిలేనిదానిలా అలా ఫోన్‌లు చేస్తుంది? అసలు బరితెగించిన అమ్మాయిలా వుంది. ఉదయంనుండి నాలుగుసార్లు చేసింది" అంటుండగానే నందిని, అంజని చెవి కొరికింది. అంజని కెవ్వుమంది.

"ఏమిటి అంజూ!"

నందిని ఫోన్ అందుకుని డిస్కనెక్ట్ చేసింది.

"చెప్పక్కా! అతనెలా పరిచయం? అంత చనువుగా 'అంజూ' అంటాడేం?" నిలదీసింది నందిని ఇంగ్లీషులో.

తను ఏ చిన్న విషయం దాచిపెట్టినా అపార్థాలకు దారి తీస్తుందని

అనుకుంది అంజని.

"అతను....అతను నా భర్త నందీ"

"వ్వాట్!" ఎగిరిగంతేసింది. గబగబ జరిగిన విషయాలన్నీ చెప్పి, "మా నాన్నపై కోపం నాపై చూపుతున్నారు నందినీ!" తల వంచుకుని అంజని.

"ఓ....య్యా!....నువ్వు అదృష్టవంతురాలివక్కా! శ్రీహర్ష హాండ్‌సమ్ గయ్...." వచ్చి గట్టిగా ముద్దుపెట్టుకుంది.

"ఇట్ ఈజ్ టూమచ్ నందినీ...." విసుక్కుంది అంజని.

"సాయంత్రంవరకు ఇంట్లో అందరితో చెప్పేసింది నందిని. ప... రావ్ సానుభూతిగా ఓదార్చాడు.

"అంకుల్! ఈ విషయం మన మధ్యనే వుండనివ్వండి" అ... ప్రాధేయపూర్వకంగా.

"మంచిదమ్మా! టైమ్ విల్ సాల్వ్ ఆల్ ప్రాబ్లమ్స్" అ... డాయన. ఆ తరువాత నందిని నాటకం ఆడి, ఇద్దరినీ ఫోన్‌పై మ... టించేది. అదోరకంగా తృప్తిగానే వుంది అంజనికి.

ఒకసారి కోటేశ్వరరావు వచ్చి వెళ్ళిపోయాడు. ఆమె దీక్షగా ... తుంది.

* *

విజయ హస్తవాసి చాలా మంచిదని వీధిలో పేరుబడిపోయింది. ఆమెకు ఒక్క క్షణం తీరిక వుండటంలేదు. ఆరున్నరకు లేచి, కాలకృత్యాలు తీర్చుకుని కాఫీ త్రాగి, పేపరు చూస్తుండగానే ఆయా వస్తుంది, ఆంటీ... సంబల్లి యిస్తుంది. రోగులను చూసి ఎనిమిదిన్నరకి లోపలికి వచ్చేసరి... రాజశేఖర్ వెళ్ళిపోతాడు. స్వాతి తయారవుతుంది.

విజయ స్నానం, భోజనంచేసి ఆస్పత్రికి వెళుతుంది. ఒక్కొక్క... సారి ఐదు అవుతుంది. అప్పుడప్పుడు మధ్యాహ్నమే వస్తుంది. మధ్యాహ్నం వచ్చినరోజు కాసేపు పడుకుని నిద్రపోతుంది. లేచి టీ త్రాగి తల్లికి... తుంది. ఏదైనా చేసిపెడితే ఫలహారం చేస్తుంది.



"మరీ రాజుకు తొందర ఎక్కువే తల్లీ! కాకుండిగా, ఆగి నిన్ను, స్వాతిని తీసుకువెళితే ఏం?" అన్నది లలితమ్మ. విజయ నీరసంగా నవ్వింది. ఇప్పుడు రాజశేఖర్ విజయకోసం బ్రతికే ఒక భర్త. ఇప్పుడు ప్రముఖ వ్యాపారవేత్త. వార్తాపత్రిక తిప్పితేచాలు, అతని ఫోటో కనిపిస్తుంది. అతను కొన్నాళ్ళు విజయమాటకు విలువ ఇచ్చినట్లు నటిస్తూ తిరిగాడు. అప్పుడు విజయను అవాయిడ్ చేస్తున్నాడు. ఒకొకరోజు మాట్లాడుకునే అవకాశమే రాదు. ఆమె లేచేసరికే లేచి వెళ్ళిపోతాడు. ఆమె నిదురపోయాక వస్తాడు. కళ్ళపైకి నిదుర కూరుకువస్తున్నా ఒకొకసారి పది, పదకొండు గంటల వరకు మేలుకుంటుందామె. ఆ తరువాత ఆమెకు తెలియకుండానే నిదురాదేవి ఒడిలోకి జారిగిపోతుంది.

అతనితో కలిసి భోజనం చేయాలనుకున్న ఆమె ఆశ నిరాశే అవుతుంది. మర్నాడు నీరసంగా వుంటుంది.

నియమిత ఆహారం, నియమానుసారంగా తీసుకుంటే ఆరోగ్యము కాపాడుకోవచ్చు అని నమ్మే వ్యక్తి విజయ.

భర్త జీవితంలో ప్రముఖపాత్రవహించే పురుషుడు, కాని అతనే జీవితంకాదు. అందుకే సరిగ్గా తొమ్మిదింటికి భోజనం చేస్తుందామె.

లలితమ్మకీమార్పు బాధగానే వుంది. తను ఏం చేయగలదు? ఇతర్రా ఏం పనిలేదు కాబట్టి, అల్లుడు వచ్చినప్పుడు తలుపుతీస్తుంది.

"భోజనం చేస్తావా బాబూ?" అంటుంది.

"బయటే భోజనం అయింది. మీరేం శ్రమపడకండి. విజయ, స్వాతీ భోజనం అయిందా?" అంటాడు.

"విజయమ్మ నీ కోసం చూసి, భోజనం చేసింది బాబూ!"

"గుడ్! మాకు బయట సవాలక్షపన్లు, మాతో కూర్చుంటే అయినట్లే. మీరు పడుకోండి వెనుక తలుపు తాళం వేసుకుని వెళ్ళిపోతాను. మీకు ఈ శ్రమ వుండదు" అన్నాడు.

ఆమె చెప్పదలచిన మాటలు నోట్లోనే వుండిపోతాయి. అతనంత సౌమ్యంగా మాట్లాడుతుంటే ఏం జవాబిస్తుంది. రెండు మూడు రోజులలో లలితమ్మను లేపడం మానేసాడతను. డ్రాయింగ్ రూమ్‌లోనుండి ఓ తలుపు

బయటి వరండాలోకి పెట్టారు. ఆ తలుపు తాళం వేసుకుని వెళ్ళి, తాళ కుని వచ్చేవాడు.

విజయకు ఈ విషయం బాధగానే వుంది కాని, బాధపడే సమ లేదు.

ఆ రోజు ఆమెను పిలిచినట్టయితే బలవంతంగా కళ్ళు విప్పింది.

"విజ్జీ! అర్జెంట్ గా వెళ్ళాలి. మా స్నేహితునికి....అతని భా క్లబ్బులో డెలివరీ అయింది" అని లేపాడు.

చాలా రోజుల తర్వాత భర్తను చూసింది విజయ. అప్ప లేచింది. ఆమె మనసులో ఎన్నో ప్రశ్నలు తలయెత్తాయి. కాని సమయం, సందర్భం కాదని వూరుకున్నది. చిరునవ్వుతో తన బ్యాగు కున్నది.

క్లబ్బు వార్షికోత్సవమట. తంబోలా, పేక, రకరకాల ఆటలా తున్నారు. అందరూ గౌరవంగా విజయని విష్ చేశారు.

క్లబ్బులోనే కొన్ని గెస్ట్‌రూమ్స్ వున్నాయి. ఆటగాళ్ళు, పాటగా వస్తే వుంటారట. ఆ గదిలో ప్రసవించిందామె.

విజయ చకచకా పనులన్నీ పూర్తిచేసి తల్లిబిడ్డల్ని ఇంటికి పం చింది.

ఆమె భర్త ఓ పెద్ద సోప్ ఫ్యాక్టరీ ప్రొప్రయిటరట. ఆ స్టయిల్ గా వచ్చి అయిదువందలరూపాయలు ఆమె ఎదురుగా బల్ల పెట్టాడు.

విజయ ముఖంలోని చిరునవ్వు ఎగిరిపోయింది. ఆమె గంభీ లేచింది.

"చూడండీ! డాక్టరుకు చందా ఇచ్చినట్టు డబ్బులివ్వరు. బిల్లు ఇ యిస్తారు. నేను బిల్ పంపిస్తాను....అఁ....బైదవే ఒక సలహా! నాకు క్ల లంటే చిన్నచూపు, అయిష్టత లేవు కాని, సమయం సందర్భం పాటిం వారంటే నాకు చాలా కోపం, వస్తాను" అని తన బ్యాగు తీసుకుంది.

"ఏమిటోయ్ మరీ దర్పం, అర్థరాత్రి నీ ఐదువందల ఫీజు కో ఆవిడ వచ్చిందా! పాపం రాజా భోళామనిషి" అన్నారెవరో.



విజయకు ఒళ్లంతా కారం రాసుకున్నట్టు అయింది. భోళా అంటే ఏటు అన్నట్టు ధ్వనించింది.

ఇల్లు చేరేవరకు భార్యాభర్తలు మౌనంగా గడిపారు.

"విజ్జీ! నీవు కాస్త పొగరుగా మాట్లాడేవేమో అనిపించింది. మీరు ఫీజు యిస్తారని రాలేదంటే, మావారికోసం వచ్చానంటే పోయేదిగా!" అన్నాడు.

"రాజా! అసలు ఏమనుకుంటున్నావు? అతనికి మంచీ మర్యాద తెలుసా? క్లబ్బుకు రావటమే నాగరికతా? ఆ డబ్బు క్లబ్బులో తమకు కావల సిన ఫ్రీంకోసం అలా విడదీసి పట్టుకుని చూపిస్తారు అని అయినా గమనిం చారా?"

"వాళ్ళకి డబ్బుంది, అది అందరూ చూడాలనుకుంటాడు డార్లింగ్! అంతమాత్రంచేత...."

"రాజా! మీ వాలకం చాలా రోజులనుండి కనిపెడుతున్నాను. డబ్బు....డబ్బు! జీవితానికి డబ్బే ముఖ్యంకాదు. అతను డబ్బుంటే ఎవడి కయినా దాసం చేసుకొస్తను. నా క్రింద పనిచేసే ఆయాలను, నర్సులను కూడా కడుపులో పెట్టి మర్యాదగా జీతాలు అందిస్తాను" అన్నది తీవ్రంగా.

"మీకు మొదటినుంచి డబ్బులేక అణగి మణగి ఉండటం అలవాట యింది" అన్నాడు తేలికగా.

"రాజా!" ఆమె ఆశ్చర్యపోయింది.

"అవును విజ్జీ! ప్రాక్టికల్ గా ఆలోచించు."

"మీ ప్రాక్టికల్.... థియరిటికల్ థింకింగ్ మీ దగ్గరే పెట్టుకోండి" ఆమె కోపంగా చూసి, తలుపు ధన్ మని వేసి, తల్లి గదిలోకి వెళ్ళింది.

లలితమ్మ అంతా వింటుంది. ఆమెకు బాధగా వుంది, కాని ఎవరికి చెబుతుంది!

విజయ చిన్నప్పటినుంచి ఎరుగును తాను. ఒక వ్యక్తిని అవ మానించే హక్కు, స్నేహాన్ని కించపరిచే అధికారము ఎవరికీలేవు. రాజాను మార్చటం ఎలాగో ఆమెకర్థంకాలేదు. అతనికి పట్టిన డబ్బు పిచ్చి, కీర్తి కాంక్ష, పబ్లిసిటీ వ్యామోహం వదిలించేదెలాగో అర్థంకాలేదు

విజయ అటు, ఇటు దొర్లింది తల్లి ప్రక్కన పడుకుని ... ఇక వూరుకోలేకపోయింది. కూతుర్ని దగ్గరగా లాక్కుని ఆమె ... ముద్దాడింది.

"విజ్జమ్మా! ఆశయాలు అతకటం చాలా కష్టం తల్లీ. ... యుద్ధం తప్పదు. అధైర్యపడకు" అన్నది మెల్లగా.

"అమ్మా! నువ్వయినా నన్ను అర్థం చేసుకున్నావు ... తల్లి చుట్టూ చేతులు వేసింది.

"అతనితో తగువుపడి మార్చలేవు తల్లీ.... ప్రేమగా ... అన్నది.

"అదే ప్రయత్నిస్తున్నాను. అప్పుడప్పుడు నాకు తెలియకుం... అసహనం తలెత్తుతుందమ్మా."

ఆమె జవాబు చెప్పలేనట్లు కూతురి తల నిమిరింది. తల్లి ... పుతో ఆమె హాయిగా నిదురపోయింది.

ఎనిమిదింటికి ఆమె పేషెంట్లను చూడటానికి వచ్చింది. ... రాజశేఖరం ఫోన్ వచ్చింది.

"విజ్జీ! వెంటనే టాక్సీ తెప్పించుకుని యిక్కడికి వచ్చేయ్. ... స్నేహితుడి భార్య, అదే రాత్రి ప్రసవించిందే ఆమెకు నలతగా ...

"రాజా! తొమ్మిదిన్నరకి నేను విక్టోరియా హాస్పత్రికెళుతున్నా... అక్కడకి తీసుకురండి. నేను వచ్చి చూసిన తర్వాత వారు నా ... డబ్బు కుమ్మరించినా అవసరమైన పరికరాలుండవు" అని ఫోన్ ... సింది.

ఆమె హాస్పత్రికి వెళ్ళి వచ్చింది. ఆమె ఊహించనివిధంగా ... రాజశేఖరం సిగరెట్ కాలుస్తూ కూర్చున్నాడు. విజయ అతడిని ... ఫక్కున నవ్వింది.

"కంగ్రాచ్యులేషన్స్ రాజా! మీరు నాగరికతకు మరో ... ఎక్కారు" అన్న ఆమె ముఖంలో ఏహ్యభావం పసికట్టాడు.

"విజ్జీ!" కోపంగా అరిచాడు.

"పల్లి సిటీతో పైకి వచ్చేవారికి చాలా సహనముండాలి రాజా ...



అంది.

"షటప్!"

"థాంక్యూ! నాగరికత అంచులు చేరుకుంటున్నావు."

"చూశావా అత్తయ్యా?"

"అత్తగారు అల్లుడి అద్భుతమైన కార్యక్రమాలకు కళ్ళు మూసుకున్నదా? నాకు తెలియదే" అన్నది.

"విజయా! నువ్వు ఫస్ట్‌క్లాస్ స్టూడెంటువని తెలుసు. నువ్వు రాకపోతే నా స్నేహితుడికి నీచుట్టూ తిరిగే ఖర్మ ఏం పట్టలేదు. సిటీలో పెద్ద నర్సింగ్‌హోంలో చేర్పించాడు" అన్నాడు అతిశయంగా.

"విక్టోరియా హాస్పత్రికన్నా పెద్ద హాస్పత్రి వుందనుకోను. ఆరు కోట్ల ఆంధ్రులకు నేనొక్కదాన్నే డాక్టర్‌నని చెప్పుకోలేదు" అన్నది విసుగ్గా.

"అతనితో నాకు పని...."

"అయితే అలంకరించుకుని వెళ్ళి అలరించనా?"

"విజయా! నా ప్రేమనే చూశావ్! నాకు కోపం వస్తే...."

"నన్ను కొడతారు, తిడతారు, అచ్చు మగాడిలా మాట్లాడావ్ రాజా! మీ స్నేహితుడి భార్య ఖరీదయిన మనిషి. ఖరీదయిన పరికరాలు నా దగ్గర లేవు" అన్నది.

"అత్తయ్యా! ఈ వాలకం చూశారా?"

లలితమ్మ అసహాయంగా చూసింది.

"రాజా! మీరు నన్ను చూసింది ఈ నాలుగైదు సంవత్సరాలనుండి. ఆమె తన ఆశలనూ, ఆశయాలనూ రంగరించిపోసి పెంచింది. మీకంటే నా విషయం తనకు బాగా తెలుసు."

"అత్తయ్యా! నేను చెప్పినట్టు వినాలి."

"అత్తయ్యా! నేనా?" విజయ నవ్వుతూ అడిగింది.

అతని వంటికి కారం రాసుకున్నట్టయింది. బూటుకాలుతో నేలను తన్నుతూ వెళ్ళిపోయాడు. విజయ తలెత్తి చూసింది. తల్లి కళ్ళల్లోకి


మాదిరెడ్డి సులోచన
మీరైతే ఏం చేస్తారు ?

చూసింది. బాధతో రెపరెపలాడింది. విజయకు ఒక్కసారి ఒ
స్పృహ వచ్చినట్టయింది. తమ్ముడి కాపురం అంత చక్కగా వున్నది.
ఇలా అయిందని తెలిస్తే ఇంకేమైనా వుందా? తల్లి కోసమైనా రాజశేఖ
రను తగువు పడకూడదు అనుకుంది.

రెండ్రోరోజులు యాంత్రికంగా గడిచిపోయాయి. మూడో
ఆదివారం విజయ లేచేసరికి రాజశేఖరం ఇంట్లోనే వున్నాడు. హాల్లో
తోనో మాట్లాడుతున్నాడు. లలితమ్మ ఫిల్టర్లో కాఫీ కలుపుతుంది.

"అల్లుడిగారికేనా?"

"అవునమ్మా" అన్నది.

"నేను తీసుకెళ్తాన్లే" కాఫీ కప్పుల్లోకి పోసుకుని ట్రేలో
వచ్చింది. అక్కడ అతని ముఖ్య స్నేహితుడు బెనర్జీ వున్నాడు.

"హల్లో విజయా!" ఎదురువచ్చి ట్రే అందుకున్నాడు.

"నమస్కారమన్నయ్యా! పాప బావుందా?" నవ్వుతూ
చింది.

బెనర్జీ బెంగాలివాడు కాదు, పాప అతని కూతురు కాదు,
ముద్దుపేరుతోనే పిలుస్తారు.

"నమస్కారం" అతను అందరికీ కాఫీలు తనే ఇచ్చాడు.
కాఫీలు త్రాగారు.

"రాత్రి వీడు గొడ్డుకారంతో అన్నం తిన్నాడా, ఒకటే
బుస్సు" బెనర్జీ అడిగాడు.

"కాదన్నయ్యా! కోపం భోంచేశారు. అదంతా నాపై
అన్నయ్యా!"

"అద్గదీ సంగతి! రేపు మా పెళ్ళిరోజు. ఆ సందర్భంలో
చేశామమ్మా. కిద్వాయ్ గార్డెన్స్‌కు వెళ్దాం అన్నాను. 'నాకు జంటగా
ఆశలేదురా' అంటూ కడివెడు కన్నీరు కార్చాడీ మహానుభావుడు"
బెనర్జీ.

"మీకెందుకన్నయ్యా! నేనొస్తానుకదా" అన్నది విజయ.

"మీ టూ...." నవ్వుతూ వచ్చింది శ్వేత.

15015
జిల్లా గ్రంథాలయ సంస్థ, నెల్లూరు



శాఖా గ్రంథాలయము, సూళ్లూరుపేట

"మీరంతా చిల్డ్రిన్స్‌డేనాడు సెలబ్రేట్ చేసుకోండి. అయినా రేపు మీకు స్కూలుంది స్వీటీ" రాజా అన్నాడు.

"మమ్మీకి హాస్పత్రి లేదా?" మూతి ముడిచింది స్వీటీ.

"ఓ డియర్! డాడీ చెబితే వినాలి" అన్నది విజయ.

"ఓ.కె. ఓకె.... మామయ్య వచ్చాక, మిమ్మల్ని వదిలి వెళ్ళకపోతే నా పేరు శ్వేత కానేకాదు" అని, నాలుక బయటపెట్టి వెక్కిరించి వెళ్ళిపోయిందామె.

బెనర్జీ వెళ్ళాక రాజా భార్యపైకి ఒంటికాలిపై లేచాడు. "అతనికి అనవసరంగా లేనిపోని ఆశలు కల్పించావు."

"లేనిపోని ఆశలు ఎందుకయ్యాయి. మేము వస్తున్నాము రాజా వారూ" అతనికి దగ్గరగా జరిగింది.

"ధన్యులం" అన్నాడు కాస్త కినుకగా.

అరగంటలో మళ్ళీ మామూలు మనుషులు అయిపోయారు. నవ్వులతో, కేరింతలతో హాయిగా గడిచింది. ఆరాత్రి యిద్దరూ సినిమాకి వెళ్ళి వచ్చారు. మర్నాడుదయం లేచి విజయ తయారయింది. కోరారంగుకు ఎర్రంచున్న గద్వాలచీరకట్టి జడ అల్లుకుని వచ్చింది.

"విజ్జీ! ఈ చీర బాగుందా...." అన్నాడు రాజా.

"ఇది కట్టుకుంటే అందరూ మెచ్చుకుని డిగ్నిఫైడ్‌గా వుందంటారు. మీకెందుకు నచ్చలేదు?" ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"ఏమో నాకు నచ్చలేదు" అతను బీరువాతీసి మీచుమిఠాయి రంగుకు బ్లాక్ బార్డరున్న షిఫాన్ చీర తీశాడు.

విజయ వాదించలేదు. అతని అభిరుచి ప్రకారమే అలంకరించుకుంది. ఇద్దరూ బయలుదేరారు.

దారిలో మరో కపుల్‌ను పికప్ చేసుకున్నారు. వాళ్ళు పెద్దప్యాకెట్ పట్టుకొచ్చారు. విజయ అదేమిటన్నట్టు చూసింది.

"బెనర్జీకి యార్‌డ్లేమార్క్ షర్ట్. మిసెస్‌కు చీర" అన్నారు.

విజయ, రాజాలు ముఖాలు చూసుకున్నారు. విజయే మెల్లగా అన్నది రాజాతో.

"డబ్బు కవర్లో పెట్టి ఇవ్వండి. వాళ్ళకిష్టమైనవి కొనుక్కుంటా అని, రాజా తలూపాడు. అందరూ కిద్వాయ్ గార్డెన్స్ చేరుకున్నా ఆటలు, పాటలు, కబుర్లు ఉత్సాహంగా గడిచింది. విజయ చిరునవ్వు అన్నీ చూస్తుంది.

"ఈ వెధవ షర్ట్‌లు మనదగ్గర కొన్నవి చూడు, అప్పుడే వెలిసిపోతున్నాయి" అని ఒకరంటే.

"అప్రా! ఖరీదైన విదేశీ చొక్కాల సాటిరావు ఏవీ" అని కరు. ఒకరు వాడే సెంటు ఫారన్‌ది.

ఒకరు వాడే చెప్పులు బయటి దేశాలవి. పేకాట జోరుగాసాగు విదేశీ వస్తువులపై, లక్షల ఆస్తులపై జరుగుతోంది చర్చ.

విజయ దృష్టి దూరంగా గార్డెన్‌లో గుమిగూడిన జనంపై ఏమిటో అర్థంకాలేదు. మెల్లగాలేచి అటువెళ్ళింది. ఒక లంబాడీస్త్రీ ప్ర వేదన పడుతుంది. వెళ్ళి పరీక్ష చేసిందామె. పిండం కాళ్ళలో అమె వెంటనే వచ్చి భర్త జేబులోని కారు తాళాలు తీసుకుంది.

"ఎందుకు విజ్జీ?" పేకముక్కలు పట్టుకున్న రాజా అడిగాడు.

"అయిదునిమిషాల్లో వస్తాను రాజా!" అంది. ఆమె కారు స్త్రీని, ఆమె తాలూకు మనుషుల్ని ఎక్కించింది. కారు తిన్నగా వైపు దూసుకుపోయింది.

పురుడు అయ్యేవరకు వుండాల్సిన అవసరం లేదుకాని, హాస్పత్రులు నరకానికి ప్రతిరూపాలుగా తయారయ్యాయి. గేటులో శించే దగ్గరనుండి పడక చేరాలంటే, వెనుకటి మాయలఫకీరు ప్రాణ వున్న చిలుకను కనుగొన్నంత పని అవుతుంది. ఆ గుహలన్నీ దా ఆ అమాయకపు ప్రాణి వుంటుందో లేదో వూహించలేదు.

అందుకే తల్లీబిడ్డలు సుఖంగా వున్నారనుకున్నాక వెనుతి కార్లో కూర్చుని టైమ్ చూసుకుంది.

"ఓబ్బాయ్! నాల్గుదాటింది" అనుకుని, వేగం హెచ్చించింది. గార్డెన్స్ చేరుకునేసరికి అందరూ తమ సామాన్లు సర్దుకుని రడీగా సిగరెట్ కాలుస్తున్న రాజశేఖర్ ముఖం చిట్లించాడు.



"అందరూ నన్ను క్షమించాలి. నేను ఏమాత్రం అలస్యం చేసినా రెండు ప్రాణాలు పోయేవి" అంది.

"ఆ ప్రాణాలు ఇప్పుడు ఎవర్ని ఉద్ధరిస్తాయట?" తీక్షణంగా అడిగాడు.

"ప్లీజ్ రాజా...." అందరిముందు చర్చ అనవసరం అన్నట్టు చూసిందామె.

"కాఫీ, ఫలహారం వుందా?" బెనర్జీ అడిగాడు.

"అన్నయ్యా! ఫరవాలేదు. దట్సాల్ రైట్!" అంది. నుదుట పట్టిన చెమట తుడుచుకుని, కారుతాళాలు రాజశేఖర్‌కు యిచ్చి, తనొచ్చి ఇవతలి ప్రక్కన కూర్చుంది.

"ఫీజు ఏమాత్రం ముట్టిందేం?"

"రాజా! అది లెక్కకురానిది, అనిర్వచనీయమైనది" అందామె.

అతను కొరకొరా చూశాడు. ఇంటికి వచ్చి నానామాటలన్నాడు. తల్లికోసం విజయ చిరునవ్వుతో విన్నది. లలితమ్మ మాత్రం తానేం చేయాలో తోచని దానిలా వుండిపోయింది.

# 12

అంజని కాలేజీనుండి వచ్చి ముఖం కడుక్కుంది. చాముండి కాఫీ ఇస్తే త్రాగుతూ కూర్చుంది. తలుపుపైన టక-టకమని శబ్దం వినిపించింది.

"కమిన్ నందీ!" అంది.

తలుపు తీసుకుని వచ్చింది నంది కాదు, శ్రీహర్ష. అతని ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపించింది. అతను సోఫాలో కూలబడ్డాడు.

"ఏమిటి బావా? ఒంట్లో బావుండలేదా?" ఆ క్షణంలో ఆమె తీసుకున్న నిర్ణయాలు మరిచిపోయింది. వచ్చి అతని నుదురు తాకి చూసింది.

"అంజనీ! అమ్మ ఇక్కడ వుండటానికి వస్తుంది. రేపు ఉదయమే వస్తుంది. నేనేం చేయాలి?" అన్నాడు.

ఒక్కనిమిషం అంజని కూడా ఏం తోచనట్టు నిలబడిపోయింది.

"మనమే వస్తున్నట్టు మీరో టెలిగ్రామివ్వండి."

"ఈపాటికామె బయలుదేరే వుంటుంది" అన్నాడు కంగారుగా.

"చెప్పండి బావా! మీరేం చేయాలంటే అదే చేద్దాం" అంది ప్రాధేయ పూర్వకంగా.

"ఏముంది? జరిగిన సంగతులు చెబుతాను. తప్పొప్పులు ఆమె నిర్ణయిస్తుంది" అన్నాడు ఆవేశంగా.

"అలా చెప్పేవారయితే ఇంతదూరం రారు బావా!" అంది మెల్లగా నవ్వి.

"ఆమె...." అతను ఏం మాట్లాడలేనట్టు కూర్చుండిపోయాడు. కాఫీ తీసుకుని వచ్చింది అంజని.

అతను కాఫీ త్రాగుతూ తల్లి వ్రాసిన విషయాలు నెమరువేసుకున్నాడు. "ఆడపిల్లను ఒకయ్య చేతిలో పెట్టిన తరువాత ఆ చుట్టుప్రక్కల తల్లితండ్రులు వుండకూడదేమో శ్రీ! అల్లుడు మారాడో, లేక అక్కయ్య మీద అభిమానంతో నాకలా అనిపించిందోగాని, మనం దూరంగా వుంటే అక్కయ్య కాపురం కుదుటపడుతుందని నా అభిప్రాయం. అందుకే నీ దగ్గరకు వచ్చేస్తున్నాను."

ఈ పరిస్థితుల్లో తను కాపురమే చేయటంలేదని ఆమెకెలా చెబుతాడు?

"అంజనీ! ఆమె ఇక్కడికి వస్తుంది. ఆ తరువాత ఏం చేయాలో అక్కయ్యతో మాట్లాడి నిర్ణయిస్తాను" అన్నాడు.

"అత్తయ్య వస్తే వద్దంటానా?" అంది సంతోషంగా.

"ఈ చుట్టుపక్కలవారు ఆమెతో అవకతవకగా మాట్లాడరు కదా!" అన్నాడు.

"ఈ బిల్డింగ్‌లో ఎవరికీ తెలుగు రాదు. వసంతరావ్ అంకుల్‌కు మన విషయం తెలుసు" అంది.

"అతనికెలా తెలుసు?" కంగారుగా అడిగాడు.

ఎందుకు చెప్పాల్సివచ్చిందో వివరించింది.

ఆమె చెప్పింది విన్న తర్వాత అతని ముఖం ఎర్రగా కందిపోయింది.



"రేపు ఉదయం వస్తాను రడీగా వుండు" అని వెళ్ళిపోయాడు.

అంజనికి ఆ రాత్రి శివరాత్రే అయింది.

మర్నాడు శ్రీహర్ష చిన్న తోలుపెట్టెలో నాలుగు జతల బట్టలు తీసుకుని వచ్చాడు. అతని బట్టలు బీరువాలో సర్దుతూ, ఒకసారి గుండెలకు హత్తుకుంది.

"ముస్తాబు తెములటంలేదా? బండి వచ్చే వేళయింది." అతని మాటకు ఉలిక్కిపడింది అంజని. గబగబ బయటికి వచ్చింది. ఇద్దరూ స్టేషన్ చేరుకున్నారు.

అప్పటికే బండి వచ్చింది. కంగారుగా చూస్తుండగానే, లలితమ్మ దిగింది.

"శ్రీ....ఇక్కడ...." అంటూ ఆమె చెయ్యూపింది.

"అమ్మా...." వెళ్ళి చప్పున ఆమె చేతిలోని పెట్టె లాక్కున్నాడు. వెనకాలే నడిచివచ్చే కోడలిని దగ్గరగా తీసుకుందామె.

"చిక్కి సల్లబడిపోయావు అంజూ!" అందామె.

అంజని కళ్ళు చెమర్చాయి. జవాబు చెప్పలేదు.

"అమ్మా! ఈ సామానంతా దేనికి?" చుట్టూ వున్న జాడీలు, మూతలు కట్టిన సంచులు, ట్రంకుపెట్టెలు చూస్తూ అన్నాడు.

"బావుందిరా! మనింటికి సామాన్లు వద్దా?" నవ్విందామె.

నల్గురు కూలీలను కేకవేశాడు విసుక్కుంటూ. టాక్సీని పిలిచి, అన్నీ సర్ది కూర్చునేవరకు ఓ గంట పట్టింది.

"అసలు అక్కయ్యకెలా బుద్ధిలేకపోయింది? తక్కువ సామానుతో ఎక్కువ సుఖం అనే మనిషికదా?" అన్నాడు.

"మీ అక్కకు సామాన్లు చూసే తీరిక ఎక్కడిది?" అందావిడ.

అంజని గుండె లటుకు-లటుకు అంటోంది. ఏం చేస్తే ఏం తప్పో అన్న భయం పట్టుకుంది.

"స్వీటీ వస్తానని ఒకటే గోల! వచ్చే ఏడు మంచి బడి చూసి తెస్తానని చెప్పి వచ్చానుకో!"

మాటల్లో ఇల్లు వచ్చింది. అంజని చాముండిని పిలిచి, సామాన్లు

లోపల పెట్టించింది.

"కాఫీ త్రాగి స్నానం చెయ్యండత్తయ్యా!"

"మంచిదే తల్లీ! నీ ఇష్టం" అందావిడ విశ్రాంతిగా కూర్చుని.

అంజని లోపలికి వెళ్ళింది.

"శ్రీ! అన్నయ్య పూర్తిగా మారిపోయాడురా! ఏప్పుడో ఒక వచ్చి, పొడిగా మాట్లాడి వెళ్ళిపోతాడు" అంది.

"పోనీలేమ్మా! అందరితో మంచిగా వుండటం మన ధర్మం. వా నేను మారిగా నువ్వు విచారించకూడదు" అన్నాడు.

"అంతేలే! ఏమిటోరా సరిపెట్టుకోలేంకదా?" అంటుండగానే అం రెండు కప్పుల కాఫీ తెచ్చింది.

ఇద్దరూ చెరొకటి తీసుకున్నారు.

"నీకేదే అమ్మాయ్?"

"నేను బయలుదేరేటప్పుడే త్రాగాను అత్తయ్యా!"

"అదంతా వేషంలేమ్మా! నా దగ్గర సగం కొట్టేద్దామని. తీసుకో" అన్నాడు కాఫీ సాసర్లోకి ఒంపి యిస్తూ.

అంజని తీసుకుంది.

"అమ్మా! నువ్వు విశ్రాంతి తీసుకో! నేను ఆఫీసుకు వెళ్ళొస్తా"

"వంట అయిందా, చేయాలే అంజూ?"

"వంటమనిషి ఉన్నదత్తయ్యా! ఒక చారు మనకు సరిపోదు. బాగానే చేస్తుంది" అంది.

"ఈ మధ్య కుదిరిందా?"

"లేదత్తయ్యా! చాలా రోజులయింది."

"శ్రీ అమ్మతో కూడా అబద్ధాలు ఆడనేర్చాడన్నమాట, హో భోజనమంటూ వ్రాశాడు" అన్నదామె ఆశ్చర్యంగా.

అంజని తడబడిపోయింది. అయినా నిగ్రహించుకున్నది. చిన్న నవ్వి సర్దిచెప్పింది.

"నాకసలే వంటరాదు. చాముండికి కాస్త ఇంగువతో యిష్ట వంటలు అలవాటు. హోటల్ కూడు అనేవారు."



బయట చెప్పులేసుకుంటున్న శ్రీహర్ష ప్రశంసాపూర్వకంగా నవ్వి వెళ్ళిపోయాడు. అతను సీట్లో కూర్చుంటుండగానే, బాయ్ మెస్సేజ్ వున్న కాగితం తెచ్చి అతనిముందు పెట్టాడు.

"మీరు రాగానే చెయ్యమన్నారు సర్" అన్నాడు.

అతను విజయ నంబరుకు డయల్ చేశాడు.

"హల్లో శ్రీ నేను....అయిదారుసార్లు ఫోన్ చేశాను. నేను నైట్ డ్యూటీ నుండి వచ్చేవరకు అంతా సర్దుకుని, నీ దగ్గరకు వస్తున్నట్లు చెప్పింది అమ్మ. ఎలా మేనేజ్ చేస్తున్నావ్? నాకు చాలా ఆందోళనగా వుంది."

"ఏమేం ఫరవాలేదు. నువ్వు నిశ్చింతగా వుండు. బావ ఏమిటి మారిపోయాడట....డబ్బు, హోదా పిచ్చిపట్టిందా? మనము పెదనాన్నతో మాట్లాడినవాడే పసిగట్టాం. ఇక్కడి విషయాల గురించి వర్రీ అవకు. వీలుంటే నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళి బాలరాజును కొన్నాళ్ళు అక్కడే వుండమను. అడ్రసు ఇచ్చి, ఇక్కడకు రమ్మని వ్రాస్తూ డబ్బు పంపాను."

"అలాగే శ్రీ! ఉదయం ఇంట్లోనుండి చేశాను. స్వీటీ మాట్లాడాలని ఒకటే గొడవ" అని ఆమె ఫోన్ పెట్టేసింది.

"ఏమప్పా హర్షా! పొద్దున్నే యాడబోతివి. ఈయాల్ల మా ఇంట్లో అరటికాయ నరికి కూర....కూర వండినారు. నీకని ఎత్తిపెట్టిందిలే" పళ్ళు బయటపెట్టి మరీ నవ్వాడు గోవిందరాజన్.

"మీ ఆవిడ ఎత్తిపెట్టిన కూరను నేను మేస్తానుగాని వెళ్ళండి" కాస్త విసుక్కున్నాడు.

ఆ ఆఫీసులో గోవిందరాజన్, అన్నా, సారు అందరికీ పాపులరే. హైద్రాబాద్‌లో బాంబే బేకరీ టీలా, విజయవాడ బాబాయి హోటల్ ఇడ్లీలా, కలకత్తాలో రసగుల్లలా, ఢిల్లీలో సార్దార్జీ ఫిష్‌స్టాల్లా గోవిందరాజన్ అనగానే అందరూ 'అన్నసారు' అని అవహేళన చేస్తారు. పొదుపు మంచిదే కాని ఏదయినా అతి మంచి పనికిరాదు. వ్యక్తిగత జీవితం సాంఘిక జీవితాన్ని దెబ్బతీస్తుంది. అతడిని ఎవరూ చేరనీయరు. పైగా టీ త్రాగుతుంటే వెళ్తారు.

“వాళ్ళావిడ ఆరోగ్యసూత్రాలు పాటిస్తుంది. అన్నసారం తప్ప మరేం అతని ఒంటికి పడవు. టీ ఇవ్వదు, ఆ ఇల్లాలిని ఇడుములపాలు చెయ్యొద్దు” అంటారు కొల్లీగ్స్.

అతనికి కాస్త గౌరవమిచ్చి, అతని బలహీనత అర్థం చేసుకున్న వ్యక్తి ఒక్క శ్రీహర్షే. అతను విసుక్కునేసరికి గోవిందరాజన్ ముఖం చిన్నబోయింది.

“అంత కోపమేలప్పా! ఏదో సంబరంలో అంటిని.”

“నేను వింటినికదా. చాలా పని వుందన్నాను. కోపం తాపం ఏమీ లేదు గోవిందరాజన్‌గారూ! నేను నాల్గురోజులు మన బాస్ ఇంటిప్రక్కన బంధువుల దగ్గరుంటాను. ఇంటికి రాలేదని మీరేం కంగారుపడవద్దు.”

“అట్లనా! కూర ఎత్తిపెట్టిందే.”

“మీరు తినండి” అన్నాడు.

గోవిందరాజన్ వెళ్ళిపోయాడు.

పనులన్నీ పూర్తిచేసి మెల్లగా ఇంటికి వెళదామని బయలుదేరాడు.

“మిస్టర్ శ్రీహర్షా! కమాన్” అతని బాస్ వసంతరావు కారు తలుపుతీసి పట్టుకున్నాడు.

మొహమాటపడుతూ కూర్చున్నాడు.

“ఓ కప్పు వేడి కాఫీ త్రాగిపోదాం” అన్నాడు ఇంగ్లీషులో.

“థాంక్యూ సర్....” అతనో మద్రాసు హోటల్ ముందాపి, దిగాడు.

హర్ష అతడిని అనుసరించాడు.

ఇద్దరూ వెళ్ళి కూర్చున్నారు. అతను కాఫీకి ఆర్డరు చేశాడు.

“మిస్టర్ హర్షా! నేను పర్సనల్ విషయాలలో తల దూరుస్తున్నానని భావించకపోతే మా అమ్మాయి చెప్పిన విషయం....”

“నిజమే సర్” తల వంచుకున్నాడు.

“ఐసీ! కారణం తెలుసుకోవచ్చునా, ఇఫ్‌యు డోంట్ మైండ్.”

శ్రీహర్ష జరిగింది క్లుప్తంగా చెప్పాడు. ఆ క్షణంలో వసంతరావును చూస్తుంటే ఆనందబాబును చూసిన అనుభూతి కలిగింది. అనుబంధాలు



అర్థం చెప్పలేము.

అభిమానాలు నిర్వచించలేము.

కాఫీ వచ్చింది. ఇద్దరూ సిప్‌చేయసాగారు.

“అతని గురించి నాకేం తెలియదుకాని, అంజని అమృతమూర్తోయ్! ఏ శిబ్ డార్లింగ్” అన్నాడు అభిమానంగా.

“ఐ నో సర్. నాకు తెలుసు.”

“తెలిసి ఎందుకు ఉపేక్షిస్తున్నావో నాకు అర్థం కావటంలేదు. ఆ అమ్మాయి పొరపాటేమిటో ఆలోచించావా?”

“అతని కూతురుగా పుట్టటమే.”

“నో....నో....నేను ఆఫీసు డబ్బు కాజేసి, లంచాలు తీసుకుంటే వండివి నేరస్థురాలా?”

“ఆ పాపిష్టి డబ్బుతో ఆమె పెరిగింది. కాబట్టి ఆమెకు భాగం లేదంటారా?” అన్నాడు చురుకుగా.

“భరించేవాడు భర్త. గృహాన్ని నడిపించటానికి శ్రమించేవాడు యజమాని. తన ధర్మం నిర్వర్తించటానికి దోపిడీలు చేస్తాడు. అది అతని కుటుంబానికి చెందుతుందని అనుకోను” అన్నాడు.

“మే, బి రాత్రింబవళ్ళు ఇదే ఆలోచిస్తున్నాను సర్! అంజనిని చూస్తుంటే ఆమెను కష్టపెట్టినదానికి నాకు నిష్కృతి లేదేమోననిపిస్తుంది” అన్నాడు శ్రీహర్ష.

“క్షమ అనేది అతి ఉదాత్తమయినది శ్రీహర్షా! ఆలోచించు. ఆ పిల్ల కిటికీలో తలపెట్టి మా యింటికి ఏదో పనిమీద రావా అని ఎదురు చూస్తుంటే నిజంగా అలనాటి అశోకవనంలోని సీత గుర్తుకువస్తుంది. నీకు వచ్చే రాంగ్‌నెంబర్స్ అన్నీ నీ భార్యనుండే.”

“సర్....”

“అవును హర్షా! మొన్న మీ ఆంటీ చెప్పి కంటతడి పెట్టింది. ఫోను ఖర్చుల దండగ, అతను మాట్లాడడు అన్నదట. ‘పోనీయండి ఆంటీ, రోజుకు ఒకసారి అతని గొంతయినా వింటాను’ అన్నదట బాధగా.”

శ్రీహర్షకు ఒక్కసారి కళ్ళు నీటితో నిండిపోయాయి. అతను

వసంతరావును చూడలేక కాఫీ వదిలివేసి చరచర బయటికొచ్చాడు.

"పోనీయండి ఆంటీ, రోజూ అతని గొంతయినా వింటాను" ప్రే కూడా ఇంత బాధగా పరిణమిస్తుందా? 'అంజనీ నన్ను తిట్టు, అవ చుకో! నాతో పోట్లాడు' అనుకున్నాడు.

తీయని వ్యథలే తీరని బాధలు అన్నాడో కవి. తనలాంటి వా చూసే అనవచ్చు. అతని అంతరాత్మ నిలదీసింది.

'జన్మనిచ్చిన తండ్రి అనిపించుకున్న వ్యక్తికోసం ఇంతగా బ పడుతున్నావే? నీ బాగోగులు చూసి, నిన్ను సంఘంలో ఓ మనిషిగా దిద్దిన వ్యక్తి ఏమీ కాదా?'

ఏమిటీ పరీక్ష? ఎందుకు తనకీ శిక్ష?

"ఏయ్! నడిరోడ్డులో నడుస్తున్నావ్ ఏమిటి కథ?" ఓ సైకిల్‌వా భుజంపట్టి లాగాడు. అక్కడా, ఇక్కడా తిరుగుతూ రాత్రి అయిందీ గమనించలేదు.

తల్లి వచ్చింది, కంగారుపడుతుందన్న వూహ రాగానే గబ ఇంటికి వచ్చాడు.

"అంకుల్ వచ్చి ఆఫీసు పనిమీద మిమ్మల్ని పంపానంటే కు పడ్డాం" అన్నది అంజని. హాల్లో కూర్చున్న తల్లి కూడా ఆందోళన ప తుంది.

## 13

అంజని కాళ్ళు తడబడుతుంటే గదిలోకివచ్చి తలుపులు వేసింది. విధంగాను తప్పించుకునే మార్గం కనిపించలేదు. రెండో గదిలో ఆమె ప కుంది.

"తబైదు పూలు అక్కరలేదు" అంటూ, సువాసనలు విరజి మల్లెలమాల తన తలలో తురుముటం గుర్తుకొచ్చింది. లలితమ్మకు ఎప్పుడూ తనంటే ప్రేమాభిమానాలే అనుకుంది.

"అన్నీ హడావిడిగా జరిగిపోయాయి. ఉద్యోగమంటూ పిల్చుకోనివ్వలేదు" అన్నది కోడలి కంటి కాటుక తుడుస్తూ.



ఆమె ఆదరానికి, అభిమానానికి కళ్ళు చెమర్చాయి. ఆమె రెండు చేతులలో ముఖం దాచుకుంది.

"పిచ్చిపిల్ల" ఆమె నుదురు ముద్దుపెట్టుకున్నది.

"అంజూ!"

ఉలిక్కిపడి అత్తగారి ఆలోచనలు ప్రక్కనపెట్టింది. మంచంపైన పువ్వుల బంగీతో అపర జయంతుడిలా కనిపించాడు.

"బావా! అత్తయ్య బాధపడకూడదని....నేను సోఫాలో పడుకుంటాను" అన్నది అతి మెల్లగా.

"ఏమిటి?" వినిపించనట్లు అడిగాడు.

ఆమె అసహాయంగా చూసింది.

దగ్గరగా రమ్మన్నట్టుగా చెయ్యూపాడు. అతను కొత్తగా, చిన్నప్పుడు తనని ఏడిపించే శ్రీహర్షగా కనిపించాడు.

ఆమె దగ్గరగా వెళ్ళి తను చెప్పదలచుకున్నది చెప్పేసింది.

"అబ్బో! అత్తగారంటే ఎంత ప్రేమో?" కళ్ళు చికిలించాడు.

"నావల్ల ఏదైనా పొరపాటు జరిగిందా?"

"ఊహూ" అమాంతంగా ఆమెను దగ్గరగా తీసుకుని లైటు ఆర్పివేశాడు శ్రీహర్ష.

"బావా!" ఆశ్చర్యంగా అనబోయి మాటలు బయటికి రాలేదు. శ్రీహర్ష అధరాలు అడ్డుపడ్డాయి. ఆమె శరీరంలోని నరాలన్నీ వీణతీగలయ్యాయి. ఇద్దరూ తమను తాము మరిచిపోయారు.

అంజని అలసటగా అతని కైందడ అండగా చేసుకుని కళ్ళు మూసుకుంది. అతను ఆమె జుట్టుతో ఆడుకుంటూ ఆమెను పిలిచాడు.

"అంజనీ నా పిలుపు వినిపించలేదా?"

"ఊఁ...."

"మాట్లాడు....ఏది కళ్ళు విప్పు."

"విప్పను" అన్నది.

"ఏం నా ముఖం అంత వికృతంగా వున్నదా?"

"నా సుకృతంపై నమ్మకంలేదు. కళ్ళువిప్పితే ఈ కల కరిగిపోతుంది.

మళ్ళీ ఒంటరిగా....ఓ....పగవారికికూడా వద్దా ఆవేదన."

"అంజనీ!" తల మరింత దగ్గరగా లాక్కున్నాడు.

"అవును. ఏ చిన్న శబ్దమయినా, నా అదృష్టం వచ్చింది వస్తున్నాడని, రెండుకళ్ళే వెయ్యికళ్ళు చేసుకుని చూసేదాన్ని. అంతరంతో మాట్లాడి వెళ్తుంటే ఆ పిలుపుకోసం, 'అంజనీ' అనే కోసం చెవులు రిక్కబొడుచుకొని ఎదురు చూసేదాన్ని. 'శ్రీహర్ష, శ్రీహర్ష' అని రోదపెడుతుంటే, 'భగవంతుడా ఆయన ఈ బేలహృదయానికి కొత్త బలమివ్వు, మనసు ఇవ్వు' అంటూ ప్రా చాను" అన్నది.

"వద్దు....వద్దు అంజూ!"

"లేదు. చెప్పండి మళ్ళీ నన్ను ఆ ఒంటరితనమనే మహా భయ అరణ్యంలో వదిలిపోరుగా?"

"అంజూ లేదు....లేదు" అతను ఆమెకు అభయమిస్తు ఆమెను రెండుచేతులతో బంధించాడు.

"నా చిన్నతనం గుర్తుకు తెచ్చుకుంటే నాపై నాకు జాలి కలు అది పగవారికి వద్దు. మీతో నా వివాహం జరిగిననాడు, సామ్రాజ్యా గెలిచిన మహారాజులు పడినంత సంబరపడ్డాను."

"ఇంకేం చెప్పకు అంజూ!"

"ఊహూ! నాకు మళ్ళీ ఇంత సావకాశం వస్తుందో రాదో చె నీయండి."

"వద్దు. ఇదిగో నీ హృదయం చెబుతుంది" అన్నాడు ఆమెను పై లాగి, రెండు హృదయాలు ఒకచోట చేర్చి.

"మీకు హృదయంచెప్పే భాష తెలిస్తే...." ఆమె కళ్ళు నిం కున్నాయి. మాట పెగలిరాలేదు.

"నీ నోరు మూయించటం ఎలాగో నాకు తెలియదా?" ఆమె అధ లను తన పెదాలతో అదిమిపట్టాడు.

అంజని అతని మెడదగ్గర కితకితలు పెట్టింది. అంతే! బంధ సడలి అతడు పెద్దగా నవ్వుతూ ప్రక్కమీద ఒరిగిపోయాడు.



"ఉష్! అత్తయ్య వున్నారు అవతల" చటుక్కున అతని నోరు మూసింది.

ఆమె చేతులపై తన చేతులు ఆన్చి, ఆమె చెదిరిన బొట్టు, కరిగిన కాటుకవంక చూశాడు.

"ఏమిటి?" అన్నది. అతను జవాబుగా ఆమె తలవంచి కళ్ళమీద ముద్దు పెట్టుకుని వదిలేశాడు. ఈసారి ఆమె పకపక నవ్వింది.

"ఏమిటా నవ్వు?"

"ఉండండి" లేచివెళ్ళి చిన్న అద్దం తీసుకువచ్చి, అతని పెదవుల నిండా కాటుక, బుగ్గలనిండా కుంకుమ అంటింది. వసంతోత్సవం నుండి తప్పించుకుని వచ్చినట్టున్నాడు. దూరంనుండి చినుకులు పడినట్టున్నాయి.

అతను నవ్వుతూ అదంతా ఆమె బుగ్గలకు పులమాలని చూశాడు.

తన పమిటలో శ్రద్ధగా తుడిచింది అంజని.

మళ్ళీ ఇద్దరూ నిదురలోకి జారిపోయారు. ఉదయం లేవాలని కళ్ళు విప్పింది. ప్రక్కంతా ఖాళీగానే వుంది. ఇద్దరికి కలిపి సగం మంచం చాలు అనిపించింది. అమాటే భర్తను లేపి చెప్పింది.

"సగం మంచం చాలా! నేనింకో మంచం చేయించాలనుకుంటుంటే."

"ఇంకోటా! అదెందుకూ?" ఆమె ఆశ్చర్యంగా చూసింది.

"మన పిల్లలకి కావద్దూ! ఈ మంచంలో ఇద్దరే పడుకోగలరు. మరో ఇద్దరు వస్తే" అన్నాడు అల్లరిగా.

"మీకు నల్గురు పిల్లలు కావాలా?"

"ప్రభుత్వం పరిధి గీసిందని నల్గురు, కనీసం తొమ్మిది మందయినా వుంటే ఇల్లు కలకలలాడుతుంది" అన్నాడు.

"బాప్రే" అదిరిపడ్డట్టు చూసిందామె.

"అంజూ! పిల్లలు దైవసమానులు. ఏ కల్మషంలేని వారితో ఆడుకుంటుంటే ఎంత హాయి, ఎంత నిశ్చింత" అంటూ పరవశంగా కళ్ళు మూసుకున్నాడు.

"అమ్మో! నేను మాత్రం ఇద్దరికంటే ఎక్కువయితే పెంచలేను" అన్నది.

"ఆయాలను పెడతానులే" అన్నాడు. ఆమె నవ్వుకుని లేచి వచ్చి అప్పటికే లేచిన లలితమ్మ కాఫీ ఫిల్టర్‌లో పోస్తోంది.

ఆ రోజంతా అంజని గాలిలో తేలిపోయింది.

భర్త వెంట వెళ్ళి చాముండేశ్వరి ఆలయం చూసి వచ్చింది.

బజారు వెళ్ళి అతని కిష్టమయిన రంగుల రెండు మైసూర్ క్రే చీరలు కొన్నది.

రోజులు నిమిషాల్లా దొర్లిపోయాయి. వారంరోజులు గడిచా ఆమెకు భర్త తోడిదే లోకం అన్నట్టుంది. బయట ఒక ప్రపంచమున్నది పూర్తిగా మరిచిపోయింది.

"తనకే మగడున్నట్టు? ఊఁ" నందిని మూతి ముప్పయి వంక తిప్పింది.

ఆరోజు ఇద్దరూ సినిమా కెళ్ళారు. సంతోష్ థియేటర్‌లో ఎప్పుడు రష్‌గా వుంటుంది. టికెట్లు దొరకలేదు.

"ఇంటికెళ్ళి ఏం చేస్తాం? దగ్గరగా పార్కు వుంది. అక్కడ కూర్చుందాం" అన్నాడు శ్రీహర్ష.

"అలాగే" అతని చేయిపట్టుకుని పార్కులోకి వెళ్ళింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకున్నారు. తను అడగాలన్న విషయం ఆమె మరచిపోయింది. తను చెప్పాలన్న విషయం అతను మరిచిపోయాడు. ఇద్దరూ ఇంటి వచ్చారు.

"ఏమిట్రా అప్పుడే వచ్చారు?" అని అడిగింది లలితమ్మ.

"సినిమాకు టిక్కెట్లు దొరకలేదమ్మా!" అన్నాడు.

చాముండీ, ఆమె కలసి ఏదో పిండివంట ప్రయోగంలో వున్నా ఒకరు కన్నడంలో చెబితే, రెండవవారు తెలుగులో చెబుతున్నారు. గమ్మత్తుగావుంది శ్రీహర్షకు.

అంజని బట్టలు మార్చి వంటింట్లోకి వెళ్ళింది.

"మేము చేస్తాము నువ్వెళ్ళు" లలితమ్మ కసురుకుంది.

"అమ్మా! అతిగారంచేసి, పని చేయనియ్యకపోతే తలకెక్కుతా" అరిచాడు శ్రీహర్ష.



"నువ్వు, నీ మేనకోడలెక్క ఇంకొకరికి స్థలం మిగిల్చారా?" అన్నదామె. అంజని భర్తను చూసి ముసిముసిగా నవ్వింది.

శ్రీహర్ష ఏదో అనబోయేలోపల తలుపు తోసుకుని, విసురుగా నందిని వచ్చింది.

"అక్కా! మీ నాన్న ఫోన్‌చేశారు. మాట్లాడే తీరికవుందా?"

"ఊహూ, బొత్తిగా తీరటంలేదు. మా నందిని సహాయము చెయ్యాలి" అన్నది నవ్వాపుకుంటూ.

నందిని వెంట వెళ్ళింది, తండ్రితో మాట్లాడింది. లలితమ్మ వచ్చిన మర్నాడే జరిగిన విషయాలు చెప్పింది.

"అంజూ! నేనేమయినా పరవాలేదమ్మా, నువ్వు సుఖంగా వుంటే చాలు. నాకెంత సంతోషంగా వుందో తెలుసా? హార్ట్ ఎటాక్ వచ్చేలా వుంది...నిజం" అతని గొంతు ఆనందంతో బొంగురుపోయిందని అర్థమయింది.

మళ్ళీ ఈ రోజు అతను చేశాడు.

"నాన్నా! నేను అంజూని" అన్నది తన సంతోషమంతా గొంతులో ధ్వనింపజేస్తూ.

"అమ్మా! ఎన్నాళ్ళనుండో ప్రపంచయాత్ర చేయాలనుకున్నాను. ఇప్పటికప్పుడు వాయిదాపడుతూ వచ్చింది. రేపు పదిహేనవ తారీకున వెళదామనుకుంటున్నాను. హర్ష నాపట్ల విముఖంగా వున్నా, నువ్వేం బాధపడకు. కాలమే అన్ని గాయాలను మాన్పుతుంది....వింటున్నావా అంజూ?"

"వింటున్నాను నాన్నా!" అన్నది. ఆమెకు దుఃఖం తన్నుకువస్తోంది. అత్తగారితోపాటు నాల్గురోజులు తండ్రిని వుంచుకుంటే ఎంత తృప్తిగా వుండేది.

"నువ్వు రావద్దు. నేనే రేపు వచ్చి, హర్ష లేనప్పుడు కలిసి వెళ్ళిపోతాను. అంజూ! ఏడుస్తున్నావుకదూ? వద్దమ్మా, నీ నవ్వులో నాకు శాంతి సౌఖ్యాలు దొరుకుతాయి" అన్నాడు. అతను ఏడుస్తున్నాడని అతని గొంతే చెబుతోంది.

"నాన్నా! ఎందుకు మీకీ శాపం?" అన్నది.

"లేదమ్మా! నీ హృదయంలో ఈ నాన్నకోసం కాస్తంత మానసం, ప్రేమ ఉన్నాయనుకుంటే చచ్చిపోయినా పరవాలేదు" అ డాయన.

ఫోన్ పెట్టేసి కళ్ళు తుడుచుకుంటూ వచ్చింది.

శ్రీహర్ష గంభీరంగా ఏమిటన్నట్టు చూశాడు.

"నాన్నగారు వరల్డ్ టూర్‌కు వెళుతున్నారు" అంది అతి మెల్ల అతను తలపంకించాడు.

ఆ రోజు ఇద్దరూ గంభీరంగా వుండిపోయారు. అంజని గోడ తిరిగి బోర్లా పడుకుంది.

శ్రీహర్ష కాసేపు అటు, ఇటు దొర్లి, మెల్లగా ఆమె వైపు గాడు. మెడను చుంబించాడు.

"అంజూ! నన్ను క్షమించు" అన్నాడు.

"మీరేం చేశారు? ఆయనే దురదృష్టవంతుడు."

"నిష్ఠూరమా?"

"నిజమే అంటున్నాను. ఆయన్ని ఎవరూ అర్థం చేసుకోలే అన్నది ఇటు తిరిగి. అతను ఆమె పెదవులను గట్టిగా అద్ది, రెండు చే లతో బంధించి దగ్గరగా తీసుకున్నాడు.

ఆమెకా క్షణంలో ఎవరిదో అసరా కావాలనిపించింది. అతని హృ యంలో తల దాచుకుంది. అతని చేతులు మృదువుగా, మెల్లగా ఆమె మీటుతుంటే కళ్ళు మూసుకుంది.

# 14

తండ్రిని సాగనంపి వచ్చిన అంజని మనసు చాలా అసం వున్నది. అత్తగారికి సర్ది చెప్పింది.

"అనుకోకుండా ప్రయాణం పెట్టుకున్నారట!" అన్నది.

"ఏమిటోనే అమ్మాయ్? అన్నయ్య మారిపోయాడు. నన్ను కుండా ఎన్నడైనా ఇన్నాళ్ళున్నాడా?" అన్నది కాస్త నిష్ఠూరంగా.



అంజని మాటలు రానట్టుండిపోయింది.

ఇంతలో బయట తలుపుతట్టిన శబ్దం అయింది.

"ఇదే శ్రీహర్ష మనె" అంటూ సగం కన్నడంలో సగం తెలుగులో చెబుతున్నారెవరో. ఎవరై వుంటారు? అనుకుంటూ తలుపు తీసింది.

ఆగంతకుడిని చూసి ప్రక్కలో బాంబు ప్రేలినంతగా ఉలిక్కిపడింది అంజని. ఆగంతకుడి చేతిలోని పెట్టె క్రిందపెట్టి ముందుకు వెళ్ళి 'అమ్మా!' అంటూ లలితమ్మ కాళ్ళపై పడిపోయాడు.

"ఎవరు? ఎవరమ్మా?" కోడలివంక చూసింది.

"అతను...." అనబోయింది-నోటమాట రాలేదు. ఈ బాలరాజు మళ్ళీ ఎందుకు దాపురించినట్టు?

సర్పద్రష్టలా, శిలలా నిలబడిపోయింది.

గుమ్మానికవతల నిలబడిన గోవిందరాజన్‌ను ఆహ్వానించాలన్న సంగతికూడా మరిచిపోయిందామె.

"అమ్మా! నేనమ్మా బాలయ్యని—"

అప్పటికి లలితమ్మ, అతన్ని పరీక్షగా చూసింది. మధురస్మృతుల నుండి మసగుసపడిన జ్ఞాపకాలు బయటపడ్డాయి.

ఆమె మానసం ఎగిరి కొన్నేళ్ళ వెనక్కు వెళ్ళింది.

"నువ్వు! నువ్వా బాలరాజూ!" ఆమెకు అసంకల్పిత ప్రతీకార చర్యలా కళ్ళమ్మట నీరుబికింది.

"ఆఁ నేనమ్మా! నేనే!" ఆమె పాదాల దగ్గర కూర్చుని ఈసారి రాపీగా అంజనివంక చూశాడు. ఆమె చూపులకే కరిగిపోయే స్థితిని దాటాడు బాలరాజు.

తన చూపులకే శక్తి ఉంటే అంజనిని భస్మం చేద్దామని ప్రయత్నం చేస్తున్నాడు. అంత తీక్షణంగా ఉన్నాయా చూపులు.

లలితమ్మ కళ్ళు ఒత్తుకుని, అతడిని కుశలమడిగింది.

"జైలునుండి ఎప్పుడొచ్చావ్ బాలయ్యా?"

"అదేంమాటమ్మా? బాబు మీకేం చెప్పలేదా?" అతను ఆశ్చర్యంగా చూశాడు.

"ఏ బాబు?" ఆమె అంతకంటే ఆశ్చర్యపోయింది.

"హర్షబాబు! నేను జైలునుండి వస్తూనే బాబును కలిశాను. నాకు జబ్బుచేస్తే ఆస్పత్రిలో వుంచాడు. సమయం చూసి నా విషయము మీతో చెబుతానన్నారమ్మా!" అన్నాడు.

"పిచ్చితండ్రి పాత సంగతులు గుర్తు చేసుకుంటాననుకున్నాడేమో బాబుకు వివాహమైంది. అదిగో కోడలు-'అంజూ, ఇలా రామ్మా!' మీకెవరు బాబూ?" అప్పుడు ఆరా వచ్చింది గుమ్మం అవతల నిలబడిన వ్యక్తి గురించి.

"నాను గోవిందరాజన్" అంతకంటే ఏం చెప్పాలో తెలియక వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"అమ్మా! ఆ పిల్ల కోడలుకాదు....కొరివి....కొరివి."

"బాలయ్యా!"

"అవునమ్మా! బాబుకు ఆ పిల్లమీద ఇంత మోజని తెలిస్తే ఆ పిల్లనే చంపి మరోసారి జైలుకుపోదును" అన్నాడు నిప్పులు కురిసే కళ్ళతో చూస్తూ.

అంజని ముఖం చూస్తుంటే అతనిలో గడ్డకట్టిన కాఠిన్యము కరిగిపో సాగింది.

వెంటనే ఇరవై సంవత్సరాలు నిరర్థకంగా గడిపిన జీవితం గుర్తుకు వచ్చింది. "నన్నేం చెయ్యమంటావయ్యా! ఇదో జనారణ్యం. ఒంటరి ఆడది ఎట్లుంటది? నా బతుకు కుక్కలు చింపిన ఇస్తరాకు అవుతుందని మారు మనువాడిన" అన్న తన భార్య మాటలు గుర్తుకు వచ్చినాయి.

"అవునమ్మా! ఆనందబాబును పొట్టనపెట్టుకున్న దుర్మార్గుల్లో ఒకడా కోటేశ్వరరావు! జైలునుండి రాగానే వాడిపని పడదామనుకున్నాను. కాని వాడలా ఒక్కసారి చావడానికి వీల్లేదు. కుమిలి, కుమిలి చావాలి" వళ్ళు నడుమ నాలుక నలిగిపోతుందేమో అన్నంత కోపంగా అన్నాడు.

"ఏమిటి....ఏమన్నావ్....? బాలయ్యా....నువ్వు చెప్పింది..." లలితమ్మ నమ్మలేనట్టు బాలరాజును చూసింది.

బాలరాజు కసిగా, కచ్చగా జరిగిందంతా చెప్పాడు.



లలితమ్మ వచ్చని ముఖం ఎఱ్ఱబడిపోయింది. ఆమెకు ఆవేశంతో మాట పెగిలిరావటంలేదు.

"శః ....శః....వి....ష....య....ము....శ్రీ....కి....తె....లు....సా?" తడబడుక్కని అడిగింది ఆమె.

"తెలుసమ్మా! నాకిప్పుడర్థం అయింది. శః కొరివితో తల ఎందుకు గోక్కుంటున్నాడో, అదే కాపురం ఎందుకు పెట్టాడో?"

లలితమ్మ ఎందుకన్నట్టు వెలగా చూసింది.

"మీ కోసం....మీ మనఃశ్శాంతికోసం...." అన్నాడు.

"నా కోసమా?" ఆమె రెండు చేతులలో ముఖం దాచుకుని ఏడ్చింది.

అంజని ఆ ఇంట్లో, అందానికి ప్రతిష్ఠించిన శిల్పంలా నిలబడిపోయింది.

"అవునమ్మా! మీకోసం! కేవలం మీకోసం."

లలితమ్మ కళ్ళముందటి పొరలు తొలగిపోయాయి. కొడుకు వివాహం నాటి రాత్రే అతను బైటికి వెళ్ళిరావటం, కోటేశ్వర్రావును తిట్టటం అన్నీ ఆమె కళ్ళముందు కదలాడాయి. అంతా అర్థమైపోయింది.

"నేనే-నేనేం పాపం చేశాను! అన్నకంటే మిన్నగా ప్రేమించానే, నా బ్రతుకులో నిప్పులుపోసి, నన్నో పాపుగాచేసి, ఎందుకు వంచించాడు?" అన్నదామె ఒగరుస్తూ.

"అత్తయ్యా!" స్పృహ వచ్చిదానిలా, అంజని వెళ్ళి తల బాదుకుంటున్న అత్తగారి చేతులు పట్టుకుంది.

"ఛీ! వదులు, నా కళ్ళముందునుండి వెళ్ళవే-వెళ్ళు" గట్టిగా అరిచింది లలితమ్మ- ఆమెకు శివమెత్తినట్టుంది.

"తవరు అపాయకంగా నమ్మొంద్రు, ఆడు గొంతు కోసిందు తల్లి—"

"చెప్పవే-చెప్పు, బాలయ్య చెప్పిందంతా నిజమేనా?" ఒక్క ఉదుటున లేచి అంజని గొంతు పట్టుకుంది లలితమ్మ.

అంజని హడలిపోయింది!

మహిషాసురమర్ధనిలా వుంది. ఆమె కళ్ళలోని ఎర్రజీరలు చూసి

వణికిపోయింది.

"మాట్లాడు" కుదించింది లలితమ్మ.

"నాకు-నాకేం తెలియదత్తయ్యా- నన్ను నమ్ము. నీకు...." మాట రాలేదు.

"ఆహా! ఏం నంగనాచి తుంగబుర్రమ్మా! బాబువెంట వచ్చి అక్క చేసిన ఘనకార్యాలు విన్నావమ్మా" అన్నాడు బాలరాజు.

అప్పటికే అటుప్రక్కలవారు, ఇటుప్రక్కల వుండేవారు జమ కూడారు.

వసంతరావు భార్యవచ్చి, లలితమ్మ చేతులమధ్య ఇరుక్కుపోయిన అంజని మెడ వదిలించింది.

"ఏమి అమ్మా! పసిబిడ్డ ఏంచేసిందీ, దాని తండ్రి చేసిపుంటే అదేం చేసును, అల్లకుటుంబం మీకు కూనంలేదా? పిల్లను సంపేస్తురా?" అంటూ దగ్గరగా తీసుకుంది.

"యారమ్మా? ఏనాయిత్తు, ఎన్నసుద్ధి?" అంటూ తలా ఒక ప్రశ్న వేశారు.

వసంతరావు భార్య అంజనిని తనింట్లో కూర్చోబెట్టి మంచినీళ్ళు యిచ్చింది. వెంటనే శ్రీహర్షకు ఫోన్ చేసింది.

"అయ్యో-అయ్యో లక్ష్మీదేవిలాంటి తల్లి చచ్చిపోతుంది" అంటూ గోలపెట్టారు.

అందరూ కంగారుగా చూశారు. లలితమ్మ ఫిట్ వచ్చి, గిలగిల తన్నుకుంటుంది, వసంతరావు భార్య టాక్సీని పిలిచి ఆమెను హాస్పటల్లో చేర్పించారు.

అంజని బేలగా చూస్తుంది. అరగంట తర్వాత శ్రీహర్ష వచ్చాడు. అక్కడ బాలరాజును చూస్తూనే అంతా గ్రహించాడు. ఆఫీసులో గోవిందరాజన్ విషయం చెప్పారు.

"నీకోసం ఎవరో వస్తే, మీ ఇంటికి వెళ్ళాడు" అని. అతను గంభీరంగా తల్లి దగ్గరకు వెళ్ళాడు. అతని ముఖంచూస్తూ, అతన్ని పలుకరించటానికి జంకింది అంజని.



ఆమె మధురస్వప్నం కరిగిపోయింది.

అమృత ఘడియలు అల్పాయుష్కులని గ్రహించలేకపోయినందుకు తనతానే నిందించుకుంటున్నది.

మత్తు ఇంజక్షన్ మూలంగా లలితమ్మ నిదురబోయింది.

బాలయ్య గతించిన విషయాలు చెబుతూ ఏడుస్తున్నాడు. ఆ క్షణంలో అతనిని చూస్తే ఎక్కడలేని చిరాకు కలిగింది.

"బాలరాజూ! కాసేపు నోరుమూసుకో" కసురుకున్నాడు.

"అచ్చు అనందబాబే! ఆ అయ్య ఇంతే...." కాస్త గొంతు పెంచి ఏడ్వటం మొదలుపెట్టాడు.

"బాలయ్యా! నాన్నను వాళ్ళు చంపారోలేదోగాని, నీ మూర్ఖత్వంతో అమ్మను చంపేలా వున్నావు. కాసేపు నోరుమూసుకో" అరిచాడు శ్రీహర్ష.

అంజని అత్తగారి మంచానికి దూరంగా నిలబడి జరిగేదంతా చూస్తుంది.

ఆమెకు శ్రీహర్షని చూస్తే జాలివేస్తుంది. అతనేం చేస్తాడు? ఒకవైపు కన్నతల్లి, రెండోవైపు కట్టుకున్న భార్య!

"నువ్వింటికెళ్ళిపో అంజూ! నేను వస్తాను" అన్నాడు.

స్పృహ రాగానే అమ్మ నిన్ను చూస్తే తట్టుకోలేదని చెప్పలేకపోయాడు.

ఆమె మెల్లగా ఇంటికి వచ్చింది. వసంతరావు భార్య కలిపి యిస్తే వేడివేడిగా కాఫీ త్రాగింది. కాస్త తలదిమ్ము తగ్గింది.

ఆమె ఈ కొన్ని నెలల్లో చాలా ప్రపంచం చూసింది. లలితమ్మ తన ఉనికిని భరించలేదు. ఆమెను కాదన్న శ్రీహర్ష, తనతో సుఖంగా వుండగలడా? లేదు. అందుకే తనే ఏదో ఓ నిర్ణయం తీసుకుని అతనికి విముక్తి ప్రసాదించాలి. అవును అంతే! ఎవరికీ మనశ్శాంతిలేని కలయిక ఎందుకు?

అంజని ఇంట్లోకి వచ్చింది. మిసెస్ వసంతరావు భయంగా చూసింది. ఒంటరిగా ఉంటే ఏదయినా అఘాయిత్యం చేస్తుందా ఈ అమ్మాయి అనుకుంది.

"ఆంటీ! అలాంటి అనుమానాలు పెట్టుకోకండి. మా నాన్నకోసం ఈ ప్రపంచంలో నిందలు, నిష్ఠూరాలు తప్ప మరేం చవిచూడని ఆ అభాగ్యుడికోసం బ్రతుకుతాను" అన్నది కళ్ళలో ఊరిన నీరు వొత్తుకుని.

ఆవిడ వెళ్ళిపోగానే వచ్చి బల్లముందు కూర్చుంది. కాగితం తీసింది. ఆమెకు ఈరోజు చేతులు ఒణకటంలేదు. ఎక్కడలేని ధైర్యం వచ్చింది. తెగింపు కలిగింది.

"ప్రియమైన మీకు !

జరుగుతున్న విషయాలు చూస్తుంటే, విధిగా విధిని సవాలనిపించింది. ఇక్కడుండి నా హక్కులకోసం పోరాడుతూ, మీ తల్లీ కొడుకుల మధ్య అడ్డుగోడగా నిలవాలనిలేదు. మనం బ్రతికే ఈ నాలుగురోజులు మనశ్శాంతిగా బ్రతకాలనుకోవటం నేరమూ కాదు, పాపమూ కాదు. అందుకే మీకు దూరంగా వెళ్ళిపోతున్నాను. ఈ దూరం శారీరకంగా మాత్రమే. ఈ కొద్దిరోజులు మీరు పంచి యిచ్చిన జీవితం మధురమైనది. ఆ అనుభూతితో బ్రతకగలను. నాన్నగారి దురదృష్టం నాకు రాకూడదని ఆయన అనుకునేవారు. కాని ఆయన ఆశ ఏది నెరవేరిందని, ఇది నెరవేరటానికి.

మీరు తిరిగి వివాహం చేసుకోవటానికి నేనడ్డు నిలుస్తానని అనుకోవద్దు. మీకు ఎలాంటి అనుమతిపత్రం కావాలన్నా ఇస్తాను. అలాగే ఆ ఇల్లు మీదే. ఇంటిపైన అలకచూపితే లాభంలేదు. మీరు పెరిగినది అంతా ఆ డబ్బుతోనే. దెప్పాలని కాదు ఉదాహరణకు చెబుతున్నాను.

బావా! నాకోసం....నాకోసం ఒక్క చిన్నపని చేయండి. అది మీకు సమ్మతం అయితేనే, సంవత్సరానికి ఒక్కరోజు అదే మన పెళ్ళిరోజు, ఒక గంట నాతో గడపండి. అత్యాశ కాదనుకుంటాను. స్నేహితులకోసం, తెలిసినవారికోసం ఎన్నో చేస్తారు. అందులో మంచి స్నేహితులని మీకు పేరుంది. నాపై దెబ్బతీస్తున్న విధితో విధిగా పోరాడతాను. మీరు వుండదల్చుకుంటే ప్లాట్‌లో వుండండి. వద్దనుకుంటే అంకుల్‌తో చెప్పండి. ఇక వుంటాను."

క్రింద సంతకం పెడుతుంటే చేతులు వణికాయి. కళ్ళు చెమర్చాయి.



అయినా గుండె నిబ్బరం చేసుకుని సామాన్లు చకచకా సర్దేసుకుంది. ఆమెకు తలపైనుండి పెద్ద బరువు దింపినట్లయింది. లలితమ్మ దగ్గర దాచిన రహస్యం కాపాడటం పెద్ద బాధ్యతగా పరిణమించింది. ఇప్పుడా భయంలేదు. తను నిర్భయంగా వుండవచ్చు.

"ఏం చేస్తావ్ అంజూ?" వసంతరావ్ భార్య జాలిగా అడిగింది. ఆమెకు ఇంగ్లీషు బాగావచ్చు.

"అక్కడికివెళ్ళి ఆలోచిస్తాను ఆంటీ! సీటు ఇచ్చారంటే 'లా' చదువుతాను" అన్నది ధైర్యంగా.

"ఇక్కడవుండి పూర్తి చెయ్యమ్మా!"

"వద్దు ఆంటీ! కేవలం అత్తయ్య కంటబడకూడదని వున్నాను. నాన్న ఒంటరిగా బాధపడతారు. మాకు బంధువులు లేరు. మీరు బంధువుల కంటే ఎక్కువ ఆదరించారు, విసుగు పుట్టినప్పుడు మీ దగ్గరకే వస్తాను" అన్నది కన్నీటితో.

"అక్కా...." నందిని బావురుమన్నది.

"నీ పెళ్ళికి తప్పక వస్తాను నందీ....తప్పక వస్తాను" భుజంతట్టి, కళ్ళు ఒత్తుకుని వెళ్ళి టాక్సీలో కూర్చుంది.

"క్షేమంగా చేరినట్టు ఉత్తరం రాయమ్మా!"

"ఫోన్ చేస్తాను ఆంటీ!" అన్నమాటకు కదిలినట్టు టాక్సీ కదిలిపోయింది. అంజలి మరోసారి కళ్ళు ఒత్తుకుంది.

## 15

భార్య మాటలు, తన గదిలో దొర్లుతూ వింటున్న రాజశేఖర్ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. తన భార్యేనా అన్న అనుమానం కలిగింది. లేచి స్లిప్పర్స్ వేసుకుని బయటికి వచ్చి చూశాడు. పెద్ద సోఫాలో కూర్చున్నారు. విజయ, ఆ పట్నంలో ధనవంతులలో ఒకరయిన కళ్యాణ్‌దాస్.

"కళ్యాణ్! మీరు ఆహ్వానిస్తే ఆ నరకానికైనా రెడీయే."

"థాంక్యూ....విజయా....థాంక్యూ సోమచ్" ఆమె చెయ్యిపట్టి నలిపాడు దాస్.

"వెల్‌కమ్! మీ టేప్‌రికార్డర్ తీసుకురండి. కొత్తటేప్స్ ఏమయినా కొన్నారా?" అన్నది చిరునవ్వుతో.

"కొనకపోతేనేం విజయా! వెంటనే కొంటాను. యూ మెస్మరైజ్‌డ్ సిట్యుయేషన్...."

"ఓబ్బాయ్...." నవ్విందామె.

కళ్యాణ్‌దాస్ 'వెళ్ళిపోయాడు. రాజశేఖర్ పళ్ళు పట పట కొరుకుతూ బాత్‌రూమ్‌లో దూరాడు. 'యూ మెస్మరేజ్ ద సిట్యుయేషన్!' వెధవన్నర వెధవ. పరాయిస్త్రీ మాటలే సమ్మోహనాస్త్రంలా వుంటాయి. పళ్ళు కొరుకుతూ బయటకి వచ్చాడు.

విజయ నవ్వు తెరలు, తెరలుగా వినిపిస్తుంది. తను అక్కడికి వెళితేగాని ఆగదని తెలుసుకున్నాడు. అందుకే బయటికొచ్చాడు.

"కమాన్ డార్లింగ్! మిస్టర్ సాహిర్ మీట్ మై హబ్బీ రాజశేఖర్. మా ప్రొఫెసర్‌గా వుండేవారు రాజా. విదేశాలనుండి మొన్ననే వచ్చారు" అన్నది.

రాజశేఖర్ కోపంగావున్నా, ముఖానికి చిరునవ్వు పులుముకుని, అతనితో కరచాలనం చేశాడు.

"గ్లాడ్ టు మీట్‌యు" అన్నాడు.

"సేమ్ టు యు, మిస్టర్ రాజశేఖర్! విజ్జీ....షల్ వుయ్ ప్రొసీడ్" అతను లేచాడు.

"ఓ.కే. సర్, రాజా! ఫారిన్ డెలిగేట్స్ వస్తున్నారు. నేను రావటం ఆలస్యం అవుతుంది. ఈరోజు స్వీటీ స్కూల్లో ఏదో కార్యక్రమం వున్నది, వెళ్ళగలవా?"

రాజశేఖర్ తీక్షణంగా చూశాడు.

"దట్స్ ఆల్‌రైట్! మీ ఇష్టం, నేను పిలుచుకుని వెళతాను" అని ప్రొఫెసర్ చేతిలో చెయ్యివేసి బయలుదేరింది. ఇద్దరూ ఒకర్ని రాసుకుంటూ, ఒకరుగా దిగారు.

రాజశేఖర్‌కు మతిపోయింది. అతను అశాంతిగా అటు యిటు తిరిగాడు.



"విజ్జీ!" ఎంత ప్రొఫెసర్ అయితేమాత్రం అంత చనువుగా పిలుస్తాడా! విజయకెంత బుద్ధిలేదు. తను మొదటిసారి తన బాస్, రాబర్ట్‌కు పరిచయం చేస్తే అతను చేయి కలుపబోతే పత్తిత్తులా చేతులు జోడించి, 'నమస్తే' అని అతని ప్రశంసలు పొందింది.

'పెద్ద నటి....కాదు మహానటి' పళ్ళు పటపట కొరికాడు.

"గుడ్‌మార్నింగ్ డాడీ" స్వీటీ స్కూలుకి తయారయి వచ్చింది.

"వెరీబ్యాడ్ మార్నింగ్" అన్నాడు కసిగా.

"వాట్ డాడీ!" కళ్ళు చిటకరించిందా అమ్మాయి.

తన పొరపాటు తెలిసివచ్చింది. కూతుర్ని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. వెంటనే సైటుకు వెళ్ళాలని గుర్తుకువచ్చింది.

'ఛీ....ఛీ! తనెంత సంకుచితంగా ఆలోచిస్తున్నాడు. తను ఇష్టం వచ్చినచోట తిరుగుతున్నాడు. అదేమిటని విజయ ప్రశ్నించిందా?

విజయను ప్రశ్నించే హక్కు తనకున్నది.

నన్ను ప్రశ్నించేహక్కు ఆమెకు లేదా? మనసు నిలదీసింది.

ఆమె స్త్రీ....స్త్రీ! స్త్రీకి స్వాతంత్ర్యంలేదని వేదాలే చెప్పాయి అనుకున్నాడు. కూతుర్ని బడిలోవదిలి, సైటువైపు బయలుదేరాడు. స్వీటీ పరుగెత్తుకు వచ్చింది.

"డాడీ....ఓ డాడీ! సాయంత్రం మరేమో నా డాన్స్ వుంది. నువ్వు రావాలి" అన్నది.

"మీ మమ్మీ వస్తుందమ్మా!"

"నో డాడీ....మీరిద్దరూ రావాలి. గేమ్స్‌రోజు మమ్మీ వచ్చింది" బుంగమూతి పెట్టింది స్వీటి.

"ఓ.కే. అలాగే వస్తాను స్వీటీ" అన్నాడు. ఆ పిల్ల కళ్ళలో ఓ అపూర్వమైన వెలుగు వెలిగింది.

తను నిజంగా బయటి విషయాలలో తలదూర్చి తన కుటుంబక్షేమం మరిచిపోయాడా? విజయతో పంచుకున్న జీవితం తిరిగిరాదా? అతను సైటు మీద పని త్వరగా ముగించుకుని బయలుదేరాడు. స్నేహితులు వచ్చారు. హోటల్లో పార్టీ వుందట రమ్మని బలవంతం చేశారు.

"ఈపూట వద్దురా! మా పాప డాన్స్ వుంది, స్కూలుకెళ్ళాలి."

"మీ పాప డాన్స్ కాదు, మీ ఆవిడ అంటే హడల్. భయి భార్యకే పడివుండేదిరా. అంత భయపడితే ఎలా బ్రతుకుతావ్?" అని వాళ్ళలో ఒ తను హేళన చేశాడు.

మగాడిని మార్చాలన్నా, సిగరెట్టు కాల్పించాలన్నా, త్రాగించాలన్నా, మరే దౌర్భాగ్యపు పనిచేయించాలన్నా భార్య అంటూ ఓ అస్త్రం వేస్తార. అప్పుడే మగాడు ఓ చిరునవ్వునవ్వి, "అవ్ర్నా! నాతో కష్టసుఖాలు పంచు కునే భార్యమాట వింటే తప్పేం?" అని నిలదీయరు సరికదా అర్థంలా ఆడదాని మాట లెక్కలేదన్న ధోరణిలో వాళ్ళవెంట వెళ్ళిపోతాడు.

రాజశేఖరం అదే చెప్పాడు. విజయ ఒక నెలంతా కష్టపడితే వచ్చే డబ్బు తను ఒక్క గంటలో సంపాదించగలడు. పిచ్చి విజయ అనుకున్నాడు రెండు పెగ్గులు కడుపులో పడ్డతరువాత.

"రాజా! నీలాంటి గ్లామరస్ కంట్రాక్టర్ వుండాలి భయి, 'మీ స్వంత ఇంటి పథకం' క్రింద మేము కట్టబోయే ప్లాట్లు నీపల్లే బుక్ అవ్వాలి" అన్నాడు రాజలింగం.

అతను చెయ్యని వ్యాపారంలేదు. నెత్తిసటోపీ వేసుకోని వ్యక్తి లేడు.

"ఆల్ రైట్! నన్నేం చెయ్యమంటారు?"

"ఏంచెయ్యొద్దు! మీరు మా పార్ట్నర్ గా వుండాలి. కథంతా మేం నడుపుతాము. ప్లాటుఖరీదు, నిర్మాణం ఖరీదు కలిసి రెండువందలరూపాయలు ఒక చదరపు అడుగుకు వేశాను. అక్కడే మనకు పదిహేనుశాతం నికర లాభం" అన్నాడు రాజాలింగం.

"పదిహేను శాతమేనా?" చప్పరించాడు మరొకతను.

"అది ఇన్కంటాక్స్ వారికి చూపేలెక్క. సిమెంటు, కర్ర, అన్నిటిలో మిగులుబాటే" అన్నాడు.

రాజశేఖర్ కళ్ళముందు పెద్ద బంగళా మెదిలింది. ఈదెబ్బతో తను బంజారాహిల్స్ లో పెద్ద బంగళా కొంటాడు. అప్పుడు ఏమంటుందో విజయ!



ఊహాలోకాలలో విహరిస్తూ ఇంటికి వచ్చాడు. పనికుర్రాడు వనికి పెట్టి పడుకున్నాడు.

"అమ్మగారు రాలేదా?" కోపంగా అడిగాడు.

"రాలేదుబాబూ" అతను లేచి కూర్చున్నాడు. విజయ ఈమధ్య ఓ కార్పొరేషన్ లో ఉద్యోగం చేస్తుంది. అక్కడ డాయ్, రాత్రిళ్ళు ఇంటిదగ్గర వుంటాడు. అతనికి భోజనం, వసతి ఉచితంగా యిచ్చిందామె.

"భోజనం చేస్తారా అయ్యా?"

"ఒరేయ్! నువ్వేం నా పెళ్ళానివా? నోరుమూసుకో...." అని హాల్లో పికిలించాడు.

అప్పుడే ఓ పెద్ద బెంజ్ కారు వచ్చింది. కారులోనుండి ఓ బట్టతల అతను దిగాడు. డోరుతీసి పట్టుకున్నాడు. విజయ దిగి నిదురపోతున్న పాపని భుజంమీద వేసుకున్నది.

"థాంక్యూ మిస్టర్ అరోరా!"

"నేనే మీకు థ్యాంక్స్ చెప్పాలి. ఆలస్యం అయినా నాకు కంపెనీ ఇచ్చారు" అన్నాడు చిరునవ్వుతో.

అతనికి ఒళ్ళంతా కారం రాసుకున్నట్లు అయింది. బయటికొచ్చి ఆ బెంజ్ కారు వ్యక్తిని నాల్గు అంటించాలనుకున్నాడుకాని, ఓవర్ డోస్ వల్ల అతనికి లేవటం వల్లకాలేదు.

విజయ కూతుర్ని పడుకోబెట్టివచ్చి రాజశేఖర్ ను లేపింది. అతని జేబులోంచి 'మీ స్వంత ఇంటిపథకం' అన్న ప్రణాళికకు సంబంధించిన కాగితాలు బయటపడ్డాయి. అవి బల్లమీదపెట్టి, అతడిని నడిపించుకుని పడక గదిలోకి తీసుకువెళ్ళింది.

"డార్లింగ్! నేను త్రాగానా....నో....నో."

"ప్లీజ్ పడుకోండి" అన్నది అరిచినట్లు.

"ఓకే....ఓకే!" చెంపలు వాయించుకున్నాడు రాజా.

"డార్లింగ్! నువ్వు....నువ్వు డాక్టర్ వి....టీచర్ లా....నో నో.... టీచర్ వి–నా బెటర్ హాఫ్ వి...." అని గొణుగుతూ మంచంపై వాలిపోయాడు రాజశేఖర్.

అతనికి దుప్పటికప్పి ఫ్యాన్ వేసింది.

విజయ పళ్ళబిగువున పెదవిబిగించి ఆలోచిస్తుంది. ఆమెలో గర్వం వుండేది. తన మాటలతో అందరినీ ఆకర్షించగలనని-కాని అబద్ధం అని తేలిపోయింది.

త్రాగుడు నాగరికత లక్షణమా? మద్యపానము పాత్ర ఎక్కడ చూసినా అక్కడ వీరవిహారం చేస్తోంది. కవితలో, నవలలో, యువతలో, నటనలో!

ఆమె అశాంతిగా అటు ఇటు దొర్లింది.

అంతకుక్రితంరోజు దగ్గరగా వున్న హాస్టల్లో ఒక కుర్రాడికి స్పృహ తప్పిందంటే వెళ్ళింది ఫస్టుఎయిడ్ చేద్దామని. అతని బీరువానిండా విస్కీ బాటిల్స్ వున్నాయి. అతన్ని పరీక్షచేస్తూనే గదినంతా పరిశీలనగా చూసింది.

"వాళ్ళ నాన్న పెద్దకంట్రాక్టర్! అందుకే కాస్టలీ హాబిట్స్" అని కుర్రాడు ఆమె చూపులకు జవాబు చెప్పాడు.

"కాదు- నాస్టీ హాబిట్స్!" అంది కోపంగా. ఆమెకు మతిపోయింది. పిల్లలు దార్లోపడేది ఎప్పుడు?

విద్యావిధానము బాగానే వుంది. అన్ని వసతులు వున్నాయి. ఆ వాట్లు, ఆలోచనలే కల్తీ అయ్యాయి. దేశం పెట్టుబడిదారుల చేతుల్లో కీలుబొమ్మ అయినంతకాలం విముక్తిలేదేమో? లైటు ఆర్పింది. చీకట్లో ఎన్నో ఆలోచనలు, ఎన్నో రకాలుగా సమస్యలు.

ప్రతి సివిల్‌సర్జన్‌కో సర్వెంట్ అలాట్ చేస్తారు. ప్రతి సర్జను వారి బంధువులలో ఎవరినో అపాయింట్ చేయించి, జీతంలో సగం తాము కొట్టేస్తారు. ఈ అన్యాయం నశించేది ఎలా?

విద్యావంతులు, మేధావులు చేస్తున్న పనులివి. ఎదిరించినవారు ఇబ్బందులపాలవుతారు.

"ఈ ప్రణాళిక ఫలిస్తే- అనిత బై న్యూకార్ డాళింగ్-న్యూకార్ నిదురలో రాజశేఖర్ కలవరిస్తున్నాడు.

విజయ గాఢంగా నిట్టూర్చింది. పురుషుడి పతనానికి స్త్రీల కోరికలు కారణమని అనుకునేది. కాని తను కారు కావాలన్నదా, హోదా కావాలన్నదా? మగవాడికి అన్ని వ్యసనాలలాగే సంపాదన కూడా ఒక వ్యసనమే కాబోలు!



"టెలిగ్రామ్.... టెలిగ్రామ్ వచ్చిందమ్మా!" బయటి నుండి పనికుర్రాడు అరుస్తుంటే, త్వరగా లేచి వెళ్ళి తలుపు తీసింది. ఆమెకు అదుర్దా ఎక్కువైనా నిబ్బరంగా టెలిగ్రామ్ విప్పింది.

"అరయివింగ్ బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్. విత్ మదర్ —శ్రీ."

"ఏమిటమ్మా?" పనికుర్రాడు ఆదుర్దాగా అడిగాడు.

"పెద్దమ్మగారు, శ్రీహర్షబాబు వస్తున్నారు" తలుపు వేసింది. ఇక ఏ టెన్షన్ భరించే శక్తిలేక, కాంపోజ్ వేసుకుని పడుకుంది.

# 16

అంజని కాలేజీకి వెళ్ళిరావటంతో ఆలోచనలకు తావులేకుండా గడుపుతోంది. ఆమె ఎదురుతిరిగి మాట్లాడినప్పటినుండి బాలాజీ, పద్మ కూడా అవమానించటం తగ్గించారు. ప్రపంచయాత్ర ముగించుకుని వచ్చిన కోటేశ్వర్రావ్ పరిస్థితి మళ్ళీ మొదటికి రావటం చూసి, ఆవేశంతోపాటు ఆవేదన చెందాడు. "ఛీ....ఏం మనుషులు? మనసులు చెప్పినా అర్థంచేసుకోలేరు" అని విసుక్కున్నాడు.

అప్పుడే మూడునెలలు దాటింది బెంగుళూరునుండి వచ్చి. శ్రీహర్ష ఇక్కడికే వచ్చాడని తెలిసినా, అనుబంధాలు పెంచుకోవటం అర్థరహితమని గ్రహించి వూరుకుంది.

కోటేశ్వరరావు మనసులో ఏముందోగాని. మళ్ళీ శ్రీహర్ష, లలితమ్మల పేరెత్తలేదు. అంజని ఒక నిట్టూర్పు వదిలింది.

ఆరోజు ఆయన హడావుడిగా వచ్చాడు. అంజని ప్రక్కన కూర్చున్నాడు.

"అంజూ! నిన్ను ఏనాడూ ఇది చెయ్యి అని ఆజ్ఞాపించలేదు తల్లీ! మీ అమ్మ మనశ్శాంతికోసం, నా పాపప్రక్షాళనకోసం నిన్నో కోరిక కోరుతాను" అన్నాడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని.

"అంతగా ఆలోచిస్తారేం నాన్నా? మీరు ఆజ్ఞాపించాలి" అంది నవ్వు ముఖానికి పులుముకుని.

ఆయన లేచి, కిటికీ పూచలు పట్టుకుని నిల్చున్నాడు.

"అంజూ! మరో గంటలో అమెరికానుండి వచ్చిన వరుడు వస్తాడు. మన సంగతి అంతా చెప్పాను. నిన్ను వివాహం చేసుకోవడానికి అంగీకరించాడు. నువ్వు అంగీకరిస్తే ఆ తల్లీ కొడుకుల ముఖంమీద కొట్టినట్లు వివాహం చేస్తాను. లేదంటే కుళ్ళి-కుళ్ళి ఏడ్వాలి" అన్నాడు. బాలాజీ నిశ్శబ్దం రాజ్యమేలింది.

"మీ ఇష్టం నాన్నా....!" అంది. అతిప్రయత్నంపైన లేచి వెళ్ళిపోయింది.

కోటేశ్వరరావు ఒక్కక్షణం తెల్లబోయాడు. తను ఆశించని సమాధానం. అంజని తెల్లబోయి ఏడుస్తుందనుకున్నాడు. ఆమె హృదయపూర్వకంగా అంటే తనకు కావల్సిందేమిటి? నిమిషంలో అతనికి, అతని తల్లికి గుణపాఠం చెప్పగలడు.

ఆయన మెల్లగా ఆమె గదిలోకి వెళ్ళాడు. ఆయన ఊహించినట్లు ఆమె బాధపడటంలేదు. రికార్డుప్లేయర్ ఆన్‌చేసి కూర్చుంది,

"అంజూ!"

"ఏమిటి నాన్నా?" ఇటు తిరిగింది.

"హృదయపూర్వకంగా అంగీకరించావా అమ్మా?"

"ఇప్పుడీ హృదయంలో తండ్రి తప్ప మరెవరూ లేరని ఇంకా నమ్మించాలి నాన్నా!" అంది.

ఆయన చటుక్కున ముందుకువచ్చి ఆమెను అక్కున చేర్చుకున్నాడు. ఆయన కళ్ళు చెమర్చాయి.

"అంజూ! నన్ను ఎన్నోరకాలుగా విధి శాసించిందమ్మా! అయినా నేను భయపడలేదు. బయట నన్ను చూసినవారికి నా జీవితం స్వర్గతుల్యం. ఇంట్లో నరకం అనుభవించాను. ఆ విధి నిన్ను ఆడిస్తానంటుంది. ఆడిలేవు అని ఆ విధితో పంతం కాస్తానమ్మా?" అన్నాడు ఆవేశంగా.

ఆయనకి దూరం జరిగింది. మతిభ్రమించలేదుకదా? అన్నట్లు చూసింది. ఆయన కళ్ళు తడిగా వున్నాయి.



"ఇంకా మతి చలించలేదు అంజూ! నీ జీవితం మోడువారిపోతే నా మతిపోతుందో, ప్రాణమే పోతుందో చెప్పలేను" అన్నాడు.

"వద్దు నాన్నా. ఆ మాట అనకండి" అంది అర్థింపుగా.

"అయితే నాల్గుగంటలకు రఘువీర్ వస్తాడు. ఈరోజే ఎందుకు పిలిచానంటే వచ్చ, బాలాజీ వుందరు" అన్నాడు.

"అన్నా, వదినా చాలా మారిపోయారు" అంది.

"వారిలోని మార్పు తాత్కాలికమే అంజూ! అబ్బాయి ఈతరంవాడు. తను మెడిసన్ చదవటానికి సహాయం చేశానని అభిమానం వుంది. తల్లిదండ్రులకు నీకు వివాహం అయిన సంగతి తెలియదు. అందుకే మన జాగ్రత్తలో మనముండాలి" అన్నాడు.

జాలిగా చూసింది అంజలి.

'వివాహమయ్యాక తెలిస్తే ఎన్ని సమస్యలు వుంటాయో?' అనుకుంది. ఆమె భావాలు ముఖంమీద చదివినట్లు నచ్చచెప్పాడు.

"చూడమ్మా! రఘుకు ఏ అభ్యంతరమూ లేదు. సాయంత్రం అన్నీ నిశ్చయం అయితే శుక్రవారం వివాహం అవుతుంది. ఆదివారం మీరు ఢిల్లీ వెళతారు. మీరు వచ్చేవరకు పాస్‌పోర్టు తయారుచేయిస్తాను. అతని భార్యగా వెళ్ళటం కుదరకపోతే విడిగా వెళుదువుగాని."

"అలాగే నాన్నా!" అంది.

"రఘువీర్ తల్లితండ్రులు నాందెడ్‌లో సెటిల్ అయ్యారు. వారికీ విషయాలు తెలిసే అస్కారం అట్టేవుండదు" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. కాఫీ తెస్తానని క్రిందికి వచ్చింది.

"అంజనీ! నాకూ ఒక కప్పు కాఫీ యివ్వమ్మా!" బాలాజీ అడిగాడు.

"అలాగే అన్నయ్యా! సాయంత్రం మీరు వుండటంలేదా?"

"లేదమ్మా! జర్మనీనుండి ఎవరో స్పెషలిస్టు వస్తాడట. మీ వదిన సంగతి తెలుసుగా, వెళదాం అంటోంది. ఒకప్పుడు గర్భం వస్తుందని కృత్రిమ పద్ధతులు అవలంభించి, మందులు వాడాం" అన్నాడు.

"ఇంతా విజ్ఞానశాస్త్రం ప్రగతిని సాధించాలన్నయ్యా! ఇద్దరో, ముగ్గురో అయ్యాక ఆపరేషన్ చేయించుకుంటే పోయేది" అంది. కలిపి అందరికీ యిచ్చింది.

ఆమె ద్వైవీభావాలతో సతమతం అవుతోంది. ఇంత తొందరగా తండ్రి తనకు పునర్వివాహం చెయ్యాలని నిర్ణయించుకున్నాడంటే, దాని వెనక ఎంత బాధ వుందో అర్థమవుతోంది. ఎంత బాధనయినా దిగమింగి ఆయనకి ఆనందం కలిగించటమే ధ్యేయంగా పెట్టుకోవాలని నిర్ణయించుకుంది.

సాయంత్రం తండ్రి చెప్పినట్టే చక్కగా ముస్తాబయింది. ఒకపాలి రంగు షిఫాన్ చీర కట్టుకుని తయారయి వచ్చింది. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్టుంది.

"ఆ మంగళసూత్రాలు తీసి బీరువాలో పడెయ్యమ్మా!"

"మంచిది నాన్నా." అంది. అవి తీయాలనుకుంటే, ఆమె ముందు శ్రీహర్ష వచ్చి నిలబడ్డాడు. ఒక్కక్షణం కళ్ళుమూసుకుంది.

'స్త్రీ సెంటిమెంట్ల వలయంనుండి బయటపడ్డనాదే విముక్తి' అజ్ఞాత కంఠము హెచ్చరించింది.

గొలుసు తీసివేయలేక జాకెట్టులోకి సర్దుకుని పిన్నులు పెట్టుకుని వెళ్ళి కారులో కూర్చుంది.

ఇద్దరిమధ్యా మౌనం రాజ్యమేలింది. హోటల్ ముందు కారు ఆగగానే డ్రైవరు తలుపుతీసి పట్టుకుంటే దిగింది.

"హాయ్!"

"నమస్తే!" తలుపు పట్టుకుని నిల్చున్న యువకుడిని విష్ చేసింది, అతనే రఘువీర్ అయివుంటాడని గ్రహించి.

"చాలాసేపయిందా రఘూ?" కోటేశ్వరరావు అడిగాడు.

"జస్ట్ ఫైవ్ మినిట్స్" అన్నాడు చిరునవ్వుతో. ముగ్గురూ లోపలికెళ్ళి, గదిలోకి వెళ్ళారు.

అచ్చు అతనిలాగేవున్న స్త్రీ, ఒక బట్టతల అతను కూర్చున్నారు. ఆమె రఘువీర్ తల్లా, అక్కా? అంచనావేయటం కష్టం అనిపించింది.



ఆమె అనుమానం గ్రహించినట్టు రఘువీర్ పరిచయం చేశాడు.

"అమ్మా! అంజని....మీట్ మై పేరెంట్స్" అన్నాడు.

అంజని వెళ్ళి నమస్కరించింది. వాళ్ళ చూపులలోని సంతృప్తే చెబుతుంది వాళ్ళకు తను నచ్చిందని. నిర్లిప్తంగా వెళ్ళి, ఒక సోఫాలో కూర్చున్నది. ఆమెకిదో కొత్త అనుభవం!

వివాహిత అయిన స్త్రీకి పెళ్ళిచూపులంటే గమ్మత్తుగా అనిపించింది.

"ఏం చదువుకున్నావమ్మా?"

"'లా' మొదటి సంవత్సరం చదువుకున్నానండీ" అంది నమ్రతగా.

"ఏరా రఘూ! అక్కడ 'లా' వాళ్ళకు ప్రాస్పెక్ట్స వుందా?"

"వైనాట్ - ఏం తీసుకుంటావు?" రఘువీర్ అడిగాడు. అతని దృష్టి అంతా అంజని అందమైన ముఖంమీదే వుంది. ఆమె తలయెత్తి చూడగానే చిరునవ్వు నవ్వాడు.

అంజని హృదయంలో శ్రీహర్ష ను చూసినప్పుడు కలిగే సంచలనం, అదుర్దా కలగటంలేదు. సముద్రతరంగంలా ఉప్పొంగటంలేదు. తల వంచుకున్నది.

"రఘూ! నేను బయలుదేరేముందే అన్నీ పంపమని ఆర్డర్ చేశాను. నువ్వేం కంగారుపడకు" అన్నాడు.

"ఎస్" అతని మాటలు పూర్తికాకముందే, రెండు స్వీట్లు, రెండు హాట్లు, పళ్ళు తెచ్చి అక్కడ సర్దారు బేరర్లు.

"ఐస్‌క్రీం పదినిముషాలయ్యాక పంపిస్తాను సర్!" అని అతను వెళ్ళిపోయాడు.

రఘువీర్ లేచివచ్చి, ఒక ప్లేటులో సమోస, పకోడి, స్వీట్స్ పెట్టి అంజనికిచ్చాడు.

"థాంక్యూ!" అంటూ తీసుకుంది. అప్పుడే వేడి వేడిగా నూనెలోనుండి తీశారేమో, గుప్పుమని వాసన వేసింది.

అంజనికి కడుపులో తిప్పినట్టయింది. అలాగే ప్లేటు పట్టుకుని కూర్చుంది.

ఆమె లేచి తనకు ఆఫర్ చేస్తుందేమోనని చూశాడు రఘువీర్.

ఆమె కదలకుండా కూర్చోవడంతో ఒక్క క్షణం తటపటాయించాడు. గాఢ పడినట్టు ముఖంపెట్టి, మరునిముషమే తేరుకున్నాడు. ఆమెను నిందించి లాభంలేదు. ఇద్దరు స్నేహితులు ఏ కారణంచేత విడిపోయినా, ఆ గాయం చాలారోజులవరకు వుంటుంది.

"తీసుకోండి" అన్నాడు తనే ముందు మాట్లాడుతూ.

"థాంక్స్" అన్నది ఆమె. వడలను చూస్తేనే అదోమాదిరిగా వుంటుంటుంచి చేతబట్టుకుంది. 'ఆ నూనె కల్తీదేమో, కంపువాసన కొడుతుంది' అనుకుంది.

కాని మిగిలినవారు చక్కగా తింటున్నారు. మర్యాదగా వుండటానికి త్రుంచిన ముక్క నోట్లో పెట్టుకుంది. అంతే.... భళ్ళున వాంతు అయిపోయింది.

"ఓ....ఏమయింది?" రఘువీర్ లేచి ఆమెను సోఫాలో కూర్చోబెట్టాడు. కోటేశ్వరరావు బాయ్‌ని కేకవేశాడు.

"ఏమ్మా?" ఆదుర్దాగా కూతురి ముఖం చూసాడు.

"అయాం సారీ! ఇంటికి వెళ్ళిపోదాం నాన్నా!"

"అలాగేనమ్మా! కాసేపు విశ్రాంతి తీసుకో" అన్నారాయన. ఆయన మనసు చిరాకుగానే వున్నది. తిండితినే సమయాన వాంతి కావటం అసహ్యకరమయిన విషయం, అశుభసూచకం!

రూమ్‌బాయ్ వచ్చి శుభ్రం చేశాడు. కోటేశ్వరరావు అతనికి అయిదు రూపాయలు యిచ్చాడు.

"ప్లీజ్! ఒక్కసారి టెస్ట్ చేయనా?" రఘువీర్ అడిగాడు.

మౌనంగా తలూపింది.

అతను మెల్లగా అడిగే ప్రశ్నలకు ఆమె జవాబు చెప్పింది. అతని ముఖం గంభీరంగా మారింది. అతను మందులు వ్రాశాడు.

"కోటేశ్వరరావుగారూ! ఆమె బలహీనంగా వుంది. జాగ్రత్తగా మందులు వాడండి" అన్నాడు.

అందరూ సగంలోనే ఫలహారం వదిలేసి, కాఫీ త్రాగారు. అంజని కాఫీ కూడా త్రాగలేకపోయింది.



"ఏదయినా కూల్ డ్రింక్ తీసుకుంటారా?" రఘువీర్ ప్రేమగా అడిగాడు.

"నో థాంక్స్! అవి తలుచుకుంటేనే కంపరం పుడుతోంది. మొన్న వంటావిడ గంజి త్రాగుతుంటే ఆ గంజి త్రాగాలనిపించింది" అన్నది.

రఘువీర్ చిన్నగా నవ్వాడు. ఆ తరువాత ఎంత ప్రయత్నించినా మాటలు సాగలేదు.

కోటేశ్వరరావు మళ్ళీ కలుస్తానని, కూతుర్ని తీసుకుని లేచాడు.

"అబ్బాయికి అమ్మాయి ఎప్పుడో నచ్చింది. మేము చూశాము. బంగారుబొమ్మ అన్నయ్యా! మీరు ముహూర్తాలు పెట్టించి వ్రాయండి...." రఘువీర్ తల్లి తృప్తిగా చూసింది.

"అలాగేనమ్మా! వస్తాం" రఘువీర్ తండ్రికి చెప్పాడు.

అంజని క్రిందకు దిగివచ్చి కారులో కూర్చుంది. కోటేశ్వరరావు రిసెప్షన్ దగ్గరకు వెళ్ళాడు.

"థాంక్స్ రఘువీర్‌గారూ!"

"థాంక్స్ ఎందుకు?" అతను కారు తలుపు వేశాడు.

"మీకు నా విషయం తెలిసిపోయింది. అయినా అందరి ముందూ బయటపెడితే నా పరువు పోయేది" అంది బాధగా.

"ప్లీజ్! టేకిట్ ఈజీ" అన్నాడతను.

"ఈ విషయంలో నాన్నగారు అబద్ధం చెబితే ఆయన తరఫున నేను క్షమాపణ కోరుకుంటాను" అంది.

"ఐ కెన్ అండర్‌స్టాండ్ యువర్ ఫాదర్స్ ఎంగ్జయిటీ" అన్నాడు చిరునవ్వుతో.

"మీ విశాల భావాలకు నా ధన్యవాదాలు" అంది ఆర్తిగా.

"నో మెన్షన్" అన్నాడు. అతని కళ్ళల్లో ఎన్నో ప్రశ్నలు. జవాబు ఒక్కమాటలో చెప్పలేదు. అంతలో కోటేశ్వరరావు వచ్చాడు.

"అమ్మా-నాన్నల అభిప్రాయం విన్నావుగా రఘువీర్?" అన్నాడు ఆనందంగా.

"మీ అమ్మాయి....గర్భవతి....సారీ టు సే సో! ఆమె గర్భవతని

నాకేం అభ్యంతరం లేదు. ఆమెకే వుంటుందేమో...." అన్నాడు.

కోటేశ్వరరావు ఇంకేం వినదల్చుకోలేదు. కారెక్కి తలుపువేశాడు. తలుపు చప్పుడులోనే అర్థమయింది అతని కోపం, అసహాయత!

"రఘూ! రేపు ఫోన్ చేస్తాను" అన్నాడు.

దారిలో తండ్రీ కూతురు ఒక్కమాట మాట్లాడుకోలేదు. అతను తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు. ఆ క్షణంలో అతడిని పలకరించ సాహసించలేదు అంజని.

పద్మ గదిలోనుండి మూలుగు వినిపించింది. ఆమెను ఎంత పట్టించుకోవద్దనుకున్నా మనసు ఆగలేదు.

"వదినా" అంటూ గదిలోకి వెళ్ళింది.

"అంజనీ! నా ప్రాణం పోతుంది, మీ అన్నకు ఫోన్ చెయ్యి..." అన్నది. బాధగా మెలికలు తిరుగుతోంది.

"ఏమయింది వదినా! మీరెక్కడికో వెళ్ళాలన్నారు?"

"అంజనీ మంచినీళ్ళు ఇవ్వు" అంది అటు ఇటు దొర్లుతూ. అంజని మంచినీళ్ళిచ్చి డాక్టరుకి ఫోన్ చేసింది.

"అసలు ఏమయింది వదినా?"

"చెట్టు మందుపోస్తే....కడుపులో మలినం పోతుందంటే....అమ్మా. అమ్మా...." మెలికలు తిరిగింది.

ఆమె కడుపు రాస్తూ కూర్చుండిపోయింది. నాగరికతకు మారుపేరు తన వదిన. ఇంకా చెట్లు, పసర్లు, నాటువైద్యాలు హాస్యాస్పదంగా తోచింది.

ఈనాటి నవనాగరికులే అమ్మలను, బాబాలను నమ్మి, బెల్‌బాటమ్ ప్యాంటుపై సత్యసాయి విభూతి ధరిస్తారని తెలియదు.

డాక్టరు వచ్చి చీవాట్లు వేసి, మందు యిచ్చాడు.

"అమ్మాయ్! ఆ మాత్రలు గంటకొకటి వేయాలి. నాదేంలేదు. ఇక జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత మీది" అని వెళ్ళిపోయాడు.

అంజని మాత్ర యిచ్చి, పాలు త్రాగించింది.

పది నిముషాల్లో నొప్పి తగ్గింది.

"మీరు ఆలోచిస్తూ బుర్ర పాడుచేసుకోకండి వదినా! అన్నయ్యకు



ఫోన్‌చేసి వస్తాను" అంజని ఆమె దుప్పటి సవరించి వచ్చింది.

క్లబ్బుకు ఫోన్ చేసింది.

"అతను ఆట మధ్యలో పిలిస్తే విసుక్కుంటాడమ్మా" అక్కడ ఫోన్ ఎత్తినతను జవాబు ఇచ్చాడు.

"భార్యకు చాలా సీరియస్‌గా వుందని చెప్పండి" అన్నది.

అతను వెళ్ళి పిలుచుకువచ్చాడు.

"నాన్సెన్స్! ఏమిటిది? ఎవరు? అంజనీ! ఆ బిచ్‌కు రోగం లేని దెప్పుడు? ఎంత సీరియస్‌గా వున్నా నాకు ఫోన్ చేయకు. ఛస్తే చెయ్యి. ఐ విల్ బి హాపీ. తలనొప్పి....నువ్వు చూసుకో. లేకపోతే హాస్పత్రిలో చేర్పించు" అన్నాడు బాలాజీ.

అతనితో ఒక్కమాట మాట్లాడలేక ఫోన్ పెట్టేసింది. భార్యంటే అంత చులకనా?"

"వస్తున్నారా అంజనీ?" నీరసంగా అడిగింది పద్మ.

"ఆఁ వస్తారు వదినా....ఎవరో గెస్టులు వచ్చారట" అన్నది.

"నాకు తెలుసు అంజనీ! ఆయనకు నేనంటే రవ్వంత కూడా ప్రేమ లేదు. హాస్పత్రిలో పారెయ్యి అనివుంటాడు" వెక్కివెక్కి ఏడ్చింది.

అంజనికి ఎలా ఓదార్చాలో తెలియదు. తెల్లవార్లూ ఆమె మంచము దగ్గరే కూర్చుంది. ప్రొద్దున కాఫీ త్రాగింది. తనూ తీసుకుంటుండగా కోటేశ్వరరావు పిలిచాడు.

"డాక్టర్ సుధారావ్ దగ్గర అపాయింట్‌మెంటు తీసుకున్నాను. పది గంటలకు వెళదాము" అన్నాడు.

"అలాగే వెళదాము" అన్నది జడ విప్పుకుంటూ.

"ఎందుకని అడగవేం? చెకప్‌కు కాదు, అబార్షన్ చేయిస్తాను" అంటుంటే అతని గొంతులో కఠినత్వం కరకరలాడింది.

"మంచిది నాన్నా!" అన్నది.

అతను మరేం మాట్లాడలేదు. అరగంటలో అంజని తయారయి వచ్చింది. ఇద్దరే బయలుదేరారు.

"అంజూ! బాలాజీ, పద్మ అవకాశవాదులు. వారికెంత దూరం వుంటే

అంత మంచిది" అన్నాడు.

"మంచిది నాన్నా! రాత్రి ఆమె చాలా బాధపడ్డాను" అన్నది.

"నీకు అబార్షన్ అంటే బాధగా వుందా?"

"నాన్నా! అలాంటి ప్రశ్నలు అడగవద్దు. కేవలం నేను మీ కూతుర్ని. మీకు ఇష్టమైన పని ఏదయినా చేస్తాను."

"అమ్మా!"

"అవును నాన్నా! నాకు మిగిలింది మీరు. మీకు మిగిలింది నేను. మీ కోసం ఏమయినా చేస్తాను" అన్నది. అతను ఆ మాటలకు పులకించి పడ్డాడు. ఇద్దరూ లేచి డాక్టరు దగ్గరకు వెళ్ళారు. ఆమె పరీక్ష చేసింది.

"డాక్టర్! ఒక్క నిమిషం" కోటేశ్వరరావు ఆమెను విడంగా తీసుకు వెళ్ళాడు. అంజని గుండె దడదడలాడింది. ఒక్కసారి తను శ్రీహర్షతో పంచుకున్న మధురమైన క్షణాలు గుర్తుకు వచ్చాయి.

"ఒక్క బెడ్ అయితే చాలు. ఎంత ఖాళీగా వుందో చూడండి" అతని కైదండ అందగా చేసుకొని పడుకొని అడిగింది.

"ఆ ఖాళీస్థలం ఇద్దరు పాపలకే సరిపోతుంది."

"మరిద్దరుకాక సబ్బరు కావాలా?"

"ఉహూ! అంజూ! మనకు ఇంటినిండా పిల్లలుండాలి ఎప్పుడూ. ఇల్లు పిల్లల కేరింతలతో, ఏడుపులతో కళకళలాడుతుండాలి" అన్నాడు. కాని విధి ఎంత క్రూరంగా ఆడుకుంటుంది తమ జీవితాలతో. ఊపిరిపోసుకోకముందే అతని బిడ్డను అంతం చేస్తుంది. ఆమె కళ్ళు ఒత్తుకుంటుండగా కోటేశ్వర రావు వచ్చాడు. ఆమె కంగారుగా ముఖం దాచుకుంది.

"పదమ్మా!"

అంజని లేచి ఆపరేషన్ థియేటర్‌వైపు నడిచింది.

"మరేం పరవాలేదమ్మా. ఇప్పుడు వెళ్ళొచ్చు. విజయకు చెబుతానులే" నవ్వింది డాక్టరమ్మ. అప్పటికే కోటేశ్వరరావు వెళ్ళి కార్లో కూర్చున్నాడు. అంజని వచ్చి తండ్రి ప్రక్కన కూర్చుంది.

"ఆలస్యం అయితే అబార్షన్ కష్టం నాన్నా" అనబోయి మాట మింగేసింది. ఈ దారుణమైన బాధకంటే అదే మేలనుకుంది.



ఇంటికి రాగానే కోటేశ్వరరావు వెళ్ళి మందులు తెచ్చాడు.

"మందులతో గర్భస్రావం అవుతుందని చెప్పిందేమో" అనుకున్నది గానీ మందులన్నీ పాప ఆరోగ్యంగా పెరగటానికిచ్చేవి. అర్థంకానట్టు తండ్రివైపు చూసింది.

"అంజూ! మీ అందరికంటే ముందు నేను గాఢంగా ప్రేమించి, అభిమానించిన వ్యక్తి ఆనంద్‌బాబు. ప్రేమంటే స్త్రీ పురుషుల మధ్య సంబంధం అనుకుంటారు కాని....అభిమానానికి, అనురాగానికి హద్దులు లేవమ్మా" కళ్ళు తుడుచుకున్నాడు.

"మీరు....మీరు ఏడుస్తున్నారా నాన్నా?"

"ఆనంద్‌ను అగ్నికి ఆహుతిచేసి ఇంతకంటే ఎక్కువే ఏడ్చాను. అతని సంతానాన్ని నాశనం చేయలేనమ్మా, చేయలేను. అతని గుర్తుగా పెంచుతాను" అన్నాడు.

"నాన్నా" పసిపిల్లలా తండ్రిని వాటేసుకుని బావురుమంది.

"వెళ్ళు....వెళ్ళి మందులు వేసుకో" అన్నాడు తలనిమిరి.

ఆమెకు ఒక్కసారి సంతోషంగా గంతులు వేయాలని వుంది. ఎవరి కోసమయినా తన సంతోషం పంచుకోవాలని వుంది. క్రిందకి వచ్చి ఓ నెంబర్ డయల్ చేసింది.

"హలో! సెవెన్ ఫోర్ త్రీ నైన్ వన్....శ్రీహర్ష హియర్....హల్లో....హల్లో" అతను ఫోన్ కట్ చేశాడు.

'ఈ సంతోషం చాలు' అనుకుంది.

"అంజనీ! మీ వదిన పిలుస్తుంది" బాలాజీ వచ్చి చెప్పాడు. ఆమె అతనిని ఆశ్చర్యంగా చూసి, పైకి వెళ్ళిపోయింది.

## 17

అప్పుడే తండ్రి మరణించినట్టు ఆవేదన చెందే తల్లిని ఎలా ఓదార్చాలో తెలియని శ్రీహర్ష హైదరాబాద్ వచ్చేశాడు. విజయను చూస్తూనే విషయం చెప్పి మరోసారి మూర్ఛపోయింది లలితమ్మ.

విజయ ఓదార్చింది. స్వీటీ మాటలతో కొంతవరకు కోలుకున్నా ఏదో పోగొట్టుకున్నట్లు వుంటుంది. శ్రీహర్షకు ఏంచేయాలో తోచలేదు. రాజశేఖర్ తనతో చేరి కంట్రాక్ట్స్ చెయ్యమంటున్నాడు. కాని అది హర్షకిష్టంలేదు.

ఉద్యోగం వెదుక్కుంటూ తిరుగుతున్నాడు. రోజూ ఒక్కసారయినా శ్రీహర్షకు ఫోన్ వస్తుంది. అవతలి పేరు చెప్పరు. సరిగ్గా తనింట్లో వుండే సమయాన చేస్తున్నారు.

బ్యాంక్‌లో టెక్నికల్ ఆఫీసరు పోస్ట్ వుండంటే అప్లయి చేశాడు. ఎన్ని రికమండేషన్లో! ఈసారి ఉద్యోగం రాకపోతే తిరిగి బెంగుళూరు వెళ్ళిపోవటానికే నిశ్చయించుకున్నాడు. వసంతరావు సలహాపైన కలిసి వెళ్ళి వచ్చాడు.

ఇంటర్వ్యూకని చదువుతున్నాడు. స్వీటీ వచ్చింది.

"మామయ్యా నన్ను జూకు తీసుకువెళ్ళవూ?"

"మనల్ని చూసుకుంటున్నాము చాలుగానీ ఇంకా జూ ఎందుకు?" అన్నాడు విసుగ్గా.

"మమ్మీకి చెబుతానుండు" కాళ్ళీడుస్తూ వెళ్ళిపోయింది శ్వేత.

పుస్తకం తీశాడు.

"నాయనా శ్రీహర్షా! ఈ విడ్డూరం విన్నావట్రా! కూతురికి మళ్ళీ పెళ్ళి చేస్తున్నాడట ఆ కోటీశ్వరుడు కోటేశ్వరరావు" అంటూ వచ్చింది లలితమ్మ.

"అమ్మా! అతనితో మనకే సంబంధం లేదనుకున్నాము. అతని గురించి మర్చిపో. అతని కూతురు, అతనిష్టం అన్నాడు.

"మాటవరసకు అన్నానులే" అన్నది. ఇక అక్కడుంటే ఇంకేం వినవలసి వస్తుందోనని అతను బయటికి వెళ్ళిపోయాడు. అతనికి చాలా అశాంతిగా వున్నది. ఇదివరకు రాజా, విజయలను చూస్తే దాంపత్యానికి నిర్వచనంగా వుండేవారు.

ఇప్పుడు ఒకరికి ఒకరు ప్రత్యర్థుల్లా తయారయ్యారు. శ్రీహర్ష మనశ్శాంతి బొత్తిగా కరువయింది. ఇద్దరికి నచ్చచెప్పాలని ప్రయత్నించి



విఫలమయ్యాడు. మగాడినన్న అహం రాజశేఖర్‌కు బాగా నాటుకుపోయింది.

"చూడు శ్రీ! బయట తిరిగే మగాడు ఎన్నో వేషాలు, మోసాలు వేసుకోనిదే సంఘంలో మనిషిలా నిలబడలేడు, అది అర్థమవదు మీ అక్కకు" అన్నాడు.

"అక్కయ్యా! బావ అభిప్రాయాలు విన్నావుగా?"

"వింటున్నాను. ఎవర్ని ఉద్ధరించాలని ఈ వేషాలు, మోసాలు అడుగు శ్రీ. మనకిప్పుడంత అవసరం ఏమొచ్చింది?" అంటుందామె.

"అది కావాలి, ఇది కావాలని వేధించే భార్యలుంటే అభిప్రాయం వర్తిస్తుంది బావా! అక్క నర్థంచేసుకోండి!" అన్నాడు.

"అవున్లే! ఆమె నీ అక్క. ఆమె అన్నమాటలు నచ్చుతాయి. ఆమెను సమర్థిస్తావు" అని రాజశేఖర్ నిష్ఠూరం ఆడాడు.

భోజనాల సమయంలో మెల్లగా విజయతో విషయం కదిపాడు.

"శ్రీ! మనిద్దరం ఒకరినొకరు ఎరిగినంతగా ఎవరూ ఎరగరేమో, మనం బయటవారితో తన్నులు తిని కూడా అమ్మతో చెప్పొద్దనుకుని ఒక్క మాటమీద నిలిచాము. నీ అక్కగాకాక ఒక వ్యక్తిగా చూడు. నేను అనుచితంగా, అన్యాయంగా ప్రవర్తించిన సంఘటన ఏదయినా వుంటే చెప్పు" అందామె.

ఏం చెబుతాడు?

తండ్రి లేకనేమో అన్యాయంగా మాట్లాడటం, ఆశలు పెంచుకోవటం చేయలేదు. విజయను అందరూ ఇష్టపడతారు.

"అదికాదక్కా! బావ బయటివాడు కదా? మన ఆశయాలు, అభిరుచులు వేరుగా వుండొచ్చు. అది అర్థంచేసుకో!"

"ప్రయత్నిస్తాను" అంది.

ఆ రోజంతా ఇండస్ట్రీ గురించి చదువుతూ ఇంట్లోనే కూర్చున్నాడు. రాంగ్‌నంబర్ ఎత్తి, విసుగ్గా వుంటే, కాఫీ త్రాగుతుండగా రాజా వచ్చాడు.

"శ్రీ! ఒక చిన్నపని చేస్తావా?"

"చెప్పు బావా?"

"ఇప్పుడొక పెద్దమనిషి వస్తాడు. నాకోసం అడుగుతాడు. పూజలో వున్నాడని చెప్పు. మరో ఐదునిమిషాలకు మీకోసమే పూజ ముగిం వస్తుంటే సి.ఎం.గారు ఫోన్ చేశారని చెప్పు."

"అదేమిటి బావా?"

"ఆఫీసరులా కొశ్చన్లు వెయ్యకు. చెప్పినట్టు చెయ్యి."

"ఓ.కె!" అన్నాడు శ్రీహర్ష. అతనికి రాజశేఖర్‌ను వదిలిపెట్టడం ఇష్టంలేదు. 'అతనితో స్నేహంగా వుండే అతని పద్ధతులు మార్చాలి' అను కున్నాడు.

"అన్నట్టు మరిచానోయ్! నీకిష్టమో, లేదో ఒక చిన్న...." ఆగాడు రాజా.

"చెప్పండి బావా....ఏం చేయాలి?"

"కాసేపు నా పి.ఏ.గా నటించు."

శ్రీహర్ష పకపక నవ్వాడు.

"నటించడం ఎందుకు? నా కిప్పుడేం పనివుంది? పి.ఏ.గా ప చేస్తాను. జీతం ఎంతో చెప్పండి?" అన్నాడు.

"జీతం సంగతి తర్వాత, మొదట కాసేపు నటించవయ్యా! ఈ సొసైటీలో మూవ్ కావాలంటే ఎన్నో వేషాలు వెయ్యాలి" అన్నాడు కట్టుకుంటూ.

ఇంతలో బయట బెల్ మ్రోగింది.

"వెళ్ళు హర్షా- ప్లీజ్!" రాజశేఖరం లోపలికి వెళ్ళిపోయాడు. శ్రీ హర్ష వెళ్ళి తలుపుతీశాడు.

"నేను ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ని. రాజశేఖరంగారి కలుసుకోవాలని వచ్చాను" అన్నాడు మర్యాదగా.

"రండి!" తీసుకువచ్చి డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చోబెట్టి కూర్చ్రు యిచ్చాడు.

"వారిని పిలుస్తారా?"

"ఈ సమయంలో పూజలో వుంటారు. చూసివస్తాను" లోపలి వెళ్ళాడు. రాజశేఖర్ పరదా చాటున నక్కి నాటకం చూస్తున్నాడు. చేయి



పించాడు ఫోన్ చేస్తున్నట్టు.

శ్రీహర్ష బయటికి వచ్చాడు.

"మీరు వస్తానని చెప్పారట. అందుకే ప్రయాణం ఆపుకుని కూర్చు న్నారు. ఇప్పుడే సి.ఎం. ఫోన్ వచ్చింది" మనసున్న మనిషికి అలాంటి అబద్ధాలు ఆడాలంటే ఎంత నరకమో మొదటిసారి అర్థమయింది.

పది నిమిషాల తర్వాత పట్టులుంగీ చుట్టుకుని, చెవిలో పువ్వు, నుదుట కుంకం దిద్దుకుని వచ్చాడు రాజశేఖరం.

"సారీ చారిగారూ! నాకు చాదస్తం ఎక్కువ. పూజ కావల్సిందే!"

"ఎంతమాట? చాదస్తం అంటారా? తరిగిపోతున్న విలువలను పున రుద్ధరించటం, సంస్కృతిని నెలకొల్పటం కాదా?" అన్నాడు. ఆయన లెంపలు వాయించుకుంటూ.

రాజశేఖరం చిదంబరంగా నవ్వాడు.

శ్రీహర్షకు అర్థమయింది. చారిగారు పరమభక్తుడని, అతని అభి ప్రాయాలతో ఏకీభవించాలని తన బావగారు ప్రయత్నిస్తున్నాడని.

"పి.ఏ. నా డైరీ తెచ్చి, ఆదివారం ఎంగేజిమెంటు చూడు" రాజ శేఖరం పిలిచాడు. ఆలోచన ఆపి వెళ్ళాడు.

డైరీ తిరగేసి, మొదటే అనుకున్నట్టు శ్రీహర్ష పెదవి విరిచాడు. "సో డా...సారీ! నో సర్. ఆ రోజంతా మీరు చాలా బిజీగా వున్నారు. రెండు ప్రారంభోత్సవాలు, ఆరంగేట్రం మీటింగ్స్" అన్నాడు పెదవి విరిచి శ్రీహర్ష.

అప్పుడే విజయ స్వీటీని తీసుకుని వచ్చి, అందరినీ చూసింది.

"మీట్ మై వైఫ్ డాక్టర్ విజయ, లీడింగ్ గైనకాలజిస్ట్" అని పరి చయం చేశాడు రాజశేఖరం. అతను కంగారుపడుతున్నాడు.

"ఐసీ....గ్లాడు మీట్ యూ" చారి అన్నాడు.

"నమస్తే!" విజయ విష్ చేసింది. భర్త ముఖం ఎందుకలా అయిందో అర్థంకాలేదామెకు.

"పి.ఏ.గారూ! ఏదో ఒక సమయం చూసి ఫిక్స్ చేయండి" అన్నాడు చారి.

శ్రీహర్షకు ప్రాణం పోతున్నట్టుంది, ఆ పరిస్థితి ఎలాగైనా తప్పించాలనిపించింది.

"చారిగారూ! మీకు అనుకూలంగా వుండే సమయం చూసి ఫోన్ చేస్తాను. మీరు వెళ్ళిరండి" అన్నాడు హడావుడిగా.

"థాంక్యూ రాజశేఖరంగారూ! మీ ఎస్టేట్ను ఒకసారి చూడాలి" అన్నాడు వెడుతూ వెడుతూ.

"అలాగే!" అని చేతులు జోడించాడు. ఆయన వెళ్ళిపోయారు.

"ఈ వేళప్పుడు వచ్చావేమక్కా?" శ్రీహర్ష తన కంగారు కప్పిపుచ్చుకుంటూ అడిగాడు.

"స్కేటీ వాళ్ళ బడిలో ఎవరో పోయారట. నాకు ఫోన్ చేశారు. నాకు కూడా తలనొప్పిగా వుంది. వచ్చేశాను. నువ్వెప్పుడు మీ బావగారి పి.ఎ.వి. అయ్యావు?"

శ్రీహర్ష ఆర్టిఫిషియల్గా నవ్వాడు.

"అది కాదక్కా....!"

"ఒక్క విషయం శ్రీహర్షా! అబద్ధాలతో జీవితం సాగిస్తాననుకోటం మూర్ఖత్వం" అంది తీక్షణంగా.

శ్రీహర్షకేం పాలుపోలేదు.

"చూడు శ్రీ! పనిలేక కూర్చుంటే ఇలాంటి పనికిమాలిన ఆలోచనలు వస్తాయి. అసలు మన నెత్తిన ఏదో శని కూర్చుంది." విజయ విసుక్కుంది. లలితమ్మ ఎప్పుడూ ఆలోచిస్తూ కూర్చుంటుంది. ఆమె డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంది. ముందు వారపత్రిక వున్నా, అది తిరగవెయ్యటంలేదు.

"అదికాదు విజయా! అతను మినిస్టరుగారికి చాలా దగ్గరవాడు. మన టెండర్...." రాజశేఖరం సంజాయిషీ యివ్వబోయాడు.

విజయ తిరిగిచూసింది. అతను ముఖం తిప్పుకున్నాడు.

విజయ చకచక ఓ నంబరుకు ఫోన్ చేసింది.

"హల్లో జగపతిగారున్నారా?....డాక్టర్ విజయని చెప్పండి. హల్లో జగపతిగారూ! నమస్తే....ఒక చిన్న ఫేవర్ కావాలి. ఇంకా ఆశయాల



ఎక్కడున్నాయి! మా తమ్ముడు మీ బ్యాంక్లో టెక్నికల్ ఆఫీసరు పోస్ట్ ఇంటర్వ్యూకి వ్రాశాడు. దయచేసి కాస్త ఫేవర్ చెయ్యండి....వాడికి స్పెషల్గా ఇవ్వద్దు. ఇంటర్వ్యూకి వస్తే మరొకరికి ఫేవర్ చెయ్యకుండా చూడండి. థాంక్యూ....థాంక్యూ" అన్నది ఫోన్ పెట్టేసింది.

"జగపతిగారు నీకు తెలుసా విజ్జీ?" రాజశేఖరం ఆశ్చర్యంగా అడిగాడు కోపం, కంగారు మరిచి.

జగపతి పేరు వినగానే నాదస్వరం విన్నపాములా అయ్యాడు.

"ఈమధ్యే వాళ్ళ ఏకైకపుత్రికకు ఆపరేషన్ చేశాను. ఆవిడకు ప్రాణాపాయం అన్నారట. నేను కాపాడానని ఓ వెర్రి అభిమానం" కాస్త వెటకారంగా అంది.

అతనితో చాలా పనివుంది డార్లింగ్! బ్యాంకులన్నీ అతని చేతిలో వున్నాయి" తబ్బిబ్బు అయిపోయాడు.

"తెలుసు! అందుకేగా ఆత్మను చంపుకుని చేసినదానికి మరో రూపంలో ప్రతిఫలం తీసుకుంటున్నాను" అన్నది.

"భలేదానివి విజయా! ప్రపంచంలో అన్నిటికన్నా ఖరీదయినది, ఎవరూ ఇవ్వలేనిది ప్రాణం. ఆ ప్రాణం యిచ్చావు. దానికి ప్రతిఫలంగా చిన్న ఫేవర్ అడిగావ్ అంతేకదా" అన్నాడు.

విజయ చిరాకుగా చూసింది.

"మీ స్వంత యిల్లు" అనే పథకం క్రింద కట్టే ఇండ్లకు కంట్రాక్ట్ సంపాదించటానికి ఎంత కష్టపడ్డానో నీకు తెలుసుగా. కొన్నిసార్లు డబ్బు చాలా అవసరం సిమెంటుకు దానికి కావాలి. ఓవర్ డ్రాఫ్ట ఇప్పించు చాలు" అన్నాడు పూర్తిగా తగ్గిపోతూ.

"రాజా! ఇన్నాళ్ళు అవసరంలేదా?" తీక్షణంగా చూసింది.

"ఎక్కడ కాస్త ఇన్ఫ్లూయెన్స్ ఉన్న మనిషి కనిపిస్తే అక్కడే అడగటం ఐ హేట్ యిట్" అన్నది కాస్త కోపంగా.

"ఇన్నాళ్ళు అవసరానికి వేలకువేలు కోటేశ్వరరావ్ సర్దాడు. మొన్న వెళితే పురుగును చూసినట్టు చూశాడు" అన్నాడు.

"ఏమిటి? కోటేశ్వరరావు దగ్గర డబ్బు తెచ్చేవారా?" అక్క

తమ్ముడు ఒక్కసారే అడిగాడు.

"మరి వ్యాపారమంటే డబ్బు పెట్టిస్తేనే డబ్బు వస్తుంది" అన్నాడు.

ఇద్దరూ మాటరానట్టు వుండిపోయారు. విజయకు తెలుసు. తను ఒక్కమాటన్నా రెచ్చిపోవాల్సివస్తుందని. ఆమె వెంటనే గదిలోకి వెళ్ళి పాటలు వేసుకుని కూర్చుంది.

శ్రీహర్ష కూడా ఒకసారి బావగార్ని చూసి బయటికి వెళ్ళిపోయాడు.

స్వీటీకేం అర్థం కాలేదు. "డాడీ ఏమిటిది?"

"ఫూలిష్‌నెస్!" అన్నాడు కసిగా. అతను కార్యవాదిగా పని చేయాలనుకున్నాడు. అందుకే మెల్లగా తలుపు తోసుకుని విజయ దగ్గరకు వెళ్ళాడు. ఆమె టేప్‌రికార్డర్ ఆఫ్ చేశాడు.

"విజ్జీ! నన్ను అర్థంచేసుకో. నాకంతకంటే మార్గం కనిపించలేదు. అయామ్ సారీ....రియల్లీ సారీ" అన్నాడు ఆమె పక్కన కూర్చుని.

విజయకు ఆశయాలున్నా, అంతకుమించిన ఆర్ద్రత, క్షమాగుణం వున్నాయి. తాడు తెగేవరకు లాగటం యిష్టపడదు.

"రాజా! ఆశకంతు వుండాలి. మనమెప్పుడూ మనకంటే క్రిందివారిని చూడాలి. సుఖపడతాం" అన్నది.

"లే....లే చాలారోజులయింది సినిమాకు వెళ్దాం" అన్నాడు. రెండు రోజుల తరువాత స్వీటీని తీసుకుని సినిమాకు వెళ్ళారు. లలితమ్మ తేలికగా నిట్టూర్చింది. బయటనే భోజనం చేసివచ్చారు. స్వీటీని తల్లిగదిలో పడుకో బెట్టి వచ్చింది విజయ.

ఆమె స్నానంచేసింది. ఆమెకు చిన్నప్పటినుండి ఒక అలవాటుంది. పడుకోబోయేముందు స్నానం చేస్తుంది.

"సుఖనిదుర, సుఖదాంపత్య జీవితానికి దోహదం చేస్తుందీ స్నానం" అంటుందామె.

"బొత్తిగా దాపరికంలేదు పిల్లకు" అని విసుక్కునేది లలితమ్మ.

రాజాకూడా స్నానంచేసి వచ్చాడు.

"చూడు రాజా! సంవత్సరం తిరగకుండా కారుకొన్నావ్. ఇంతలో అంత డబ్బు టర్న్ ఓవర్ అవుతుంది అప్పనా?" అన్నది.



"యస్ డార్లింగ్! నా ఇంజనీరు ఉద్యోగంచేస్తూ, నీకు రెండుపూటల భోజనా పెట్టేవాడినా?" అన్నాడు కూర్చున్న ఆమె వడిలో తలపెట్టి పడుకుంటూ.

"రాజా! నిన్ను చూస్తుంటే నాకు ఇంకో బాబు అక్కరలేదనిపిస్తుంది తెలుసా!" అన్నది.

"అదేం?" కొద్దిగా లేచి చూశాడు.

"నువ్వే బాబులా వున్నావ్. దొంగతనంచేస్తే ఇంకా డబ్బు వస్తుంది బాబూ! ఈ కాంట్రాక్టర్లు చేసినంతగా దోపిడీ ఎవరూ చెయ్యరేమో! పనిలో దెబ్బయిబదు శాతం లాభాలేకదా."

"మరి అందుకే చేబట్టానోయ్."

"అదే చెబుతున్నాను రాజా! జ్ఞానం లేనివారు గుత్తాదారులు దేశాన్ని అడ్డదారి పట్టిస్తున్నారని, అనుకుంటే విద్యాధికులు మీలాంటివారేం చేస్తున్నారు? వద్దు రాజా వద్దు. ఎందరి కడుపులు మాడుతున్నాయో ఆలోచించావా?"

"విజయా! అవన్నీ ఆలోచిస్తే, నువ్వు డాక్టరుగా పనికిరావు. ఎవరి స్కిల్ వారు ప్రదర్శించుకోవాలి" అన్నాడు మళ్ళీ నితారుగా పడుకుని.

అతను ఇప్పుడామె చెంపదెబ్బలు వేసినా కించిత్తు బాధపడే స్థితిలో లేడు. అతని కళ్ళముందు జగపతిగారు, అతని పలుకుబడి గిరగిర తిరుగుతున్నాయి. విజయద్వారా అతని ప్రాపకం, పరిచయం సంపాదించాలి. అందుకే విజయను రెచ్చగొట్టడం ఎంతమాత్రం మంచిదికాదని అర్థమయిపోయింది.

"ఏయ్! నన్ను బాబుతో పోలుస్తావుకదూ! బాబునో, ఆ బాబు బాబునో చూపిస్తాను" అంటూ ఆమెను కౌగలించుకున్నాడు.

"రాజా....ఏ...." ఆమెను మాట్లాడనియ్యలేదు.

# 18

కోటేశ్వర్రావు ఇంట్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు అంజనిని కూతురిలా చూసుకుంటుంది. బాలాజీ అంతే "అం అంజూ" అంటూ పిలుస్తాడు. కోటేశ్వరరావే చిత్రంగా మారిపోయా. కొడుకు, కోడలు ఆయనముందు అతిగా మాట్లాడితే చాలా కోపం చూస్తాడు.

"అంజూ! వాళ్ళని నమ్మటానికి వీలులేదు. జబ్బుపడితే చాకిరీ చే పని మెహర్బానీ చూపుతున్నారు" అనేవాడు.

"పోనీలెండి నాన్నా! పగతో పగ ఆరిపోదు. వాళ్ళు మంచిగా ఉన్నా రని నేనూ మాట్లాడుతున్నాను" అనేది నవ్వుచెప్పే ధోరణిలో.

"అయిదోనెల రాగానే సీమంతం చేస్తానని పద్మ హడావుడి చేసింది అంజని మృదువుగా తిరస్కరించింది. ఆమె కొత్తచీర, పళ్ళు కొనిచ్చింది పొట్ట కనిపిస్తుంటే కాలేజీకి ఎలావెళ్ళాలో అర్థంకాలేదు కాని అప్పటి సెలవులిచ్చేశారు,

ఏడవనెల కూడా వచ్చింది. ఆరోజు వుదయమే లేచి మెల్లగా లాం లోకి వచ్చింది. ఆమెకిప్పుడు, ఆలోచించి, బాధపడటం అవివేకమని తెలి పోయింది. ఆమె ఆలోచనలు తనకు పుట్టబోయే పాపపైనే వున్నాయి.

మల్లెతీగ ఆకులుదూసి, ప్రక్కనున్న బోగన్‌విల్లా ఆసరాగా కట్టింది. ఈ ప్రపంచంలో స్వేచ్ఛ కావాలనుకుంటాముగాని, అది కొం వరకే అవసరమేమో! బంధనములో వుండే ఆనందం మరి దేనిలో లేదేమో!

"అంజూ!"

"తనకేమయింది! ప్రతినిముషం శ్రీహర్ష వచ్చినట్టే అనుభూ పొందుతుంది."

"అంజూ!"

ఈసారి ఇటు తిరిగి చూసింది. ఆమె ఊహకాదు. నిజమే నిజంగా శ్రీహర్ష నిలబడి వున్నాడు. గ్రేకలర్ సూటులో అందంగా, హుందా



ఉన్నా, కాస్త వయసు పెరిగినట్టు అనిపించింది.

"ఏమిటలా చూస్తున్నావ్?" ఆ ప్రశ్నలోని ఆప్యాయతకి, అనురాగానికి చలించిపోయింది. ఒక్కసారి అతని చేతులలో వాలి బావురుమని ఏడవాలనిపించింది. ఏడ్చేవారంటే శ్రీహర్షకెంత చిరాకో ఎరగనిదికాదు. అందుకే బలవంతంగా తన భావాలను అదిమిపట్టింది.

"మీరు....మీరు...."

"అంజూ! నువ్వు నాకు బెంగుళూరులో ఉత్తరం వ్రాశావ్ మరిచిపోయావా? ఎక్కడున్నా మన పెళ్ళిరోజు కలుసుకొమ్మని."

"మీకు....మీకు గుర్తుందా?" అన్నది కళ్ళు మిలమిల మెరుస్తుండగా.

"మరిచిపోదగిన బంధమా?" అన్నాడు ఆర్తిగా.

"కూర్చుందాం రండి" అక్కడున్న సిమెంట్‌బెంచీ చూపించింది. దానిపై దుమ్ము పమిటతో దులిపింది. ఈసారి ఆమె శరీరంలో వచ్చిన మార్పులు స్పష్టంగా కనిపించాయి.

"అంజూ!" అన్నాడు ఉత్తేజితుడయినట్టు. తమ ప్రేమఫలం, తమ దాంపత్య జీవితానికి ఆలంబన సంతానము. అది ఆనందం, గర్వం కలిగిస్తుంది. "కూర్చోండి" అన్నది.

"అంజూ! మీ ఆడవాళ్ళు చాలా కఠినాత్ములు" అన్నాడు.

"మరి ఆ కఠినత్వం అలవరుచుకోకపోతే అసలు బ్రతుకలేము. మగాడుచేసే మోసాలు, వేషాలు తట్టుకోవాలికదా?" అన్నది నవ్వుతూ.

"మాట్లాడటం బాగా నేర్చావు" అన్నాడు ఆదరంగా ఆమె చెయ్యి పట్టుకుని ఇద్దరూ కూర్చున్నారు. ఎన్నో మాట్లాడాలని వుంది. ఇద్దరికీ మాటలు కరువయినట్టు కూర్చుండిపోయారు. అతని భుజంపై ఆమె తల వాల్చింది. అలాగే ఇద్దరూ చాలాసేపు కూర్చున్నారు.

"అమ్మాయిగారూ!" పని కుర్రాడి పిలుపుతో ఆమె చప్పున లేచి నిలబడింది కంగారుగా.

"అయ్యగారు నాస్తకాడ కూసున్నారు."

"వస్తాను, నువ్వుపద" అన్నది. అతను వెళ్ళిపోయాడు.

"పదండి" అన్నది రెండు అడుగులువేసి.

"అంజూ! ఇప్పుడు మనము అంతా మరిచి సంతోషంగా గడపాలను కున్నాము కాని, మనసు పాడుచేసుకోవాలనుకోలేదు. ఆయనను చూడగానే నాకు ఆవేశం వస్తుంది. నన్ను చూడగానే ఆయనకూ వస్తుందని నాకు తెలుసు" అన్నాడు.

ఆమె జవాబు చెప్పలేదు. అతని చేయి పట్టుకుంది.

"సాయంత్రం హోటల్ మూన్‌లైట్‌కు వచ్చేయి అంజూ!" అని అతను లేచి రెండు అడుగులు వేశాడు.

"మరిచేపోయాను ఇదిగో స్వీట్. చేతిలో చిన్న ప్యాకెట్టుతీసి ఆమె కందించాడు. ఆమె అది అందుకుని, ప్యాకెట్టువిప్పి, ఒక కోవాబిళ్ళ తీసి అతని నోటికి అందించింది.

"థాంక్స్...." ఆమె చేతిలో బిళ్ళ అందుకుని, ఆమె నోట్లో పెట్టాడు. ఆమె నోటమాట రాలేదు కాని, కళ్ళనుండి రెండు అశ్రుబిందువులు రాలాయి.

"ఎన్నోనెల అంజూ?"

"ఏడు" అన్నది తల వంచుకుని.

"సాయంత్రం వస్తావుకదూ?" అరి కాళ్ళకు చక్రాలు వచ్చినట్టు చక చక నడిచి వెళ్ళిపోయాడు.

అంత త్వరగా ఎందుకువెళ్ళాడో ఆమెకు అర్థంకాలేదు. రెండు అడుగులువేసి ఆగిపోయింది. వరండాలో తండ్రి నిలబడి వున్నాడు. ఆమె తలయెత్తి చూడలేకపోయింది.

"నాన్నా! క్షమించండి. అతడిని నేనే మా పెళ్ళిరోజు వచ్చి కనిపించమని కోరాను" అని తల ఎత్తకనే లోపలికి వెళ్ళింది.

"రా అంజూ! నీకిష్టమైన ఫలహారం చేయించాను. మీ అన్నయ్య ఉడుక్కుంటున్నారు" నవ్వింది పద్మ.

అంజని నవ్వే మూడ్‌లో లేదు.

"మా చెల్లాయికి తెలియదా డియర్ భర్త ఇష్టమే భార్యకు శిరోధార్యమని, ఏమ్మా అలా వున్నావ్?"

జిల్లా గ్రంథాలయ సంస్థ, నెల్లూరు



శాఖా గ్రంథాలయము, సూళ్ళూరుపేట

"ఏంలేదు అన్నయ్యా! ఎందుకో నీరసంగా వుంది" అన్నది. వచ్చి ఒక కుర్చీ లాక్కుని కూర్చుని.

అందరూ ఫలహారం చేశారు.

అంజనికి ఆరోజు గడవటం చాలా కష్టమనిపించింది. అతి భారంగా ఎదురుచూసింది. నాలుగ్గంటలనుండి మరో భయం పట్టుకుంది. తండ్రికేం జవాబు చెప్పాలో తెలియలేదు. కోటేశ్వరరావుకు ఫోన్ రావటంతో అతను వెళ్ళిపోయాడు.

ఆమె తేలికగా నిట్టూర్చింది. గబగబ బట్టలు మార్చుకుని ఆటో తీసుకుని 'మూన్‌లైటు'కు వచ్చింది. అప్పటికే శ్రీహర్ష ఎదురుచూస్తున్నాడు. అతను రూమ్ బుక్ చేశాడు. గదిలోకి వెళ్ళగానే తెల్లబూటీలున్న బెనారస్ చీర తీసి యిచ్చాడు.

"మీరు జాబ్ చేస్తున్నారా?"

"ఊఁ! బ్యాంక్‌లో. నువ్వు చీర కట్టుకో అంజూ!" అన్నాడు. ఆమె బట్టలు మార్చుకుని, పూలు తురిమింది. మల్లెలు అతడిని పిచ్చివాడిని చేశాయి.

అతను ఆవేశంగా ఆమెను దగ్గరగా తీసుకుని, నుదురు, బుగ్గలు చుంబించాడు. గుండెలకు బలంగా హత్తుకున్నాడు.

"అబ్బ...." బాధగా మూల్గి దూరంగా జరిగింది.

"సారీ అంజూ! అయామ్ రియల్లీ సారీ" అన్నాడు-ఆమె పొట్ట నడుము సున్నితంగా రాస్తూ.

ఆమె సిగ్గుపడింది. అతని చేయి గట్టిగా పట్టుకుంది. మాటలు కరువైనట్టు ఇద్దరూ ఒకరిని, ఒకరు చూసుకున్నారు కళ్ళతోనే ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు.

పదినిమిషాల్లో ఆమెకిష్టమైనవన్నీ తెప్పించాడు. ఆమెకా క్షణం శాశ్వతం అయిపోవాలని వుంది. భోజనం తరువాత అలా ఒకరి ప్రక్కన ఒకరు పడుకుని, ఒకరి స్పర్శలో ఒకరు స్వాంతన పొందారు.

"అయ్యో! పదిన్నర అయింది. నాన్నగారు కంగారుపడతారు" అన్నది అంజని.

పరాయివారితో వున్నావా" అనబోయి మాట మింగేశాడు. ఏ అధి కారంతో అనగలడు. అతను లేచాడు.

"స్కూటర్ ఎక్కగలవా అంజూ?"

"మీరు మెల్లగా తీసుకువెళ్ళండి. స్కూటర్ కొన్నారా?"

"కాదు బావది, డబ్బివ్వాలి" అన్నాడతను కారు కొన్న విషయం చెబుతూ.

"వదిన, స్వీటీ బావున్నారా?"

"అందరూ బావున్నారు. అక్కకే ఆ ఫిట్స్ రావటం తగ్గలేదు. ఆమెకు బాధ కలిగే విషయం వింటేచాలు, పడిపోతుంది. మొన్న అక్కయ్య, బావ ఘర్షణపడ్డారు. ఆమె మూడురోజులు కంగారుపెట్టింది" అన్నాడు నిట్టూరుస్తూ.

మౌనంగా అతని వెనక స్కూటర్ ఎక్కింది. విజయ చాలా తెలి వయిందని ఆమె భావన. విజయకు కూడా సమస్యలా? ఆమె కూడా ఘర్షణ పడుతుందా? అదేమాట శ్రీహర్షను అడిగింది.

"తెలివైనవారికీ, అత్మ వున్నవారికి శాంతి, సౌఖ్యాలుండవు కాబోలు" అన్నాడు స్కూటర్ స్టార్టుచేసి. ఆమె మాట్లాడలేదు. ఇంటి ముందు దింపాడు.

"గుడ్‌నైట్!"

"గుడ్‌నైట్! నాదో చిన్న కోరిక?"

"చెప్పు అంజూ!"

"స్త్రీకి ప్రసవం పునర్జన్మ అంటారు. నాకేదైనా అయితే, మన బిడ్డను వదిలివేయకండి" అన్నది.

శ్రీహర్ష పకపక నవ్వాడు.

ఏదో కొత్త విషయం చెబుతావనుకున్నాను. ఒకప్పుడు ప్రసవం గురించి అనుమానాలుండేవి. ఇప్పుడు ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగు తుంది నువ్వేం దిగులుపడకు. హాస్పత్రికి వెళుతూ ఫోన్‌చెయ్యి నేను వస్తాను" అన్నాడు ఆమె వీపు నిమురుతూ.

"థాంక్స్!" అంది.



ఇద్దరూ భారమైన హృదయాలతో విడిపోయారు. ఆమె మెట్లు ఎక్కుతుండగా హాల్లోని లైటు వెలిగింది. ఆందోళనగా కూతురివంక చూశాడు కోటేశ్వర్రావ్. అప్పుడే గేటు తీసిన చప్పుడైతే అటు చూశాడు. శ్రీహర్ష గేటువేసి వెళ్ళిపోయాడు.

అంజని తలవంచుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆమె వెనకాలే వెళ్ళిన కోటేశ్వరరావు గుమ్మంలో ఆగిపోయాడు.

"అంజూ!"

"నాన్నా!" చటుక్కున చేతులు జోడించింది అంజని. ఆమె క్రింది పంటితో నొక్కి దుఃఖాన్ని దిగమింగుతుందని తెల్సిపోతుంది.

"నాన్నా! మీకోసం బ్రతుకుతున్నానని అన్నా, బావను చూడకుండా వుండలేని నా బలహీనతకు క్షమించండి. ఈరోజు నన్నేం అనకండి" అన్నది కాస్త ఆవేశంగా, ఆవేదనగా.

"అమ్మా!" ఆయన దగ్గరకువచ్చి, కూతురి తలను గుండెలకదుము కున్నాడు.

"అంజూ! నన్ను పూర్తిగా అపార్థం చేసుకున్నావు తల్లీ! హర్ష ఎవరు-నా చేతులలో పెరిగినవాడు, నీకంటే ముందు నా గుండెగుండెలపు చందమామలా, నా హృదయంపై వాలి కబుర్లు చెప్పింది శ్రీహర్ష. అతనిపై తాత్కాలికంగా కోపం వచ్చినమాట వాస్తవమే కాని...." అతను మాట్లాడ లేకపోయాడు.

"నాన్నా!" ఆర్తిగా పిలిచింది.

"అవునమ్మా! రేపే వెళ్ళి శ్రీహర్షని తీసుకువస్తాను" అన్నాడు.

అతని చేతులలోనుండి దూరం జరిగి కళ్ళు ఒత్తుకున్నది అంజని.

"క్షమించండి నాన్నా! మీరు కోరినప్పుడు మా జీవితాలు ఒకటి కావు. మన నీడ చూసినా అత్తయ్య బ్రతుకదు" అన్నది.

కోటేశ్వర్రావు తలపట్టుకుని కూర్చున్నాడు. జరిగిపోయిన కాఠిన్యం మళ్ళీ తలయెత్తింది. అతని పళ్ళు బిగుసుకున్నాయి. లేచి తన గదిలోకి వెళ్ళాడు.

పద్మ పాలు తీసుకువచ్చింది.

"వద్దు వదినా!" అన్నది దిండ్లకు ఆనుకుని.

"నాకోసం కాకపోయినా, పాపకోసం త్రాగాలి" అని స్వీటీ, మందు అక్కడపెట్టి పాలగ్లాసుపై మూసింది.

"అంజనీ! గతంలో నేను ప్రవర్తించిన తీరు నాకే సిగ్గుగా వుంది. ప్రేమించిచూడు అన్నట్టు, ప్రేమకు ఎంత శక్తివుందో చెప్పలేను" అన్నది ఆప్యాయంగా అంజని చెయ్యి నిమురుతూ. అంజని అలాగే కళ్ళు మూసుకుంది.

## 19

"ఎక్కడినుండి రాక?" తల్లి ప్రశ్నకు తెల్లబోయినట్టు నిలబడి పోయాడు శ్రీహర్ష.

"నాకు తెలుసురా! భార్యతో కలిసి పెళ్ళిరోజు చేసుకుని వస్తున్నావు. నేనేగా పరాయిదాన్ని. చనిపోయింది నా భర్తేగా....నష్టపోయింది నేనేగా" ఉన్మాదిలా ఏడుస్తుందామె, ఆమె ప్రక్కనే బాలరాజు నిలబడిపోయాడు. శ్రీహర్షకు తల్లి అంతరంగం పూర్తిగా అర్థమయింది. మొదటిసారిగా బాలరాజుపై కోపం వచ్చింది.

"అమ్మా...." గర్భవతి, తల్లిలేని అభాగ్యురాలు అంజని అని చెప్పబోయి, ఆగిపోయాడు. తల్లి శపిస్తే తను భరించలేడు.

అప్పటికే ఆమెకు ఫిట్స్ వచ్చేశాయి. విజయకు నైట్‌డ్యూటీ. డాక్టరును పిలిచాడు. అతను ఇంజక్షన్ యిచ్చాడు.

"ఆమెకు ఎలాంటి మనస్తాపం కలుగరాదు" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు. స్వీటీ సోఫాలోపడి నిదురపోతుంది.

"స్వీటీ.... స్వీటీ....పడుకుందువుగాని లేతల్లీ" ఆప్యాయంగా లేపాడు.

"మామయ్యా! ఆకలి" అన్నది. అతని గుండెల్లో ఎవరో పొడిచినట్టయింది. త్వరగా వెళ్ళి అన్నం పెట్టాడు. వండినపదార్థాలు వండినట్టే వున్నాయి. స్వీటీకి అన్నం తినిపించాడు. ఆమెను రాజశేఖర్ గదిలోకి తీసుకువెళ్ళాడు. అతను నిషాలో నిదురపోతున్నాడు. ఆ స్థితిలో స్వీటీ



చూడకూడదని, తన మంచంపైనే పడుకోబెట్టాడు. బాలరాజును ఎలా సరిదిద్దుకోవాలో అర్థంకాలేదు.

ప్రతి పురుషుడికి తండ్రి అవుతానన్న భావన ఎంత మధురమైనది! ఎంత ఉన్నతమైనది! ఎవరో పశుప్రవృత్తి కలవారికి తప్పితే, ఎంత అద్భుతమైన అనుభవం. అది భార్యాభర్తలు పంచుకుంటే ఎంత మధురంగా వుంటుందో. తనకా అదృష్టంలేదు. అదృష్టమే వుంటే తండ్రే బ్రతికేవాడు. నిట్టూర్చి, తల్లి గదిలోకి వెళ్ళాడు. ఆరాటంగా ఆమె నుదుట పట్టిన చెమట వత్తాడు.

"మీకోసం బ్రతుకుతున్న ఆయమ్మనలా కష్టపెట్టటం మంచిదికాదు అర్బబాబూ" అన్నాడు బాలరాజు.

"బాలరాజూ! ఈ ఇంట్లో శాంతిసౌభాగ్యాలు వుండాలంటే నువ్వు వెళ్ళిపో. రేపే వెయ్యిరూపాయలిస్తాను" అన్నాడు.

"అదేమిటి బాబూ?"

"అంతే" అన్నాడు కఠినంగా.

అతను వెళ్ళిపోయాడు. తెల్లవారుజామున నిద్రపట్టింది. ఏడుగంటలకు విజయ వచ్చి లేపింది.

"ఇప్పుడే వచ్చావా అక్కయ్యా?"

"మళ్ళీ అమ్మకు ఫిట్స్ వచ్చాయిటకదా" ఆమె అడిగింది. అపరాధిలా తల వంచుకున్నాడు.

"రా అర్చనా! మా తమ్ముడు" అన్నది విజయ. ఓ యువతి వచ్చి అతనికి నమస్కరించింది.

"శ్రీ! అర్చన అని మెడికో హౌస్‌మెన్‌షిప్ చేస్తుంది. ఆమెకు ఇల్లు కావాలిట" అన్నది. అప్పటికే స్వీటీకి పాలు త్రాగించి బాలరాజు అందరికీ కాఫీ కలుపుతున్నాడు,

"నువ్వింకా ఇక్కడే వున్నావా?" కోపంగా చూసి, బాత్‌రూమ్ వైపు వెళ్ళాడు. అతను ముఖం తుడుచుకుంటూ వచ్చేసరికి విజయ లలితమ్మకు ముఖం కడిగిస్తోంది.

"అమ్మా! నీకెన్నిసార్లు చెప్పాను జరిగేవి ఏవీ మనకోసం ఆగవు.

అనవసరంగా నువ్వు అప్‌సెట్ అవుతావు" అన్నది విజయ.

"ఇంత అప్‌సెట్ అయినా ప్రాణంపోలేదు విజ్జమ్మా! నా జన్మే ఓ శాపమే తల్లీ, నాలుగురోజులు ఆయనతో పంచుకున్న జీవితంతప్ప ఏం మిగిలింది" అన్నది పశ్యతోపటం ఆపి.

శ్రీహర్ష మౌనంగావచ్చి, ఆ ప్రక్కనేవున్న స్టూల్‌పై కూర్చున్నాడు. అర్చన అతడిని ఏవో అడుగుతుంది. అన్యమనస్కంగా జవాబు చెప్పాడు.

"కాఫీ తీసుకోమ్మా" అన్నది విజయ.

"నీతో చాకిరీ చేయించుకోవటం తప్పటంలేదే తల్లీ" అంది కాఫీ అందుకుని. తలయెత్తి మళ్ళీ దాచుకున్నాడు శ్రీహర్ష.

విజయకు తల్లి మనసు అర్థమయింది. అతనివంక జాలిగా చూసింది. ఈ స్థితిలో తల్లిని మందలించనుకూడా లేదు.

"అర్చనా! అక్కడ గదివుంది. అటాచ్‌డ్ బాత్‌రూంవుంది. నువ్వు వెళ్ళి విశ్రాంతి తీసుకో" అన్నది విజయ. ఈమధ్యే మెట్లగదిలో ఓ మంచంవేసి, మెట్లక్రింద స్థలం బాత్‌రూంక్రింద మార్చారు.

అర్చన వెళ్ళి తలుపులు వేసుకుంది.

"విజ్జమ్మా! బాలరాజుకు ఓ రెండువందల రూపాయలు ఇవ్వమ్మా, అతను వెళ్ళి ఏదయినా పని చూసుకుంటాడు" అన్నది లలితమ్మ.

"అలాగే" అన్నది ఘర్షణ పెంచక.

లలితమ్మకు నిరాశ కలిగింది. అందుకే మరో బాణం విసిరింది.

"పిల్లలంటూ లేకపోతేనే హాయి కాబోలు ఈ బంధాలు, బంధనాలు అన్నీ ఉత్తవే. ఎవరి పిల్లలు ఎవరికి అవుతారు. అంతా తన స్వార్థం చూసుకుంటారు" అన్నది.

అప్పుడే తన పాత సంచితో బాలరాజు వచ్చాడు.

కాఫీకప్పు కిందపెట్టి చటుక్కున లేచాడు శ్రీహర్ష. బాలరాజు సంచిని లాగి, పక్కన పెట్టాడు.

"బాలరాజూ! వెళ్ళి నీపని చూసుకో" అన్నాడు. బాలరాజు ఏదో అనబోయి శ్రీహర్ష కళ్ళలోని తీక్షణతకు భయపడి వెళ్ళి తన సంచి వేడగా



పెట్టి, తనపని చేసుకోవటానికి వెళ్ళాడు.

"అమ్మా! నిష్ఠూరాలు, నిందలు వద్దమ్మా... నేనేం చేయాలో చెప్పరాదూ?"

"నేను చెప్పినదానికి కట్టుబడి వుంటావన్న నమ్మకం నాకులేదురా!"

"లేదమ్మా! ఏదయినా పొరపాటు జరిగితే క్షమించు. నీవు బాధపడవద్దు" అన్నాడు, ఆమెకు దగ్గరగా జరిగి ఆమె చేతిలో చేయివేసి వాగ్దానం చేస్తున్నట్టు.

"ఆ కుంపటిని పూర్తిగా మరిచిపోవాలి. నేను నిర్ణయించిన అమ్మాయిని వివాహం చేసుకోవాలి. మనల్ని మోసం చేసినవారికి గుణపాఠం నేర్పాలి."

శ్రీహర్ష తల్లిని ఒక్కసారి దీక్షగా చూశాడు.

ఆడదాని హృదయంలో అగాధాలు దాగివున్నాయంటారు. అది నిజమేనేమో! అమృతం కురిసిన ఆ హృదయం నుండే హాలాహలం కురుస్తుంది.

"మాట్లాడవేం?"

"అమ్మా! వాడిని బలవంత పెట్టి వాగ్దానాలు చేయించుకోకు. ఆలోచించుకునే అవకాశం యివ్వు" అంది విజయ.

"ఆలోచించేది ఏమీలేదక్కా! అలాగేనమ్మా! నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఏదీ జరగదన్నాను కదా? ఈరోజే నీకు నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను సరా!" అన్నాడు ఆవేశంగా, అక్కడనుండి లేచి వెళ్ళిపోయాడు.

లలితమ్మ తేలిగ్గా నిట్టూర్చింది. ఆమె బాలరాజును సాయం తీసుకుని ఆ సాయంత్రమే లాయర్ పార్థసారధిగారింటికెళ్ళి, "వారి అన్న కూతుర్ని చూసింది. లోగడ ఒకసారి పార్థసారధిగారే సంబంధం తీసుకొని వచ్చాడు.

ఆయన లలితమ్మను ఆదరంగా ఆహ్వానించాడు. కాఫీలు, మర్యాదలు అయ్యాక అసలు విషయం చెప్పింది.

"అదేమిటమ్మా! కోటేశ్వరరావుగారమ్మాయితో వివాహం జరి

గిందిగా?" అన్నాడు.

"అదో బొమ్మలపెళ్ళి అనుకోండి. ఆ అమ్మాయి ఆరోగ్యం మంచిది కాదు. తనే స్వయంగా కాగితం వ్రాసిచ్చింది. రెండవ వివాహం చేసుకుంటే తనకేం అభ్యంతరం లేదుట" అంది.

"ప్చ్...ప్చ్! అమ్మాయి అందమయినది, మంచిపిల్ల. కోటేశ్వర్రావు ఎప్పుడూ అనలేదమ్మా!" అన్నాడాయన.

"అంటే అమ్మాయి కాపురం పాడవుతుందిగా? అదీగాక ఆయన్ని మీరు అంతగా నమ్మవద్దు" అంది సలహా యిస్తున్నట్టు.

"అలాగా! ఆయన మాత్రం మీ పేరు చెబితే ఆదరం, ఆప్యాయతలు ఒలికినట్టే మాట్లాడతాడమ్మా!" అన్నాడు.

"అదంతా నటనలెండి. మీరే మాట్లాడతారా? మీ అన్నయ్యతో నన్ను మాట్లాడమంటారా?"

"మొదట అమ్మాయిని అడుగుతాను లలితమ్మగారూ! ఈ కాలం పిల్లలు స్వంత నిర్ణయాలు తీసుకుంటారు."

"రెండో వివాహానికి సంశయిస్తున్నారో ఏమో! మన హర్ష వయసు మీకు తెలుసుకదా? అదీకాక ఈ కాలంలో ఆడపిల్లలకే చేసేస్తున్నారాయే" అంది.

"నేను అమ్మాయితో మాట్లాడి ఒకటి రెండు రోజుల్లో కబురు చేస్తాను" అన్నాడు ఆయన. లలితమ్మ వెళతానని లేచి, హాల్లోని వ్యక్తిని చూసి చలనం లేనట్టు ఆగిపోయింది.

కోటేశ్వర్రావు నిల్చున్నాడు. ఆయన కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. లలితమ్మ ఒక్క క్షణం తడబడినా వెంటనే సర్దుకుంది.

"వస్తాను పార్థసారథిగారూ! దురదృష్టవంతుడు తల తడుపుకుందామనుకుంటే, వడగళ్ళ వర్షం కురిసిందట" అని విసురుగా బయటికి వచ్చింది.

ఆటోలో కూర్చుంది. బాలరాజు ఒక ప్రక్కకు ఒదిగి కూర్చున్నాడు. అతను పళ్ళు నూరాడు.

"మీరు ఏమంటారోనని వూరుకున్నాను. లేకపోతే వాడి అంతు



తేల్చేవాడిని" అన్నాడు.

"అసలు ఈరోజు నిదురపోడులే'" అందావిడ. ఒక్కసారి ఆమె హృదయం మేలుకుంది.

తన భర్త పోయి అలమటించినవాడు ఆదరంగా పిలిచినవాడు, ఓదార్చి- చేరదీసినవాడు తనేనా ఇంత అన్యాయంగా ప్రవర్తించింది?

"ఏమిటోనమ్మా! ఆనందబాబంటే మనము సర్కారుకార్ల తిరగక పోదుమా?" అన్నాడు బాలరాజు.

లలితమ్మలోని జాలి, దయ మళ్ళీ కరుడుగట్టిపోయాయి. 'అవును! ఈ ప్రపంచంలో తిరిగి పొందలేనిది తన సౌభాగ్యం. అది తనకు దూరం చేసినవారెవరయినా క్షమించలేదు' అనుకుంది.

విజయ ఏం జరిగిందని అడగలేదు. అవసరమయితే తల్లే చెబుతుందని వూరుకుంది.

"ఎక్కడికి వెళ్ళినా శని వెంటే వుంటుంది" అని గొణుక్కుంది. అందరితో ఖచ్చితంగా చెప్పింది వివాహం ప్రసక్తి వస్తే, మొదట ఒక వివాహం అయినట్టు చెప్పొద్దని ఆజ్ఞాపించింది.

ఆ రోజు శ్రీహర్ష భోజనం చేస్తుండగా అతని స్నేహితుడు రాజన్ వచ్చాడు.

"అబ్బ! ఎంత అదృష్టంరా! నువ్వే నా ఏరియాకు ఆఫీసరుగా వచ్చావని విని గాలిలో తేలిపోయాననుకో!" అన్నాడు.

"ఒరేయ్ నాయనా! నేను గాలిలోకి ఎగరలేనుగాని, కూర్చుని విషయం ఏమిటో చెప్పు?" అన్నాడు కుర్చీలాగి.

"అడేరా! మా ఇండస్ట్రీకి మీ బ్యాంక్ అప్పు యిస్తుంది. మా పొలం తాకట్టుపెడితే, హామీ సరిపోదంటాడు" అన్నాడు.

"హామీ సరిపోదని నేనయినా లోన్ రికమండ్ చేస్తానని ఎలా అనుకున్నావ్?" అన్నాడు చెయ్యి కడిగి.

"స్నేహితుడికి ఆమాత్రం చేయలేవట్రా? కావాలంటే శాంక్షనయిన ఎమౌంట్‌లో ఫైవ్ పర్సెంట్ తీసుకో. అవునూ. ఏది నీ స్వీట్ హార్టు?" చుట్టూ కలియచూశాడు.

శ్రీహర్ష తల పంచుకున్నాడు.

"అర్థమైంది పురుటికి వెళ్ళింది. అవునా? మాకంటే అన్నిటా ఫస్టేనా నువ్వు? అలా సిగ్గుపడతావేం? పార్టీ కావాలి పార్టీ."

"పార్టీకేంలే! నేను ఆఫీస్‌కు వెళ్ళాలి. సాయంత్రం రా!" చెయ్యి కడుక్కుని లేచి రాజన్‌ను పంపించి వచ్చేశాడు. అతను ఇన్‌షర్టు వేసుకుని, పై కట్టుకుంటుండగా తల్లి వచ్చింది. ఆమె ముఖం వెలవెలబోతోంది.

"శ్రీ! ఈ ప్రభుత్వ ఉద్యోగాలు మనకచ్చిరావురా! నువ్వు వెళ్ళి బెంగుళూరులోనే చేరిపో" అంది వణికిపోతూ.

"ఇప్పుడేమయిందమ్మా?"

"ఇంకా ఏం కావాలిరా? మీ నాన్నకు వచ్చిన పరిస్థితే వచ్చింది. లంచం ఇస్తామని వచ్చారు. నువ్వు తీసుకోనంటావు. వాళ్ళు నిన్ను చంపుతారు. చంపుతార్రా!" అంది దుఃఖంతో వణికిపోతూ.

ఆర్తిగా తల్లిని దగ్గరగా తీసుకున్నాడు శ్రీహర్ష. ఆమె తల ఆదరపూర్వకంగా నిమిరాడు.

"అమ్మా! నువ్వేం దిగులుపడకమ్మా! ఒక సమస్య ఎదురయినప్పుడు ఉపాయంగా అపాయం తప్పించుకోవాలి. అంతేగాని, మొండిపట్టుపట్టి అపాయం కొనితెచ్చుకోకూడదు" అన్నాడు.

ఆమె చటుక్కున దూరం జరిగింది.

"అంటే....అంటే....మీ నాన్న మొండిపట్టుపట్టారంటావా?"

"అమ్మా! నువ్వు ఆవేశపడకమ్మా! మా మాష్టరు ఒకరుండేవారు. ఆయన పబ్లిక్ పరీక్షలప్పుడు పేపర్లు దిద్దుతుంటే ఎవరన్నా మరిచిపోయి 'ఏమండీ! మా నంబరు?' అంటే చాలు. పోలీసులకు కబురు చేసేవారు, అందరితో పగ కొనితెచ్చుకున్నాడు."

"అంటే.... అంటే అందరి నంబర్లు తీసుకుని ప్యాస్ చేయించమనా?"

"నా మాట పూర్తిగా వినమ్మా! అదే మరోరకంగా చెప్పవచ్చునంటున్నాను. మా లెక్కల మాస్టారు అందరిచ్చిన చీట్లు చిరునవ్వుతో తీసుకుని 'అయ్యో! ప్రయత్నిస్తాను గాని ఆశ పెట్టుకోవద్దు' అని మృదువుగా చెప్పే



వాడు" అన్నాడు.

"నువ్వు....నువ్వు అనేదేమిటి?"

"నా ప్రాణం నాకు తీపే. నువ్వు నిశ్చింతగా వుండు. రాజన్‌కు నచ్చచెబుతాను" అన్నాడు.

ఆమెకు మాత్రం నమ్మకంలేదు. వాదించలేక అక్కడినుండి వెళ్ళిపోయింది అలితక్క.

బ్యాగు తీసుకుని బయటికొస్తుండగా రాజశేఖర్ ఎదురొచ్చాడు.

"శ్రీ! ఒక్క నిముషం."

"బావా! సమయమైపోయింది, రేపు మాట్లాడుకుందాం."

"ఐదు నిమిషాలు అటు ఇటు అయితే వచ్చే నష్టం ఏమిటి?"

"అందరిలో అధికారం చెలాయించే అర్హత పోతుంది, లంచం నువ్వు అడగటంలేదు. ఇస్తే పుచ్చుకుంటే తప్పేమిటి అంటావు? నిజమే! ఈ తప్పొప్పులు మనిషిని, మనసునిబట్టి వుంటాయి. డబ్బు సంపాదించటం థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్సే కాని, వ్యసనంగా మారకూడదు. వస్తాను."

"శ్రీహర్షా! నీకు మీ అక్క ఆశయాలు తలకెక్కాయన్నమాట."

"ఆమె ఆశయాలు మనిషిగా బ్రతకాలనుకునేవారికి కరదీపికలు" అని ఆఫీస్‌కు వచ్చాడు. అతని మనసంతా కకావికలమయింది. రాజశేఖరంతో వాదించాడుగాని, ఆశయాలను ఆచరణలో పెట్టటం ఎంత కష్టతరమయిన పనో అర్థమయింది.

బ్యాంకులలో ఋణాలు యిస్తున్నారు. తీసుకునేవాడికి ఎంత ముడుతుందో ఎవరికీ అర్థంకాదు. క్రింది లెవెల్ నుండి పై లెవెల్ వరకు అందరూ అడిగేవారే. తను రాజన్‌కి చెయ్యగల సహాయం ఒక్కటే- తను ఆ సీట్లో నుండి తప్పుకోవడం. ఎలా తప్పుకోవాలో అర్థంకాలేదు. తన తోటి ఉద్యోగికి తనకంటే రెండువందలు ఎక్కువ వస్తుంది. నాలుగు సంవత్సరాలు సీనియర్. అతనిల్లు చూస్తే ఆశ్చర్యపోవాలి. కారుంది. ఎలా వచ్చిందని బ్యాంకు అధికారులకి తెలుసా అనుకుంటే, తెలియకుండా ఎలా వుంటుంది? రాబడి, ఖర్చులు లెక్కవేసుకోరా?

తలపట్టుకుని కూర్చున్నాడు.

"స్వీట్ తీసుకోండి శ్రీహర్షగారూ!" క్లర్క్ వచ్చాడు.

"స్వీట్ ఎందుకండీ?" అందుకుని అడిగాడు.

"నాకు కొడుకు పుట్టాడండి" అని ప్రక్కతని దగ్గరకెళ్ళాడు.

శ్రీహర్షకు ఒక్కసారిగా నిండుగా తిరిగే అంజని కళ్ళముందు వెలిగింది. ఫోన్ డయల్ చేశాడు.

"హల్లో" అవతలినుండి మృదువయిన కంఠం వినిపించగానే తల్లి ఎదుట నిలిచినట్టయింది. 'నీ ప్రయాణం మర్చిపోయావా?' అంటూ ఒక నిట్టూర్పు వదిలి ఫోన్ పెట్టేసాడు.

"రాజన్! చూడు, నా చేతనయినంత సహాయం చేసి, నీకు మళ్ళీ మమ్ లోన్ రిలీజ్ అయ్యేలా చూస్తాను. త్వరపడి లంచాలు గించాలని ప్రయత్నం చెయ్యకు. ఒక్కసారి యివ్వటం అలవాటుచేస్తే నీకే ప్రమాదం. కొంచెం ఆలస్యమయినా మునిగిపోయేదిలేదు. రాజన్! యువతరంవారము మనమయినా ప్రయత్నం చెయ్యకపోతే ఎలా? బి ష్యూర్....థాంక్యూ! నీలాంటివారు నలుగురు సహకరిస్తే కొంతకాకపోయినా కొంతయినా లంచ గొండితనం రూపుమాపవచ్చు" అని ఫోన్ పెట్టేశాడు.

అతను వెళ్ళి ప్రయత్నం ప్రారంభించాడు.

"నీ స్నేహితుడంటున్నావ్- కనీసం వెట్ పార్టీ అయినా ఇప్పించు" అని ఒకరంటే, "చైనీస్‌కయినా తీసుకువెళ్ళవా?" అంటూ ఇంకొకరు అడిగారు. "ఏం వాడెందుకు? నేను తీసుకువెళతాను...." అని పేపర్స్ మూవ్ చేయించాడు కాని ఇలా ఎంతకాలం అతనికే అర్థంకాలేదు.

"మనిషిగా బ్రతకటమే దుర్భరం శ్రీ!" అన్న అక్క మాటలు గుర్తుకువచ్చాయి.

ఒక నిట్టూర్పు వదిలాడు.

"మనం చదువుకోటానికి వ్రాసినవి చదివింది నిజమైన చదువుకాదు. ఇదిగో లంచాలు, దిగజారుడు అన్నవి నిజమైన పరీక్ష సమయాలు మనకు. అప్పుడు నిలదొక్కుకుంటే జీవితంలో నిలదొక్కుకున్నట్టే" అన్న అవే మాటలే నిజాయితీగా నిలబడే ధైర్యాన్నిచ్చాయి. ఒక దృఢనిశ్చయంతో రాజన్ కేసులో వ్యవహరించాడు.

# 20

అంజనికి మహదానందంగా వుంది. ఆమె కొడుకును చూసుకుని మురిసిపోయింది. కాన్పు కష్టమయింది. విశ్రాంతి అవసరమన్నారు. అందుకే నాలుగోనెల వచ్చినా నామకరణోత్సవం చేయలేదు. ఇంట్లో అందరూ 'పండు' అంటూ పిలుస్తున్నారు. పండు బాధ్యత పూర్తిగా పద్మ తీసుకుంది. అంజని ఆరోగ్యం కుదుటపడింది. నొప్పులురాగానే మొదట శ్రీహర్షకు ఫోన్ చెయ్యమన్నది తండ్రిని.

"చేస్తానులే" అన్నాడుగాని చెయ్యలేదు.

తను చేద్దామంటే హాల్లోకి రావాలి. ఆమె హాస్పత్రికి వెళుతూ ఫోన్ దగ్గరకెళ్ళింది. ఇంట్లో స్వీటీ ఎత్తి ఆఫీసునుండి రాలేదని చెప్పింది. బ్యాంక్‌కు చేస్తే అతను ఊళ్ళో లేడన్నారు.

మౌనంగా వచ్చి కారులో కూర్చుంది.

"అభిమానం లేనివారిని పట్టుకుని ప్రాకులాడడం మన బలహీనతమ్మా" అన్నాడు కాస్త కోపంగా.

"ఏమిటి నాన్నా?" ఆమెకు తండ్రి ఆంతర్యం అర్థంకాలేదు. మొన్నటికి మొన్న ఎంతో దయగా, అభిమానంగా ఉన్న వ్యక్తి మళ్ళీ ఏమొచ్చిందో అనుకుంది.

"పార్థసారధిగారి అన్న కూతుర్ని చూసిందమ్మా! ఆ లలితమ్మ కొడుకు వివాహం చేస్తుందట" అన్నాడు కసిగా.

అంజనికి ఒక్కసారిగా నరాలు గడ్డకట్టుకుపోయినట్టు అనిపించింది. కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి.

"ఈరోజు క్రొత్తగా ఏం జరిగిందని ఏడుస్తున్నావు తల్లీ! ఇది మనము అనుకున్నదేగా! నువ్వు విడాకులపత్రం కూడా వ్రాసిచ్చావు."

"అందుకు కాదు నాన్నా! కడుపులో నొప్పి" అన్నది పళ్ళబిగువున దుఃఖాన్ని ఆపుకుని కొడుకో, కూతురో పుడితే లలితమ్మ మారిపోతుందని ఆశించిన అంజనికి ఆశాభంగమే అయింది.

'అతను తల్లికి ప్రియపుత్రుడు. తను అంగీకరించలేదా? అతను అంతే' అనుకుంది.

ఒక్కరోజు నొప్పుల తర్వాత ప్రసవించింది. మగపిల్లడని అందరూ సంతోషించారు. వారంరోజులకు ఇంటికి వచ్చారు. ఆమె మనసు రాజీ చేసుకుంది. తల్లిదండ్రులకు ప్రియమైన సంతానం కావటం ఒక శాపమే నేమో. ఆ ప్రేమ నతిక్రమించి బయటపడలేదు.

ఆమె ఒక రకమయిన వైరాగ్యం పెంచుకున్నది.

"ఐదోనెలలో బారసాలచేస్తాం" అని ప్రకటించింది పద్మ. 'పండు' 'పండుదొర' అంటూ ఆ పసివాడిని ముద్దుచేసి స్వాంతన పొందుతున్నారు ముగ్గురూ. ఒక్క అంజని మాత్రమే నిర్లిప్తంగా వుంటుంది.

'తనయినా ఫోన్‌చేసి నా స్థితి కనుక్కోవచ్చుగా' అనుకుంది. శ్రీహర్ష ఫోన్ చేయటం, ఆ విషయం విని తండ్రి మండిపడి 'అమ్మాయి చచ్చిందా, బ్రతికిందా అన్న ఆరానా! ఏ మాత్రం అభిమానం వున్నా మళ్ళీ ఫోన్ చేయను. రెండవ పెళ్ళికి సిద్ధమై ఫోన్ చేయటానికి సిగ్గులేదు. ఆడ పిల్లంటే ఆటబొమ్మ అనుకుంటున్నావట్రా రాస్కెల్' అని ఫోన్ పెట్టేయటం ఆమెకు తెలియదు.

యూనివర్శిటీకి సెలవులయిపోగానే ఆమె కాలేజీకి బయలుదేరింది.

"ఇప్పుడు డిగ్రీ అంత ముఖ్యమా అంజనీ?" పద్మ నిలదీసింది.

"నాకేం పనివుంది వదినా! పండును నువ్వే చూస్తున్నావు. నాకు ఏదో పని వుండాలిగా" అన్నది.

అలా రోజులు గడుపుతున్నది. అంజని ఆరోజు ఆలస్యంగా లేచింది. అన్న, వదిన, తండ్రి హడావుడిపడుతున్నారు.

"ఏమిటి నాన్నా! ఈ ఇన్విటేషన్ కార్డ్స్ ఎందుకు?" అన్నది ఆశ్చర్యంగా.

"అంజూ! ఎవరూ కనీవినీ ఎరుగనంత ఘనంగా పండు నామకరణోత్సవం చేస్తానమ్మా" అన్నాడు.

"వద్దు నాన్నగారూ! అత్తయ్యకు తెలిస్తే బాధపడుతుంది."

"బాధలకు, గాథలకు అర్థం తెలుసా? బాధపడాలి. కుళ్ళి-కుళ్ళి ఏడ్వా



లే ఈ పార్టీ" అన్నాడు.

అతని కళ్ళలోని ఎర్రజీరలు, పట్టుదల చూస్తే భయం వేసింది. మౌనంగా వుండిపోయింది.

"నా కూతురు ఉసురుపెట్టుకున్న ఆ లలితమ్మ బాగుపడుతుందా! ఆ బిడ్డడు వచ్చి తాగుబోతు, తిరుగుబోతు అయిపోయాడు. కంట్రాక్టు పేరు చెప్పి దొరికిన సిమెంటంతా బ్లాక్ చేస్తున్నాడు. పట్టుబడితే జైలుకే! అప్పుడు గాని బుద్ధిరాదు."

"నాన్నా....!"

"అవునమ్మా!" చటుక్కున కూతుర్ని అక్కున చేర్చుకుని, తలపై ముద్దుపెట్టుకున్నాడు.

"నువ్వు మహారాణిలా బ్రతుకుతావు" అన్నాడు సగర్వంగా.

నిజంగా మధ్యతరగతివారి పెండ్లికి అయినంత ఖర్చు మొత్తం ఊరో వున్న ఉన్నత కుటుంబాలు కదిలివచ్చాయి.

"ఏదో తెలియక పెంచిన మమకారంతో పిల్లనిచ్చాడు. ఒట్టి పోకిరీ వెధవ. అందుకే వాళ్ళతో తెగతెంపులు చేసుకున్నాను...." అని కోటేశ్వరరావు చెబుతుంటే అంజని హృదయం భారమయింది. గాయపడ్డ ఆ ప్రాణిని ఏమనలేకపోయింది.

ఉయ్యాలలో వేసినప్పుడు పద్మ 'శ్రీనివాస్' అని దేవుడి పేరు పెట్టమంది. బాలాజి శ్రీనివాస్ కుమార్ అంటే కుమార్ అని ముద్దుగా పిలుచుకోవచ్చునన్నాడు.

అంజని మాత్రం నవ్వేసింది.

"నాన్నగారిష్టం" అన్నది.

ఆయన ఒక్క నిమిషం కూతుర్ని చూసాడు. వెంటనే పేరు పెట్టటానికి వంగిన ముసలమ్మతో "ఆనంద్ కుమార్" అని పెట్టమని ఆదేశించాడు. ఆనంద్‌కుమార్....ఆనంద్....అంటూ గొణుక్కుంది అంజని. రకరకాల బహుమతులు వచ్చాయి.

"నీ కొడుకు మూడునెలలు లేదు. అప్పుడే ఎన్ని బహుమతులు కొట్టేశాడో చూడమ్మా" అన్నాడు కోటేశ్వరరావు.

"అవన్నీ తాతగారికి వచ్చినవేలెండి" అన్నాడు బాలాజీ. అందరూ నవ్వారు.

"ఆనంద్! నువ్వయినా నన్ను అర్థంచేసుకో. నేను....నేను నిన్ను ఎంత ప్రేమించానో అభిమానించానో నీకు తెలియదా? నిన్ను....నిన్ను చంపుతానా?" అన్నాడు ఉయ్యాలపైకి వంగి.

"ఏమిటి నాన్నా! అందరూ ఇటే చూస్తున్నారు" కళ్ళు ఒత్తుకుని అన్నది అంజని. కాని ఆమెకు బాధగా, అసంతృప్తిగా వున్నది. తన హోదా, డబ్బు చూసి ఎవరూ అనటంలేదు కాని, కొడుకు నామకరణం అవుతుంటే తండ్రి వుంటే ఎంత ఆనందంగా వుంటుంది. పిల్లడి జన్మకు కారకులైన ఇద్దరు వ్యక్తులుంటే అది ఎంత పరిపూర్ణత! ఎంత నిండుదన మొంటుంది.

"లేదు అంజూ! లేదు. ఆనంద్. ఊర్మిళ ఎవరు నన్ను కరుణిస్తారో అనుకున్నాను. నా ఆనంద్ స్నేహపాత్రుడు. అతనే కరుణించాడు" అన్నాడు గాఢంగా నిట్టూర్చి. ఆమె జాలిగా తండ్రివంక చూసింది. విందు దాదాపు ముగిసింది. ఇంటివారే వున్నారు.

"అంజనీ! భోజనం చేద్దాంరా" పద్మ పిలిచింది.

"నాకు ఆకలిగా లేదు వదినా!"

"రెండు ముద్దలు తినమ్మా! శుభకార్యం రోజున అభోజనంగా వుండ కోరాదు. ఈ మగ సన్యాసుల గురించి, మనము బాధపడతాము కాని వాళ్ళు ఉత్త స్వార్థపరులు" అని బల్లదగ్గరకు లాక్కుపోయింది. రెండురకాల స్వీట్స్ చేశారు. సమోస, వెజిటబుల్ పలావ్, నాల్గురకాల కూరలు, పూరీలు వున్నాయి. పెరుగు వేసుకుని రెండు ముద్దలు తిన్నది. ఒక్కొక్కరే వెళ్ళి పోతున్నారు. కోటేశ్వరరావు, పెద్ద ఇంజనీరు వస్తే అతనికి డ్రింక్స్ ఆఫర్ చేస్తూ పైన వున్నారు.

"అమ్మగారూ! మిమ్మల్ని పసిబిడ్డను తీసుకుని అక్కడికి రమ్మంటు న్నారెవరో" యూనిఫాంలో వున్న బట్లర్ వచ్చి పిలిచాడు.

'ఎవరై వుంటారు?'

పద్మ చేతిలోని పండునెత్తుకుని వచ్చింది. అశోకచెట్టు నానుకుని



నిల్చున్నాడు శ్రీహర్ష. అతని చేతిలో రెండు మూడు ప్యాకెట్లున్నాయి.

"మీ....మీరా...." మాటలు రానట్టు నిలబడిపోయింది.

శ్రీహర్ష ఎన్నో మాటలని, ఆమెని ఎత్తిపొడవాలని వచ్చి, ఆమె చేతిలోని బాబుని చూచి, అన్నీ మరిచిపోయాడు. ప్యాకెట్లు క్రిందపెట్టి, చటుక్కున బాబును లాక్కున్నాడు.

వాడిని ఒక్కనిమిషం పరీక్షగా చూశాడు. వెంటనే హృదయానికి హత్తుకున్నాడు.

అటువంటి వత్తిడి అలవాటులేని బాబు కెవ్వుమన్నాడు.

"అరే సారీ!" మళ్ళీ ఎత్తిపట్టుకుని. రెండు బుగ్గలు ముద్దుపెట్టు కున్నాడు. వేలితో గిలిగింతలు పెడుతుంటే అలాగే నిలబడిపోయింది అంజని.

"ఇక్కడున్నావా అంజనీ! వెళ్ళొస్తాం" ఎవరో వచ్చి పిలిచారు. వారిని పంపించి వచ్చింది.

"రండి...." భర్తను ఆహ్వానించింది.

"అంజూ! మీ నాన్నగారు నా గురించి ఎంత చెడుగా చెబుతున్నారో నేను ఎరగనిదికాదు, ఆయన మాట అబద్ధం ఎందుకు చెయ్యాలి" అన్నాడు బాబును తిరిగి యిచ్చివేస్తూ.

ఆమెకెన్నో చెప్పాలని వుంది. నోటమాట రాలేదు.

"కనీసం తెలియపర్చాలన్న ధ్యాస నీకు లేకపోయినా, ప్రాణం వుండలేక వచ్చాను" అన్నాడు.

"బావా!" ఒక్కసారి అంజనికి దుఃఖం ముంచుకొచ్చింది.

"ఇద్దరూ స్వతంత్రులే. మీ ఇద్దరిమధ్య నలిగిపోతున్నాను నేను. ఏన్నేం చెయ్యమంటారో చెప్పండి, 'ఇలాగే వచ్చెయ్యి అంజనీ' అంటే రాకపోతే అడగండి. మీరు మళ్ళీ వివాహం చేసుకుంటున్నారని ఆయన అంకలు పెట్టారు. నేనేం చేయను?" అన్నది కళ్ళమ్మట కారే నీరు ఒత్తు కోవటం కూడా మరిచిపోయి.

"ఐనో....ఐనో అంజనీ! అయామ్ సారీ. నీపై కోపం వుంటే నిన్ను తప్పుపట్టాలనుకుంటే ఇలా వస్తానా, ఆ ప్యాకెట్లు తీసుకో. వాటికేం

పేరు పెట్టారు" అన్నాడు. ఆమె కళ్ళు తన రుమాలుతో అద్ది.

"ఆనంద్" అన్నది, అతనిచ్చిన ప్యాకెట్లు అందుకుని.

"ఊఁ" అతను వెనుతిరిగాడు.

ఆమె పండును అతని చేతిలో పెట్టింది.

"ఒక్క నిముషం....." లోపలికి వెళ్ళింది. రెండు మూడు నిమిషాల తర్వాత ప్లేటుతో తిరిగివచ్చింది. స్వీటు అతని నోటికి అందించింది. అతను ఆనంద్‌ను చూస్తుంటే, తనే స్పూన్‌తో పలావ్ పెట్టింది. అతనికలా అన్నం పెడుతుంటే కళ్ళమ్మట నీరూరింది.

"ఇక చాలు అంజూ!" అని వారించాడు. మంచినీళ్ళిచ్చింది.

మిగిలిన అన్నం తను తినేసింది. తనెంత దురదృష్టవంతురాలు. తనకు లభించే అన్ని అనుభూతులను అనుమానాలతో దూరం అవుతుంది.

అతను ఆనంద్‌ను వదలలేక, వదలలేక అంజనికి అందించాడు. అంజనికి తెలుసు శ్రీహర్షకు పసిపిల్లలంటే ఎంతో ప్రాణం.

"వాడిని తీసుకువెళ్ళండి."

"హృదయపూర్వకంగా అంటున్నావా ఆ మాట."

"నా హృదయం మీ ముందే విచ్చుకుంటుందని మరచిపోతున్నావు బావా!" అన్నది, అతని భుజం పట్టుకుని.

"వద్దు అంజూ! నన్ను ఉత్తేజితుడిని చెయ్యకు" అన్నాడు.

"మీ వివాహం ఎప్పుడు?"

"ఆహ్వానం పంపుతానుగా" అన్నాడు. ఆమెకు ముఖం చూపించలేక చరచర వెళ్ళిపోయాడు. అంజనికి దుఃఖం రావటంలేదు. ఆ అనుభూతి హృదయంనిండా నింపుకుని, తృప్తిగా వెనుదిరిగింది. 'అయ్యో పండు ఎవరిలా వున్నాడో అడగనేలేదు' అనుకున్నది. అప్పటికే అతని స్కూటర్ స్టార్టయింది.

ఆమె ఇంట్లోకివచ్చి, పెట్టెలు విప్పింది. రంగురంగుల చొక్కాలు అందంగా వున్నాయి.

ఇంకో పెట్టెలో మల్లెపూవులాంటి తెల్ల షాడోవర్క్ చీర అందంగా వున్నది.



"డార్లింగ్ అంజుకు....ప్రేమతో శ్రీ" అని వుంది. అది అలాగే హృదయానికి హత్తుకుని కూర్చుంది.

"ఏమంటున్నాడమ్మా హీరో?"

"నిదురపోతున్నాడు నాన్నా!" అన్నది కంగారుగా.

"ఈ చొక్కాలన్నీ ఎక్కడివి?"

"ఒక ఫ్రెండ్ ఇచ్చింది" అన్నది కంగారు కంగారుగా.

"ఎవరా ఫ్రెండ్?" అంజనికి స్నేహితురాండ్రు లేరని అతనికి తెలుసు.

"నందిని పంపింది నాన్నా....నందిని."

"నా దగ్గర దాపరికమెందుకమ్మా, హర్ష వచ్చాడు కదూ? అతనంటే నాకేం కోపం లేదమ్మా! అతని వాలకమంటేనే గిట్టదు" అన్నాడు.

ఆమె జవాబు చెప్పలేనట్టు తల వంచుకున్నది,

"ధైర్యంచేసి రమ్మని తీసుకెళ్ళదేం? తల్లి తల్లి అనటం, తను ఒక బొమ్మలా మిగిలిపోవటం నాకు కంపరం" అన్నాడు.

"పోనివ్వండి. ఏ జన్మలో ఏ తల్లిబిడ్డలను విడదీశానో, యీ జన్మలో ఈ స్థితి కల్గింది, వాళ్ళననటం దేనికి?" అన్నది.

అతను ఏం మాట్లాడలేదు.

ఆ మర్నాటినుండి అంజని ఒక యాంత్రిక జీవితం గడపసాగింది. పండు బాధ్యత పద్మ స్వీకరించింది. కోటేశ్వరరావుకు మనుమడంటే పంచ ప్రాణాలు. రోజూ ఒక గంటయినా గడపకపోతే తోచదు. బాలాజి ఇప్పుడు బాధ్యతగా తండ్రికి చేదోడువాదోడుగా వుండి కంట్రాక్ట్సు చేస్తున్నాడు.

ఆ రోజు అతను హడావుడిగా వచ్చాడు.

"నాన్నగారూ! లేబర్ కాలనీ టెండర్ కూడా ఆ రాజశేఖర్‌కు శాంక్షనైంది" అన్నాడు కాస్త ఆశాభంగం చెందినవాడిలా.

"అదేమిటి? మనదే అందరికంటే తక్కువ వుండాలికదా?"

"అతను చాలా నాటకాలాడుతున్నాడు. అక్కడి అధికారులకు ట్రాగుడు పార్టీలు అరేంజ్‌చేసి, తన టెండర్ ఇంతని చెప్పక లీస్ట్ టెండర్ కంటే వందరూపాయలు తక్కువని ఇచ్చాడు" అన్నాడు.

"అది చట్టవిరుద్ధం. పోనివ్వు దాంట్లో మిగిలినదెంతని" కొట్టిపారేశాడు.

అంజని నంటాడుగాని, తనకు వాళ్ళంటే అభిమానమే" అని గొణుక్కున్నాడు బాలాజి.

# 21

కాలం ఎవరికోసమూ ఆగదు. మూడు సంవత్సరాలు అతి త్వరగా దొర్లిపోయాయి. శ్రీహర్ష ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఇప్పుడతనికి తన జీవితం కంటే అక్క జీవితం ఓ సవాలుగా నిల్చింది. దాదాపు మూడు నెలలుగా విజయ, రాజశేఖరం మాట్లాడుకోటంలేదు. విజయ ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తుంది.

అర్చన ఆమె దగ్గరే పనిచేస్తుంది. ఇంకో ఇద్దరు మేల్ డాక్టర్లు చేస్తున్నారు. ఆమెకు ఒక్క క్షణం తీరిక వుండదు. శ్రీహర్షకు తల్లితో విడిగా పోవాలని వున్నా, స్వీటీకోసం అతను ఆ ఆలోచన దూరం చేసుకున్నాడు.

లలితమ్మ కాస్త కన్ను, ముక్కు తీరున్న అమ్మాయి కనిపించగానే కొడుకు కోసం చూస్తుంది. వాళ్ళకు ఫారిన్ రిటర్న్డో, డాక్టరో కావాలని కోరుకుంటారు. అలా తప్పిపోతున్నాయి.

శ్రీహర్ష అక్క, బావలమధ్య సఖ్యత కుదర్చలేకపోయాడు. కాని, ఈ విషయాలకు దూరంగా స్వీతను పెంచటానికి కృత కృత్యుడయ్యాడు.

"హర్షా! నేనో నిర్ణయానికి వచ్చాన్రా!"

"చెప్పమ్మా!" అన్నాడు తల ఎత్తకుండానే.

"అర్చనను అడిగాను. 'మీ ఇష్టం ఆంటీ, మీ ఇంటి కోడల్ని కావడం నా అదృష్టం' అన్నది. నాకైతే చాలా ఆనందంగా వున్నది. అటు కుటుంబానికి ఇటు నీకు చేదోడు వాదోడుగా వుంటుంది" అన్నది.

"మంచిదమ్మా" అన్నాడు.

"నీకు మొదటి వివాహం అయిందని కూడా చెప్పాను. దాపరికం దేనికి? 'కొన్ని సంఘటనలు తెలియకుండా జరిగిపోతాయి' అన్నదిరా"



అన్నదామె.

శ్రీహర్ష ఏదో చెప్పబోయేటంతలో రాజశేఖర్ విసురుగా వచ్చాడు. ఈ మధ్య అతను అర్ధరాత్రే వస్తున్నాడు. ఆ రోజు ఎనిమిదిన్నరకే వచ్చాడు. శ్రీహర్ష ఏమనలేక ఓ చిరునవ్వు నవ్వాడు.

"మీ అక్కకు బుద్ధిచెప్పాలి."

"అలాగా! అక్కయ్య బుద్ధిలేని పనులు ఏం చేసిందో సెలవిస్తారా బావా?"

"ఆ ఆరోగాడితో స్నేహమేమిటి చెప్పు?" అన్నాడు తీవ్రంగా.

"అరోరా ఇంటికేగాదు, ఎవరు పిలిచినా వెళ్ళాలి. ఆమె డాక్టర్, అర్థమైందా?" అన్నాడు కాస్త కోపంగా.

"ఓహో! వ్యవహారం చాలావరకు వచ్చిందే, డాక్టరుగా వెళుతుందో, డార్లింగ్‌గా వెళ్తాందో నీకేం తెలుసు?"

"కామెర్ల రోగిలా మాట్లాడకండి బావగారూ!" అన్నాడు తీవ్రంగా.

అప్పుడే విజయ, అరోరా పొడవాటి కార్లో దిగింది.

"థాంక్యూ విజయా! థాంక్యూ సోమచ్. మీ కంపెనీలో మెస్మరిజం వుంది.

"మీ అభిమానం" అన్నది విజయ.

రాజశేఖర్ కొరకొర శ్రీహర్ష వంక చూశాడు.

"ఇప్పుడేమంటావ్? అనడానికి అర్హత వుండాలి. అసలు భరించలేకాక భార్యను వదిలి మరో అమ్మాయిని చేసుకోవాలని ఆరాటపడుతున్న నీకు అనడం చెల్లదు" అన్నాడు కసిగా.

విజయ వచ్చింది. ఆమె ముఖంలో జంకు, బొంకు ఏంలేదు. ప్రశాంతంగా చిరునవ్వుతో చూసింది.

"హాయ్ రాజా! వ్వాటే సర్‌ప్రైజ్! మీరు ఈ రోజు త్వరగా రావటం ఆశ్చర్యంగా వుంది" అన్నది.

"ఎవరు వాడు?" రాజా తీక్షణంగా అడిగాడు.

"మర్యాదగా మాట్లాడు రాజా? ఓ నీవు మర్యాద ఇవ్వాలంటే వాడు బాగా డబ్బున్నవాడయి వుండాలి కదూ! డబ్బున్నవాడు" అన్నది మెల్లగా.

ఎలాంటి భయంలేక.

"రబ్బిష్! వాడికి డబ్బుంటే నాకేం? ఊడితే నాకేం? వాడికి, నీకు ఏమిటి స్నేహమని అడుగుతున్నాను."

"నీకు డబ్బు అవసరమైతే ఆదుకునేవారుండొద్దా రాజా! పతివ్రత ధర్మమంటే భర్తకోసం, ప్రాణం, శీలం అన్నీ వదులుకోవాలి. అందుకే అతనికి వలవేయాలని చూస్తున్నాను."

"షాపిట్...."

"నా స్నేహమా, మాట్లాడటమా?"

"రెండూనూ."

"అదెలా కుదుర్తుంది రాజా! మనిషికో రకమైన పిచ్చి. నీకు పేరు, పబ్లిసిటీ, డబ్బు కావాలి. నాకు నువ్వుకావాలి. నిన్ను దక్కించుకోవటానికి ఏమయినా చేస్తాను" అని ఆమె గదిలోకి వెళ్ళింది.

"ఐ విల్ కిల్ దట్ బగ్గర్...." నేలను తన్ని రాజా బైటికి వెళ్ళాడు.

శ్రీహర్ష మాటలురానట్టు నిలబడిపోయాడు నిజమే దాంపత్యము గురించి మాట్లాడే హక్కు తనకులేదు. అన్యమనస్కంగా అతను బయటకు వచ్చాడు. అర్చన వస్తుంది.

"గుడ్ ఈవినింగ్ శ్రీహర్షగారూ!"

"గుడ్ ఈవినింగ్! ఇంతరాత్రి వచ్చారు, ఏదైనా అర్జెంట్ కేసా?"

"అబ్బే కేసులేదు. విసుగ్గా వుంటే, పిక్చర్ కొస్తారేమోనని."

"పదండి" అన్నాడు.

ఆమె అతడిని ఆశ్చర్యంగా చూసింది. బాత్‌రూంకి స్లిప్పర్స్‌తో బయల్దేరాడు. అడగబోయి మానేసింది. చాలా దూరం నడిచాక ఆటోరిక్ష దొరికింది. ఇద్దరూ ఎక్కి ఇంగ్లీష్ సినిమాకు వెళ్ళారు.

"ఇంగ్లీష్ సినిమాలు నాకెప్పుడూ అర్థంకావు."

"చూచేవాళ్ళందరికీ అర్థమౌతుందనా మీ భావన?" అడిగాడు శ్రీహర్ష.

"ఏమో! ఊరికే అందరూ, 'బావుంది చూశారా, చూశారా' అంటుంటే



చూస్తుంటాను" అంది సిన్సియర్‌గా.

అతను ఏం మాట్లాడలేదు. ఇంటర్వెల్‌లో అతను కూల్ డ్రింక్ తీసుకువచ్చి యిచ్చాడు. అర్చన సహజంగా మితభాషి. అందుకే సంభాషణ కలవలేకపోయింది. అతను అంతకంటే గంభీరంగా వుంటున్నాడు. ఒకప్పుడు ఉత్సాహానికి మారుపేరుగా వుండేవాడు శ్రీహర్ష అంటే ఎవరూ నమ్మరు.

"అబ్బ! అందం అడుక్కొచ్చుకుంటారు కొందరు" అనుకోబోయి పైకి అన్నది అర్చన.

"ఏమిటర్చనా?" అన్నాడు, అతనికి అనీజీగా, గిల్టీగావుంది కంపెనీ కని వచ్చి, తను ముడుచుకుని కూర్చోవటం అతనికి గిట్టలేదు. కాని ఏం చేయలేదు.

"అదిగో ఆ మూల కూర్చున్నావిడను చూడండి, ఎంత అందంగా వుందో!" అన్నది. తలతిప్పిన శ్రీహర్ష తెల్లబోయాడు. అంజని కూర్చుని తన ప్రక్కన కూర్చున్న చిన్నబ్బాయితో నవ్వుతూ ఏదో చెబుతుంది. శ్రీహర్షకు ఒక్కసారి రక్తం పొంగులా వచ్చింది. తల్లి ముందు ఆడినమాట తప్పలేక, మనసు రాయి చేసుకున్నాడు. ఎక్కడ పసిపిల్లలు కనిపించినా, అక్కడ ఆనంద్‌ను ఊహించుకునేవాడు.

"జస్ట్ ఎ మినిట్ ప్లీజ్...." ఆమెను వదిలి, అంజని దగ్గరగా వెళ్ళాడు. ఆమె అప్పుడే అతడిని చూసింది. ఆమె కళ్ళు ఒక్కసారి కాంతివంతమయ్యాయి.

"మమ్మీ! ఎవరు మమ్మీ?" ఆనంద్ తల్లిచేయి గిరాడు.

"నువ్వు గుడ్ ఈవినింగ్ చెప్పవా?....అన్నయ్య, వదిన గారాబం ఎక్కువయింది. వాళ్ళు పార్టీకెళ్ళారు. ఇల్లుపీకి పందిరేశాడు. దగ్గర్లో వున్న హాలని తీసుకువచ్చాను" ఆమె అంటున్న మాటల్ని విన్నాడో లేదోగాని, అతను ఆనంద్‌ను ఎత్తుకుని ముద్దులతో ఉక్కిరి బిక్కిరి చేశాడు.

"థాంక్యూ అంకుల్ థాంక్యూ!" అన్నాడు.

ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు శ్రీహర్ష. అతడిని దింపివేశాడు.

"మీనాన్న పేరేమిటి బాబూ?" బొంగురుగొంతుకతో అడిగాడు.

"మా నాన్నగారిపేరు శ్రీహర్ష. అతను చదువుతూ అమెరికాలో వున్నాడు. వచ్చేటప్పుడు బొమ్మలు, చాక్లెట్లు, ఇంకా....ఇంకా నువ్వు చెప్పమ్మా ఏమేం తెస్తారో" అన్నాడు. అంజని మెల్లగా నవ్వింది.

"వసపిట్ట అనుకోండి. ఇంట్లో అందరినీ బిజీగా వుంచుతాడు. వాళ్ళ తాతగారికి పెట్టే ప్రయిపేట్లు అడక్కండి" అన్నది.

"అంకుల్ మీ నాన్నగారి పేరేమిటి?"

"ఆనంద్...." అన్నాడు అస్పష్టంగా. ఆనంద్ కిలకిల నవ్వాడు.

శ్రీహర్ష క్యాడ్‌బరీప్ కొనిపెట్టాడు. అంజనికి కూల్‌డ్రింక్ తీసుకుని ఇచ్చాడు. పిక్చర్ మొదలయింది. అంజనికి అవతల ప్రక్కనున్న సీట్లో ఎవరో వచ్చి కూర్చున్నారు. ఆమె ఆనంద్‌ను వడిలోకితీసుకుని, కూర్చోండి అన్నట్టు చూసింది.

"మమ్మీ నా సీటు నాకే కావాలి. ఐవాంట్ టు సీట్...." ఆనంద్ మారాం మొదలుపెట్టాడు.

"వాడిని కూర్చోనివ్వు అంజూ! నేను వెళ్ళి నా సీట్లో కూర్చుంటాను నేను ఒంటరిగా రాలేదు."

అంజని ముఖంలో రంగులు మారాయి.

"అంజూ కాదు, అంజని అని పిలవాలి. షి ఈజ్ నాట్ యువర్ డాటర్...." అన్నీ మరిచి పకపక నవ్వాడు. అతడిని ముద్దులతో ముంచెత్తాడు హర్ష.

ప్రక్కవాళ్ళు విసుగ్గా చూడగానే ఆనంద్‌ను సీట్లో దింపి వచ్చి, తన సీట్లో కూర్చున్నాడు.

"మీకు తెలుసా ఆమె?"

"ఊఁ...." అన్నాడు సంభాషణ పెంచటం ఇష్టంలేక.

"ఏం చేస్తుందో?" అర్చన దృష్టిలో అంజని డాన్సర్ అయితే బావుండునని వుంది.

"ఆమె లా చేసి, పార్థసారథిగారి దగ్గర ఈ సంవత్సరమే అప్రెంటిప్‌గా చేరింది."

"ఐసీ!" సినిమాచూసి, బయటకి వచ్చారు. వాళ్ళిద్దరూ పేవ్‌మెంటు



మీద నడుస్తుంటే అంజని కారుతెచ్చి ఆపింది.

"మీ స్కూటర్ ఏమైంది?"

"అలా అనుకోకుండా బైటికొచ్చాను" అన్నాడు అపరాధిలా.

"రండి డ్రాప్ చేస్తాను" అంది.

ఆమె తలుపు తీయకుండానే, ఇద్దరూ వెనుకసీట్లో కూర్చున్నారు.

అంజని వెనక్కు తిరిగి చూసింది.

"మీ కాబోయే శ్రీమతి అనుకుంటాను" అన్నది నవ్వుతూ.

అంజని ఎలా నవ్వగలుగుతుంది, ఆనంద్ కూడా వెనక్కు తిరిగి నవ్వాడు.

"ఈమె డాక్టర్ అర్చన. అక్కయ్యదగ్గర అసిస్టెంట్" అన్నాడు.

"ఓ ఐసీ! కంగ్రాచ్యులేషన్స్" అన్నది.

జవాబు చెప్పలేదు. దారిపొడవునా ఆనంద్ ప్రశ్నలు వేస్తూనే వున్నాడు. అంజని చిరునవ్వుతో చెబుతుంది.

"మమ్మీ! ఆ కారును ఓవర్‌టేక్ చెయ్యి మమ్మీ."

అంజనిలో బేలతనం పోయింది. దృఢత్వం, నిదానం అబ్బాయి. ఎంతో ఎదిగి, ధైర్యం వచ్చినట్టనిపించింది.

"చదువుతున్నావా బాబూ?"

"ఎస్! లిటిల్‌ఫ్లవర్ స్కూల్, ఎల్ కేజీ ఏ" అన్నాడు. మళ్ళీ తనే ప్రశ్నించాడు.

"నువ్వా?"

"నేను....నేనా! అప్పర్ కేజీ బాబూ."

ఆనంద్ పకపక నవ్వాడు. నాలుక వెళ్ళబెట్టి వెక్కిరించాడు.

"నీ అంత అయితే నేను మా డాడీలా ఇంజనీరింగ్ చదువుతాను. నువ్వు ఇంకా కేజీనేనా! షేమ్‌కదూ మమ్మీ?"

"ఆనంద్! పెద్దవారిని 'నీవు' 'నీ' అనకూడదని చెప్పానా?"

"ఓ! సారీ మమ్మీ అయామ్ సారీ!"

శ్రీహర్షకు మనసంతా కలతబారిపోయింది. వాడిని దగ్గరకు తీసుకుని ముద్దాడే యోగంలేని బ్రతుకు తనది. తనలాంటి దురదృష్టవంతులెవరూ

వుండరేమో!

ఇద్దరినీ డ్రాప్‌చేసి వెళ్ళిపోయింది అంజని. ఆమె సిగచుట్టి, ఒక ప్రక్క గులాబీ అమర్చుకుంది, ఎంత బావుంది. ఇంకా నాజూకు తేలినట్టుగా వుంది.

"అంత పరధ్యానగా నడుస్తున్నారేం?" అర్చన మాటలకు ఉలిక్కిపడ్డాడు.

"ఏంలేదు, ఏదో ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"ఆనంద్‌లాంటి కొడుకు కావాలని" మారాం చేస్తాడేమో సరదాకి అనుకుంది. ఆమెకు ఆశాభంగమే మిగిలింది.

"గుడ్‌నైట్" అన్నాడు ఆమె తలుపు తాళం తియ్యకుండానే."

"మీ అక్క అడుగుతున్నారు, అదే....సివిల్ మారేజా" సిగ్గుగా తల వంచుకున్నది.

శ్రీహర్ష ఒక్కసారి నిరాకుగా అయ్యాడు. అంతా అర్చనకు చెప్పాలి లేకపోతే తను మోసగాడు అవుతాడు.

"మిస్ అర్చనా మన పెళ్ళి తారీఖు నిర్ణయించేముందు కొన్ని విషయాలు మీకు చెప్పాలి."

"చెప్పాల్సినవన్నీ అమ్మగారు, విజయగారు చెప్పారు" అన్నది అతని నిజాయితీకి మెచ్చుకుంటూ.

"మీకు వాళ్ళేం చెప్పారో తెలియదు. నేను చెప్పేది కూడా వింటారా?" అన్నాడు సీరియస్‌గా.

"ఉహూ! మీరు చెప్పేది ఈ కబుర్లుకాదు, మీరు అంత గాంభీర్యంగా ఎందుకు వుంటారో చెప్పారు. ఆవిడెవరో మిమ్మల్ని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు. మిమ్మల్ని చూసి అందరూ నన్ను అదృష్టవంతురాలని ఈర్ష్యపడాలి. మీరు చూస్తారుగా" అన్నది నవ్వుతూ సగర్వంగా.

"అర్చనా! అర్చనగారూ! నా మాట...."

ఆమె సున్నితంగా తలుపువేసి, గ్రిల్ దగ్గరకు వచ్చింది.

"మీతో చూరం వుంది మాట్లాడే నిగ్రహములేదు హర్షా! ప్లీజ్ అ ముహూర్తం ఏదో త్వరగా పెట్టించు" అన్నది వేడికోలుగా.



అతను ఆమెను చూసి ఒకసారి జాలిపడ్డాడు.

'పాపం బయటకి చూస్తే ఎంతో గయ్యాళితనంగా, గడుసుగా కనిపించే స్త్రీలంతా ఎంత భోళా మనుషులో! పట్టుదలేగాని, పరిణామాలు ఆలోచించరు' అనుకున్నాడు.

అతను నిదానంగా, ఒక్కొక్క అడుగువేస్తూ వెనక్కి తిరిగాడు.

"హర్షా!"

ఆమె కంఠంలోని కోమలత్వానికి కరిగిపోయాడు.

"ఏమిటి?" గ్రిల్ దగ్గరకు వచ్చి, చెయ్యి గ్రిల్‌మీద వేశాడు. ఆమె అతని చెయ్యి తీసుకుని సున్నితంగా పెదవులకు తాకించుకుని వదిలివేసింది.

"ఐ లవ్ యూ..... హర్షా! ఐ లైక్ యూ...." అని చటుక్కున లోపలికి వెళ్ళిపోయింది. శ్రీహర్ష చలించిపోయాడు. ఈ నిముషమే అందరికీ నిజం చెప్పాలి. అర్చన మాటల్నిబట్టి, తన భార్యను తనను ఏడ్పించి వెళ్ళినట్టు అర్థమవుతోంది. జరిగింది జరిగినట్లు చెప్పాలి. అనుకొని తలుపు తట్టబోయాడు. ఆమె ఇంటిగలవాళ్ళు అతని వీపు తట్టారు.

"ప్రేమలు, తిరుగుళ్ళు అంటూ ఇలా తిరక్కపోతే పెళ్ళి చేసుకోరాదూ?"

"ఇంకా వయసు రాలేదేమో! ఈ కాలంలో ప్రేమకు వయసుతో నిమిత్తంలేదు కాని, పెళ్ళికి ఎంతో నీతి నియమము."

భార్యాభర్తలు కాబోలు అనుకుంటున్నారు. అది విన్న శ్రీహర్ష ఇంటికి వచ్చేశాడు.

"శ్రీ! వివాహం కాగానే మనము బయటకి వెళ్ళిపోదాం, మళ్ళీ ఏమొచ్చిందో ఇద్దరూ ఘర్షణపడ్డారు. అతనికేదో ఫోటోలపిచ్చి వుంది. చూసి చూడనట్టు వూరుకుంటేనేం? మన విజయకూడా...."

"బరితెగించింది అను....అనమ్మా" విజయ గదిలోనుండి బయటకు వచ్చింది.

ఆమె ముఖం మలినమై, కమిలినట్టుంది. ఆమె సినీవారపత్రిక తెచ్చి, శ్రీహర్ష ముందేసింది.

"చూడు శ్రీ ఆ ఫోటోలు చూడు ఆ సినీతార పై చెయ్యి వేయటం దేనికి చెప్పు? నేను అమ్మలా ఇంట్లో ఉండేదాన్ని అయితే, అతను చెప్పిందే వేద మంటూ, అతని మాటలకు తాళంవేస్తూ కూర్చునేదాన్ని. హాస్పిటల్లో స్టాఫ్ నన్ను చూసి ముసిముసిగా నవ్వుతారు. మీ బావగారికిచ్చిన బిరుదేమిటో తెలుసా? 'ఫోటోల పిచ్చయ్యశాస్త్రి' అన్నది ఆవేదనగా.

"అవునక్కా! నా ఎదురుగా అనరుగాని, ఆ ఫోటో వెయ్యటానికి ఎంత డబ్బిస్తాడోనని కొందరు, ఆ పెళ్ళాం చండశాసనురాలట, పైపైన పూసుకుతిరిగి సంతోషిస్తాడుట అంటుంటారు. రాజకీయనాయకులకు ఇదేం పిచ్చో! ఫోటోలు చూసుకుని తృప్తిపడతారు" అని మరో పేజీలో వున్న మంత్రుల ఫోటోలు చూపించాడు. ఏదైనా సాధించినప్పుడు, ఘనకార్యం ఫోటో వేసుకున్నా అర్థంవుంది. ఫలానా మంత్రి ప్రారంభోత్సవం చేస్తారని, ఫలానా ఫంక్షనుకు వెళతాడని ఫోటో వేసుకోవటం అనుభూతుల్ని పలుచన చెయ్యటమే.

"అదేరా? నా విషయం వదిలివెయ్యి నిన్న స్వీటీ ఏమందో తెలుసా? 'మమ్మీ! డాడీతో చెప్పు పేపర్లో, టి.వి.లో రావద్దని. అందరూ ఎగతాళి చేస్తున్నారు' అంటూ" విజయ ఆగింది.

"అక్కా! నేనే ఏదో ఉపాయం ఆలోచిస్తాను, నువ్వేం కంగారు పడకు."

"ఏమోరా! ఆయనను ఏడ్పించాలని తిరిగినట్టు నటించాను. నన్న జగపతిగారు హాస్పిటల్‌కి వచ్చి, ఇండైరెక్టుగా హెచ్చరించారు. ప్రభుత్వం, అప్పు, కంట్రాక్టు తన ప్రతిభ చూసే యిచ్చారనుకుంటున్నాడు బావ." అన్నదామె.

ఆమెకు విద్యార్థినిగా మంచి పేరేకాదు, అందరూ అభిమానించే వారు. గౌరవించేవారు ఎందుకు? ఆమెకానాడున్నది నాలుగు చీరలే. ఈనాడు కావాల్సినన్ని హంగులున్నా తలఎత్తుకు తిరగలేకపోతుంది.

శ్రీహర్ష ఆలోచిస్తుండగా ఫోన్ వచ్చింది. అతను ఎత్తాడు.

"రాజశేఖరంగారిని పిలుస్తారా?"

"వారి పి.ఏను ఏంకావాలో చెప్పండి. ఆరోజు ఆయన బిజీగా



ంటారు. నిజం ప్రిసైడింగ్ యిచ్చినా, నలుగురు ఫోటోగ్రాఫర్లనుపుర్చినా లాభంలేదు" అని ఫోన్ పెట్టేశాడు.

అతను ఆలోచిస్తుండగానే పద్మనాభరావు వచ్చాడు. ఆయన శ్రీహర్ష పెత్తండ్రి.

"మీరా! మాపై దయకలిగిందే ఎం.పి గారికి."

"ఢిల్లీకి రాజయినా తల్లికి బిడ్డేరా. ఎం. పి నయినా, మినిష్టరునైనా నీ పెదనాన్ననే" అన్నాడు నవ్వుతూ.

పద్మనాభంగారు వచ్చి కూర్చున్నాడు.

"అల్లుడు ఏడి?" అన్నాడు చుట్టూ చూస్తూ.

"ఇంకా రాలేదు."

"అల్లుడు ఈపాటికి నా సంగతి చెప్పేవుంటాడు నీకు." విజయ వైపు చూశాడు.

"నాకే విషయం చెప్పలేదు."

"కొంప మునిగిందేంలేదు అమ్మాయ్! మా రెండో అల్లుడు బిల్డింగ్ బ్యాంక్‌కి మార్టిగేజీ చేసి అప్పు తీసుకున్నాడు. కారు యాక్సిడెంట్‌లో అల్లుడుపోయాడు" అన్నాడు.

"అదెప్పుడో సంవత్సరం క్రితం జరిగిందికదా" అన్నది విజయ అసహనంగా. ఆమెకు వాళ్ళ ధోరణి బొత్తిగా నచ్చదు. ఆయన అల్లుడుపోయినప్పుడు పలుకరించాలని వెళితే అక్కడ వారు ప్రదర్శించిన గొప్పలకు పారిపోయి వచ్చేసింది.

"జగపతి నీకు బాగా తెలుసుకదా, ఆ అప్పు మాఫీ చేయిస్తానన్నాడు అల్లుడు. తీసుకున్నవాడు చనిపోయాడు" అన్నాడు.

"నిజమే పెదనాన్నా! తీసుకున్నవాడు చనిపోయినా, హామీగా పెట్టిన యిల్లుందికదా. యిల్లు అమ్ముతాం అంటారు."

"ఇల్లుంటే దానికి వారసులు పిల్లలులేరూ!"

"అసంతా అప్పిచ్చేవాడికి ఎందుకు పెదనాన్నా!" అన్నది.

"నిజమేనే అమ్మా! అదంతా అనవసరమేకాని, అన్నీవుంటే నీ రిక

మండేషన్ ఎందుకు?" అన్నాడు కోపంగా.

"పోనీలెండి నేనే చెయ్యలేని అసమర్థురాలిని సరా?" అని ఇక ఏం వినదల్చుకోనట్టు లేచింది విజయ.

"అయితే మీ ఆయన రాగానే చెప్పు. నా పరపతిపై నలభై వేలు అప్పు యిప్పించాను. అది తిరిగి యివ్వమను."

విజయ నిముషం ఆలోచించింది. వెంటనే వెళ్ళి బీరువా తీసింది.

"శ్రీ! ఈ నగలు ఈనాడు యాభై, అరవై వేలు చేస్తాయి. అమ్మి అతని డబ్బు జమకట్టు" అన్నది పెట్టె అందిస్తూ.

పద్మనాభరావు వెళ్ళిపోయాడు. ఆరాత్రి రాజశేఖర్ అక్కా తమ్ముళ్ళపై యుద్ధం ప్రకటించాడు. విజయపైకి చెయ్యి ఎత్తాడు.

"ఆపండి!" చెయ్యిపట్టి ఆపాడు శ్రీహర్ష.

"బావా! నేను చెయ్యి ఎత్తగలనుగాని ఎత్తను. ఎవరి తృప్తి కోసం మీరీపనులు చేస్తున్నారు?"

"షటప్! నా తృప్తికోసం చేసుకుంటున్నాను."

"అయితే మీరు విడిగావుండి చెయ్యండి" అన్నాడు శ్రీహర్ష.

"డాడీ! డాడీ! మీరు క్లౌనా?" స్వీటీ పరుగుపరుగున వచ్చింది.

"క్లౌనా! ఎవరన్నారమ్మా?" అన్నాడు.

"పక్కింటివాళ్ళు డాడీ! టి.వి. వాళ్ళకు విస్కీ, బ్రాందీ ఇచ్చి నువ్వు వస్తున్నావట, ఇంకా వెక్కిరించారు డాడీ."

"ఓ ఐసీ....వాళ్ళపని నేను చెబుతాను" స్వీటీని పంపించాడు.

"బావా! స్వీటీని మాయచేశారు. మరి మాకేం జవాబు చెబుతారు? మా స్నేహితుల సర్కిల్లో తలెత్తుకు తిరగలేకపోతున్నాం" అన్నాడు శ్రీహర్ష.

"ఛీ ఛీ! బొత్తిగా పాడయిపోయింది దేశం. ఎవరయినా బాగుపడితే చూడలేరు" చరచర బయటకి వెళ్ళాడు రాజశేఖరం.

"ఏమిట్రా శ్రీ! ఆయన మారరు" విజయ దిగులుపడింది.

"నువ్వేం కంగారుపడకు. అదంతా నేను చూసుకుంటాను" అన్నాడు విజయను ఓదార్చి.

# 22

అదొక పాష్‌రెస్టారెంటు. హైద్రాబాద్‌లోని సాంస్కృతిక సంఘా లకు సంబంధించిని కార్యకర్తలు అక్కడ చేరుతారు సాయంత్రం. గుండు సూదినుండి, గుండూరావు రాజకీయందాకా మాట్లాడుతుంటారు. అక్కడ కూర్చున్నారు రాజశేఖర్, శ్రీహర్ష. వాళ్ళు పద్మనాభరావు ఇంటినుండి వచ్చే రారు. అతను పురుగుకన్నా హీనంగా చూశాడు. 'అయ్యో! తమ్ముడి అల్లుడి వని ప్రేమ కొట్టుకుపొయ్యి నీకు సాయం చెయ్యలేదు. నా పెళ్ళానికి జగ నికి పరిచయం అంటే పడకటింటి పరిచయం' ఎన్ని పనులయినా చేయి స్తుందని అడిగాను. నగలమ్మి డబ్బు నా ముఖాన కొడుతుందా?" రోషంగా అన్నాడు.

రాజశేఖర్‌కు మతిపోయింది. 'పడకటింటి పరిచయం' అన్న మాట అతడిని పిచ్చివాడిని చేసింది. రోషంగా లేచాడు.

"బావా! ఆయన స్థాయి నాకు తెలుసు. ఇంకా పచ్చిగా మాట్లాడ గలడని తెలుసు. నీకు నిజం తెలియాలని తెచ్చాను పద" బలవంతంగా బయ టికి వచ్చారు.

"ఛీ....ఛీ వీళ్ళకన్న బయటివారే నయం" అన్నాడు.

"నిన్ను వేదికలపై ఆకాశానికి ఎత్తేవారి అభిప్రాయాలు విందువ గాని పద" అంటూ రెస్టారెంటుకు తీసుకువచ్చాడు.

"రాజశేఖరం అంటే దేవుడు అనే మీ కల్చరల్ మిత్రుడు అక్క డున్నాడు. పలుకరిస్తాను బావా! నీవు ఇటు వుండగానేవిను" అతను మెల్లగా లేచి ముందు బల్లదగ్గరకొచ్చాడు.

అక్కడ ఓ లీడింగ్ ఆర్గనైజర్ కూర్చున్నాడు. అతను రాజశేఖ రాన్ని కలియుగదైవం అంటాడు. మామూలు డ్రస్సుల్లో వుంటే గుర్తించే వాడే కాని, పైజమా లాల్చీ మీదున్నాడు రాజశేఖరం.

శ్రీహర్ష వెళ్ళి అతని ప్రక్కసీట్లో కూర్చున్నాడు.

"గుడ్ మార్నింగ్ సర్! మీరు వనశ్రీ అనుకుంటాను."

"అనుకోవటం ఏమిటండీ! నేను వనశ్రీనే. మీరు?"

"నన్ను శ్రీహర్ష అంటారు. బ్యాంక్ ఎంప్లాయిని. జగపతిగారికి సన్మానం చేద్దామనుకుంటున్నాను. మాకు సంబంధించినవాడు."

"చెయ్యండి. అప్పుడప్పుడు వారి హోదా గుర్తుచెయ్యాలి."

"అందుకేనండి మిమ్మల్ని అడిగాను. ఇద్దరు స్టేట్ మినిస్టర్స్ వస్తారు. ఈ ఖర్చులు ఎలా మీటవ్వాలో తెలియటంలేదు."

"మేం చేస్తాం. ఖర్చులు ఎవర్నోపట్టి మీరు తేవాలి."

"ఎవర్నో ఎందుకు? సాంస్కృతిక సంఘాల రాజపోషకుడు మన రాజశేఖరంగారిని అడక్కపోయారా?" అన్నాడు.

"అతను ఒట్టి లోఫర్ సార్! అతడిని పెట్టుకుంటే మాకుందే ఇబ్బందులు మాకున్నాయి. ఆయనిచ్చేదెంతోగాని, ఆయన ఫోటోలకు, పబ్లిసిటీకి కావాలి బోలెడు" అన్నాడు వనశ్రీ.

"అతను ఫోటోలు వెయ్యమన్నాడా? మీ తృప్తికోసం మీరు వేస్తున్నారుగాని."

"అదేం ప్రశ్న సర్! మొదట అన్ని పేపర్లో తన ఫోటో కావాలంటాడు. అదీగాక అతని ప్రవర్తన కూడా బావుండదు. మొన్నొక సినిమా తార ఇంటికివెళ్ళి గొప్పకోసం రాజశేఖరంగారి పేరు చెప్పాము. ఆ తార భర్త కొట్టినంత పనిచేశాడు. 'మీకు బుద్ధి వుందాలేదా? ఖిషమెత్తి మొహమెప్పులు ఎవడు చెయ్యమన్నాడు? సినిమాతారలంటే డబ్బున్నవాడి వడిలో అమాంతం వాలిపోతారనా వాడి ఉద్దేశ్యం? నేనక్కడ వుండగానే నా భార్య భుజంపై చేయివేస్తాడా?' అని గెంటించినంత పనిచేశాడు" వనశ్రీ చెప్పాడు.

"ఆయన పరాయి స్త్రీల జోలికి వెళ్ళడే...." ఆలోచిస్తూ అన్నాడు శ్రీహర్ష.

"అదేనండీ! ఏదో తను మగాడు అయినట్టు, అందరు స్త్రీలను తను ఏదో చేసినట్టు వూహించుకుని అలా ప్రవర్తిస్తాడు. నిజంగా స్త్రీలతో సంబంధము వున్నవాడు గుట్టుచప్పుడు కాకుండా పనులు కానిచ్చేసుకుంటాడు. రెండో కంటివాడికి తెలియదు" అన్నాడు.

"అదీ నిజమనుకోండి."

"ఒకర్ని చూసి ఒకరు ఆయనేదో ఒరగబెడుతున్నాడని ఎగబడతారు,



పైగా మినిస్టర్లతో, అధికారులతో పేచీ. ఇదెక్కడి చవకబారు మనిషండీ, అందరి భుజాలపై చేతులు వేస్తాడు?"

"ఎందుకంటారు?"

"ఎందుకేమిటి? మంత్రిగారితో తనకెంత చనువుబడి వుందో చూపించుకోవటానికి" ఇంకో యువకుడు వచ్చి వీళ్ళతో చేరాడు.

"గుడ్ ఈవినింగ్ వనశ్రీగారూ!"

"మీట్ మిస్టర్ శ్రీహర్ష! బ్యాంకులో పనిచేస్తాడు. మన ఉడ్‌బి మెంబరు. ఈయన రాజారామ్ అని ఏ ఎన్నార్ ఫ్యాన్స్ అసోసియేషన్ మెంబరు" పరిచయం చేశాడు.

"గ్లాడ్ టు మీట్ యు" కరచాలనం చేశాడు శ్రీహర్ష.

"సేమ్‌టుయు వనశ్రీగారూ! ఈ వారం ఆఖరున బాలసుబ్రమణ్యం గారు ఊళ్ళోకి వస్తున్నారు. వచ్చే నెల ఫస్ట్‌వీక్‌లో దాసరినారాయణరావు గారు వస్తున్నారు. సారీ శ్రీహర్షగారూ! ఇన్ఫర్మేషన్ యివ్వాలికదా? మీ పేరంటే చాలా ఇష్టం" అన్నాడు రాజారాం.

"పేరేకదా! మరేం ఫరవాలేదు. నేనంటే ఇష్టమంటేనే పేచీ. మీరు ఒక వ్యక్తి ఫ్యాన్స్‌గా ముద్రపడేకంటే, ఓ కల్చరల్ ఆర్గనైజేషన్ అయితే బావుంటుందేమో?"

"బావుంటుంది. కానీ దేని గ్లామర్ దానికేనండి. వాళ్ళు లీడింగ్ స్టార్స్ తపఃసంపన్నులు. వాళ్ళ పేరుమీద పెడితే నష్టంలేదు. మీకు తెలుసో తెలియదో మనం తనకో ఫ్యాన్స్ అసోసియేషన్ పెడితే పెట్టించుకుంటాడా రాజశేఖరం?" రాజారామ్ అన్నమాట పెద్ద జోకయినట్టు అందరూ నవ్వారు ఘొల్లున.

"వాడో ఈడియట్! అవసరమైనప్పుడు వాడుకుని వదిలివేయాలి" అన్నాడు మరొకతను.

"అందరి భార్యలను రాసుకుపూసుకు తిరుగుతాడు కదా? మరి తన భార్యను ఏ ఫంక్షన్‌కు తీసుకురాడేం?" అని రాజారాం అడిగాడు.

"అక్కడే మగాడు విశ్వరూపంతో దర్శనమిచ్చేది. వాడి దృష్టిలో అందరూ వ్యభిచారులే, తన భార్య తప్ప. ఆ కోవకు చెందినవాడే ఆ రాజ

శేఖరం" అన్నాడు.

"అదేం కాదురా! ఆ భార్యను జడుస్తాడట" అన్నాడు ఇంకొకడు.

"శ్రీహర్షా! మంచికో చెడుకో మనం స్నేహితులమయ్యాం. నీవు సాంస్కృతిక సంఘం పెడితే హాయిగా డాక్టర్ చంగయ్య దగ్గరకు వెళ్ళు. ప్రిసైడింగ్, చీఫ్‌గెస్ట్ ఏదయినా ఫరవాలేదు. ఓ అరగంట మైకు దొరకాలి. అంతేగాని- ఫోటోలు, దండలు ఖర్చులేదు" సలహా యిచ్చాడు.

"థ్యాంక్స్ ఎలాట్!" శ్రీహర్ష లేచి ముందుకు నడిచాడు. రాజశేఖరం ఇటు ముఖం చూపలేక లేచి హర్షను అనుసరించాడు.

"సాంస్కృతిక చక్రవర్తీ! ఎలా వుంది మీ అభిమానుల అభిప్రాయం" శ్రీహర్ష నవ్వాడు.

"నీకు....నీకు నవ్వులాటగా వుందా? ఈ లోఫర్స్, ఉల్పాగాళ్ళు అంటే నాకు భయమా? మినిష్టర్లు అంతా నన్నెంత గౌరవిస్తారో, సినిమా యాక్టర్లు" మధ్యలో తుంచాడు శ్రీహర్ష.

"బావా! ఇంకా ఆశ చావలేదనుకుంటే వెళదాం పద, వాళ్ళ అభిప్రాయాలు పరోక్షంగా విందువుగాని."

"వద్దులే" అన్నాడు ఎటో చూస్తూ.

"బావా! మనమొక పనిచేస్తే మన తృప్తికోసం చేస్తాం, ఆ తృప్తి నీకు దొరుకుతుందా? నువ్వెళ్ళినచోటల్లా పది దండలు పడతాయి, వాటిని మీరే ఏర్పాటు చేసుకున్నారంటే మీకు నిదురపడుతుందా? వనశ్రీ లాంటి వారు కొందరు తమ పబ్బం గడుపుకోటానికి 'ఇంద్రుడు, చంద్రుడు' అంటారు. నమ్మేయటమేనా?"

"సారీ శ్రీ! నేను ఇంత డీప్‌గా ఆలోచించలేదు. ఐయామ్ రియల్లీ సారీ!"

"సారీ రాదు బావా! ఇలాంటివి ఇకముందు జరగకుండాచూసుకో! చప్పటు కూడా కిరాయి మనుషులు కొడతారని తెలిశాక, అక్కడ ఎలా నిలబడ్డావ్?"

"శ్రీ! నా కళ్ళపొరలు విచ్చుకున్నాయిరా! మళ్ళీ ఎవ్వడ్నీ మనింటి ముందుకు రానియ్యను." ఇద్దరూ ఇంటికి వెళ్ళారు. విషయం విన్న విజయ



ఫక్కున నవ్వింది.

"స్మశాన వైరాగ్యమా? ప్రసూతి వైరాగ్యం శ్రీ?"

"చూడు శ్రీ! నీకున్నపాటి నమ్మకం మీ అక్కకులేదు" రాజశేఖరం ఉడుక్కున్నాడు.

"కాలమే నమ్మకం కలుగజేస్తుంది బావా! మళ్ళీ నువ్వు దురాశకు లోనవ్వకూడదు" అన్నాడు.

రాజశేఖరం నిజంగానే చాలా అభిమానపడుతున్నాడు. ముఖస్తుతి చేసేవారు ఇంత నీచంగా వెనక మాట్లాడతారని ఎరుగడు.

తనకేం తక్కువ? తన భార్య అందవిహీనురాలు, విద్యావిహీనురాలు కాదు. అతని చర్యలు అతనికే సిగ్గు కలిగించాయి.

"బావా! మనిషి తప్పు చేస్తాడు. కాని తప్పు తెలుసుకున్నవాడే మనిషి. మీకు కావల్సిన సహాయం నాచేతనయింది చేస్తాను. ఉన్న కంట్రాక్టు పూర్తిచేయండి. ఆ తర్వాత ఏదయినా పరిశ్రమ గురించి ఆలోచిస్తాను" అన్నాడు శ్రీహర్ష.

"థాంక్యూ శ్రీ....థాంక్యూ!" అన్నాడు. శ్రీహర్ష తేలికగా నిట్టూర్చాడు.

విజయ కూడా ధన్యవాదాలు చెప్పింది.

"అదేమిటక్కా? పరాయివారమా?" అన్నాడు.

"కాదు. కాని చాలామంది మగాళ్ళను చూశానుగా! అక్క గయ్యాళిది, పనికిమాలిందన్న భ్రమలోపడి అవమానంచేస్తారు. ఒకరికి ఒకరం తోడువుంటే చాలురా!" అంది చమర్చిన కళ్ళు ఒత్తుకుని.

లలితమ్మ సంతోషం అంతా ఇంతా కాదు. ఆరోజే శ్వేత పుట్టిన రోజు. లలితమ్మ పాయసం, గారెలు చేసింది.

పెద్దపార్టీ చేయటం విజయకు నచ్చదు. వేగం హెచ్చింది. ప్రతివారూ ఏదో పనులలో వుంటాను. పార్టీ అవగానే అందరూ పనులు మాను కొని రావాలి.

ఊరందరు ఒకదారి అయితే ఉలిపికట్టెది మరోదారి అని మురిపెంగా విసుక్కుంటుందామె.

రాత్రి భోజనాలు చేస్తుండగా వివాహప్రసక్తి తెచ్చిందామె.

"నాలుగో తారీఖు మంచి ముహూర్తం వుందట. పెళ్ళి తిరుపతిలో పెళ్ళిచేద్దామని వుంది. దానికి అర్చన అంగీకరించింది" అంది.

అర్చన ఒకసారి తలెత్తి మళ్ళీ దించుకుంది. శ్రీహర్ష ఏం మాట్లాడ లేదు.

"శ్రీ నీ ఇష్టం అన్నాడు కదమ్మా?" అంది విజయ.

"రేపు వెళ్ళి మీ ఇద్దరికీ కావల్సిన బట్టలు తెచ్చుకోండి. అర్చనా! నా గొలుసు చెరిపి నీకిష్టమయిన వస్తువులు చేయించుకోమ్మా!"

"నేనసలు గాజులు కూడా వేసుకోను. గొలుసు చెరిపించటం దేనికి? వుండనివ్వండి" అందామె.

శ్రీహర్ష మనసులో ఆనంద్, వాడి మాటలు తిరుగుతున్నాయి.

"ఏమిటి శ్రీ జవాబు చెప్పవూ?"

"ఆఁ....ఏమన్నారు?" కంగారుగా అడిగాడు,

"ఏంలేదు. మీ ఫ్రెండ్స్‌ను, కొలీగ్స్‌ను పిలుస్తావా? లేక తిరుపతి నుండి వచ్చాక రిసెప్షన్ యిద్దామా?"

"తిరుపతినుండి వచ్చాక రిసెప్షన్ యిద్దాం" అన్నాడు క్లుప్తంగా. అతను చెయ్యి కడుక్కొని బయటికి వెళ్ళాడు.

"మాట్లాడుతుంటే మధ్యలో వెళతావేంరా?" ఆమె కోపంగా అడిగింది.

"నా మంచిచెడులు నాకంటే బాగా నీకు తెలుసమ్మా! నువ్వు నిర్ణయించి ఇలా చెయ్యి అంటే గుడ్డిగా అనుసరిస్తాను" అన్నాడు బయట నుండే.

"చూశావా విజ్జమ్మా! నీ తమ్ముడి మంచితనం?" లలితమ్మ నవ్వింది.

విజయకు తెలుసు శ్రీహర్ష హృదయం. అందుకే ఆమె ఏంమాట్లాడ లేదు.

అర్చన మాత్రం కాస్త బాధపడింది. మొదటిసారిగా తన సమర్థత మీద, అందంమీద అనుమానం కలిగింది.

శ్రీహర్ష వెంటనే ఆమె దగ్గరకు వచ్చి క్షమార్పణ కోరాడు.



"సోమవారం బ్యాంకుకు వెళ్ళి సెలవుపెట్టి వస్తాను. నువ్వు రడీగా వుండు" అన్నాడు.

ఆమాత్రానికే ఆమె హృదయం పున్నమినాటి సముద్రంలా ఉప్పొంగి పోయింది. ఆమె కళ్ళు మిలమిలలాడాయి.

విజయ తమ్ముడివంక జాలిగా చూసింది.

రాజశేఖర్ పిలవటంతో శ్రీహర్ష అతని గదిలోకి వెళ్ళాడు.

"'ఓన్ యువర్ హౌస్' స్కీములో డబ్బు వచ్చింది శ్రీహర్షా! ఇది బ్యాంక్‌లోన్‌లో కట్టెయ్యి" అని పదిహేనువేల రూపాయలు క్యాష్ యిచ్చాడు. మరో పదిహేనువేలకి చెక్కు ఇచ్చాడు.

"ఈ చెక్కు కమీషన్‌పై క్యాష్ చేస్తారు క్యాష్ చేయించి, మూడ్రైవేలు కట్టెయ్యి" అన్నాడు.

"రెండురోజులు ఆలస్యం అయినా ఫరవాలేదు బావా! చెక్కులే తీసుకో! నువ్వెవరికిచ్చినా, చెక్కులే ఇవ్వు" అన్నాడు.

"ఇకముందు అలాగే చేస్తాను."

"రశీదులు వ్రాయటం కుదరకపోయినా సమస్య వుండదు. ఈ డబ్బు తీసుకెళ్ళటం సేఫ్టీ వుండదు బావా!" అన్నాడు శ్రీహర్ష.

"ఐ విల్ సీ దిస్ ఈజ్ లాస్ట్. ఎవరో పార్టీ దుబాయ్ వెళుతూ ఇచ్చారు" అన్నాడు. రాజశేఖర్‌కు తెలుసు. ఒకటి రెండుసార్లు చెక్కులు బౌన్స్ కాక అయిన గల్లంతు అయినా ఇప్పుడు చర్చించాలనుకోలేదు. ఇద్దరూ బయటికి వెళ్ళారు. శ్రీహర్షకు మాత్రం గుండెలు ఎవరో పిండు తున్నట్లు అయింది. అతను దారిలో తన వుద్దేశం మార్చుకుని, ఆనంద్ బడికి వెళ్ళాడు.

ఇంకా పిల్లలు క్లాసులోకి వెళ్ళలేదు.

"మా డాడీ ఫారిన్‌నుండి రాగానే నేను కొనుక్కుంటాను" అంటు న్నాడు ఆనంద్.

"హాయ్ ఆనంద్!"

"హాయ్ అంకుల్! మమ్మీకి చాలా భయం అంకుల్. నాకు సైకిల్ కావాలంటే కొనివ్వదు" అన్నాడు బుంగమూతి పెట్టి.

"నేను కొనివ్వనా?"

"డాడీ, మమ్మీ దగ్గర తప్ప తీసుకోకూడదని మమ్మీ చెప్పింది. నో థాంక్స్."

వాడు ఆ మాటలన్న తీరుకు శ్రీహర్ష ఒక్కసారి చలించిపోయాడు. వాడెనెత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు. అతనికి కళ్ళు సజలమయ్యాయి.

"అరె మీ కళ్ళల్లో నీళ్ళు అంకుల్...."

"అలాగా, ఏదో నలకపడింది...." అన్నాడు.

"మా మమ్మీకి అంతే. ఎప్పుడూ కళ్ళలో నలకపడుతుంది" అంటున్నవాడల్లా బెల్ కావటం విని, శ్రీహర్ష చేతుల్లోనుండి దిగి పరుగెత్తాడు.

'మీ అమ్మ కండ్లలో కారం చల్లబోతున్న దుర్మార్గుడిని ఆనంద్' అనుకున్నాడు.

మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ స్కూటర్ వైపు వచ్చాడు.

# 23

అంజని పార్థసారథిగార్కి ఫోన్ చేసి చెప్పింది. 'ఈరోజు తనకు తలనొప్పిగా వుంది రాలేనని' ఆమె మనసంతా చేదు మింగినట్టుంది. ఆ రోజు శ్రీహర్ష వివాహం. తిరుపతిలో జరుగుతుంది. అతనే బడిదగ్గర కనిపించాడు.

"నాకు....నాకు గతం మరిచిపోయి, ఆనంద్ కోసమే బ్రతికే బలం కావాలి....బలం కావాలి" అనుకుంది పదేపదే.

"మమ్మీ! ఎందుకు అలా కూర్చున్నావ్?"

"ఎలా కూర్చున్నాను?"

"సాడ్‌గా! నాకు ఫస్టుమార్కులు వస్తే రిషి యిలాగే కూర్చుంటాడు" అన్నాడు. అంజని విషాదంగా నవ్వింది.

"ఓ మైడియర్ ఫ్రెండ్ పేపర్ ఇస్తావా?" గడ్డం గీసుకుంటూ కోటేశ్వరరావు అడిగాడు.

"ఓ.కే మిస్టర్ రావ్" ఆనంద్ వార్తాపత్రిక తెచ్చి అందించాడు.



"థాంక్యూ ఆనంద్ బాబూ!" అన్నాడు పేపర్ తీసుకుని.

"సబ్బు సరిగ్గా తుడుచుకోవు" అనినవాడిలా తుండు తీసుకుని అతని ముఖం తుడిచాడు. బుగ్గమీద ముద్దుపెట్టాడు.

"అంజూ!" ఒక్కసారి కేకపెట్టాడు కోటేశ్వరరావు.

"నాన్నా! ఏమిటి?" కంగారుగా లేచింది అంజని.

"ఏంలేదు. నా ఉసురు, నీ ఉసురు కొట్టింది" పేపర్ నేలకేసి కొట్టాడు. అంజని చటుక్కున పేపర్ తీసుకుంది. మొదటి పేజీలో శ్రీహర్ష ఫోటో వుంది. "బ్యాంకులో ఉద్యోగిగా చేరి దొంగనోట్లను మారుస్తున్న ఒక విద్యాధికుడైన ఇంజనీరు అరెస్టు" అని వుంది.

"చూశావా అంజనీ! పత్తిత్తుల్లా మాట్లాడి ఎంతకు తెగించారో!"

కోటేశ్వరరావు పళ్ళు కొరికాడు.

"చదువుకుని బ్యాంకులోచేరి ఇతను చేస్తున్నపని ఇదా?" హేళనగా నవ్వాడు. అతనికి తెలిసింది శ్రీహర్ష రెండవ వివాహం చేసుకుంటున్నాడని. అప్పటినుండి కోటేశ్వరరావు హృదయం భగభగ మండుతుంది. తన కారు తీసుకువెళ్ళి స్కూటర్‌కు డాష్‌కొట్టి రావాలనుకున్నాడు. కానీ కూతురి ముఖం చూసి వూరుకున్నాడు.

అంజని ఆదుర్దాగా వివరాలు చదివింది. "శ్రీహర్ష నమ్మించి తన నబ్బం గడుపుకుంటున్నాడని బ్యాంకు అధికారులు అభిప్రాయపడుతున్నారు. రావుగారి పేరనున్న లోన్‌లో పదిహేనువేల రూపాయలు జమకట్టాడట. కేషియర్‌కు ఎందుకో అనుమానం వచ్చి ఆ నోట్ల నంబర్లువేసి సంతకం చెయ్యమన్నాడట. జంకు లేకుండా సంతకం చేశాడు. అవి వెరిఫై చేసుకుంటే దొంగనోట్లని అర్థమయింది. అన్నీ చిన్ననోట్లు కాబట్టి అనుమానించారు. వివాహం చేసుకోవటానికి బయలుదేరుతున్న శ్రీహర్షను అరెస్టు చేశారు."

"నో....నో! ఇదంతా అబద్ధం నాన్నా!" అంజని అరిచింది.

"నువ్వు అనుకుంటున్నావు. అందరూ అనుకోవద్దూ. ఒకప్పుడు నాపైన పడిన నిందలన్నీ అబద్ధాలేననీ ఎంతగానో అరిచానమ్మా. ఎవరు విన్నారు?" ఆయన లేచి బాత్‌రూంలోకి వెళ్ళాడు.

అంజనికి తండ్రి హృదయం అర్థమయింది. అతను శ్రీహర్షకు ఏ విధమైన సహాయం చెయ్యలేదు.

అతడిని కాదని తను ముందుకు సాగలేదు. అంజని రాయిలా కూర్చుండిపోయింది.

"అంజనీ! ఈ ద్రిమ్మరి ఏనాడూ బైంపకాడు. ఆనంద్‌ను బడిలో వదిలిరా" పక్క ఆనంద్‌ను తీసుకువచ్చి ఆమె దగ్గర వదలివేసింది.

అంజని ఒక్క నిమిషం ఆలస్యం చెయ్యకుండా కొడుకును తీసుకుంది. ఆనంద్‌ను బడిలో వదిలింది. అక్కడనుండి లాయర్ పార్థసారథి దగ్గరకు వెళ్ళింది. అతనికి శ్రీహర్ష విషయం అంతా చెప్పింది. 'ఆయన అలాంటివారు కాదు' అన్నది కన్నీటితో.

"మనం ప్రొసీడ్ అయ్యేకంటే ముందు ఒకసారి నేను రాజశేఖరం గారితో మాట్లాడితే కొంత కేసు అర్థమవుతుంది" అన్నాడు.

"ఇప్పుడే పిలుస్తాను. ఆమె త్వరగా ఫోన్ చేసింది. అవతల ఎవరో కొత్త కంఠము పలికింది.

"రాజశేఖరంగారు పోలీసు కమీషన్ ఆఫీసుకు వెళ్ళారు" అన్న జవాబు వచ్చింది.

"అర్చన అయివుంటుంది. నాకంటే దురదృష్టవంతురాలు" అని నిట్టూర్చింది. ఆమె తిన్నగా పోలీసు కమీషన్ ఆఫీసుకు వెళ్ళింది. అక్కడ తండ్రికి తెలిసినతను కనిపించాడు.

"అతను శ్రీహర్ష బెయిల్ కోసం ప్రయత్నించాడు. బెయిల్ నిరాకరించారు. ఈరోజు ఇన్‌స్పెక్షన్ వున్నదట. అతను సైటుమీదకి వెళ్ళాడు" అన్నాడు.

అంజని అతనింటికి ఫోన్ చేసి, అతను పనిచేసే స్థలం కనుక్కుని అక్కడికి వెళ్ళేసరికి సీన్ దారుణంగా వుంది. కూలీలంతా రాజశేఖర్‌ను ఎదుర్కొంటున్నారు. ఏది దొరికితే దాంతో కొడుతున్నారు. అంజని అడ్డు పడింది.

"ఆగండి. చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకుంటామనుకోవటం పొరపాటు."



అంటుండగానే ఒక రాయి వచ్చి, ఆమె నుదురును తాకి నేలపై పడింది. ఆమె కట్టిన తెల్లచీరపై ఎర్రని రక్తం మరకలు స్పష్టంగా కనిపించాయి.

జనం తగ్గారు. అంజని పమిటతో నుదురు ఒత్తుకుని చూసింది. అక్కడ నేలపై మరో వ్యక్తి ప్రాణంలేనట్టు పడివున్నాడు.

"ఏం జరిగింది?" అంజని అడిగింది.

"ఆ పాపిష్టి కంట్రాక్టర్‌ను అడగండి. అటు ప్రజలను, ఇటు ప్రభుత్వాన్ని దోచుకుంటున్నారు అన్నాడో యువకుడు.

మళ్ళీ కూలీలు రెచ్చిపోయారు.

"ఆగండి. అతనెవరోగాని, అతనికి దొరికే డబ్బు కూడా, మీ తొందరపాటువల్ల దొరకదు" అని అంజని అరిచాక తగ్గారు. రాజశేఖర్‌కు బాగా దెబ్బలు తగిలాయి.

"మొదట అతని పరిస్థితి చూద్దాం" అంటూ అంజని వంగి, నేలమీద పడిన వ్యక్తిని చూసింది. అతని ప్రాణం ఎప్పుడో పోయిందని అర్థంచేసుకుంది అక్కడి జనాన్ని ఉద్రిక్తులను చేయటం ధర్మంకాదని భావించింది.

"రాజశేఖరంగారూ! కాస్త సాయంపట్టండి, ఆస్పత్రికి తీసుకువెళ్దాం" అన్నది. అతనొచ్చి సాయంపట్టాడు.

"అంతమీదికెల్లి పడ్డాక, ఇంకా ప్రాణం వున్నాది?" ఒక కూలి పెదవి విరిచాడు.

"మీరు నిర్ణయిస్తే వదిలివేయటం కుదరదు. డాక్టరు నిరూపించాలి" అన్నది కారు రివర్స్ చేస్తూ.

రాజశేఖరం వచ్చి ఆమె ప్రక్కన కూర్చున్నాడు. గుమాస్తా వెనుక శవము ప్రక్కన కూర్చున్నాడు.

అంజని కారు స్టార్టు చేసింది.

"అతను చనిపోయాడు అంజనీ" రాజశేఖరం, ఆమె పెళ్ళయిన తరువాత చూడటమే. మళ్ళీ ఈరోజు పలుకరిస్తున్నాడు. అబలకాదు. ఆరితేరిన యువతిప్పుడు.

బేల చూపులుకాదు, తీక్షణంగా చూస్తూ మనుషుల్ని అంచనా

వెయ్యాలని చూస్తూంది.

కట్టు బొట్టులో హుందాతనము కనిపించింది.

"నాకు తెలుసండీ! అక్కడి జనాన్ని బెదరగొట్టాలంటే అతడిని అక్కడినుండి తరలించాలి" అన్నది.

"ఓ....ఐసీ" అన్నాడు నుదుటపట్టిన చెమట పత్తుకుంటూ.

"ఎలా పడ్డాడు అతను?"

"నిన్న పని అనుకున్న సమయానికి జరగాలని, ఓ నలభై బస్తాల సిమెంట్ బ్లాకులో కొన్నాను. దాంట్లో బూడిదపాలే ఎక్కువ వున్నట్టుంది. అందులో మా సూపర్‌వైజర్ కొంత మిగిలించుకుందామని రేషియో తగ్గించాడు. బాల్కనీ స్లాబ్ పోశారు. ఈరోజు ఇన్స్‌పెక్షన్‌కువచ్చి అతని కాలు పెట్టగానే స్లాబ్ కూలింది" అన్నాడు.

"నాల్గుగంటల్లో ఆరిపోవాలికదా?"

"బూడిద, ఇసుక ఏమారుకుంది" అన్నాడు.

దేశంలో సంవత్సరం తిరిగేసరికి పదివేల రూపాయలతో పని ప్రారంభించిన కంట్రాక్టర్లు లక్షాధికార్లు అవుతున్నారు. ఈ దోపిడీ ప్రభుత్వానికి తెలియదా? ప్రజలకు తెలియదా? ఒకప్పుడు ఓవర్సీర్ కోర్సు చదవాలి. డబ్బులొస్తాయి అనే తల్లిదండ్రులు, ఇప్పుడు కంట్రాక్టుకు ఎగబడ్డారు. అక్రమము, అన్యాయము ఏది గుర్తుండదు అర్జనతప్ప. హైయ్యర్ పర్సెంటేజికిచ్చిన ఇళ్ళు మరీ ఘోరం. సగం డబ్బు కట్టకముందే పెచ్చులూడి, మొండిగా కనిపిస్తుంటాయి. కొన్నవారికదో తృప్తి. మేం ఒక్కసారి డబ్బు ఇవ్వలేదు అనుకుంటారు.

కారువెళ్ళి ఆస్పత్రి ముందాగింది. అంబులెన్స్ తెచ్చి పైనుండి పడిన అతడిని తీసుకెళ్ళి చనిపోయాడని చెప్పారు.

"రాజశేఖరంగారూ! మీరు బయట తిరగటం అంత క్షేమంకాదు. ఈ దెబ్బలు చూపి మిమ్మల్ని అడ్మిట్ చేస్తాను. దయచేసి నా మాటలు వినండి" అన్నది అంజని.

"సారీ అంజనీ! నీకీ విషయం తెలియదేమో. శ్రీహర్ష అరెస్టు అయ్యాడు" అన్నాడు అపరాధిలా తలవంచుకుని.



"పేపర్ చదివాను. అతను క్షేమంగా వుంటాడు. మీరేం దిగులు పడకండి. మీరు బయటవుండటం అంత క్షేమంకాదు. మీ పబ్లిసిటీ మీకు హానిచేస్తుంది. ఇందాక కొందరి మాటలు విన్నమీదట నేనిచ్చే సలహా ఇది."

"నీ సలహా....విని పనిచేస్తే అయినట్టే" అనబోయి ఆగిపోయాడు. ఆమె ఇప్పుడు సిటీలో లీడింగ్ లాయర్ అసిస్టెంట్.

"విజయకీ విషయము...."

"నేను ఫోన్‌చేసి చెబుతాను. వీలయితే పంపిస్తాను" అన్నది.

రాజశేఖర్ అడ్మిట్ అయ్యాడు. ఒక మనిషి చనిపోయాడన్న ఆదుర్దాలో గమనించలేదుకాని, అతనికి దెబ్బలు బాగానే తగిలాయి. ఒక బాటిల్ గ్లూకోజ్ ఎక్కించాలన్నారు.

"అంజనీ! నువ్వూ మందు వేయించుకోమ్మా" అన్నాడు ఆర్తిగా.

"అలాగే అన్నయ్యా" అన్నది. ఆ క్షణంలో ఇద్దరిమధ్యనున్న అడ్డుగోడలు కూలిపోయాయనిపించింది. ఆమె నుదుట కట్టు కట్టించుకొని చనిపోయినతని వివరాలు తీసుకుంది, అతను గవర్నమెంటు ఉద్యోగి, సూపర్‌వైజర్. పేరు రాజారామట. అతని అయిడెంటిటీ కార్డులోవున్న అడ్రసు తీసుకుంది. తిన్నగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి రిపోర్టు చేసింది.

"వెంటనే చెయ్యాల్సింది, ఆస్పత్రికెందుకు తీసుకెళ్ళారు?" సబ్-ఇన్స్‌పెక్టర్ అడిగాడు.

"చిన్న ఆశ ఇన్స్‌పెక్టర్‌గారూ! కొనప్రాణంవున్నా, మెడికల్ ఎయిడ్ అందుతుందని...." అని వాళ్ళకు వివరాలుచెప్పి విజయ నర్సింగ్ హోమ్‌కు వెళ్ళింది.

"ఇప్పుడు డిస్టర్బ్ చెయ్యొద్దండీ. ఆమె ఒక క్రిటికల్ ఆపరేషన్ చేస్తుంది. ఆమె అసిస్టెంట్ అర్చన కూడా రాలేదు" అన్నారు.

"దట్స్ ఆల్‌రైట్! ఆమె బయటికిరాగానే చీటీ ఇవ్వండి" అని గబగబా నాల్గు వాక్యాలురాసి యిచ్చింది.

ఆమెకు అప్పుడు గుర్తుకువచ్చింది. ఉదయంనుండి తనేం తినలేదని. వెంటనే ఇంటికెళ్ళింది. తండ్రినో, అన్ననో సహాయంకోరి, పనిచేసే దగ్గ

రకు మనిషిని పంపాలనుకున్నది. ఆమె కారు లాక్ చేస్తుండగా కోటేశ్వర రావు బయటికి వచ్చాడు.

"అంజూ! ఎక్కడినుండి రాక?"

"మీరు....మీరు....వారు అరెస్ట్ అయినట్టు చెప్పారుకదా. ఒకసారి చూద్దామని" అన్నది.

"అంజూ! నేనెప్పుడూ శాసించలేదు, నీపై ఆంక్షలు పెట్టలేదు. ఈరోజు మాత్రం ఖచ్చితంగా చెబుతున్నాను. వాళ్ళకు, మనకు ఏసంబంధం లేదు" అన్నాడాయన దృఢంగా.

"అలా అంటే లేకుండాపోతుందా నాన్నా?" అని నచ్చచెప్ప బోయింది అంజని.

"వాళ్ళు లేకుండా చేసుకున్నాక పదేపదే ప్రాకులాడతావేం? అన్నీ కలిసివస్తే ఈపాటికి పెళ్ళికొడుకు అయ్యేవాడు. అదన్నా గుర్తులేదా? నాకొక్కమాటివ్వాలి....మాట సహాయంగాని, డబ్బు సహాయంగాని చెయ్యటానికి వీల్లేదు" అన్నాడు.

అంజని ఉక్కిరిబిక్కిరి అయింది.

"అదికాదు నాన్నా!"

"ఏదికాదు! నేను అభిమానంతో చేసిన ప్రతిపనికి స్వార్థం అంటూ లేనిపోనివి అంటగట్టి అవమానం చేశారు. కొన్ని సంవత్సరాలుగా అనుభవిస్తున్నాను ఈ నరకయాతన. దేవుడు దయామయుడు. నాకు న్యాయం జరిపాడు" అన్నాడు అతిశయంగా.

"నాన్నా! మీరు....మీరేనా? వారు జైల్లోవుంటే సంతోషమా?" అదిరిపడింది అంజని.

"అవును అంజూ! నేనే, నా హృదయం కాలికాలి మసి అయ్యే స్థితిలో వున్నది" అన్నాడు కోపంగా.

ఆమె కొత్తగా చూసింది. తండ్రి వాకిట్లో నిలేసి, ఇన్ని మాటలు అనడమా? ఆమె నమ్మలేకపోయింది.

"వారు....వారు అంటున్నావే వాడికి హృదయం వుందా? వాడొక మనిషేనా?" ఆయన కోపం తారాస్థాయికి అందుకున్నది. కాండ్రించి



ఉమ్మేశాడు.

"నాన్నా!" అంజని అరుపుకు అతను అదిరిపడ్డాడు. ఆమె లోపలికి వచ్చింది. ఆమెను అనుసరించాడు.

"నాన్నా! మీ పెద్దవారి పగలు, సెగలు మమ్మల్ని మాడ్చివేశాయి. మీ ఇద్దరికీ సఖ్యతలేనిది మాకెందుకు చేశారీ వివాహం. ఎవరు చెయ్యమన్నారు? ఎందుకు మమ్మల్ని ఏడ్పిస్తావ్?" నిలదీసి అడిగింది.

"ఏమిటీ ఏమన్నావ్?" ఆమె చెయ్యిపట్టి లాగాడు కోటేశ్వరరావు. ఆమె పడబోయి నిలద్రొక్కుకున్నది.

"నేను....ఏడ్పిస్తున్నది నేనా?" ఆశ్చర్యంగా అడిగాడు. "నీకోసం బ్రతుకుతున్నాననే కూతురేనా?"

"అవును నాన్నా! ఆనాడే ఆనందబాబు విషయం అత్తయ్యతో చెబితే మంచోచెడో అప్పుడే తేలిపోయేది. అవన్నీ దాచిపెట్టి మాకు వివాహముచేసి, ఓపరిధి గీసి 'అది దాటితే చస్తాం' అంటూ సెంటిమెంటుపై కోర్కె తీర్చుకుంటున్నారు" అన్నది.

"అంజనీ....అంజనీ" ఆయన పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"మీరు....మీరు ఎంత అరిచినా నన్ను భయపెట్టలేరు. బావకు కోరికలు పెరిగిపోయి ఆగలేక వివాహానికి అంగీకరించలేదు. అక్కడే ఆమె సెంటిమెంటల్‌గా అతన్ని లోబరుచుకుంది."

"నోరుముయ్యి" అతను చెయ్యెత్తాడు.

"ఆగిపోయావేం? కొట్టు నా జీవితంపైపడిన దెబ్బకంటే పెద్ద దెబ్బ కాదు. నేను వెళ్ళి ఆయనను విడిపిస్తాను" కోపంగా అన్నది.

"నా డబ్బు ఒక పైసా ముట్టుకోవద్దు" అన్నాడు అతను అంతకంటే రెచ్చిపోతూ.

"ఏమిటి నాన్నా! మీరు పసిపిల్లాడిలా!" బాలాజి వచ్చి తండ్రి చేయి పట్టుకున్నాడు.

"అన్నయ్యా! నేను మాట్లాడే మాటలు పసిపిల్ల మాట్లాడినట్టు వున్నాయా? ఇన్నిరోజులు మీకోసం బ్రతికాను. ఇప్పుడు నాకోసం బ్రతుక

తాను. మీ డబ్బు వద్దు, మీ దయాదాక్షిణ్యాలు వద్దు...." ఆమె ఆవేశంతో, రోషంతో ఊగిపోతూ పైకివెళ్ళి తన బట్టలు సర్దుకుని క్రిందకు వచ్చింది.

"అంజూ! ఏమిటమ్మా ఇది?" పద్మ వచ్చి సూట్ కేస్ లాక్కుంది.

"వదినా! ఆనాటినుండి, ఈనాటివరకూ స్త్రీ స్థానం ఏమిటో వివరించి చూపారు. పుట్టింట్లో వుండాలంటే ఆత్మాభిమానం చంపుకుని బ్రతకాలి" అని తన పెట్టె తాను తీసుకుంది.

"ఓహో! ఈరోజు నీ బ్రతుకు నీవు బ్రతుకుతానంటావు లాయర్ విగా" అన్నాడు కోటేశ్వరరావు.

"చదువు చెప్పించింది మీరే నాకు తెలుసు. కాని కన్నవారు ఆ మాత్రం చేయటం గొప్పకాదు. కన్నవారుగా పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించటం మీ బాధ్యత" అని విసురుగా బయటికి వచ్చి కారు తాళాలు తండ్రి పైకి విసిరింది.

బయటికి వచ్చి, కనిపించిన రిక్షా ఎక్కి, పార్థసారధిగారింటికి వెళ్ళింది. అతనప్పుడే భోజనానికి కూర్చుంటున్నాడు. సూట్ కేస్ ఓ పక్కకు పెట్టింది. వెళ్ళి బేసిన్ దగ్గర చేతులు కడుక్కుంది.

"ఆంటీ! నాకూ వడ్డించండి" అన్నది కూర్చుని.

"నేడెంత సుదినం! భోజనం చెయ్యమ్మా అంటే నాన్న ఎదురు చూస్తాడు, అన్నయ్య కాచుకుంటాడు, వదిన చూస్తుంటుంది అనేదానవు" అని మిసెస్ పార్థసారధి వడ్డించింది.

ఆయన అనుభవం నేర్పిన పాఠాలతో, చుట్టూ కలయచూసి, తల పంకించాడు.

"సరస్వతీ! అమ్మాయి కొన్నాళ్ళుండాలని వచ్చినట్టుంది" అన్నాడు.

"అవునంకుల్! ఇల్లు దొరికేవరకు వుంటాను. శ్రీహర్ష కేసు టేక్ చేయటం నాన్నగారికిష్టంలేదు. అందుకే...." అన్నది.

"ఏమిటో....ఈ పెద్దల పట్టుదలలకు పిల్లలు నలిగిపోతున్నారు" నిట్టూర్చిందామె.

"మేడమీద పోర్షన్ ఖాళీగానే వుందమ్మా! బాబు సంవత్సరానికి ఒకేసారి వస్తాడు. అయినా అది అద్దెకివ్వటం యిష్టంలేదు" అన్నాడాయన.



"అయితే నాకు వంటచేసుకునే అనుమతివ్వాలి" అన్నది అంజని.

"అబ్జెక్షన్ యువర్ ఆనర్! గ్యాస్ పొయ్యి లేకుండా ఎలా విడిగా వుంటారు యువర్ ఆనర్?" అన్నది సరస్వతి.

"ఆంటీ! నా మనసు బాగుంటే వాదించి గెలిచేదాన్ని. నన్ను క్షమించండి" అన్నది. ఆ మాట అంటుంటే ఆమె కళ్ళనిండా నీళ్ళునిండాయి.

"నో....నో అంజనీ! నీవు ఏడవద్దమ్మా! బి బ్రేవ్" అన్నాడు ఓదార్పుగా. సరస్వతి కూడా తల్లిలా ఓదార్చింది.

## 24

అన్నివైపులా బంధించినట్టుంది రాజశేఖర్ పరిస్థితి. ఉదారతకు మారుపేరు, స్నేహానికి నిర్వచనము అన్న పెద్దలంతా అతన్ని చూస్తూనే తప్పుకుపోతున్నారు.

ఆ ఇంట్లో విషాదం అలుముకున్నట్లుంది. శ్వేత పెద్దదయింది. పిల్ల విచారంగా వస్తుంది.

"మమ్మీ! డాడీ ఛీట్ అంట అవునా?"

"ఎవరన్నారమ్మా?"

"మా టీచర్ అందరిముందూ అంటోందమ్మా! నేను కాదనంటే పేపర్లో పడిన డాడీ ఫోటో చూపించింది. దానిక్రింద వ్రాసింది చదివాను" అంది ఏడుపు గొంతుకతో.

విజయకు మతిపోయింది. ఉపాధ్యాయులంటే ఆమె అమితమైన గౌరవం వుంది. అలాంటిది ఈరోజు తన అంచనాలు తారుమారయ్యాయి. ఆ టీచర్ ఎందుకలా ప్రవర్తించింది?

విజయకు గతంలోని సంఘటన గుర్తుకువచ్చింది.

"మిసెస్ విజయా! నిన్న స్వాతంత్ర్య దినోత్సవమని మీవార్ని ముఖ్య అతిధిగా పిలిచారు. పూలగుత్తి యివ్వబోయాను. 'ఇంతకంటే అందమైనవాళ్ళు లేరా?' అంటూ అవమానం చేశారు" అన్నది కళ్ళు నీటితో నిండాయి.

"సారీ మిస్ జానెట్" అంది విజయ.

"మీవారు అందం, హోదా అంటూ ప్రాకులాడతారు. అది శాశ్వతం కాదని తెలియదా!" అంది కళ్ళు ఒత్తుకుని.

'అది తెలిస్తే మనిషి ఇంత దిగజారిపోడేమో' అనుకుంది.

"స్వీటీ! మీ నాన్నను ఎవరు తిట్టారమ్మా?"

"అదే జానెట్ టీచరమ్మా" అంది.

"స్వీటీ! జానెట్, మీ డాడీ పోట్లాడుకున్నారు. ఆ కోపంలో అన్నారేమో, ఫర్‌గెట్ ఇట్ డార్లింగ్" కూతుర్ని ముద్దుపెట్టుకుంది. స్వీటీ ఆడుకోవటానికి వెళ్ళింది.

"విజ్జమ్మా! మీ పెదనాన్న ఊళ్ళోనే వున్నాడట" అంది లలితమ్మ. ఈ నెలరోజులలో ఆమె జుట్టు పూర్తిగా తెల్లబడింది.

రాజశేఖరం పదేపదే ఆ విషయం చెప్పాడుగాని, విజయకున్న అనుమానాలు ఆమెకు చెప్పలేదు. ఇద్దరు మగవాళ్ళు వెళ్ళి చట్టం చేతుల్లో యిరుక్కుపోయారు. తనెలా ఎదుర్కోవాలో తెలియదు. హాస్పత్రి వదిలినా డబ్బు కావాలి. పద్మనాభరావు సహాయం చేస్తాడన్న నమ్మకంలేదు. రాజశేఖర్, లలితమ్మ అన్నారని, అతనుండే ఇంటికి వెళ్ళింది.

అతను విజయను చూసి ముఖం చిట్లించాడు.

"హల్లో విజయా! బావున్నావా? అర్జెంటుగా సెక్రటేరియెట్‌కు వెళ్ళాలి. కాలం మారిపోయిందమ్మా! అడ్డమైన పనులుచేసి, ఆదుకోమ్మని వెంటబడతారు జనం....మేము ఎంపీలు అయిందే ఇందుకు అన్నట్టు...." బయటికి పోబోయాడు. విజయ పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఆశించిందే అది. అందుకే చిన్నగా నవ్వింది.

"అట్లాగా పెదనాన్నా! వెళ్ళిరండి. ఇక్కడికి పనిమీద వచ్చాను, ఒక్కసారి మిమ్మల్ని చూడాలనిపించింది" అని లేచింది.

"ఇంట్లో మీ పెద్దమ్మ వుంది...." అతని మాటలు పూర్తయ్యేలోపలే విజయ కారులో కూర్చుని, కారు స్టార్టు చేసింది. ఆమె ఇంటికి వచ్చేసరికి అక్కడ శ్రీహర్ష వున్నాడు.

అతని ముఖంలో కొత్తకాంతి కనిపించింది. అతను కృంగిపోయినట్టు కనిపించలేదు. లలితమ్మ కంటనీరు పెట్టుకొని, అతని చేతులు నిమురు



తోంది.

"బెయిల్ యిచ్చారా శ్రీ?"

"ఒకరిప్పించారక్కా" అన్నాడు.

"ఎవర్రా? మీ పెదనాన్నేనా?" లలితమ్మ అడిగింది.

"పేరు, ఊరు ఎందుకులేమ్మా! నన్ను ప్రేమించి, అభిమానించే వ్యక్తి. అన్నట్టు అక్కయ్యా! నేను రాత్రికి బొంబాయి వెళ్ళాలి. బావగారికి క్యాష్ ఇచ్చినవారిని కలుసుకోవాలి" అన్నాడు.

అతను హుషారుగా గడ్డం గీసుకుని, బట్టలు సర్దుకుని తయారయ్యాడు.

"పాపానికి పలుకుతున్నాయి రోజులు. సిమెంటు బావ తయారు చేశాడా? ఎవడో కాలుజారిపడితే అది హత్య ఎలా అయింది?" లలితమ్మ కొడుకును అడిగింది.

"మనం అర్థం చేసుకోవటంలో వుందమ్మా....!" అన్నాడు బ్లేడు కడుగుతూ.

ఆమెకు అతని మాటల్లో ఎన్నో అర్థాలు ధ్వనించాయి. "నాన్నకు ప్రమాదం జరిగితే, అది కోటేశ్వరరావు చేసిన హత్య అనలేదా? ఒక్కసారి ఆలోచించు" అన్నట్టున్నాయి.

రాజశేఖరం నెలరోజుల క్రితం సిమెంటు ఇంటికి మోస్తుండగా పట్టుకుని పంపించివేశాడో వర్కర్ని. అతను అందరితో తను చూసినట్టే చెబుతున్నాడు.

"పాపం! ఆ సూపర్‌వైజరుకేం తెలుసు కంట్రాక్టర్‌గారి ప్లాను? అమాయకంగా 'ప్రజల దగ్గర అంతంత డబ్బు తీసుకుని, ఇలాంటి ఇళ్ళు కడితే ఎలా?' అని అడుగుతుంటే, భుజంమీద చెయ్యి వెయ్యటం చూశాను" అన్నాడు పోలీసుల దగ్గర.

అది విని రాజశేఖర్‌ను అరెస్ట్ చేశారు. నిజానికి ఈ సమయానికి ఆ వర్కర్ జంగయ్య అక్కడ లేనేలేడట. అది విజయ కనుక్కువచ్చింది. ఈనాటి జంగయ్యే ఆనాటి బాలరాజు కాదుకదా! ఆమెకు మతిపోసాగింది.

తలపట్టుకుని కూర్చుంది లలితమ్మ,

శ్రీహర్ష కాఫీ కలిపి తల్లికి, అక్కకు యిచ్చాడు. తన కప్పు తీసుకున్నాడు.

"అక్కా! నువ్వు నిశ్చింతగా వుండు. కొన్నాళ్ళు బావ లోపల ఉండటమే మంచిది. ఈ కేసులు ఒకదానితో ఒకటి ముడిపడ్డాయి" అన్నాడు.

"నాకేం దిగులు లేదురా" అన్నది విజయ.

"లాయర్ పార్థసారధిగార్కి ఏదయినా ఇన్‌ఫర్మేషన్ కావల్సివస్తే ఫోన్ చేస్తారు. మీరు వెళ్ళాలి అన్నాడు.

"అలాగే...." అన్నది విజయ.

"అక్కా! నువ్వు దిగులుగా వుంటే స్వీటీ సంగతేమిటి? ఇవన్నీ మనకు పట్టిన శని చేయిస్తున్నాడనుకుంటాను. ఏమ్మా! ఏమంటావు?"

"నాపై నిష్ఠూరాలు వేస్తారు చెప్పవే విజ్జమ్మా! నా స్థానంలో వుంటే నువ్వేం చేస్తావ్....మీరైతే ఏంచేస్తార్రా" అన్నది ఆవేశంగా.

"ఇప్పుడు చేస్తున్నాను కదమ్మా! బావను తేలికగా హంతకుడనొచ్చు కాని అనను. ఆలోచిస్తాను" అని ఫోన్ రాగానే వెళ్ళాడు.

"హల్లో....మీనార్‌కే దొరికిందా? వెళ్తాను. చెప్పాను. అక్కగాని, అమ్మగాని వస్తారు....నథింగ్ టు వర్రీ....పిలువు....ఓయస్ బాస్....మీ ఆజ్ఞ శిరసావహిస్తాను. థాంక్యూ....థాంక్యూ...." అని ఫోన్ పెట్టాడు.

యెవరు అన్నది విజయకనూహ్యంగా వుంది. అవసరమైతే తమ్ముడే చెబుతాడని ఆమె అడగలేదు.

"అక్కా! నాకు మీనార్‌లో రిజర్వేషన్ దొరికింది. బొంబాయిలో కొందరి స్నేహితుల ద్వారా, ఈ దొంగనోట్లు ఇచ్చేవారి అడ్రస్‌లు తెలుసుకున్నాను. నా ట్రిప్ సక్సెస్ అవుతుంది" అన్నాడు.

విజయ చటుక్కున లేసింది.

"నేను వస్తాను శ్రీ. ఇదంతా చూస్తుంటే పద్మవ్యూహంలా వున్నది" అన్నది.

"మరేం పరవాలేదక్కా! నువ్వేం కంగారుపడకు. ఇక్కడ చూసుకోవాల్సిన పనులు చాలా వున్నాయి" అన్నాడు.

15015
జిల్లా గ్రంథాలయ సంస్థ, నెల్లూరు

 శాఖా గ్రంథాలయము, సూళ్లూరుపేట 

అతను బట్టలు సర్దుకొని బయటికి వెళ్ళిపోయాడు. అతనంత హుషారుగా వుండటానికి కారణం అర్థంకాలేదు.

లలితమ్మ మాత్రం కనిపించిన రాయికల్లా మొక్కుతుంది.

ఒక్క అభియోగం కాదు.

ఇటు కొడుకు!

అటు అల్లుడు ఇరుక్కుపోయారు. వాళ్ళ భవిష్యత్తేమిటో అనూహ్యంగా వుంది. గుడి కెళ్ళొచ్చేసరికి బాలరాజు ఎదురొచ్చాడు.

"అమ్మా! లాయర్ పార్థసారధిగారంట ఫోన్ వచ్చింది" అన్నాడు.

"విజయ లేదా?" అని కూతురికోసం ఇల్లంతా వెతికింది.

"లేరమ్మా! హాస్పత్రికెళ్ళారు" అన్నాడు. లలితమ్మ హాస్పత్రికి ఫోన్‌చేసింది.

"డాక్టరుగారు అర్జంటు కేసు చూడాలని బయటికి వెళ్ళారు." అని చెప్పింది నర్సు.

"ఇప్పుడెలా బాలయ్యా!" ఆమె కంగారుగా తిరుగుతుండగా అర్చన వచ్చింది.

"శ్రీహర్ష లేరా అమ్మా?"

"బొంబాయి వెళ్ళాడమ్మా! సమయానికి వచ్చావు. లాయర్‌గారి దగ్గరకు వెళ్ళాలి" అన్నది కంగారుగా.

"పదండి వెళదాం. ఒక్కసారి కనిపించి, ఇదీ విషయమని చెప్పొచ్చుగా" అన్నది కాస్త నిష్ఠూరంగా.

"వాడి మనసు స్థిమితంగాలేదు అర్చనా! ఏం అనుకోకు" అన్నది బ్రతిమలాడుతూ.

అరగంటలో ఇద్దరూ లాయర్ గారిల్లు చేరుకున్నారు. గుమాస్తా గారొచ్చి, ఇద్దరిని లోపలికి తీసుకువెళ్ళాడు.

"నమస్కారం...." అంటుండగానే లలితమ్మ కళ్ళమ్మట నీరూరింది.

"కూర్చుని, తాపీగా నేనడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పమ్మా" అని ప్రశ్నార్థకంగా అర్చనవైపు చూశారు.

"మా కాబోయే కోడలే లెండి" అన్నది.

"అలాగా! చాలా సంతోషం. హాల్లో మాగజీన్స్, న్యూస్‌పేపర్లుం టాయి వెళ్ళి చదువు." అని అర్చనను పంపేశాడు.

"ఆవిడను అడిగే ప్రశ్నలు నేను వినకూడదు కాబోలు. నాకు వారి కుటుంబానికి ఉన్న సంబంధ బాంధవ్యాలు తెలియవు కాబోలు" ముసిముసిగా నవ్వుతూ హాల్లోకి వచ్చింది.

"హాండ్సప్....."

ఉలిక్కిపడింది.

పకపక నవ్వుతోపాటు పరదా చాటున దాక్కున్న ఆనంద్ వచ్చాడు.

"భయపడ్డారు కదూ!"

"ఊహుం!" అన్నది. అతడిని ఎక్కడ చూచిందో గుర్తుకు తెచ్చుకుంటూ—

"మీరు నన్ను గుర్తుపట్టలేదు. నేను మిమ్మల్ని గుర్తించాను. మా డాడీ ఫ్రెండ్ మీరు...." అన్నాడు సగర్వంగా.

"మీ డాడీ ఫ్రెండ్‌నా?" ఆశ్చర్యపోయింది.

"ఎస్! ఆ రోజు సినిమాలో కలుసుకున్నాం."

"ఓ....ఐసీ! ఆ రోజు మీ మమ్మీతో వచ్చావుగా, మీ డాడీ పేరేమిటి?" అన్నది కుతూహలంగా.

"ఓయ్.... మా డాడీ పేరే తెలియదా? శ్రీహర్ష...." అన్నాడు నవ్వి.

ఆ నవ్వు అచ్చం శ్రీహర్ష నవ్వులాగేవుంది. ఆమె ముఖం నల్లబడింది. ఆమె ఏదో అడగబోయింది.

"ఆనంద్! బడికి సమయం కావటంలేదా?" అన్న పిలుపు పైనుండి వచ్చింది.

"వస్తానండీ. నేను స్కూలుకు వెళ్ళాలి, సాయంత్రం రండి ఆడుకుందాం" అని పైకి వెళ్ళిపోయాడు. ఆమె మనసంతా చేదుమింగినట్టు అయింది.

శ్రీహర్ష వివాహమైందని ప్రారంభంలోనే ఏదో మనస్పర్థలు వచ్చి విడిపోయారని తెలుసు. కాని, ఇంత పెద్దకొడుకున్నాడనిగాని, ఆ భార్యా



భర్తల అనుబంధం కొడుకు పుట్టేవరకు వెళ్ళిందని ఊహించలేకపోయింది.

ఆమె ఆరాటంగా కూర్చుని వుండగానే, అంజని ఆనంద్‌ను తీసుకుని వచ్చింది.

"నమస్కారం అర్చనగారూ! లలితమ్మతో వచ్చారా?" అన్నది.

"అవునండి" అన్నది. ఆ గొంతులో జీవంలేదు. నూతిలో నుండి వచ్చినట్లు వచ్చాయా మాటలు.

"మీరేం దిగులుపడకండి. శ్రీహర్షకేం ప్రమాదంలేదు. తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు వస్తాయి" అన్నది ఓదార్పుగా.

"మీకు దిగులుగా లేదా?" అర్థయుక్తంగా అడిగింది.

"నాకేం దిగులు! నాకిది మొదటికేసే. అయినా పార్థసారధిగారి అండదండలుంటాయి" అన్నది. బయటికి వెళ్ళి రిక్షాలో ఆనంద్‌ను కూర్చోబెట్టి వచ్చింది. ఆమె పైకివెళ్ళి చీర మార్చుకుని ఆఫీసు గదిలోకి వెళ్ళింది.

అర్చన కుతూహలంగా బయట గదిలోకి వచ్చింది.

లలితమ్మ కళ్ళు ఎర్రబడటం గమనించకపోలేదు.

"అంజనీ! వీరు కొన్ని వివరాలు చెబుతారు తీసుకో. లలితమ్మగారూ, నా అసిస్టెంటు అంజని. ఆమె ఈ కేసు తీసుకుని, మీకు న్యాయం చేయాలన్న సంకల్పంతో తనవారందరిని వదులుకుని వచ్చింది."

"అంజనీ! నేను వెళ్ళి భోజనంచేసి వస్తానమ్మా" పార్థసారధిగారు వెళ్ళిపోయారు.

"చూడండి కొన్ని ప్రశ్నలకు దాపరికం లేకుండా జవాబు చెప్పాలి" అన్నది కాగితాలు తీసి.

లలితమ్మ పళ్ళబిగువున కోపం మింగుతున్నది. తనను కావల్సి ఇలా కూర్చోబెట్టటం లేదుకదా! అన్న అనుమానం వచ్చింది.

"ఈ మధ్య శ్రీహర్షగారిలో డబ్బు సంపాదించాలన్న తపనగాని, ఒకేసారి లక్షాధికారి కావాలన్న ఆశగాని తలెత్తిందా?" అన్నది.

"ఏమో నాకు అలా అనిపించలేదు."

"అతనికి డబ్బుమీద వ్యామోహం వుండేదా?"

"ఆ సంగతి నన్ను అడగటం దేనికి?" అన్నది లలితమ్మ.

"చూడండి, శ్రీహర్షగారు ఊళ్ళోలేరని, కావాలసిన వివరాలు మీరు చెబుతారని పార్థసారథిగారు చెప్పారు" అన్నది తీక్షణంగా.

లలితమ్మకు తల తీసేసినట్టు వుంది. తనముందు అపరాధిలా భయపడుతూ అణకువగా తిరిగే కోడలా! తను ఏమూహించింది. 'లా' చదువుతుందనుకుందా! చదివినా, వేరే లాయర్ లేనట్టు తన కేసు ఈ అమ్మాయి చూడాలా? అసలు హర్షకు బుద్ధిలేదు. అర్చనకు ఈ విషయం తెలియకూడదు. లలితమ్మ చాలా జాగ్రత్తగా జవాబులు చెప్పింది. అంజని మధ్యలో పనివాడిని కేకవేసి, కాఫీ తెప్పిచ్చింది.

"కాఫీ త్రాగటానికి రాలేదు."

"నాకు తెలుసు, మీరు ఉదయమే బయలుదేరారని తెప్పించాను వద్దనుకుంటే పెట్టేయండి" అన్నది తన కప్పును తీసుకుని.

లలితమ్మకు త్రాగక తప్పలేదు.

అర్చనకు ముళ్ళమీదున్నట్టుంది-ఎప్పుడు బయటపడదామా అన్నట్టుంది. అంజని చిరునవ్వుతో అందించిన కాఫీ తీసుకోక తప్పలేదు. అంజని ఫైలు మూసింది.

"మీరిక వెళ్ళవచ్చు. ఒక్కసారి పిలుంటే విజయగారిని పంపించండి" అంజని లేచింది.

"లాయర్ గారూ! ఒకసారి మనము సినిమాలో కలిశాము గుర్తుందా?" అర్చన అడిగింది. ఆమెకు అత్త కోడళ్ళ నటన చూస్తే చాలా మంటగా వుంది.

"అవును మీ కాబోయే శ్రీవారు మా అమ్మాయికి కూల్ డ్రింక్స్ ఇప్పించారు" అంది అదే చిరునవ్వుతో.

"ఓ బైదవే మీ శ్రీవారేం చేస్తారు?"

"మా వారు ఇంజనీరు."

"ఎక్కడున్నారు?"

"విదేశాలలో."

లలితమ్మ తేలికగా నిట్టూర్చింది.

వయసులో ఉన్నవారు. మీరు దూరంగావుంటే, మరో అమ్మాయి



ఆకర్షణలో చిక్కుకుంటే...."

"అర్చనగారూ! ఆయన్ని ప్రేమించాను, ఆరాధించాను, అభిమానించాను. ఆయన సుఖంకోసం ఏమైనా చేస్తాను. మరో స్త్రీని వారు కోరుకుంటే సంతోషంగా, వారి జీవితంనుండి తొలగిపోతాను" అన్నది గాద్గదికమైన స్వరంతో.

అర్చన ఆరాధనాపూర్వకంగా ఆమెవంక చూసింది. 'అమృతమూర్తి అయిన భార్యను వదులుకున్న శ్రీహర్ష దురదృష్టవంతుడు' అనుకుంది. ఆమెకు లలితమ్మను నిలేసి దులపాలనుకుంది. కాని కన్నతల్లి హృదయం ఆమె కళ్ళలో నగ్నంగా నాట్యం చేసింది. ఒక నిట్టూర్పు వదిలి లలితమ్మ వెంట బయలుదేరింది.

"మీరేం దిగులుపడద్దు. ఈ కేసులో నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అన్నది సాగనంపుతూ వచ్చి.

"స్వామీ! వెళ్ళి అమ్మగార్ని ఇంటిదగ్గర దింపిరా" అంజని పార్థసారథిగారి డ్రైవర్ని కేకవేసింది. అర్చన మరొక్కసారి వెనుతిరిగి చూసింది. తనెవరో తెలిసీకూడా ఆ ముఖం అంత ప్రశాంతంగా ఉండంటే నిజంగా ఇంత చిన్న వయసులో స్థితి ప్రజ్ఞత సంపాదించింది. అర్చన వెయ్యాపి కార్లో కూర్చుంది, 'అసలు తప్పు లలితమ్మదికాదు శ్రీహర్షను నిలదియ్యాలి' అనుకుంది.

కాని ఒక్కసారి వెనక్కితిరిగి చూసుకుంటే ఆమె మనసే ఆమెను నిలదీసి, ఛెళ్ళున కొరడాతో కొట్టింది. ఏనాడు శ్రీహర్ష తనంతట తాను తనకు చేరువకాలేదు. ముభావంగానే వున్నాడు. అతను ఎన్నోసార్లు విషయాలు చెబుతానంటే తనే అవకాశం యివ్వలేదు.

నిజంగా అతను అదృష్టవంతుడు. అతడిని అందరూ ప్రేమిస్తారు. ద్వేషించేవారు తక్కువేమో! అంత మంచి వ్యక్తిని అర్థాంగి అయ్యే అదృష్టం తనకులేదు. అప్రయత్నంగా కళ్ళు ఒత్తుకుంది.

## 25

శ్రీహర్ష వచ్చి వారం రోజులయింది. కాని అసలు వ్యక్తులను కలుసుకోలేకపోయాడు. తనేకాదు, ప్రభుత్వం కూడా ఈ దొంగనోట్లు వేసే వారిని పట్టుకోవాలని ప్రయత్నిస్తుంది. వారు రంగంలోకి దిగితే పరిస్థితి చెయ్యిజారిపోతుందని, వారు తెరవెనుక ఉండి శ్రీహర్షకు సహాయం చేస్తున్నారు.

శ్రీహర్ష కేసు పబ్లిసిటీ కాకుండా జాగ్రత్తపడ్డారు. ఎలాగైనా ఈ రాకెట్ ఛేదించాలని వుంది.

పేపర్లో ఫైనాన్సర్ కావాలని ప్రకటించాడు. రెస్పాన్స్ రాలేదు. వారి అడ్రసు ప్రకారం వెడితే అక్కడ బురఖా స్త్రీలున్నారు. ఆ స్త్రీలను ప్రశ్నిస్తే ఏదయినా తెలుస్తుందేమోకాని, ఆ స్త్రీలు అవకాశం యివ్వటం లేదు. బలవంతం చేస్తే తనే దోషి అవుతాడు. అతనికి హైద్రాబాద్ వచ్చి మళ్ళీ అపార్ట్‌మెంట్స్ కోసం అడ్వర్‌టైజ్‌మెంట్ చేయాలా అనిపించింది. అతను వచ్చి బాల్కనీలో నిలబడ్డాడు.

ఇద్దరు భార్యాభర్తలు వాదించుకుంటూ వెళుతున్నారు.

అతను డాలర్‌కు అయిదురూపాయలు ఎక్కువ ఇస్తానంటున్నాడు కదా."

"నీకు తెలియదు శైలా! వారిచ్చేవి దొంగనోట్లో మంచివో మనకు తెలియదు. ఇదివరకు సిక్కులు ఈ వ్యాపారంచేస్తే, నీతి నిజాయితీ వుండేది" అన్నాడు పురుషుడు.

వారి సామాన్లు, సరంజామా చూస్తే విదేశాలనుండి వచ్చారని అర్థమైంది. శ్రీహర్షకు మెరుపులాంటి ఆలోచన తట్టింది. వెంటనే, తనకు సహాయం చేస్తున్న సి.బి.ఐ. అధికారితో చెప్పాడు-తన ప్రణాళిక నిమిషాల మీద ఏర్పాట్లు జరిగిపోయాయి. ఆ రాత్రి బాహరీన్, కువైట్ నుండి వచ్చే ప్రయాణికులలో చేరిపోయాడు శ్రీహర్ష.

అతనూహించినట్టే కొందరువచ్చి, అతడిని రాసుకుంటూ తిరిగారు.
"డాలర్ రేటు అయిదురూపాయలు ఎక్కువ....పదమూడు రూపాయలు"



అంటూ హిందీలో, ఇంగ్లీషులో అనుకుంటూ వెళ్ళారు.

శ్రీహర్ష ప్రయాణీకుడిలా వచ్చి రెండువందల డాలర్లు అమ్మాడు కాని. ఆ డబ్బు మంచిదేనని తేలిపోయింది.

"వాళ్ళు ఆరితేరినవాళ్ళు మిస్టర్ శ్రీహర్షా! మీ వృత్తి ఏమని చెప్పారు?"

"డాక్టర్ అన్నానండీ."

"వద్దు. రేపు కాస్త మేకప్పుతో గుజరాతీ పటేల్ అయి రండి వంద, రెండొందలు కాదు-పదివేల డాలర్ల వరకూ ఆఫర్ చెయ్యండి."

"థాంక్యూ సర్" హుషారుగా హోటలుకువచ్చి, మర్నాడు చాలా జాగ్రత్తగా తయారయి, వేరేరంగు వి.ఐ.పి. సూట్‌కేసులు తీసుకుని వెళ్ళాడు.

అతను చెకింగ్ కౌంటరునుండి రాగానే మళ్ళీ వెంటపడ్డారు. ఈసారి హుందాగా ముందుకు నడిచాడు.

"పెద్దమొత్తం కావాలి" అన్నాడు. మీ ముఖాలు మీరేం ఇస్తారు అనే ధోరణిలో.

అతను తన వెంటబడ్డ వారిని పరీక్షగా చూశాడు. ఇరాన్‌లో పని చేస్తూ అమృతలత భర్త స్నేహితుడెవరన్నా కనిపిస్తారేమోనని అమృతలత, రాజశేఖర్ ఒకేలాంటి పోలికలు చెప్పారు.

హైద్రాబాద్‌లో కొంటున్న ఫ్లాటు అమృతలత పేరున బుక్ అయింది. భర్త బయట పనిచేస్తూ డబ్బు పంపాడు. అతడి స్నేహితుడిగా వచ్చిన సాజన్. అమృతలత దగ్గర మంచినోట్లు తీసుకున్నాడు. దాదాపు పది రోజులున్నాడు. ఆమె భర్తకూడా ఉత్తరం వ్రాశాడట.

అలాంటి వ్యక్తి కనిపించలేదు. శ్రీహర్ష నిరాశ చెందలేదు.

"నాకు పెద్దమొత్తం కావాలి. మీలో అంత పెద్దమొత్తం ఇచ్చేవారెవరు?" అన్నాడు జేబులోని పాస్‌పోర్టు సర్దుకొని, గాగుల్స్ తీసి సర్దుకుంటూ.

వాళ్ళు ముఖాలు చూసుకున్నారు.

"అయితే సుఖదేవ్ దగ్గరకు తీసుకెళ్దాం" అన్నారు.

శ్రీహర్ష అసహనంగా చూశాడు.

"పదండి సాబ్! మా సేట్‌జీ దగ్గరకు తీసుకువెళతాము" అని ముగ్గురూ శ్రీహర్ష సామాన్లు పట్టుకున్నారు.

"ఎక్కడైనా హోటల్లో సామాన్లు పెట్టాలి" అన్నాడు.

"మనము హోటల్‌కే వెళుతున్నాము" అన్నారు. శ్రీహర్షవారి కార్లో ఎక్కాడు. పెద్ద పేరున్న హోటల్ ముందు కారాగింది. వాళ్ళు దిగి శ్రీహర్ష కోసం ఒక గది తీసుకుని అందులో సామాన్లు పడేసి కారిడార్లో ఆఖర్న వున్న గదికి వెళ్ళారు.

తలుపు తీసుకుని లోపలికి వెళ్ళగానే, సిగరెట్టు కాలుస్తున్న వ్యక్తి చిరునవ్వుతో లేచి, ఎదురొచ్చాడు.

శ్రీహర్షకు నవ్వు వచ్చింది. స్మగ్లర్స్ ఇలా ఫారిన్ ఎక్స్చేంజి తీసుకునేవారు, సినిమాలలో చూపించినట్టు రకరకాల మాయలుకల మేడల్లో వుంటారనుకున్నాడు.

"హల్లో! చందూభాయ్‌పటేల్" అంటూ కరచాలనం చేశాడు. కాస్త యాసగా మాట్లాడుతూ.

"సుఖదేవ్ హియర్!" అన్నాడు కుర్చీ చూపుతూ. ఇద్దరూ కాఫీ తాగారు.

"ఎనీ హాట్ డ్రింక్?"

"థాంక్యూ! రాత్రిపూట మాత్రమే లిమిటెడ్‌గా పుచ్చుకుంటాను" అన్నాడు. అతను ఆఫర్ చేసిన సిగరెట్ కూడా మృదువుగా వద్దని వారిస్తూ.

"ఆఫ్రికన్ కంట్రీస్ బిజినెస్‌కు మంచి సెంటర్స్" అన్నాడు సుఖదేవ్.

"ఒకప్పుడు వుండేదేమో? ఇప్పుడు ఎక్స్‌పాట్రియేట్స్ అంటే, ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారన్న నమ్మకం పెరిగిపోయింది. అందుకే మరో సంవత్సరం కాగానే ఇక్కడికే రావాలనుకుంటున్నాను."

"దట్స్ గుడ్! చేసుకునేవాడికి ఎన్నో వ్యాపారాలు."

అలా అరగంట మాట్లాడాక, బిజినెస్ ట్రాన్‌జాక్షన్ అయింది.

"గోల్డ్‌బార్స్ కూడా వున్నాయి."



"కస్టమ్స్...." సుఖదేవ్ అనుమానంగా చూశాడు.

"మేనేజ్ చేశాను" అన్నాడు.

"అయితే రెండుగంటల్లో డబ్బు వస్తుంది.

"సుమారు ఐదులక్షల వర్త్ వుంటుంది.

"పదిలక్షలన్నా అయిదారుగంటల వ్యవధి చాలు" అన్నాడు.

అతను తన గదికి వచ్చాడు. శ్రీహర్ష టెలిఫోన్ తిప్పాడు.

"సర్ కాఫీ" వెయిటర్ వచ్చాడు ట్రేతో.

"నేను ఆర్డర్ చేయలేదే...." అంటుండగా, టిష్యూపేపర్లో వున్న ఉత్తరం కనిపించింది.

ఫోన్ పెట్టేసి, కాఫీ కప్పుతోపాటు ఉత్తరం తీసుకున్నాడు. మీ చుట్టూ పనిమనుషులు కాపలా కాస్తుంటారు. ఫోన్ చెయ్యొద్దు. మెసేజ్ వెయిటర్‌కు ఇవ్వండి అని వుంది.

శ్రీహర్ష ఉలిక్కిపడ్డాడు. కాఫీ తాగుతూనే నాలుగు పంక్తులు ఒక తెల్లపేపర్‌పై వ్రాసి యిచ్చేశాడు. వెయిటర్ వెళ్ళిపోయాక శ్రీహర్ష అశాంతిగా అటు ఇటు పచార్లు చేశాడు. తన బావకు ఫేక్ నోట్లు యిచ్చిన మనిషి పోలికలు సుఖదేవ్‌లో స్పష్టంగా వున్నాయి. అతను ఎలా నిర్ధారణ చేయాలో అర్థంకాలేదు. తలుపు తోసుకుని సుఖదేవ్ వచ్చాడు.

"కేష్ రడీ మిస్టర్ పటేల్!" అన్నాడు.

"కేష్ వర్క్" నవ్వాడు. బంగారం ఇచ్చేసి డబ్బు తీసుకుని జాగ్రత్తగా దాచి, సుఖదేవ్‌ను సాగనంపుతూ బయటికొచ్చాడు.

"సాయంత్రం కంపెనీ యిస్తారుగా?"

"ష్యూర్!" అన్నాడు.

"ఒరేయ్ శ్రీహర్షా! ఇక్కడున్నావేమిట్రా? బొంబాయి వస్తున్నట్లు చెప్పలేదేం?" తుఫానులా వచ్చాడు రాజన్. ఈ హఠాత్పరిణామానికి తెల్లబోయాడు శ్రీహర్ష. జవాబు చెప్పటానికి ఒక నిమిషం పట్టింది. తను గుర్తులేనట్టు నటించినా ఇంకా అనుమానం పెరిగే అవకాశం వుంది.

"హల్లో రాజన్! మీట్ మై ఫ్రెండ్ సుఖదేవ్!" పరిచయం చేశాడు శ్రీహర్ష.

"వీడు నా ఫ్రెండు, ఇండస్ట్రియలిస్ట్ రాజన్.

"ఐసీ! ఆఫ్రికాలోనా?" సుఖదేవ్ అనుమానం చూశాడు.

"వెడితే గిడితే అమెరికా వెళతాం. ఆఫ్రికా వెళ్ళే ఖర్మ మాకెందుకు?" అన్నాడు ఇంగ్లీష్‌లో.

"బై మిస్టర్ పటేల్! నాకు చాలా పనులున్నాయి."

సుఖదేవ్ చరచరా వెళ్ళిపోయాడు. రాజన్ వూర్కోలేదు.

"మిస్టర్....మీ పేరు తెలియదు. మావాడు శ్రీహర్ష. పేరు ఖూనీ చెయ్యొద్దు. అర్థమయిందా?" అన్నాడు.

ఒక్కసారి సుఖదేవ్ వెనక్కుతిరిగి చూసి వెళ్ళిపోయాడు. శ్రీహర్ష రాజన్‌ని ఏం అనలేకపోయాడు.

"ఏమిట్రా బాబూ! ఇప్పుడే అమెరికానుండి దిగుబడి అయినట్టున్నావ్?" అన్నాడు.

శ్రీహర్ష ఏం చెప్పలేదు. గదిలోకి వెళ్ళి పిచ్చాపాటి మాట్లాడి మరో సారి కాఫీ త్రాగి వెళ్ళిపోయాడు రాజన్. శ్రీహర్ష బయటికి రాబోయి, పోలీస్ డిపార్టుమెంట్‌వారి హెచ్చరిక గుర్తుకువచ్చింది. ఆ రాత్రి ఆరాటంగా గడిపాడు.

"మర్నాడు ఎనిమిది గంటలకు సి.ఐ.బి. వ్యక్తి అమృతను వెంట బెట్టుకుని వచ్చేసరికి సుఖదేవ్ గది ఖాళీచేశాడు.

"నేను అనుకుంటూనే వున్నాను" నొచ్చుకున్నాడు శ్రీహర్ష.

"మా మనుషులు వెంబడించారట. మీరేం కంగారుపడకండి. కరెన్సీ చెకప్ చేద్దాం" అన్నాడతను.

అందరూ బ్రేక్‌ఫాస్ట్ ముగించి కరెన్సీ చెకప్‌చేస్తే అంతా దొంగ సరుకే.

"ఇక తప్పించుకోలేడు" అంటుండగానే ఫోన్ వచ్చింది. సుఖదేవ్ బొంబాయి ఓడరేవులో పట్టుబడ్డాడట. అతని పేర్లు సుఖదేవ్, ఎలియాస్, రహమాన్, అలియాస్ సాజన్, అలియాస్ విన్సెంట్ ఇలా ఓ పదివరకు వున్నాయి.

అమృతలతను హోటల్లో దింపి వెళ్ళిపోయారు. సుఖదేవ్, అతని



అనుచరులు శ్రీనివాస్‌డాంగే అన్నపేరుతో లండన్ పాస్‌పోర్టు తయారు చేశారట. వారి దగ్గరున్న ఫారెన్ కరెన్సీ, బంగారం అంతా పట్టుబడింది. శ్రీహర్షకు తలపైనుండి పెద్దభారం దిగినట్టు అయింది. ఆరోజు భోజనం కూడా లేదు. పత్రికలవారితో ఇంటర్వ్యూలతోనే సరిపోయింది, రాత్రికి హైదరాబాద్ ఇన్ఫర్మేషన్ వారికి ఫోన్‌చేసి వార్త చెప్పాడు.

"ప్రజలు కూడా ఇంట్రస్టుతో మాకు సహాయపడితే బావుంటుంది శ్రీహర్షా!" డిన్నర్ తీసుకుంటూ చెప్పాడు సి.ఐ.డి. ఏజెంటు. ఆ రాత్రి పార్థసారథిగారింటికి ఫోన్‌చేసి, అంజనికి విషయం చెప్పాడు. తల్లికి ఫోన్ చేశాడు.

"పోన్లే నాయనా! ఆ విషవలయంనుండి బయటపడ్డావు. అంతేచాలు" అని ఫోన్‌లోనే ఏడ్చిందామె.

"ఊర్కోమ్మా....ఊర్కో!" అతనికి తేలికగా, హాయిగా వుంది. ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయాడు.

* * * *

మూడురాత్రులు 'లా' పుస్తకాలన్నీ తిరగవేసింది అంజని. ఆమెకు పట్టుదలగా వుంది. మనుధర్మశాస్త్రం చూసింది.

"పడుకోమ్మా!" పార్థసారథి భార్య వచ్చి పాలు యిచ్చింది.

"లేదు ఆంటీ! ఈ కేసు పూర్తయితేగాని నిదురరాదు" అంది పాలు తీసుకుని తాగుతూ. కిందికి పైకి తిరుగుతుంటే అంజని అలసిపోతుందని ఎక్స్‌టెన్షన్ పెట్టించింది.

"అంజనీ! ఆనంద్ క్రింద పడుకున్నాడు" అంది ఆమె.

"ఈ వారంరోజులు మీరే చూడండి ఆంటీ!" అంది.

"అంతకు ముందురోజే బాలాజి, పద్మ వచ్చి ఆనంద్ కోసం కోటేశ్వరరావు దిగులు పెట్టుకున్నాడని తీసుకువెళ్ళి రాత్రి తీసుకొచ్చారు. సాయంత్రం వచ్చి మళ్ళీ తీసుకువెళ్ళారు.

పంతాలు, పట్టింపులు వస్తే తల్లి, చెల్లి అని చూడరేమో? అనుకుందావిడ.

అంజని మళ్ళీ చదవటంలో లీనమయింది.

జంగయ్య తను రాజశేఖర్ నెట్టగా చూశానని సాక్ష్యం యిచ్చాడు. మిగిలినవారు తాము చూడలేదన్నా, రాజశేఖర్‌ను నిర్దోషిగా నిలబెట్టే సాక్ష్యాలు తక్కువే వున్నాయి. జంగయ్య ఆ సమయాన అక్కడలేడని తెలుసు. కొందరు సమ్మతంగా చెబుతున్నారు. కాని ఎక్కడున్నాడో నిరూపించాలి. జంగయ్య మాటలను ఆధారం చేసుకుని నిర్ణయాలు తీసుకుంటారు.

ఆమె మర్నాడు ఉదయం లేస్తూనే కూలీలు గుడిసెలు వేసుకున్న దగ్గరకు వెళ్ళింది. సూపర్‌వైజరు చనిపోయిన తారీఖు, వారంచెప్పి ఆరోజు ఎవరెవరున్నారో కనుక్కుంది.

"ఎందుకమ్మా మళ్ళీ ఎలచ్చన్లు వచ్చాయా?"

"యహా గిప్పుడేం ఎలచ్చన్లే పాలపొడి, నూనె పంచుతారేమో."

"ఏందో జర బేగి జెప్పు. గాడ గుడిసెలు కాలిపోతే అందరం ఎల్లి సల్లార్పినము అందరమున్నముగాయాళ్ళ."

అంజనికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వాళ్ళే ఆమెకు క్లూ అందించారు.

"ఆ గుడిసెలు ఆర్పేయటానికి ఎవరెవరున్నారో వారందరికి డబ్బిస్తాను పేర్లు చెప్పండి" అన్నది డైరీతీసి.

"సర్కారు తరఫునా!"

"మిషని దొరలిస్తరా" అడుగుతూనే అందరి పేర్లు వ్రాయించారు. ఒక్కొక్క పేరు జెప్పరేముంద్రి" ఒక ఆడగొంతు వినిపించింది.

"యహా! మీ ఇంటాయన గాయల్ల ఇల్లు కట్టేతున్నడని చెప్పింద్రు గద దొరలు!" అన్నది మరో స్త్రీ.

"యహా! ఆ దొరాని ఒకీలు జెప్పిండు. మా ఇంటాయనే వున్నడు" అన్నది. అంజని ముందుకొచ్చిందామె.

"రాయమ్మ జంగయ్యంట" అన్నది,

"నువ్వు పక్కన కూర్చో. ఆఖర్న రాస్తాను. నీ మగడు సూపరువైజర్ దగ్గరున్నాడు."



"ఈ మా ఇంటాయనే సగం గుడిసెలు ఆర్పాడు. అందరు ఎనకసీరి వచ్చినోల్లే తియ్యి" అన్నది కోపంగా.

"నీ పేరేమిటి?"

"నా పేరు పెంటమ్మ."

"పెంటమ్మా! మీ ఇంటాయనను పిలుచుకునిరా, డబ్బిస్తాను...." అన్నది.

"మా ఇంటాయన్ను గాళ్ళు ఎవరో పిలుచుకపోయింద్రు. గదేందో కేసు తేలేంతవరకు రారంట" అన్నది.

పెంటమ్మ కళ్ళలో డబ్బు కావాలన్న ఆశ బాగా మెదిలింది. ఆమెను బయటికి లాగాలంటే డబ్బే ఎరగా వేయాలి. అంతకంటే మార్గంలేదు.

అందుకే అంజని గుడిసెలు ఆర్పినవారందరికి అడ్వాన్సు అంటూ తలో ఇరవై రూపాయలు యిచ్చింది. పెంటమ్మ చురచుర చూసింది,

"చూడు పెంటమ్మా! అసలు వ్యక్తి లేనిదే డబ్బివ్వకూడదు."

"ఏందమ్మా! నా మొగనికి నేను నీల్లు ఇచ్చిననంటే మీకు అర్థం కాదా? ఏడజెప్పమంటే ఆడజెప్త పద" అన్నది పెంటమ్మ.

"అయితే కారెక్కు. నీకు నూరురూపాయలిస్తాను" అన్నది.

ఆమె పెంటమ్మను తీసుకువచ్చి సర్వెంట్స్ క్వార్టర్స్‌లో వుంచింది.

ఆ మరురోజే ప్రాసిక్యూషన్ బలమైన సాక్ష్యాలు బెంచ్ ముందుంచాడు జంగయ్య సాక్ష్యం అయింది. తను అక్కడ నీళ్ళు కొట్టటానికి ఉన్నానని రాజశేఖర్ సిమెంటు బ్లాకులో అమ్ముకుని, పనివారికి జీతాలు ఇవ్వక ఏడ్పించేవాడని చెప్పాడు. ఆరోజు సూపరువైజర్ ఆయన ఘర్షణపడ్డారని, తరువాత మాయమాటలతో రాజశేఖర్ సూపర్‌వైజర్ని పైకి తీసుకువెళ్ళి చంపాడని, నెట్టగా తను చూశానని నమ్మకంగా చెప్పాడు.

"డిఫెన్సులాయర్ క్రాస్ ఎగ్జామ్ చెయ్యవచ్చు" అనుమతి వచ్చింది. అంజని లేచింది. ఒక్కసారి అందరివంక చూచింది గంభీరంగా. ఏ అవకాశంలేదని నిరాశతో కూర్చున్న విజయకేసి గంభీరహాసము చేసింది.

"జంగయ్యా! రాజశేఖరంగారు సూపర్‌వైజరును క్రిందికి నెట్టారని నీకు ముందే తెలుసా?"

"తెలుసా అని అన్నానా!"

"జవాబు చెప్పు. నెట్టుతాడని నీకు తెలుసా?"

"తెలియదు."

"మరి వాళ్ళనే ఎందుకు చూశావ్? అప్పుడు నీకు పని వుందికదా?"

"ఊరకినే....అదికాదు....ఏం చేస్తారో అని...." తడబడిపోయాడు.

"అదిపోనీ నువ్వు సూపర్‌వైజరు పడ్డప్పుడు సైటుమీదే వున్నావా?"

"ఆఁ! సైటుమీదే వుంది గోడలకు నీళ్ళు కొడుతున్నాను."

"యువర్ ఆనర్ నోట్ ద పాయింట్. ఆ ఇంట్లో గోడలకు నీళ్ళు పోసే వ్యక్తికి బాల్కనీలో మనుష్యులు కనిపించే అవకాశం లేదు...."

"ఆదికాదు....నీళ్ళు ఎత్తుకువస్తున్నాను."

"యువర్ ఆనర్ నీటిహౌస్ కూడా వెనుకవైపు ఉన్నదని గ్రహించాలి" అన్నది.

"నేను బాల్కనీలో చల్లుదామని ముందుకు వచ్చిన" అన్నాడు జంగయ్య.

"సరే నువ్వెలా వచ్చిన మాకు అనవసరం. ఆరోజు నువ్వు అక్కడ లేవు. ఆ సంగతి నాకు బాగా తెలుసు" అన్నది అంజని. ఆమె బయట ఎవరితో సైగ చేసింది.

"మరొక ముఖ్యమైన సాక్షిని ప్రవేశపెట్టటానికి అనుమతి ఇవ్వమని కోరుతున్నాను" అన్నది.

న్యాయమూర్తి అంగీకరించారు. వెంటనే పెంటమ్మ వచ్చింది. పెంటమ్మని చూస్తూనే జంగయ్య కంగారుగా తను లాయర్‌వంక చూశాడు.

కావల్సిన ఫార్మాలిటీస్ అయ్యాయి.

"పెంటమ్మా! సోమవారం ప్రొద్దుటే నీ భర్త ఇంటిదగ్గరే వున్నాడా?" అంజని అడిగింది.

"ఇంటికాడనే ఉన్నడమ్మ. గుడిసెలు అంటుకున్నయంట. లేపితే తనే పొయ్యిండు" అన్నది పెంటమ్మ.

"అప్పుడు టైమెంతో తెలుసా పెంటమ్మా?"

"తెలుసమ్మ. తొమ్మిదిన్నర అయివుంటుందేమో! పోరగాల్లు బడులకు



పొయ్యింల్రు" అన్నది.

"పాయింటు నోట్ చెయ్యదలచినదే."

"మాకు గడియారాలు లేకపోయినగూడ కరెక్ట్ సమయము జెప్తము, తొమ్మిదిన్నరకంటే ఎక్కువకాలేదు."

"జంగయ్య భార్య సాక్ష్యం విన్నారుకదా. సూపర్‌వైజరు చనిపోయిన సోమవారమే జంగయ్య ఇంటి చుట్టుపట్ల గుడిసెలు అంటుకున్నాయి. ఇదిగో పేపరుకటింగ్స్" అన్నీ న్యాయమూర్తికి అందజేసింది అంజని.

"ఏమ్మో! నా మాట అబద్ధం అనుకుంటున్నావేమో? మా ఆయన భుజంమీద కట్టెపడి పుండయింది చూడండ్రి" పెంటమ్మ అరిచింది. అంజని నవ్వుతూ వెళ్ళి నిర్ధారణ చేసుకుంది. ఈ క్రాస్ ఎగ్జామ్‌లో దొరికిపోయాడు.

"మిలార్డ్! ఇదంతా పరిశీలించాక, కావలసి రాజశేఖర్‌పై పన్నిన కుట్ర అని తేలిపోయింది. సిమెంటు అతని తయారీకాదు కదా. బూడిదతో వచ్చిన సిమెంటు అంతా పరిశీలించారు. కాబట్టి దీనివెనుక వున్న రాకెట్ ఛేదించాలని కోరుతున్నాను" అన్నది అంజని.

రాజశేఖర్‌పై తోటి కంట్రాక్టర్లు పన్నిన కుట్ర అని తేలిపోయింది. రాజశేఖర్‌పై కేసు కొట్టివేశారు. అడల్టరేటెడ్ సిమెంట్‌ది అది వేరే కేసు.

ఆరోజు అందరి ఆనందం అంతా ఇంతా కాదు. విజయ పరుగు పరుగునవచ్చి అంజనిని కౌగలించుకుంది.

"నీకు ధన్యవాదాలు చెబితే అవమానించినట్లు అవుతుంది" అన్నది కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా.

"అదేమిమాట! ఈ కేసు నా వృత్తికే సవాలుకదా?" అన్నది చిన్నగా నవ్వి.

ప్రక్కనే వున్న లలితమ్మ ఏమీ మాట్లాడలేకపోయింది.

"విజయగారూ! మా నాన్నగారు మీ కుటుంబానికి చేసిన ద్రోహంలో కొంతయినా ఈ రూపంలో తీరిపోతే సంతోషిస్తాను" అన్నది. ఎంతో సహ

జంగా వున్నా ఆమె గొంతులో నిష్ఠూరం ధ్వనించింది.

"అంజూ!"

"విజయగారూ! మళ్ళీ ఆ ఆప్యాయతలు, అనుబంధాలు గుర్తుచేయకండి. మిమ్మల్ని నొప్పించలేక మా నాన్నగారిని ఒప్పించలేక త్రిశంకు స్వర్గం అనుభవిస్తున్నాను నేను. మీరు సుఖంగా వుంటే అదే చాలు" అని తల్లి ప్రక్కన నిలబడిన స్వీటీని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది.

స్వీటీ సిగ్గుపడింది. అంజని ఎత్తలేక దింపేసింది.

"మమ్మీ" ఆనంద్ తల్లిని కౌగలించుకున్నాడు.

"పండూ!" కొడుకును చాలారోజుల తరువాత చూసిన అంజని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది.

"అమ్మమ్మతో వచ్చావా పండూ?"

"ఊహూ! తాతయ్యతో వచ్చాను. నేను ఇన్నిరోజులు తాతయ్యతో వున్నాను. తాతయ్యకు జ్వరం వచ్చింది. అబ్బబ్బ మందు మింగడానికి ఎంత గొడవ చేశాడని. నేనే మీసాలెత్తి బలవంతంగా నోట్లో పోశాను మమ్మీ" అన్నాడు.

అంజని పరిసరాలు మరిచి ఫక్కున నవ్వింది.

లలితమ్మ చూచాయగా విన్నదిగాని, మొదటిసారి మనవడిని చూసింది ఆమె హృదయపు పొరలను చీల్చుకుని పాత జ్ఞాపకాలు, స్మృతులు బయటకి వచ్చాయి.

"అమ్మా! నువ్వేడ్వకు. నేను చదివి నాన్నలా ఇంజనీరు అవుతాను" అనే చిన్నారి శ్రీహర్ష కనిపించాడు. అప్రయత్నంగా ఆమె అడిగేసింది.

"ఆ బాబు ఎవరు అంజనీ?"

"నా మూడునాళ్ళ ముచ్చటయిన దాంపత్యానికి, కాపురానికి తీపి గుర్తు లలితమ్మగారూ!" అని కొడుకును తీసుకుని ముందుకు నడిచింది. ఆనంద్ తల్లి చేతిని దులపరించుకొని వచ్చాడు.

"మా మమ్మీకి జవాబు చెప్పటం తెలియదు. నా పేరు ఆనంద్. మా డాడీ పేరు శ్రీహర్ష, మా మమ్మీ పేరు అంజని. అవునూ మీ పేరు?" వచ్చి లలితమ్మను అడిగాడు.



మీరైతే ఏంచేస్తారు ?

"లలితమ్మ అన్నది కదూ మమ్మీ! వస్తాం లలితమ్మగారూ!" ఆమె జవాబు చెప్పేలోపలే అతను వెళ్ళిపోయాడు. ఆనంద్ అన్న వింటూనే ఆమె ముఖంలో రంగులు మారిపోయాయి.

అంజని బయటికి వచ్చేసరికి పార్థసారథి కారు బయట వుండేది కాని, కోటేశ్వర్రావు నిలబడి వున్నాడు. అతని ముఖం పీక్కుపోయి బలహీనంగా వున్నాడు.

"నాన్నా!"

"అంజూ....!" అతనొచ్చి కూతురి వీపు నిమిరాడు.

"నిన్ను రెస్టు తీసుకొని, బాగా తినమని చెప్పాను. మళ్ళీ నిల్చున్నావేమిటిరా?" ఆనంద్ దబాయించేశాడు.

"అలాగే డాక్టరుగారూ!" భయం నటించాడాయన.

ఇద్దరి వాలకం చూచి అంజని ఫక్కున నవ్వింది. తండ్రీ కూతురికి ఎన్నో మాట్లాడాలనివున్నా నోటమాట రావటంలేదు.

"నీ విజయం నాది తల్లీ!" అన్నట్టున్నాయా చూపులు.

"నీ అవమానం నాది నాన్నా!" అన్నట్టున్నాయి ఆమె చూపులు. తండ్రిదగ్గర కారు తాళాలు తీసుకుని తనే డ్రైవ్‌చేసింది అంజని.

## 26

ఆనంద్‌భవన్ ముందు షామియానా వేశారు. పార్టీకి అన్ని ఏర్పాట్లు జరిగాయి, శ్రీహర్ష మళ్ళీ వుద్యోగంలో చేరినందుకు, రాజశేఖర్‌పై వచ్చిన నింద తొలిగిపోయినందుకు పార్టీ ఏర్పాటుచేశారు.

"అంతా రడీయేనా శ్రీ?" రాజశేఖర్ టై బిగించుకుంటూ అడిగాడు.

"అంతా రడీయే బావా! ఫోటోగ్రాఫర్లు తప్ప."

"చూడు విజ్జీ! మీ తమ్ముడికి అంతా వేళాకోళంగా వుంది."

"రాజా! వాడికా అవకాశం ఇచ్చింది మీరే" అన్నది నవ్వుతూ,

"ఏనాటికైనా మీ అక్కాతమ్ముళ్ళు ఒక్కటే" అన్నాడు నిష్ఠూరంగా.

"ఆ బెంగ అక్కరలేదు బావా! మేము విడిగా వెళ్ళిపోతాము" అన్నాడు శ్రీహర్ష.

"శ్రీ! ఈ యిల్లు ఎలా కట్టినా, ఎందుకు కట్టినా నీదేరా. నాకే నర్సింగ్‌హోమ్ దూరమవుతుంది, దగ్గరలో ఓ యిల్లు చూశాను. ఈ పార్టీ అయ్యాక వెళ్ళిపోతాను" అన్నది,

"నీ ఇష్టం" శ్రీహర్ష ఏర్పాటుచూడాలని బయటికి వెళ్ళాడు.

"విజ్జీ! నేనెవరినీ మోసం చెయ్యలేదు. నా ఫొటోలు, నా పేరు పేపర్లో వస్తే ప్రక్కవారికంత కడుపుమంట దేనికో అర్థంకాదు" అన్నాడు నిష్ఠూరంగా.

"రాజా! దేనికయినా అతికాకుండా మితం వుండాలి. స్వతహాగా వచ్చిన కళ ఏదయినా వుంటే ఎవరూ తీసుకోలేనిది. డబ్బిచ్చి ఖ్యాతి కొనుక్కుంటాననటం అవతలవాడికి కన్నెర్రే. మనం సంఘజీవులం. మన మంచి చెడులు గూర్చి సంఘమే ఆలోచిస్తుంది" అన్నదామె, బొట్టు సరిదిద్దుకుంటూ.

"అమ్మా! విజ్జా! అర్చన ఈ సమయాన వూరికి వెళతుందమ్మా" కంగారుగా వచ్చింది లలితమ్మ.

విజయ బయటకి వచ్చింది. చిన్న సూట్‌కేస్‌తో అర్చన నిల్చుంది.

"విజయగారూ! మీరు ఇన్నాళ్ళు చూపిన ఆదరణకు, ఆప్యాయతకు ధన్యవాదాలు. నా స్నేహితురాలితో గల్ఫ్‌దేశాలకు వెళదామని అనుకుంటున్నాను" అన్నది.

"అర్చనా...." లలితమ్మ ఏదో అనబోయింది.

"అమ్మా! మీ తల్లి మనసు, ఆరాటం అర్థం చేసుకోగలను. మీ కుమారుని క్షేమంతప్ప మరేం అక్కరలేదా? శ్రీహర్షగారు కాపురం చెయ్యలేదన్నారు, అతనికో కొడుకున్నాడు. పోనీ మూడునాళ్ళ కాపురానికి నిదర్శనము అనుకున్నా మీ కోడలు మళ్ళీ గర్భవతి...." అర్చన గొంతు బొంగురుపోయింది.

"అబద్ధం" లలితమ్మ కీచుగా అరిచింది.

"అంత అవసరం నాకేం లేదమ్మా. ఈపూట పార్టీకి వస్తున్నారు.



మీ కోడలు కనుక్కోండి. పొరపాటు నాదికాబట్టి వూరుకున్నాను, శ్రీహర్షగారు ఎన్నో తన విషయాలు చెప్పబోతే నేను వారించాను. అతను ప్రాణంకంటే ఎక్కువగా ఆమెను ప్రేమిస్తాడు. ఆమె అతనికోసం ఏ త్యాగం చెయ్యటానికయినా సిద్ధమే. అది తెలిసినాక ఏ స్త్రీ వివాహానికి సిద్ధపడదు."

"నీకెలా తెలుసు?"

"నేనెవరో ఆవిడకు తెలియదు. అందుకే తన పరిస్థితి, భర్త స్థితి చెప్పింది. నా భర్త నన్నే గుర్తుంచుకోవాలి. నన్నే ఆరాధించాలి. నాకోసం మిగిలిపోవాలి. అలా అనుకోవటంలో తప్పా! చెప్పండి విజయగారూ! నా స్థానంలో వుంటే మీరేం చేస్తారు?"

విజయ సానుభూతిగా చూసింది. లలితమ్మ ద్వైదీభావాలతో సతమతమవుతూ నిలబడింది.

"అమ్మా! మీకు చెప్పదగినదాన్ని కాను కాని, ఒక్క విషయంలో మీకు ఒకమాట చెబుతాను. మీ అర్థంలేని అనుమానాలతో ఆ అనురాగమూర్తులను దూరం చెయ్యకండి. ప్లీజ్. మీ అల్లుడిని హంతకుడన్నారు అది నిజమేనా?"

"వద్దు అర్చనా, వద్దు. ఇంకేం చెప్పకు" లలితమ్మ తల పట్టుకుని కూలబడిపోయింది.

"బయట గెస్ట్స్ వస్తున్నారు. మీరంతా ఇక్కడే వున్నారా?" శ్రీహర్ష హడావుడిగా వచ్చాడు.

"చూడు శ్రీ. పార్టీకి వుండదట అర్చన" అన్నది విజయ.

"అర్చనగారూ! ప్లీజ్! ఈ శుభసందర్భంలో నా ఆత్మీయులంతా వుండాలని నా కోరిక" అంటూనే ఆమె చేతిలో సూట్‌కేసు లాక్కెళ్ళి గదిలో పెట్టాడు.

"మీకు మనుష్యుల్ని మెస్మరైజ్ చెయ్యటం బాగా చేతనవును" అన్నది.

"అయామ్ సారీ!" అన్నాడు శ్రీహర్ష.

ఆమె నవ్వేసి వెళ్ళి అతిథులను ఆహ్వానించింది.

"శ్రీ....శ్రీ....నువ్వు....నువ్వు నన్నెందుకు మోసం చేశావ్?" అడగలేక అడిగింది లలితమ్మ.

"అమ్మా, ఎవరినీ మోసం చేయాలనుకోలేదమ్మా! మొదటిసారి బాలరాజు నోటివెంట విషయాలు విన్నప్పుడు అంజనిని వెంటనే తరిమేయాలనుకున్నాను. నీకోసం....నీకోసం అంజనికి దగ్గరయ్యాను, జీవితంతో రాజీపడ్డాను. గతం మరిచిపోవాలనుకున్నాను. ఆ సమయాన మీకు అసలు విషయం తెలిసి, మళ్ళీ ఆంక్షలు పెట్టారు. అప్పుడు అంజని గర్భవతి. ఏంచెయ్యాలి చెప్పండి! పంతాలకుపోయి మామయ్య ఆమెకు వివాహం చేస్తానని, ఇటు మీరు పట్టుదలగా వున్నారు. ఒకరిని ఒకరు విడువలేకపోయాము. 'బావా! అభిమానం, అనురాగం సముద్రంలాంటిది. ఎందరికైనా పంచవచ్చు. మీరు వివాహము చేసుకోండి. నా జీవితంలో మిగిలిన మధుర స్మృతి వివాహము. ఆ వివాహానికి చిహ్నంగా సంవత్సరానికి ఒక్కనాడు నాతో గడపండి' అని ఒక ఆడపిల్ల కోరితే కాదనే కఠినాత్ముడుంటాడా చెప్పమ్మా....చెప్పు?" అన్నాడు ఆవేశంగా.

లలితమ్మ నిరుత్తరాలయింది. తన అల్లుడిని అనుమానించారు. రేపు అందరూ తన కూతుర్నిలాగే అంటారా? ఏమో స్వీటీని అవమానిస్తారా? అభం శుభం తెలియనిది స్వీటీ. ఆ పిల్ల బడిలో తండ్రి ఫోటోలగురించి అడిగితేనే సహించలేకపోయింది. లలితమ్మ తనదే పొరపాటని గ్రహించింది.

"అమ్మా! తప్పో, ఒప్పోకాని నిన్ను మోసగించాలని మాత్రం కాదు" అని అతను వెళ్ళిపోయాడు. లలితమ్మ కళ్ళముందు పొరలు తొలగిపోయాయి. ఆమె మెల్లగా బయటికి వచ్చింది. విజయతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు కనిపించాడు.

"నాకేం కోపంలేదు విజయా! నన్ను చూస్తే లలిత అప్‌సెట్ అవుతుందని రాలేదు. ఆనాడు ఈనాడు నేను మీ నాన్న ఆరాధకుడేనమ్మా. అందుకే యిదిగో ఈ ఆనంద్‌గారు రమ్మనగానే వచ్చేశాను. లలిత రాకముందే వెళ్ళిపోతాను" అన్నాడు.

"ఇంతదూరం వచ్చారు ఏదయినా తీసుకుంటే సంతోషిస్తాను



మామయ్యా" అన్నది.

"ఒక పండు ఇవ్వమ్మా చాలు. డాక్టర్లు అన్నీ ఆంక్షలే పెడతారు" అన్నాడు ఆనంద్‌ను దింపుతూ. ఇద్దరూ కాస్త దూరంలోవున్న బల్లదగ్గరకు వెళ్ళారు.

"నువ్వు చాలా స్ట్రెయిన్ తీసుకుంటున్నావు అంజూ."

"మీ అమ్మగారు...." కుడిప్రక్కన యిద్దరూ నిలబడి మాట్లాడుతూ లలితమ్మను చూడగానే అంజని దూరంగా వెళ్ళిపోయింది. లలితమ్మ కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్లయింది. తనేనా అమాయకురాలయిన కోడల్ని ఇంత దారుణంగా ద్వేషించింది. ఆమె వెళ్ళి కోటేశ్వరరావుకు ఇష్టమైనవి ప్లేటులో వడ్డించి అందించబోయింది.

"లలితా...." ఆయన కళ్ళల్లో ఆనంద్ పోయిన కొత్తల్లో కనపించిన ఆర్తి కనిపించింది.

"అన్నయ్యా...." ఆమెకెన్నో చెప్పాలని, నిష్ఠూరాలు వెయ్యాలని వుంది. కాని నోటమాటరానట్టు నిల్చుని దగ్గరే నిల్చున్న ఆనంద్‌ను దగ్గరగా తీసుకుని గుండెలకి హత్తుకుంది.

పార్టీలో అర్చన, అంజని ఇద్దరూ బొంగరాల్లా తిరిగారు. శ్రీహర్ష బ్యాంక్ స్టాఫ్ వచ్చారు.

"రండి....రండి వారిని పిలుస్తాను" అర్చన ఆహ్వానించింది.

"ఈవిడ....?" ఒకతను ఆగి అడిగాడు.

"శ్రీహర్ష కాబోయే భార్య...."

"నో సర్! మీరు పొరపడ్డారు. ఇదిగో వీరు శ్రీహర్షగారి అర్ధాంగి. నేను ఆరాధించే స్నేహితురాలిని" అని అంజనిని పరిచయం చేసింది. అంజని తెల్లబోయినా నమస్కరించింది.

"మీరు ఏమన్నారు?"

"అంజనిగారూ! మీరెంత త్యాగం చెయ్యబోయినా, మీ సౌభాగ్యం పంచుకునే సంకుచితురాలిని కాను" అన్నది.

"కాని....కాని...."

"మీరేం చెప్పొద్దు! మీపై అందరికీ కలిగిన కోపం తాత్కాలికమైనది.

మీ వాళ్ళందరికి మీరు దేవత."

"మీరిలా చెయ్యటం ఏం బావుండ్లా."

"మీరయితే ఏం చేస్తారు?"

"ఆ(....." మాటలు రానట్టు తడబడింది అంజని.

"మీరయినా యింతే చేస్తారు! స్త్రీకి తోటి స్త్రీ న్యాయం చెయ్యక పోయినా, హాని చెయ్యనినాడు ప్రగతి సాధించినట్టే. అంజనిగారూ సగం సమస్యలు పరిష్కారం అవుతాయి" అన్నది.

"మీకు జవాబు చెప్పలేను."

"నాలాంటివారికి జవాబుచెప్పి ఎనర్జీ వేస్టు చెయ్యొద్దు. కోర్టులో వాదించడానికి ఎనర్జీస్టోర్ చేసుకోండి. ఐ విష్ యు బెస్టాఫ్‌లక్" అన్న అర్చన కళ్ళలో తడి కనిపించింది.

అంజని మాటరానట్టు నిలబడిపోయింది.

"అంజూ" లలితమ్మ పిలిచింది. అంజని తిరిగిచూసింది. అత్తగారు నిల్చున్నది.

"అంజూ! వెళ్ళమ్మా శ్రీ పిలుస్తున్నాడు. వాళ్ళ బాస్ నిలబడలేరట ఇంట్లో కూర్చున్నారు" అన్నది.

అంజని ఆమె ఆజ్ఞపాలిస్తున్నట్టు, ఏడు అడుగులు కొలుస్తూ నడుస్తున్నట్టు నడిచి, ఇంట్లోకి వెళ్ళింది.

"అమ్మా! నా కోపం, అనుమానంతో అన్నాలం చేసిన, మన్నించమ్మా" అంజనికి ఎదురువచ్చాడు బాలరాజు.

"పోనీలే బాలయ్యా! పరిస్థితులు అలా వచ్చాయి నువ్వేం చేస్తావు. వెళ్ళి కాస్త సామాన్లు చూడు" అన్నది. అతను వెళ్ళిపోయాడు.

మంచినీళ్ళగ్లాసులతో డ్రాయింగ్‌రూమ్‌లోకి వెళుతున్న శ్రీహర్ష తలవంచి స్వాగతం అన్నట్టు మందహాసం చేశాడు.

పందిట్లో పెళ్ళవుతుంది అన్న రికార్డు మోత మ్రోగిస్తుంది బయట.

15015

—: శుభం :—